RNI No. APTEL/2003/12253

# భావ వీణ

అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక

# BHAVA VEENA

International Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 15 Issue No. 12(2) Monthly December 2018 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



## వేదం వెంకటరాయ శాస్త్రి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**International Journal of Telugu Literary, Culture & Language Study**

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482
Rohini Towers,
2/11 Brodipet, GUNTUR-2.

**Vol. 15 - Issue. 12(2) - December 2018 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment
Postal colony ,4 Th Line,- 522 002, Guntur Dist., A.P.
Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University, Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide
   Dept. of Telugu
   PAS College, Pedanandipadu.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu, Madras University, CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman, Telangana University,
   Dichpally, Nizamabad, Telangana.
5. **Dr. N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District. Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept.of Modern Indian Languages,
   Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu, Silver Jubilee
Govt. Degree College, Kurnool District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
University of Hyderabad, Hyderabad.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
University of Hyderabad, Hyderabad.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies, Telangana University,
Dichpally, Nizamabad.

**LEGAL ADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal
Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**
G.L.S. ENTERPRISES, Guntur. 9494 660 509


గమనిక: రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - ఎడిటర్.


Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 9703301698.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# వేదం వేంకటరాయశాస్త్రి

సుప్రసిద్ధ కవి, పండితుడు, విమర్శకుడు, నాటకకర్తయైన శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి వేంకటరమణ శాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు చెన్నైలో 1853 డిసెంబర్ 21న జన్మించారు. తండ్రి వేంకటరమణశాస్త్రి ప్రముఖ కవిగా, నాటకకర్తగా, విమర్శకులుగా, పండితులుగా సుప్రసిద్ధులు. తండ్రి నుండి పుణికి పుచ్చుకున్న సాహితీ సౌరభం వేంకటరాయశాస్త్రిలో అణువణువునా నిబిడీకృతమైంది. మద్రాస్ క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండితునిగా విశిష్ట సేవలందించిన వేదం వారు తెలుగు భాషాభిమాని అనే నాటక సమాజాన్ని స్థాపించి తాను వ్రాసిన నాటకాలను ప్రదర్శించేవారు. వీరు వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, ఉషా నాటకం ప్రేక్షకుల మనస్సులను రంజింపజేశాయి.

వేదం వేంకటరాయశాస్త్రి గ్రాంథిక భాషావాది అయినప్పటికీ సంస్కృత నాటకాలను తెనుగులోకి అనువదించే క్రమంలో నీచపాత్రల సంభాషణలకు వ్యవహారిక భాషను ఉపయోగించారు. ఈ ప్రయోగం సంస్కృత నాటకాలలోని నీచ పాత్రలకు ప్రాకృతాన్ని ఉపయోగించడం లాంటిదేనని సమర్థించుకున్నారు. దీనిపై పండితులలో వాదోపవాదాలు జరిగినా సృజనాత్మక సాహితీకారులు మాత్రం శాస్త్రిగారి పంథానే కొనసాగించారు. తత్ఫలితంగా వ్యవహార భాషోద్యమానికి ఈ సంఘటనలు ఊతంగా మారాయని చెప్పవచ్చు.

శాస్త్రి గారి వ్యక్తిత్వం చాలా గొప్పది. ఏపనైనా సమయానికి చేసేవారు. వేదం వారు తెలుగు, సంస్కృతంలో పెక్కు రచనలు చేశారు. అందులో ప్రతాపరుద్రీయ నాటకం చిరస్థాయిగా నిలిచి పోయిందని చెప్పవచ్చు. ఓరుగల్లు ప్రభువైన రెండవ ప్రతారుద్రుని జీవితంలో జరిగిన కొన్ని చారిత్రాత్మక, యదార్ధ సంఘటనల ఆధారంగా వ్రాసిన గొప్ప తెలుగు నాటకం. వీరు వ్రాసిన 'నన్నెచోడుని కవిత్వము" అనే గ్రంధానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి లభించింది.

వేదం వేంకటరాయశాస్త్రి సోదరులు వేదం వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్ పేరుతో ప్రచురణ సంస్థను స్థాపించి అనేక తెలుగు పుస్తకాలను అచ్చువేశారు. వీరు సూర్యరాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకులుగా కూడ పనిచేశారు. వీరి పాండితీ ప్రకర్షకు ఆంధ్ర విశ్వకళాపరిషత్ కళా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించగా, ద్వారకా పీఠ శంకర భాగవత్పాదులు "సర్వతంత్ర స్వతంత్ర", మహామహోపాధ్యాయ, విద్యాదాన వ్రత మహోదధి బిరుదులతో సన్మానించారు. అటువంటి మహనీయుడు మనకు సదా స్మరణీయులే.

- సంపాదక వర్గం

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగు రచయిత్రులు - ప్రపంచీకరణ దృక్పథం | - డా॥. చుక్కా శ్యామల కుమార్ | 5 |
| 2. | "శాంతి" సాహితీ వివేచకుడు - చల్లా రాధాకృష్ణ శర్మ | - ఇ. అమృతేష్ | 7 |
| 3. | ఆంధ్ర సాహిత్యంలో వికసించిన విప్లవ కవిత్వం | - గుంటూరు భాస్కరరావు | 9 |
| 4. | అడిగోపుల వెంకటరత్నం కవిత్వం - దళితవాద దృక్పథం | - డా॥. ఎన్. భీమన్న | 11 |
| 5. | తెలంగాణ రాష్ట్రం- కార్మిక వర్గ సాహిత్యం | - డా. చింతం ప్రవీణ్ కుమార్ | 14 |
| 6. | అన్నమయ్య సంకీర్తనలు - సామాజిక స్పృహ | - డా॥ ఇ. వాసు | 21 |
| 7. | బాదామి చాళుక్య రాజ్య రాజప్రతినిధి - విజయ భట్టారిక | - డా.యమ్. ఎస్తేర్ కళ్యాణి ఆశీర్వాదం | 24 |
| 8. | విదుర నీతి - ఒక అనంత ధర్మ సందేశం | - డా॥ పి. జయచంద్రుడు | 26 |
| 9. | ఆధునిక తెలుగు కవుల కవితా నిర్వచనాలు | - డాక్టర్ కోదండ లక్ష్మణ | 29 |
| 10. | తెలంగాణ నిత్య సాహిత్య కృషీవలుడు డా॥వెల్చాల కొండలరావు | - మండలోజు. నర్సింహస్వామి | 34 |
| 11. | కాలం మారినా......... మారని మనస్తత్వాలు | - పప్పుల శైలజ | 37 |
| 12. | ఛాత్రోపాధ్యాయుల దోష విశ్లేషణ | - ప్రవాసీ చిన్నయ్య | 40 |
| 13. | మహాభారతం: ద్రౌపతి వివాహం - పంచ భర్తృత్వం | - డా॥పులపర్తి శ్రీనివాసరావు | 45 |
| 14. | ప్రబంధయుగ సాహిత్యంపై శ్రీనాథయుగ సాహిత్య ప్రభావం | - రాంభట్ల వేంకటరాయశర్మ | 49 |
| 15. | యక్ష ప్రశ్నల్లో వాస్తవికత | - డా॥. ఉమ్మిడి శాంతి | 52 |
| 16. | శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి భక్తి సాహిత్య కృషి - ఒక పరిశీలన | - శ్రీనివాసులు నాయక్ | 54 |
| 17. | దేవులపల్లి విశ్వనాథం వచన కవిత్వం - సామాజిక దృక్పథం | - సూరె శ్రీనివాసులు | 56 |
| 18. | సినారె దివ్య స్మృతికి నివాళి "విశ్వంభర పై మరోచూపు" | - డా॥ జి. స్వర్ణలత | 58 |
| 19. | పర్యావరణ వేదన... కొండెపోగు ఆవేదన | - యు. అంజిరెడ్డి | 61 |
| 20. | ఆధునిక తెలుగు సాహిత్యం - కరువు ప్రభావ చిత్రణ | - డా॥ గుండ్లూరి వెంకట రమణ | 63 |
| 21. | ఆధునిక ఆంధ్ర భాషా సాహిత్యాలపై 'గిడుగు' ప్రభావం | - డా॥ ఎ.ఎ. నాగేంద్ర | 66 |
| 22. | తుమ్మల సీతారామమూర్తి 'నా కథలు' - అధ్యయనం | - డా॥ పి.సి.వెంకటేశ్వర్లు | 69 |
| 23. | సీతారాం కవితా నిర్మాణ చాణక్యం - సన్నాఫ్ మాణిక్యం | - పోతగాని సత్యనారాయణ | 73 |
| 24. | త్రిపురనేని నాటకత్రయం - మానవత దృష్టి | - డా॥టి. రాజశేఖర్ | 82 |
| 25. | పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ తల్లి దివ్య చరిత్ర | - రావిరాల లక్ష్మీకాంతం | 88 |
| 26. | స్త్రీవాద కవిత్వ ధోరణులు - విశ్లేషణ | - శెల్కలపెల్లి రాజు | 93 |
| 27. | జానపద సాహిత్యంలో హాస్యం | - ఎమ్.ఎన్.వి. సూర్యకుమారి | 96 |
| 28. | తెలుగు భాష మనుగడ - తెలుగు ఉపాధ్యాయుల కర్తవ్యం | - 'భాగవతరత్న' డా॥ వీపూరి వేంకటేశ్వరు | 99 |
| 29. | అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు భాషావైభవం | - డా॥ వై. సుభాషిణి | 103 |
| 30. | ఆధునిక కవిత్వ సొబగులు | - డా॥ డి.యువశ్రీ | 107 |
| 31. | జాషువా కవితా శిల్పం - భావుకత | - డా॥ బూసి వెంకటస్వామి | 110 |

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలుగు రచయిత్రులు - ప్రపంచీకరణ దృక్పథం

- డా॥. చుక్కా శ్యామల కుమార్, ఆంధ్రోపన్యాసకులు, ఎ.జి.కె.యం. కళాశాల, సత్తెనపల్లి, గుంటూరు.

"యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః" ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారని స్త్రీల ఔన్నత్యాన్ని చాటిన ఈ నేలమీదనే "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" స్త్రీలు స్వతంత్రులుగా జీవించడానికి అర్హతలేదని వక్కాణించారు. రెండు విభిన్నమైన దృక్పథాలు మన సమాజంలో సమానంగా అనాథిగా వస్తున్నాయి. దేనికి ప్రాధాన్యత ఇవ్వాలో ఏకాలంలో ఏ ధర్మాలను పాటించాలో ఇప్పటికీ ఇంకా ప్రశ్నార్థకంగా ఉందనుటలో సందేహించవలసిన అవసరం లేదు. మారుతున్న సరళీకృత ఆర్థిక విధానాలు, శాస్త్ర సాంకేతిక సమాచార పరిజ్ఞానం వలన విప్లవాత్మకమైన పరిణామాలతో జరుగుతున్న ప్రపంచీకరణ ప్రభావం ప్రతిరంగం మీద పడింది. ప్రపంచీకరణ వలన ప్రపంచమంతా మన కళ్ళముందుకు వచ్చి ఆధునికత అలవరచుకోవడానికి దోహదం చేసింది. దీని వలన ప్రతి రంగాన్ని ప్రపంచ దేశాలతో పోల్చి చూడటం ప్రారంభమైంది. దీని ప్రభావం సాహిత్యంపై బలంగా పడిందని చెప్పవచ్చు.

19వ శతాబ్దం వరకు ఒక మూసలో సాగిన తెలుగు సాహిత్యం తన రూపును మార్చుకోవడం ప్రారంభించింది. అప్పటి వరకు సాంప్రదాయ సాహిత్యానికి మాత్రమే పరిమితమైన తెలుగు సాహిత్యం ఒక్కసారిగా రెక్కలు విచ్చుకున్న పక్షిలాగా తన ప్రాభవాన్ని చూపటం ప్రారంభించి ఆధునికత వైపు అడుగులు వేసింది. ఇందులో ముఖ్యంగా తెలుగు రచయిత్రులు చూపిన ప్రతిభ ఎన్నదగినది. వీరికంటే ముందుగా తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ దృక్పథం కందుకూరి, గురజాడ వంటి నవయుగ వైతాళికులతో ప్రారంభమైంది. వారు ప్రపంచీకరణ భావాలతో స్త్రీ చైతన్యానికి బాటలు వేశాడు. చలం సాహిత్యమంతా స్త్రీ వాదనతో నిండి అసలైన ప్రపంచీకరణ కోణాన్ని చూపించింది. చలం తన సాహిత్యంలో ఆధునిక స్త్రీని ఆవిష్కరించాడు. మరొకవైపు సనాతనవాదులు సాంప్రదాయాలను పాడు చేస్తున్నారనే వాదనలూ, మూలుగులూ వినపించాయి. అయినా వాటిని పట్టించుకోకుండా మొదటితరం మహిళా రచయిత్రులైన తెన్నేటి లత, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, మల్లాది సుబ్బమ్మ గార్లు అభ్యుదయ భావాలతో కొత్త ఆలోచనలతో స్త్రీ స్వేచ్ఛకోసం తమ కలంతో ఉద్యమించారు. ఆ క్రమంలోనే యునెస్కో 1975 సంవత్సరాన్ని "అంతర్జాతీయ మహిళా దినోత్సవం"గా, 1976-1985 దశకాన్ని "అంతర్జాతీయ మహిళా దినోత్సవం"గా ప్రకటించింది. ఈ పరిణామాలను గమనిస్తే ప్రపంచమంతా మహిళాభ్యుదయానికి కొత్త బాటలు వేశారని చెప్పవచ్చు.

ఈ క్రమంలోనే తెలుగు రచయిత్రులు తమ కవితా వ్యాసాంగాలతో స్త్రీకి సముచిత స్థానం కల్పించడం కోసం ప్రయత్నించారు. పురుషుల కంటే స్త్రీలే తమ సమస్యలను బాగా చెప్పుకోవచ్చనే స్త్రీవాదం బయలుదేరింది. బాల్య వివాహాలు, నిరక్షరాస్యత, వరకట్నం, అవిద్య, అసాంఘీకత, కులం, మత, జాతి వంటి వైషమ్యాల బారిన పడిన స్త్రీల జీవితాలలో కొత్త వెలుగులు నింపడానికి విస్తృతంగా రచనలు చేశారు. పురుషాధిక్య సమాజంలో స్త్రీ వెనుకబడిపోయిందని తమ శక్తివంతమైన కవిత్వంతో సమాజాన్ని దువ్వబట్టారు. జయప్రద, కొడేపూడి నిర్మల, ఘంటసాల నిర్మల వంటి కవయిత్రులు సాహిత్యంలో స్పష్టమైన ప్రపంచీకరణ భావాలు కనిపిస్తాయి. స్త్రీలకు ఆర్థిక స్వేచ్ఛ, సమానత్వం, స్వేచ్ఛ, కావాలని కోరుతూ, ఈ సమాజం స్త్రీలను శారీరక సుఖం అందించే యంత్రాలుగా, పిల్లలను కనడానికి, వెట్టిచారికి చేయడానికి పనికి వచ్చే వస్తువుగా చూడడం స్త్రీ తత్వాన్ని అగౌరవపరచడమేనని వాటన్నిటి నుండి స్త్రీలు స్వాంతన పొందాలని ఘాటుగా విమర్శించి తమ ఆధునికతను చాటారు.

అయితే సమాజాన్ని సాంప్రదాయాన్ని పురుషుడిని ఇంత నీచంగా నిందించవలసిన అవసరం లేదనే దృక్పథంతో కొందరు రచయిత్రులు రచనలు చేయడం మనం గమనించవచ్చు. అయితే ఈ వాదాన్ని ఎక్కువమంది అంగీకరించలేదు. తరతరాల స్త్రీ దోపిడీని వ్యతిరేకించడానికే పూనుకున్నారు.

"అందమైన దోపిడికీ
పవిత్రమైన హింసకు
న్యాయమైన దాస్యానికి
బలైపోయిన నేను
భారత స్త్రీని" అని ఓల్గా ఆక్రోశిస్తే,

"పెళ్ళంటే పెద్దశిక్ష అని మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని" తన 'బందిపోట్లు' కవితలో కసిని చూపించింది సావిత్రి. 'వీడు నా కలలన్న చెరిపేస్తాడని' సుమతి గారన్న. హైమావతి "సర్పపరిష్వంగం" కవితలో స్త్రీ దుస్థితిని వివరించినా, రాజేశ్వరి 'తాళి కట్టిన మృగం' అని దూషించిన.

"నేనొక స్త్రీని
నేనొక నిషిద్ధ జీవిని" అని రజియా బేగం ఆవేదన వ్యక్తం చేసినా, వంటిల్లును ధ్వంసం చేద్దాం రండని విమలగారు పిలుపునిచ్చినా, తరతరాలుగా నా స్వేచ్ఛను హరిస్తున్న ఈ పైటను తగలెయ్యాలి అని జయప్రద వాడివేడిగా పదాలను గుచ్చినా, ఇవన్నీ తరతరాలుగా పురుషాధిక్య సమాజంలో హీనంగా,

నీచంగా, క్రూరంగా, భయానకంగా, బానిసగా బ్రతికిన స్త్రీ యొక్క దుస్థితిని చూసి గుండె రగిలి మనస్సు చలించి మార్పు కోసం, స్వేచ్ఛ కోసం రచించిన సాహిత్యమని మారుతున్న మానవ జీవన పరిణామాలలో స్త్రీలకు కూడా సమున్నత స్థానం ఉండాలని, తమ గుండెలోతుల్లోని ఆక్రందనలను కవిత్వంగా మలిచి, ప్రపంచీకరణ అంటే మార్పును కోరడమని ఆ మార్పు స్త్రీ చైత న్యంతో జరగాలని తెలుగు రచయిత్రులు ఉద్యమించారు.

పాశ్చాత్య సాహిత్య ప్రభావం తెలుగు సాహిత్యంపై బలంగా ఉన్నదని చెప్పవచ్చు. ముఖ్యంగా ఆంగ్ల భాషా సాహి త్యంలో వచ్చిన పలు ప్రక్రియలు కూడా ప్రపంచీకరణ దృక్పథా లకు నూతన బాటలు వేశాయి. స్వాతంత్ర్యానంతరం భారతీ యులు ఆలోచనలలో ఎన్నో విభిన్నమైన మార్పులొచ్చాయి. సాహిత్యం కొత్తరూపును సంతరించుకుంది. ప్రాచీన సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ నశించటమేగాక స్త్రీని ఒక అలంకార వస్తువుగా, అనుభవించేదానిగా, అందానికి ప్రతిరూపంగా సాగిన ఆ సాహిత్య మంతా వ్యర్థమని నిజమైన వ్యక్తిత్వ వికాసం కలిగిన స్త్రీగా తన జీవితం సాగాలని వర్ణ వ్యవస్థ నశించాలని ఆధునిక కవయిత్రులు భావించారు. ఆ కోణంలోనే గొప్ప రచనలు చేయనారంభించారు.

కనుపర్తి వరలక్ష్మమ్మ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, శ్రీదేవి, చిల్లర భవానీ దేవి, ఇల్లిందుల సరస్వతీదేవి, వాసిరెడ్డి సీతాదేవి, స్వరూపారాణి, కాత్యాయనీ విద్మహే ఇలా ఎందరో కవయిత్రులు తమ సైద్ధాంతిక భూమిక నుంచి ప్రాపంచిక దృక్పథం నుండి ప్రపంచాన్ని, జీవితాన్ని విశ్లేషిస్తూ తెలుగు సాహిత్యంలో నూతన పోకడలను అర్థవంతంగా మారుస్తూ తమదైన శైలి విన్యాసంతో అన్ని సాహిత్య ప్రక్రియలలో సామాజిక, రాజకీయ, కుల, మత సమస్యలపై కూడా తమ కవిత్వాన్ని సంధించి చైతన్యపరచడానికి ఎంతో కృషి చేశారు, చేస్తూనే ఉన్నారు. ఆధునిక కాలం యొక్క గొప్పతనం మనిషిని మనిషిగా గౌరవించడమేనని దానిని సాధించ డానికి తమ భావాలను ప్రపంచీకరణ చేసుకున్నారు మన తెలుగు రచయిత్రులు.

ఎక్కడైనా మార్పు కోసం ఎందుకు విప్లవాలు పుడతాయని మన ప్రశ్నించుకుంటే? ఎన్నో తరాలుగా అణచివేతకు గురైన స్థితి నుండి గొప్ప చైతన్యవంతమైన విప్లవం పుడుతుందని తెలుస్తుంది. అటువంటి గొప్ప చైతన్యం తెలుగు సాహిత్యంలో వచ్చిందనడానికి మహిళా రచయిత్రులు విస్తృతంగా చేసిన గొప్ప రచనలే తార్కాణం. వీరి రచనలలో అధికభాగం స్త్రీకి భద్రత, స్వేచ్ఛ కావాలని కోరుకోవడం కనిపిస్తుంది. ప్రపంచీకరణ ప్రభావం వలన ఆధునిక భావాలు ఉద్భవించాయి. అనేక దేశాల స్థితిగతు లను, అభివృద్ధిని, మార్పును, లోటుపాట్లను తెలుసుకోవడానికి ఉపయోగపడింది. దీని వలన మన స్థితి గతులను అంచనా వేసుకొని ఎలాంటి జీవిత దృక్కోణాలను ఆవిష్కరించాలో మన రచయిత్రులు ఆలోచించి గొప్ప కథా వస్తువుతో రచనలు చేశారు. ఇది ప్రపంచీకరణ వలన వచ్చిన గొప్పమార్పుగా మనం భావించాలి.

నేడు విరివిగా మహిళా రచయిత్రులు చేస్తున్న సాహిత్య కృషి వల్లనే మహిళలు అన్ని రంగాలలో స్థిరపడటానికి కారణ మైంది. అన్ని రకాలుగా అణచివేతకు గురైన స్త్రీలు గొప్ప చైత న్యంతో ముందుకు రావడానికి వీరు చేసిన కృషి ఎంతో ఉంది. ఆధునిక ప్రపంచీకరణ వాదం కుల, మత, జాతి, ప్రాంతీయ, స్త్రీ, పురుష లింగ బేధాలు లేని గొప్ప సమాజ నిర్మాణం జరగాలని కోరుకుంటుంది. ఆ దృక్పథాలు జాతి ఔన్నత్యానికి గొప్ప వీచికలు. అందుకే ఆ భావాలు తెలుగు రచయిత్రులుపై బలంగా, దృఢంగా పడ్డాయి. అందుకే బలమైన సాహిత్య బీజాలు దృక్ప థాలు వీరి రచనలలో కన్పిస్తాయి.

ప్రపంచీకరణ వలన జాతి ఔన్నత్యం దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయనే వాదన ఉంది. మన సనాతన సాంప్రదాయ ఆచార వ్యవహారాలు పాశ్చాత్య సంస్కృతి వలన ప్రపంచీకరణ భావాల వలన కుంటుపడే అవకాశం ఉందని బలమైన మన కుటుంబ సామాజిక వ్యవస్థ దెబ్బ తింటుందని వాదించేవారూ ఉన్నారు. ఏమైనా మార్పుకోసం ప్రారంభమైన ప్రపంచీకరణ దృక్పథం మన సత్ సాంప్రదాయాలను పాడు చేయకుండా ఉండేలా చూసుకోవ లసిన బాధ్యత మనపై ఉందని నేటి తెలుగు రచయిత్రులు ఆలోచించాలి. స్త్రీ కొన్ని ప్రకృతి ధర్మాలకు నిలయమైనది కాబట్టి ఆ బాధ్యతలను గుర్తెరిగి ఉండటం అవసరమే కదా!

ఏమైనా తెలుగు రచయిత్రులు తమ అద్భుత సాహిత్య పటిమతో స్త్రీలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించడానికి తమ కంటూ ఒక జీవితాన్ని భద్రతను ఏర్పరచుకోవడానికి చేస్తున్న కృషి శ్లాఘనీయం. ప్రపంచీకరణ దృక్పథం మన తెలుగు రచ యిత్రుల రచనలలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. పురుషుడు ఇప్పటి కైనా స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని గౌరవించాలని వారు కోరుకుంటు న్నారు. భయంకరమైన లైంగిక, శారీరక హింస నుండి మూఢ నమ్మకాల నుండి కట్టు బానిసత్వం నుండి వరకట్నం నుండి స్త్రీలను గౌరవించలేని పురుషాధిక్య సమాజం నుండి స్త్రీ తనను రక్షించుకోవటానికి ప్రారంభించిన సాహిత్య ఉద్యమం వారికి ఒక గొప్ప వజ్రాయుధంగా ఉపయోగపడింది. వారిలో ఆధునిక భావాలు అంకురార్పణ జరగడానికి తెలుగు రచయిత్రులపై ప్రపంచీకరణ దృక్పథం ఎంతో బలంగా ఉందనేడి వాస్తవం.

"సర్వేజనా సుఖినో భవంతు"

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# "శాంతి" సాహితీ వివేచకుడు - చల్లా రాధాకృష్ణ శర్మ

- ఇ. అమృతేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు సాహిత్య చరిత్రలో అనేక మంది రచయితలు శాంతి సహనాలు సాంఘీకాభివృద్ధితో కూడుకున్న సమాజం కోసం రచనలు గావించారు. అలాంటి వారందరిలో చల్లా రాధాకృష్ణ శర్మ ప్రముఖులు. చల్లా రాధాకృష్ణ గారు మధురై కామరాజు విశ్వ విద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా తన విధిని నిర్వ హించారు. ఈయన కేవలం తెలుగు భాషల్లో మాత్రమే కాకుండా కన్నడం తమిళం, మలయాళం భాషలలో కూడా ప్రవేశం ఉంది. ఈ విధంగా దక్షిణ ద్రావిడ భాషల అన్నింటిలో పాండిత్యం ఉండటం వలన ఈయన 'ద్రావిడ సాహిత్య సేతువు' బిరు దాంకితుడైనాడు.

కృష్ణాజిల్లా సోమవరప్పాడు గ్రామ వాస్తవ్యులైన చల్లా లక్ష్మీ నారాయణ శర్మ గారు తెలుగు, సంస్కృతము, హిందీ భాషలలో పండితులు అష్టావధాని, బహుగ్రంథ కర్త. ఈయన గారి సతీమణి యశోదమ్మ ఈమె సాక్షాత్తు అన్నపూర్ణేశ్వరి దేవి. ఈ ఆదర్శ దంప తుల పుణ్య ఫలితంగా 06.01.1929 తేదీన చల్లా రాధాకృష్ణ శర్మ గారు జన్మించారు. ఒకటవ తరగతి నుండి 4వ తరగతి వరకు చల్లా రాధాకృష్ణ శర్మ గారు మచిలీపట్నంలో చదివారు. ఐదవ తరగతి నుండి యస్.యస్.యల్.సి. వరకు మద్రాసు ప్రాంతంలో ఉండే చెంగల్పట్టు జిల్లాకు చెందిన పొన్నేరి గ్రామం లో చదివారు. తరువాత నెల్లూరు వి.ఆర్. కళాశాలలో ఎం.పి.సి. గ్రూపులో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనారు. ఆ తర్వాత గుంటూరు ఏ.సి. కళాశాలలో భౌతిక శాస్త్రం ప్రధానం విషయంగా బి.ఏ. చదివారు. అక్కడ విద్యార్థుల సమ్మెలో పాల్గొనటం వలన భౌతిక శాస్త్రంలో ఉత్తీర్ణులు కాలేకపోయారు.

ఆ తర్వాత తెలుగు సాహిత్యాన్ని ప్రధానాంశంగా తీసుకొని మళ్ళీ బి.ఏ. చదివి 1950లో డిగ్రీ పట్టా సాధించారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో ఎం.ఏ. తెలుగు పట్టా సాధించారు. నిడద వోలు వెంకటరావు గారి పర్యవేక్షణలో "తమిళ ఎలిమెంట్ ఇన్ తెలుగు లిటరేచర్" అను అంశం పై ఎం.లిట్ పొందారు. ఆ తర్వాత మద్రాసు విశ్వ విద్యాలయం నుండి పర్య వేక్షకులు లేకుండా స్వయంగా 'ది రామాయణ ఇన్ తెలుగు అండ్ తమిళ్ ఎ కంపారిటివ్ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేసి పింగళి లక్ష్మీ కాంతం పరీక్షకులుగా పి.హెచ్.డి. పట్టా పొందారు. కృష్ణా జిల్లా గుడివాడ గ్రామస్థులైన చింతల పాటి కామయ్య శాస్త్రి గారి కుమార్తె సుశీల గారితో చల్లా రాధాకృష్ణ శర్మ గారికి వివాహం జరిగింది. ఇట్టి ఆదర్శ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు జన్మించారు.

చల్లా రాధాకృష్ణ శర్మ వారు మొట్ట మొదటి సారిగా సత్యవేడు గ్రామంలో ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యా యుడిగా పనిచేశారు. ఆ తర్వాత మద్రాసులో త్యాగరాయ కళాశాలలో తెలుగు ట్యూటర్ గాను, తెలుగు లెక్చరర్‌గాను పని చేశారు. తెలుగు లెక్చరర్‌గా పని చేసిన నాటి నుండి ఆయన జీవితం ఉన్నత దశ వైపు మలుపు తిరిగింది. 1981వ సంవత్సరం నుండి మధురై కామరాజు విశ్వ విద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా, తెలుగు శాఖాధ్యక్షులుగా పని చేసి అక్కడ ఉ ద్యోగ విరమణ చేశారు.

## చల్లా వారి శాంతి సిద్ధాంతాలు :

చల్లా రాధాకృష్ణ శర్మ తండ్రి లక్ష్మీ నారాయణ గారు కూడా గొప్ప పండితులు కావున శర్మ గారిపైన తన తండ్రి ప్రభావం ఎక్కువగా ఉంది. శర్మ గారి పుస్తకాలన్నింట పైన తన తండ్రి పేరు మీదనే ప్రచురించారు. కావున శర్మ గారిపైన తన తండ్రి ప్రభావం ఉందని చెప్పుటకు ఇదే సాక్ష్యం. శాంతి సహనాలతో కూడుకున్న అహింసే తన ఆయుధంగా జీవించిన మహాత్మా గాంధీ సూత్రాలు సిద్ధాంతాలు శర్మ గారికి అమిత ప్రీతి. చల్లా రాధాకృష్ణ స్వతహాగా శాంతి స్వభావి. కావున తన రచనల్లో ఎక్కువగా శాంతి సహనాలు కూడుకున్న సమాజం గూర్చి రచిం చారు.

చల్లా రాధాకృష్ణ శర్మ గారు సాంఘీకాభివృద్ధి కోసం శాంతి సహనాలతో కూడా రచనలు సాగించారు. అందులో (1) శాంతి సూక్తం, (2) శాంతి సూక్తం పరిస్తూ అను రెండు కవితా సంపుటి కలు రచించారు.

## శాంతి సూక్తం :

ప్రస్తుత కాలంలో మనుగడ కోసం మానవుడు చేస్తున్న సమరంలో కన్పించే అసమానతలు, రోత గొలిపే అంశాలు అట్ట హాసం చేసే స్వార్థము మొదలైన వాటిని 'శాంతి సూక్తం' కవితా సంపుటికలో చల్లా రాధాకృష్ణ శర్మ గారు వివరించారు. ఈ కవితా సంపుటిలో మొత్తం 33 కవితా సంచికలు ఉన్నాయి. హింసను మనసారా ద్వేషించాలి. శాంతిని నోరారా భూషించాలి. మానవు లందరూ శాంతి, సహనాలు జీవితం అమృత ఖండం అవుతుంది. శాంతి అను క్షేత్రంలో శ్రమ అనే బీవజలు చల్లితే సిరి సంపదలు పండును. కావున శాంతి సహనాలతో కూడుకున్న జీవించటమే మానవ ధ్యేయం అని చల్లా రాధాకృష్ణ శర్మ గారు తెలిపారు.

కన్పిస్తున్న నాటి మురికి వీధులు దువ్వినా అణగని జుట్టు ముదిరిగా లెక్కల చేయాల్సిన చేతులు మట్టిలో గోళీలు ఆడుతు న్నాయి. విద్యాధికులుకి విదేశ వ్యామోహం నెలకొంది. ఖాతాలో

ధనాన్ని చూసుకుంటూ వర్తకులు ఆనందిస్తున్నారు. కానీ పేదలకు ఏ మాత్రం సహాయం చేయట్లేదు అని రాధాకృష్ణ శర్మ గారు సాంఘీక సమస్యలను, పరిష్కరించాలని కవితా పాఠకుల హృదయానికి హత్తుకునేలా తెలిపారు. ఆకుపచ్చ చీర కట్టుకుని అందానికి అందాలు దిద్దుకున్న లావణ్య లలిత ప్రకృతి. గజగజలాడే గాలులు కల్పించినా.... కణ కణ లాడే నిప్పులు చెరిగినా.... ప్రకృతి హృదయం నవనీతము. ప్రకృతి మాత సందున సాధు ఫలాలు మనకు అందిస్తుంది. వర్షం వలన పంటలు పండును కావున వర్షాలను మొదలైన వాటిని మనకు అందించిన ప్రకృతిని మనం రక్షించుకోవాలని చల్లా రాధాకృష్ణ శర్మ గారు తెలిపారు. మానవులందరూ శాంతి సహనాల నిస్వార్థంగా ఉంటే ప్రకృతి మాత కూడా నిశము ప్రచండాలు జరుగవు. అని శర్మ గారి ప్రధానో ద్దేశ్యం.

**శాంతి సూక్తం పఠిస్తూ :**

స్వేచ్ఛ శాంతం మొదలైన మానవ గుణాలకు చెందిన ప్రస్తావన ఈ సంపుటిలో శర్మ గారు క్షుణ్ణంగా తెలిపారు. మానవ జీవితం పంజరంలో చిలుక లాంటిది. తలుపు తెరిస్తే పంజరానికి చెప్పకుండా ఎగిరిపోతారు. బంధ విముక్తి కల్గిన నాడే మనిషి వృద్ధి చెందుతాడు. సర్వ జగత్తుకు ఆరాధ్య దేవత శాంతి మాత మానవుల అందరు నేటి కాలంలో సమర గీతాన్ని తలపిస్తున్నారు. రుధిర దీపికలను వెలిగిస్తున్నారు. ఈ విధమైన ప్రవర్తనను ఉండరాదు. సర్వ జగత్తుకు ఆరాధ్య దేవత శాంతి మాత. మానవులు అందరు నేటి కాలంలో సమర గీతాన్ని ఆలపిస్తున్నారు. రుధిర దీపికలను వెలగిస్తున్నారు. ఈ విధమైన ప్రవర్తనను ఉండరాదు. సర్వజనులు అందరూ శాంతి సూక్తం చదవాలి. హృదయ శాంతి సదమైనాడు. ప్రగతి పథగామియై మానవులు విహరిస్తాడు.

ఈ కవితా సంపుటికలో మొత్తం 41 ఖండికలు ఉన్నాయి. అందులో 'శాంతి మాత' అను ఖండికలో చల్లా రాధాకృష్ణ శర్మ గారు శాంతి స్వభావి అని పాఠకులకు తెలుస్తుంది.

"దేశమే నా పవిత్ర దేవాలయం
ఆలయంలో నెలకొన్న మూల విరాట్టు
సర్వ జగతికే ఆరాధ్య దేవత
సర్వ సౌఖ్య ప్రదాత, శాంతి మాత...!
మలినాత్ములెవరో ఆమె సన్నిధిని
సలుపులు జరుగుతున్నా హావాకారాలు,
రువ్వుతున్నారు రాళ్ళు రప్పలు
పువ్వుల చల్లవలసిన చేతులతో...."

పై ఖండికలో శర్మ గారు దేశాన్ని ఒక దేవాలయంగా ఊహించి 'శాంతి' స్వభావాన్ని ఒక దేవతగా కల్పించి ఈ కవితా సంపుటి రచించారు. శాంతి సౌఖ్యం ఉండాల్సిన ఈ దేశంలో కొందరు నీచులు ఈ దేశంలో ఉండే శాంతి స్వేచ్ఛలకు భంగం కల్గిస్తున్నారని ఈ విధంగా ప్రవర్తించరాదని తెలిపారు.

అయినా ఆమె చూపులు కక్కావు నిప్పులు
ఆమె మాటలు కాలేవు తూహేరాలు
ఆమె ఎప్పటికి సుప్రస్తున్న ఆమె కుమాత కాదు కనుక!

నీచులు ఎన్నో అశాంతి, అహింసలతో కూడుకున్న దుష్కార్యాలు గావించిన ఆ శాంతి మాత మాత్రం ప్రకృతిని వినాశనం చేయకుండా ఓర్పు, సహనశీలమై ఉంటుందని సమస్త జనులకు శాంతి మాత యొక్క ఔన్యత్యాన్ని ఈ కవితా సంపుటిలో తెలి పారు.

'దురహంకారం మితమీరితే' అను కవితా ఖండికలో దురహంకారం ఉండరాదని శర్మగారు పామరులకు సైతం అర్థమయ్యే భాషలో రచించెను.

"పుట్టుకతో దుర్మార్గులు కారెవ్వరూ
పుత్తడి బొమ్మలే పుట్టిన వారందరూ.....!
దుష్ట చిత్తులౌతారు కొందరు
దురహంకారం మితి మీరినపుడు
దురాశలు వెర్రితలలు వేసినపుడు
దుర్భోదులు మనస్సును తొలిచినపుడు
మనిషి అప్పుడు శివమెత్తిన కోతి
దౌష్ట్యం రూపెత్తిన కోతి"

పుడుతూనే సమస్తజనం మంచివారే అని వారి దుష్ప్రవర్తన, దురహంకారం ఎక్కువ అవటం వలన దుర్జనులు అవతారని ఇలాంటి దుర్జనుల వలన శాంతి సహనాలతో కూడుకున్న సమాజానికి ఆటంకం కల్గుతుందని శర్మగారు హెచ్చరించారు.

**ముగింపు :**

ఆచార్య చల్లా రాధాకృష్ణ శర్మ గారు శాంతి స్వభావి, మృదు హృదయుడు. ఆవేశం కోపం నేటి కాలంలో ఎక్కువగా ఉన్నాయని అవి లేని శాంతి సహనాలతో కూడుకున్న మానవ జీవితంతో కూడుకున్న ప్రపంచం కావాలని కోరుతున్నారు. అలాంటి నవ నూతన ప్రపంచం కోసమే రచనలు గావించారు.

**ఆధార గ్రంథాలు :**

1. శాంతి సూక్తం పఠిస్తూ- చల్లా రాధాకృష్ణ శర్మ
2. శాంతి సూక్తం - చల్లా రాధాకృష్ణ శర్మ

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆంధ్ర సాహిత్యంలో వికసించిన విప్లవ కవిత్వం

- గుంటూరు భాస్కరరావు, తెలుగు అధ్యాపకులు, హిందూ కళాశాల, మచిలీపట్నం.

విప్లవం అనే మాట ఇంగ్లీషులో Revolution అనే మాటకు సమంగా వాడుతున్నాం. దీనికి దేశోపద్రవము అనే అర్థము కలదు. "విప్లవ మనగా ప్రజల్లో వచ్చే ఒక రకమైన మౌళిక మార్పుగా చెప్పవచ్చు" ఆ మార్పు సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా కావచ్చు. అదే విధంగా తెలుగు సాహిత్యంలో మార్పు ఆశించిన కొంత మంది తమ రచనల ద్వారా నిద్రపోతున్న జనాన్ని మేల్కొల పాలని అనేకమైన కవితలు, గ్రంథాలు రాసారు. అలా రాసిన వారే విప్లవ కవులు. వారు రచించిన కవిత్వమే విప్లవ కవిత్వం. కవులు తమ కలాలను ఖడ్గాలుగా మలచి రచించిన కవిత్వమే విప్లవ కవిత్వం. శ్రమ దోపిడీ చేసే సమాజం పై ఆ ఖడ్గాలను ఝళిపించారు.

## విప్లవ వాదం :

ఆధునిక తెలుగు కవిత్వ చరిత్రలో చేపట్టిన దృష్టి మరల్చే కవితా ధోరణులు వచ్చి ఉండవచ్చు. ఆకర్షణీయమైన వ్యక్తీ కరణలు మనం విని ఉండవచ్చు. తాము రంగం మీదకి వచ్చాకే చరిత్ర మొదలయిందని దబాయించిన కవితా ధోరణులుండ వచ్చు. కానీ సజీవ పరిమాణానికి నిదర్శనం మాత్రం ఒక్క "విప్లవ కవిత్వమే".

భారతదేశం సామ్రాజ్య వాదుల పరిపాలన కింద ఉన్న రోజుల్లో స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. కమ్యూనిస్టులకూ, ఇతరులకు ఒక ముఖ్యమైన భేదం ఉంది. సర్వ విషయాలను స్పృశించే తత్వ శాస్త్రం కమ్యూనిస్టుల కుంది ప్రకృతి, సమాజం, చైతన్యం వీటి పరిణామ క్రమాన్ని ఇదే తత్వ శాస్త్రంలో పరిశీలిస్తారు. కమ్యూనిస్టు అంతిమ లక్ష్యం కమ్యూనిస్టు సమాజ నిర్మాణం. 1946 నుంచి 1948 వరకూ కమ్యూనిస్టు ఉద్యమం ఆంధ్రదేశంలో బలంగా ఉంది. ఆ సమ యం అభ్యుదయ రచయితలకు స్వర్ణయుగం. 1950 పోరాటం విరమణ తరువాత పోరాటాన్ని కీర్తిస్తూ అభ్యుదయ కవిత్వం ఉన్నది. కానీ ఎక్కువ కాలం మనలేదు. ఇందుకు కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన మార్పులే కారణం. ఉద్యమంప్రజా పోరా టాల నుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఎదిగినప్పుడు అభ్యు దయ రచయితలు కూడా ప్రజారంగాన్ని వదిలి సినిమా రంగానికే గారు.

## విప్లవ కవిత్వం :

1970-80 దశకంలోని ఆధునిక సాహిత్యాన్ని విప్లవ కవి త్వంగా పేర్కొంటారు. దిగంబర కవుల ధోరణికి విసుగుపోయిన కొందరు అభ్యుదయ కవులు 1970లో విప్లవ రచయితల సంఘం (వి.ర.సం.) ను స్థాపించి అదే సంవత్సరం ఫిబ్రవరి 1,2 తేదీలలో శ్రీ శ్రీ షష్టి పూర్తి సందర్భముగా జరిగిన సభలో రచయితలకు సవాల్, "ముప్పై ఏళ్ళుగా సాహిత్యం ఏం చేస్తుంది? ఎటు వెళ్ళింది, మీరంతా ఎందుకోసం రాస్తున్నారు? ఎవరి కోసం రాస్తున్నారంటూ?" కొందరు విద్యార్థులు కరపత్రాల ద్వారా ఆ సభకు వచ్చిన అభ్యుదయ కవులను నిలదీసారు. "చేతనయితే రండి. నిజాన్ని నిర్భయంగా రాయండి మేం ఉన్నాం. మీరూహించే మరో ప్రపంచాన్ని వాస్తవం చేస్తాం" అని ప్రకటించారు. ఆ సమ యంలో వి.ర.సం. అధ్యక్షుడు శ్రీశ్రీ

భారత కురుక్షేత్రంలో
నవయుగ భగవద్గీతా ఝంఝ ని ప్రసరిస్తాను
మంటల చేత మాట్లాడించి
రక్తం చేత రాగాలాపన చేయిస్తాను.అని తమ దీక్షను ప్రకటించారు శ్రీ శ్రీ

## విప్లవ కవిత్వంలో వచ్చిన కావ్యాలు :

"సాహిత్యం ఒక ఆయుధ విశేషం". "సంపూర్ణ మానవ స్వేచ్ఛయే విప్లవం". అని తమ మార్గాన్ని నిర్దేశించుకున్నారు. "విప్లవ కవిత్వంలో మొట్టమొదట వెలువడిన కవితా సంపుటి "ఝంఝా". ఈ కావ్యము శ్రీకాకుళ రైతాంగ పోరాటములో ప్రాణాలు పణంగా పెట్టిన సుబ్బారావు పాణిగ్రహికి అంకితమీయ బడినది. "ఝంఝా"లో అశోక్, చెరబండరాజు, జ్వాలాముఖి, కె.వి.రమణారెడ్డి, సాగర్, నగ్నమునిల కవితలు ఉన్నాయి. శ్రీకా కుళ పోరాటములో మరణించిన చాగంటి భాస్కరరావు పై విప్లవ కవుల్లో గాఢమైన, ఆవేశభరితమైన మానవతా స్పర్శగల శివసాగర్ రాసిన కవిత

"బర్రెంక సెట్టు క్రింద నరుడో, భాస్కరుడా
బందూకు పట్టివయ్యా నరుడో, భాస్కరుడా
బందూకు సేతపట్టి నరుడో, భాస్కరుడా
బంధాలు తెంచితివయ్యా నరుడో భాస్కరుడా"

ఇది జనాన్ని విప్లవం వైపు పరుగులెత్తించింది.

"అన్నా నీ గాయాలపై నుండి వీచిగాలి ఎరుపెక్కింది"

అని పోరాటంలో మరణించిన వీరుడ్ని అశోక్ తన కవితలో పేర్కొనగా జ్వాలాముఖి తనదైన శైలిలో

ఉదయం రాకుండా ఊరంతా కాపలా
మనమందరం కటిక చీకటి కోటలో
బ్రతుకు చెడిన బానిసలం, విముక్తి మార్గం కావాలి
లక్ష నక్షత్రాలు రాలందే ఉజ్వల ఉదయం ప్రవహించదు

అని సమాజంలో విప్లవాత్మకమైన మార్పు రావాలని ఈ కవిత ద్వారా ఉద్ఘాటించారు.

"అజ్ఞానం మన శత్రువు, ప్రపంచాన్ని ప్రమాణాన్ని
ప్రజా ప్రభుత్వాన్ని నిర్మించే మనుషులు కావాలిప్పుడు
ప్రతి తల్లీ ఒక సూర్యుణ్ణి ప్రసవిస్తే చాలు"

అని యువతరాన్ని విప్లవం వైపు కదిలేట్టుగా చైతన్య పరుస్తూ రాసిన కవిత యిది. అప్పటి ప్రభుత్వం 'ఝంఝా' కవితా సంపుటిని నిషేధించింది. విప్లవ కవిత్వంలో వచ్చిన కవితా సంకలనాలు 'లే', మార్చ్, విప్లవం వర్ధిల్లాలి, తిరగబడు మొదలైనవి. వీటిలో మార్చ్ కవితా సంకలనాన్ని కూడా ప్రభుత్వం నిషేధిం చింది.

**విప్లవ సాహిత్యంలో మాండలికాలు :**

"ఏం పిల్లో ఎల్దమొత్తవా
శ్రీకాకుళములో సీమకొండకీ
సిలకలు కత్తులు దులుపరిత్తయట
ఏంపిల్లో ఎల్ద మొత్తవా"

అంటూ చక్కని విప్లవ గీతాన్ని శ్రీకాకుళం మాండలికంలో రాసారు.

"సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో
సినబోయి కూసున్న వెందుకమ్మో ఎందుకమ్మా"

అంటూ తెలంగాణా మాండలకంలో సాగిన ఈ గీతంలో రైతు కూలీ అయిన లచ్చుమమ్మ దీనగాథను ఆవిష్కరించారు.

"చీమలదండులు కదిలినాయి
పాముల గుండెలు అదిరినాయి
తోడేళ్ళు తోక ముడిచినాయి"

అని గద్దర్ భూస్వాముల అరాచకాలు ఇక సాగవని ప్రజలను తనదైన శైలిలో ఉత్సాహపరిచాడు.

"ఊరు మనదిరా, ఈవాడ మనదిరా
పల్లె మనదిరా, ప్రతి పనికి మనం రా
సుత్తె మనది, కత్తి మనది, పలుగు మనది, పారమనది
బండి మనదిరా, బండెడ్లు మనయిరా"

అని సాగే ఈ గేయాన్ని గూడ అంజయ్య రాసాడు. ఈ గేయం ఇప్పటికీ ప్రజల హృదయాల్లో మార్మోగుతుంది.

## విప్లవోద్యమంలో దళిత కవిత్వం :

దళితుల పై అగ్ర వర్ణాలు జరిపిన దారుణ మారణ కాండను చూసి చలించిన మేథావులు కవులు తమ తమ కలాలకు పదును పెట్టారు. కవితల ద్వారా దళితుల్లో చైతన్యం కలిగించా లని అనేక మంది కవులు తమదైన శైలిలో పాటలు, గేయాలు, కవితలు రాశారు. శ్రీకాకుళ రైతాంగ పోరాటం, తెలంగాణా రైతాంగ పోరాటం, నిజాం వ్యతిరేక పోరాటం మొదలైన ఉద్యమాల్లో పాలు పంచుకున్న వారు దళితులే. ఈ కాలంలో వచ్చిన కవితలు, పాటలు, గేయాలు, ఊరూ, వాడా పల్లె పట్టణం అని తేడా లేకుండా దళితేతరులను సైతం ఒక ఊపు ఊపాయి.

చెరబండ రాజుగారు "ఏ కులమబ్బీ - మాదేమతమబ్బీ మట్టి పిసికి ఇటుక చేసి, ఇల్లు కట్టి కూడా కూడు లేక డొక్క లెండిన శ్రమ జీవులది ఏ కులమబ్బీ" అంటూ కులరక్కసిని బాహాటంగా విమర్శించాడు.

"మాలోల్ల మంటావు మాది గలమంటావు
మాట మాటాడితే మారముండంటావు
నీ రక్తమెట్టుండెరో ఓరోరి మా రక్త మెరుపుండెరో"

అంటూ బి.యన్.బి.గారు అగ్రవర్ణాల వారిని దుయ్యబట్టారు.

"బాంచెన్ బాంచెనంటు గులాపోన్ని దొర అంటూ
ఎన్నాళ్ళు బ్రతుకుతావు మాలన్నా
నువ్వు ఎదురు తిరగవేమిర మాదిగన్నా
రాజ్యాధికారానికి - మాలన్నా!
నువు రైఫిలందుకోవరో మాదిగన్నా"

అంటూ విప్లవ కవితలో మాల మాదిగలను రైఫిల్ పట్టండంటూ పిలుపునిచ్చారు. దళితుల కష్టాలను కాంచి, వారి బ్రతుకులను బాగు చేసే ప్రయత్నంలో తమదైన శైలిలో అనేక మంది కవులు స్పందించారు. దళిత చైతన్యానికి ప్రతీకగా ఈ కవుల నిరంతర శ్రమ కనిపిస్తుంది.

## ముగింపు :

1970లో ప్రారంభమైన విప్లవ కవిత్వం 1980వరకు సాగి చల్లారింది. అక్కడక్కడా హింసాపూరితమైన అంశాలకు చోటివ్వడంతో క్రమంగా ఉద్యమం సన్నగిల్లింది. రాజకీయ పక్షాల జోక్యం వల్ల విరసంలో చీలికలు రావడంతో విప్లవ కవితోద్యమం క్రమంగా కుంటుపడింది.

## ఆధార గ్రంథాలు :

ఆధునిక సాహిత్యంలో విభిన్న ధోరణులు - ఆంధ్ర సారస్వత పరిషత్తు
తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - వేల్చేరు నారాయణరావు
ఇతర పత్రిక

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# అడిగోపుల వెంకటరత్నం కవిత్వం - దళితవాద దృక్పథం

- డా॥. ఎన్. భీమన్న, ఆంధ్రోపన్యాసకులు, ఎస్. వి. ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

సమాజాన్ని, చరిత్ర గమనాన్ని దళితుల దృష్టికోణం నుండి అధ్యయనం చేసే వాదం దళిత వాదం. దీనికి మూలం దళిత జీవిత వాస్తవికత.

**దళితవాదం - నేపథ్యం :**

భారతదేశంలో వివిధ మతాలతో పాటు, విభిన్న కులాల వారు ఉన్నారు. దేశ జనాభాలో ఉన్న వివిధ కులాల వారిలో కొన్ని ఉన్నత కులాలుగా, మరికొన్ని అంటరాని కులాలుగా సంకుచిత దృష్టితో కులాల ఏర్పాటు జరిగింది. రాజకీయ, సామాజిక, హైందవ వర్ణవ్యవస్థ, నియంతృత్వం ఫలితంగా కింది కులాల వారు కొందరు సంఘంలో అస్పృశ్యులుగాను, కడజాతి వారిగాను పిలువబడ్డారు. వీరికి సమాజంలో సముచిత గౌరవ స్థానాలు గానీ, సంఘంలో అభివృద్ధి చెందే అవకాశాలు గాని లేవు. ఆర్థికంగా నిలదొక్కుకునే వనరులు, వసతులు వీళ్ళకు మృగ్యం.

తాత ముత్తాతలు సంపాదించిన స్థిర చరాస్తులంటూ ఏమీ లేవు. శరీర కష్టాన్ని నమ్ముకుని, కుల వృత్తులు చేసుకుంటూ విద్యకు, నాగరిక జీవనానికి దూరంగా ఊరి వెలుపలకు నెట్టి వేయబడ్డారు. దుర్మార్గపు కులం కట్టుబాట్లలో నలిగిపోతూ ఉన్నారు. వీరిపై అంటరానివారనే ముద్రవేసి, నానా రకాల నీచమైన ఆంక్షలు విధించి వీరిని యుగయుగాలుగా సంఘం నుండి బహిష్కరించారు.

ఇటువంటి పరిస్థితుల్లో సంస్కరణోద్యమాలు పుట్టడం తద్వారా కొత్త ఆలోచనలు అంకురించడం జరిగింది. జాతీయ ఉద్యమాలు బయలుదేరాయి. "అస్పృశ్యులు పతితులు కారు. వాళ్ళు మనుషులే. దేవుని బిడ్డలని ఉద్ఘోషించి, వాళ్ళు పునరుద్ధరణ కోసం యావజ్జీవితం హరిజనుల అభివృద్ధి కోసం పోరాడిన మహామహుడు అంబేద్కర్" అని "తెలుగు నవల అస్పృశ్యతా సమస్య' రచనలో డా॥ ననుమాస స్వామి అభిప్రాయ పడ్డారు. జాతీయ స్ఫూర్తితో గాంధీజీ కొన్ని నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టాడు. అందులో అస్పృశ్యతపై నిరసన, హరిజనుల ఆలయ ప్రవేశం వంటివి ప్రధానాంశాలు. ప్రయోగాత్మకమైన ఈ నిరసన వల్ల ఆంధ్రదేశంలో కూడా కొన్ని విప్లవాత్మకమైన సంస్కరణలు వెలిశాయి. ముఖ్యంగా జాతిని పీడిస్తున్న అస్పృశ్యతపై తిరుగుబాటు మొదలైంది. 1920లో ప్రారంభమైన జాతీయోద్యమం కంటే ముందే 1916లో అయ్యదేవర కాళేశ్వరరావు, త్రిపురనేని రామస్వామి చౌదరి హరిజనోద్యమాన్ని ప్రారంభించడం విశేషం.

ఈ హరిజనోద్యమం తెలుగుసాహిత్యాన్ని, తెలుగుదేశ సాంఘిక జీవితాన్ని ప్రభావితం చేసింది. మంగిపూడి వేంకటశర్మ 'నిరుద్ధ భారతం', ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' జాల రంగస్వామి 'అంటరాని వారెవరు', మొదలైన రచనలు ఆ సందర్భంలో పేర్కొనదగినవి.

దళిత సాహిత్యం అంటే దళితులను గూర్చి చెప్పేదిగా, దళితులే చెప్పిందిగా గుర్తించవచ్చు. అవగాహన స్థాయి విభిన్నం కావడం వల్ల, అనుభవించే భావాల తీరు వేరుగా ఉండడం వల్ల చూచినవాడు వ్యక్తం చేసేది, అనుభవించినవారు నివేదించేది తప్పనిసరిగా వైవిధ్య భరితంగానే ఉంటుంది. 19వ శతాబ్దం ఉత్తరార్ధంలో బ్రహ్మసమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం వంటి సంస్థలు భారతీయ సామాజిక జీవితంలో సంస్కరణలు తీసుకురావడానికి కృషి చేశాయి.సరిగ్గా ఆ రోజుల్లోనే 1873-74 నాటికి మహారాష్ట్రలో మహాత్మజ్యోతిరావు పూలే 'సత్య శోధక సమాజాన్ని' స్థాపించాడు. చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని రూపొందించాడు. దళితుల పెళ్ళిళ్ళకు బ్రాహ్మణ పౌరోహిత్యం అక్కరలేదని, దళిత పురోహితులే దళితుల పెళ్ళిళ్ళు నిర్వహించాలని ప్రబోధించాడు. దళితుల ఆత్మగౌరవ పోరాటానికి పిలుపునిచ్చాడు. పూలే వారసత్వాన్ని స్వీకరించిన డా.బి.ఆర్.అంబేద్కర్ 1924 మార్చిలో అస్పృశ్యత నివారణోద్యమం ప్రారంభించాడు. తద్వారా అస్పృశ్యతకు వ్యతిరేకంగా వేలాది పుటల సాహిత్యాన్ని రచించి దళితుల్లో చైతన్యాన్ని, సంఘటిత శక్తిని ప్రేరేపించాడు.

1984లో ఉత్తర భారతదేశంలో కాన్షీరామ్ బహుజన సమాజవాదాన్ని ప్రచారం చూశాడు. "ఓట్లు మావి సీట్లు మీవా?" అన్న విప్లవాత్మక నినాదం ద్వారా దళితులకు రాజ్యాధికారం రావాలన్న దిశను నిర్దేశించాడు. ఈ పరిణామాలన్నీ సమకాలీన దళిత సాహిత్యం పురోగమించడానికి కావలసిన నేపథ్యాన్ని సమకూర్చాయి.

దళితులను, వారి సమస్యలను గూర్చిన సాహిత్య చరిత్రను పరిశీలిస్తే ప్రాచీన సాహిత్యంలో శ్రీ కృష్ణదేవరాయల ఆముక్త మాల్యదలోని మాలదాసరి వృత్తాంతం, వేమన, వీరబ్రహ్మం, అన్నమయ్య వంటివారు అక్కడక్కడ అస్పృశ్యతను నిరసించారు.

ఆధునిక సాహిత్యంలో ఈ నిరసన స్పష్టంగా కనిపిస్తుంది. కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా మొదలైన వారు హరిజన సమస్యలపై కావ్యాలను రచించారు. సుబ్బారావు ప్రాణిగ్రాహి,శిసాగర్, గద్దర్, బొజ్జాతారకం, కత్తి పద్మారావు, కొలకలూరి ఇనాక్, మద్దూరి నగేష్‌బాబు, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి మొదలైన కవులు దళిత కవిత్వానికి బలం చేకూర్చారు. ఆత్మగౌరవ చైతన్యాన్ని ప్రేరేపించారు.

**అడిగోపు దళితవాద దృక్పథం :**

దళిత కవిత్వాన్ని కేవలం అనుభవాల, ఆత్మన్యూనతా భావాల వ్యక్తీకరణగా కుదింపజూసిన అగ్రకుల సాహితీ వేత్తల అర్థ దృక్పథాన్ని, అసమగ్రతని బద్ధలు కొట్టి తెలుగు సాహిత్యాన్ని ఓ కుదుపు కుదిపింది దళిత కవిత్వం.

మొదట అభ్యుదయ దృక్పథమే కలిగిన అడిగోపుల వెంకటరత్నం తర్వాత దళితుల బాధలపై కూడా స్పందించారు. దళితుల ఆశలకీ, ఆకాంక్షలకీ,ఆవేదనకీ, ఆగ్రహానికీ ప్రతి రూపంలో నిలిచిన కవిత్వాన్ని కొత్త చూపుతో, కొత్త వ్యక్తీకరణతో సృష్టించాడు.

ఈయన దళితులనుద్దేశించి రచించిన కవితల్లో ప్రధానంగా కనిపించేది అస్పృశ్యత అనే దురాచారం. దీన్ని తీవ్రంగా ఖండించాడు అడిగోపుల వెంకటరత్నం. ఈయన కవిత్వంలో పాలేతనం, ఆలయప్రవేశం, వృత్తి,నీటి సమస్య, రాజకీయం అనేవి అస్పృశ్యతలో అంతర్భాగంగా కనిపించే అంశాలు.

**అస్పృశ్యత :**

హరిజనులు శతాబ్దాల తరబడి దీన హీన స్థితిలో జీవించారు. భారతీయ సంస్కృతిలో వర్ణవ్యవస్థ అనేక సంవత్సరాలుగా హిందూజాతికి ఒక అడ్డుగోడగా నిలిచింది. దీనికి మూఢ నమ్మకాలు, ఆచార సంప్రదాయాలుతోడవడం వల్ల వాటికి గట్టి పునాది ఏర్పడింది. వారి జీవితాలు సుసంపన్నం కావడానికి, కావాల్సిన ఏర్పాట్లు ఎంత ప్రయత్నించినా సుస్పష్టంగా విశదం కావడంలేదు.

దళితులను ముట్టుకుంటేనే అంటరానితనం సోకి మైల పడేటట్లు భావించే అమానుషమైన సాంఘిక వ్యవస్థను మనువు సృష్టించాడు. అంటరానితనం ధర్మసమ్మతమేనని పూరి శంకరాచార్యుడు ప్రకటించాడు. సమాజంలో హరిజనులు చాలాహీనంగా చూడబడుతూ కేవలం సవర్ణుల పశువుల కొట్టాలకే పరిమితం అయ్యారు.

జీవితాంతం దళితులు అగ్రవర్ణాల పొలంలో పనిచేస్తారు కానీ వాళ్ళు ఇళ్ళలోకి ప్రవేశించరు. కనీసం వాళ్ళ పాత్రలు అంటుకోవడానికి కూడా అవకాశం ఉండదు. సమాజం అంతగా అభివృద్ధి చెందక మునుపు హరిజనులు పురవీధుల్లో సంచరించేవారుకాదు.

అస్పృశ్యతను రూపుమాపడానికి ప్రతి హరిజనుడు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనీ అప్పుడే వారు సవర్ణులతో సమానంగా చూడబడతారని సంస్కరణాభిలాషులైన కవులు, రచయితలు సాహిత్యం ద్వారా సమాజానికి ఉద్భోదించారు.

కులమతాలన్నవి అగ్రవర్ణాల్లో ఒక వర్గం తమ స్వార్థం కోసం, తమ ఉనికిని కాపాడుకోవడం కోసం సృష్టించినవి. ఇవే దళితులను బలిపశువులుగా మార్చాయి. కులం పేరుతో మనిషిని దూరంగా ఉంచడం సమానత్వం కాదనీ అందరూ ఒక్కటేనన్న మానవత్వాన్ని తెలుసుకోవాలని అడిగోపు తన కవిత్వంలో అస్పృశ్యతను తీవ్రంగా గర్హించాడు.

'భారతమాత' అనే కవిత అందుకోక నిదర్శనం.

"భారతదేశానికి
మూడువైపుల
మూడు మహాసముద్రాలు
ఉత్తరాన హిమలయం వున్నట్లే
నాగుడిసెకు మూడు వైపుల
మూడు నిలువు లోతు నీళ్ళు
ఉత్తరాన ఎత్తైన కొండ
నాబిడ్డంటూ నా భారతమాత
నా దగ్గర కెప్పుడూ
వచ్చింది లేదు
నాకు దారి లేదు" (ఎన్నాళ్ళీ చిరిత్ర)

పంచముడికి నాలుగు వైపుల వంచనలే. ఇవి మానవీయ సంబంధాలకు అఘాతం కలిగిస్తున్నాయి. ఒకదేశాన్ని మున్నీరు మూడు వైపుల ఆక్రమించుకుంది. మరోవైపు కులతత్వం హిమాలయం అంత ఎత్తుకు ఎదిగి అంటరానితనానికి ఒంటరి జీవితాన్ని నిర్దేశిస్తుంది. దేశం ఎలాగైతే ప్రపంచం నుండి దూరమైపోయిందో, దళితుడు కూడా జన సముద్రం నుండి సుదూర ద్వీపంలోకి నెట్టి వేయబడ్డాడనే ఆర్తి ఈ కవితలో కనిపిస్తుంది.

'ఒకరికిఒకరు' అనే ఖండిక కూడా అస్పృశ్యతను నిరసించిందే.

"నదికి రంజాను తెలియదు
క్రిస్మస్ తెలియదు
సంక్రాంతి తెలియదు
దోసిలి పట్టినవాడి
దప్పిక తీర్చడమే దాని పని
ఒడ్డున ఉన్నది
రామాలయమో
శివాలయమో
దుర్గాలయమో పట్టదు
స్నానమాచరించే భక్తులను
స్వాగతించడమే దాని స్వభావం
ఎందుకో మనుషులు విడివడుతూ
తరమబడుతూ వినిరి వేయబడుతూ
ఊరు వాడల విభజింపబడుతూ
ఒకరికి ఒకరు అస్పృశ్యులై".

దారీ తెన్నూ లేకుండా ప్రవహించే నది దాహార్తుల దోసిలి నింపుతుంది. ప్రకృతంతా పరోపకార భావంతో పరుగులు తీస్తుంది. కానీ ప్రకృతి నుండి పుట్టిన మనిషి, పరమాత్మకు ప్రతినిధిగా

చెప్పుకుంటూ సాటి మనిషిని హీనంగా చూసే కుసంస్కారాన్ని ఎండగట్టాడు అడిగోపుల వెంకటరత్నం.

"మర్రికింద మల్లెతీగ" అనే కవిత కూడా ఇటువంటిదే

"మాకు అనుభవాలకేం కొదువ
మారక్తంతో అవమానాల వెల్లువ!
పచ్చిబాలింత తల్లి నా పాల కోసం
ఇంటింటా యాచించి పెంచిన సంగతి!
నిక్కరు లేక చినిగిన చొక్కాతో
పగిలిన పలక పట్టుకొని
బడికెళ్ళితే
చదువుకు సేద్యానికి
రెండింటికి నువ్వు చెడతావు
మట్టి పిసుక్కుని బ్రతకమన్న
బడిపంతులు ఆజ్ఞసంగతి!
చంపేసిన నా తండ్రి శరీరాన్ని
శవ పంచాయితీ చేసి
సహజమైన చావని చెప్పిన సంగతి!
మాకు అనుభవాలకేం కొదువ
మా రక్తమంతా అవమానాల వెల్లువ
మేము మర్రిచెట్టు క్రింద
మల్లె తీగలం
పెరగకుండా బ్రతకాలి
చావకుండా నిలవాలి
నీడనిచ్చినా పెరగలేదని
నీతులు మీరు చెప్పుకోవాలి (విప్లవానికి పురిటిగది)

ఒకవైపు ఆత్యాధునిక జీవనవేగం, మరోవైపు దుర్భరమైన భూస్వామ్య అణచివేత, ఒకవైపు ప్రపంచాన్ని దిగ్భ్రమ పరిచే హైటెక్ భవన సముదాయాలు, మరోవైపు గాలి దుమారానికి కొట్టుకు పోయే పూరి గుడిసెలు, సమాంతరంగా కొనసాగుతున్న సంక్లిష్ట సామాసిక వ్యవస్థ భారతదేశం. ఇటువంటి వ్యవస్థలో దళితుల జీవన విధానం దుర్భరంగా ఉంటుందని అడిగోపుల బాధపడ్డాడు.

**ఆలయ ప్రవేశం :**

తరతరాలుగా ఆలయప్రవేశానికి అనర్హులని తమ మనుస్సులలో ఉన్నంత వరకు అభివృద్ధి చెందలేరని కవి భావించాడు. దేవుని పేరుతోనో, భక్తిపేరుతోనో సవర్ణులు చేసే మోసాలను దళితులు మూర్ఖంగా అనుభవించక వారు చేసే మోసాలను ఎండగట్టమని ఉద్భోదించాడు. అగ్రవర్ణాల వారు గుడి, గోపురాల్ని హరిజనుల చేత కట్టించుకొని అవసరం తీరిన తరువాత వారినే దేవాలయ ప్రవేశానికి అనర్హులను చేయడం అన్యాయమని అడి గోపుల అన్నాడు.

"ముడిరాయిని శిల్పికి మోశాను
శిల్పాన్ని గుడికి చేర్చాను
కోవెల నిర్మాణానికి రాళ్ళెత్తాను
అయినా ఆలయానికి అస్పృశ్యుడ్ని
ప్రవేశానికి నిషిద్ధుడ్ని". (శ్వేత పత్రం)

బడినుండి ఎలాగు వెలివేయబడిన మనిషి ఆలయ ప్రవేశానికీ నిషిద్ధుడయ్యాడు. ఈ అంతారాలు సమసిపోవాలంటే రాజకీయ చైతన్యం తప్పనిసరి. ఆర్ధిక సమానత్వం అనివార్యం. ఒట్టి మాటలతో ఇలాంటి నిరాశామయ జీవితాల్లో ఆశాజ్యోతులు వెలగవు అనే భావనను అడిగోపుల వెంకటరత్నం వ్యక్తిపరచాడు.

**నీటి సమస్య :**

చాలా కాలంగా దళితుల్ని పట్టిపీడిస్తున్నా వాటిలో ఒక్కటి నీటి సమస్య. తాము శ్రమించి తవ్విన బావిలోనే నీటికి త్రాగడానికి దళతులు అనర్హులయ్యారు. ప్రతి ఒక్కరికి ప్రాణాధారమైన నీరు కూడా దక్కని దౌర్భాగ్య జీవితాలకు అడిగోపుల వెంకటరత్నం చిత్రిక పట్టాడు.

'అంటరానితనం' అనే కవిత అటువంటి వాటిలో ఒక్కటి.

"మాపల్లె బావిలో
చేదక నీళ్ళందక
చేంతాడివ్వమని
మాయజమాన్నడిగితే
అంటరాని వాళ్ళు బావిలో చేంతాడేసి
మాకూ అంటరానితనం
అంటగట్టాలనా అన్నాడు" (ఎనాళ్ళీ చరిత్ర)

ప్రకృతి మనిషికి ప్రసాదించిన గాలి,నీరు,నిప్పు అన్నింటికీ అంటరానితనాన్ని ఆపాదించడం అమానుషత్వం. ఇటువంటి దురాచాలకు చరమగీతం పాడాలని అడిగోపుల వెంకటరత్నం తన సాహిత్యం ద్వారా దళితులను చైతన్య పరచారు.

**ఆధార గ్రంథాలు:**

1. తెలుగు నవల అస్పృశ్యతా సమస్య - డా॥ ననుమాసస్వామి
2. దళితవాద వివాదాలు - ఆచార్య ఎస్వీ సత్యనారాయణ.
3. అడిగోపుల కవితా సంపుటాలు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలంగాణ రాష్ట్రం- కార్మిక వర్గ సాహిత్యం

- డా॥. చింతం ప్రవీణ్ కుమార్, పి.డి.ఎఫ్. స్కాలర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

కార్మిక వర్గ సాహిత్యాన్ని అస్తిత్వ పోరాటాల దశలో భాగంగా చూడవలసి ఉంటుంది. అస్తిత్వ పోరాటాల దశ ఒక సమాజంలో నిరాదరణకు గురైన అంశాలన్నింటిని సాహిత్యంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుంది. ముఖ్యంగా మన దేశంలో కార్మిక వర్గ పోరాటాలకు మూలం 1860లో మహాత్మ జ్యోతిరావు ఫూలే, యమ్.ఎన్.లోఖాండేలు సత్యశోధక్ సమాజ్ నాయకత్వంలో చేసిన పోరాటాలే. వాళ్ళు మొట్టమొదటిసారిగా బొంబాయి బట్టలమిల్లు కార్మికుల పని, పని గంటల భారం తగ్గించేందుకు సమ్మె చేశారు. ఆ తర్వాత కాలంలో కార్మిక వర్గ పోరాటాలకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తినిచ్చింది. సాయుధ రైతాంగ పోరాటంలో చైతన్యం పొందిన ప్రజానీకం, రైతులు, రైతు కూలీలు...ఆ తర్వాత 1977 ఉత్తర తెలంగాణ రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించారు. అవి కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలుగా ప్రాచుర్యం పొందాయి. ఇవే తదుపరి కార్మిక వర్గ పోరాటాలకు ప్రేరణ అయ్యాయి. వీటి విప్లవ భావజాల స్ఫూర్తితో ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య,ఆర్టీసీ కార్మిక సమాఖ్యలాంటి విప్లవ కార్మికసంస్థలు ఆవిర్భవించాయి.

తెలంగాణాలో వ్యవసాయం, చేనేత, బీడీ, బొగ్గుగని కార్మికులు, ఈ పనివాళ్ళే ఎక్కువ. అయితే 8 లక్షల మంది బీడీ కార్మికులు, 60,000 మంది బొగ్గుగని కార్మికులతో ఈ రెండు రంగాలు అత్యధిక కార్మిక శక్తిని కలిగి ఉన్నాయి. ఉత్తర తెలంగాణా జిల్లాలైన కరీంగర్, వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలు బొగ్గుగని కార్మికుల కేంద్రాలుగా ఉన్నాయి. దీనితోపాటు కరీంనగర్, వరంగల్, అదిలాబాద్ జిల్లాలతో పాటుగా నిజామాబాద్, మహాబూబ్‌నగర్ జిల్లాలో బీడీ పరిశ్రమ విస్తరించి ఉంది. ఈ విధంగా తెలంగాణా పది జిల్లాల్లో సగానికి పైగా జిల్లాల్లో బొగ్గుగని కార్మికులు, బీడీ కార్మికులు విస్తరించి ఉన్నారు. మిగతా రంగాల్లో కార్మికులు...ఆర్టీసి కార్మికులు - 1 లక్ష 20 వేలు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా రాష్ట్రంలో ఈ సంఖ్య ఎంత అనేది లెక్క తీయాల్సి ఉంది) . చేనేత కార్మికులు - పవర్‌లూం, సెంట్రల్ వేర్‌హౌజ్, ఆల్విన్, నిజాం షుగర్, ఆజంజాహి మిల్లు కార్మికులైతే.., అసంఘటిత కార్మికులైనటువంటి భవన నిర్మాణ కార్మికులు, హమాలీ, కూలీ, హొటల్ కార్మికులు, వ్యవసాయాధారిత రంగ కార్మికులు... ఈ విధంగా తెలంగాణా వ్యాప్తంగా కార్మికశక్తి విస్తరించి ఉంది.

ఇప్పటిదాకా కార్మిక వర్గ సాహిత్యానికి సంబంధించిన సాహిత్యాన్ని పరిశీలిస్తే... చేనేత కార్మికులకు సంబంధించి చాలా సాహిత్యం వచ్చింది. కథలు, కవిత్వం, నవలలు వచ్చాయి. ఈ సాహిత్యం మీద పెద్ద ఎత్తున విశ్లేషణలు కూడా వచ్చాయి. విస్తృత చర్చలు కూడా జరిగాయి. ఇంకా తెలంగాణా సమాజానికి సంబంధించి నిత్యం ప్రజా జీవితాలతో పెనవేసుకున్న బంధం ఆర్టీసి కార్మికులది. ప్రజా రవాణ వ్యవస్థలో ఆర్టీసి కార్మికుల పాత్ర అనిర్వచనీయం. కానీ ఎందుకనో ఆర్టీసీ కార్మికుల జీవితాలపై, వాళ్ళ అవస్థలపై అంతగా సాహిత్యం వచ్చినట్టు కనబడదు.కనుక ఈ రంగంపై దృష్టి సారించవలసిన అవసరముంది.ఇక అసంఘటిత కార్మిక రంగం తెలంగాణాలో అధికమే. ఇప్పుడికిప్పుడే సంఘటిత శక్తిని ప్రోది చేసుకుంటున్న ఈ రంగంపై సాహిత్యం ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తోంది.పైన పేర్కొన్న అన్ని రంగాలతో పోల్చితే తెలంగాణ వ్యాప్తంగా అత్యధిక కార్మిక శక్తి కలిగి ఉన్నది బీడీ రంగం. దీని గురించి విస్తృతమైన సాహిత్యచర్చ సామాజిక చర్చలు జరుగవలసిన అవసరముంది.ఇక తెలంగాణతో సహ యావత్ దేశానికి వెలుగులనిస్తున్న సింగరేణి గనికార్మికుల సాహిత్యాన్ని పరిశీలించవలసి ఉన్నది. కనుక తెలంగాణా పునర్నిర్మాణానికి సంబంధించి కార్మిక శక్తి అత్యంత క్రియాశీలకమైన పాత్ర పోషిస్తుందనేది వాస్తవం. కనుక కార్మికవర్గ సాహిత్యాన్ని పరిశీలించడం తక్షణ అవసరం సాహిత్య బాధ్యత కూడా.

## బీడి పరిశ్రమ

తెలంగాణాలో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభాకు ఉపాధిని అందిస్తోంది బీడి పరిశ్రమనే. బీడీ కార్మికుల శ్రమ ఫలితంగా దేశీయ మార్కెట్‌లోనే గాక గల్ఫ్‌లోను ఇక్కడి బీడీలకు మార్కెట్ మెరుగ్గానే ఉంది.ఇదంతా నాణానికి ఒక వైపు...మరోవైపు చూస్తే పరిస్థితి ఇంకోలా ఉంది...ఇక్కడి బీడీల మార్కెట్ బహుళ జాతి సిగరెట్ కంపెనీలకు కంటగింపుగా మారింది.దేశీయ బీడి పరిశ్రమను దెబ్బతీసెందుకు కుట్రపన్నిన ఈ కంపెనీలు చిన్న సిగరెట్‌ను విడుదల చేసి బీడీ పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీసాయి. ఈ పరిణామాల దృష్ట్యా చాలా వరకు బీడీ కంపెనీలు మూతపడ్డాయి. దీంతో ఉన్న కొన్ని కంపెనీలు ఈ కార్మికులను ఎలా వదిలించుకోవాలా అని పథక రచనలో మునిగి ఉండగానే ‘పుర్రె గుర్తు’తో ఇంకా డేంజర్ సైరన్ మోగిస్తున్నాయ్ ప్రభుత్వాలు. ఒక్కొక్క బీడీ చుడుతూ జీవితాన్ని వెల్లదీస్తూ ,తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పొట్టకూటి కోసం గత్యంతరం లేక ఈ పొగాకు ఘాటులో మగ్గుతున్న ఈ కార్మికులు బతుకు భయంలో కొట్టు మిట్టాడుతున్నారు.తంబాకు సిగరెట్‌లో పదోశాతం కూడా పొగాకు ఉండని బీడీ కట్టలపై పుర్రె గుర్తు వేయడం వెనుక బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేసే కుట్రలను చూసి ఆందోళన చెందు తున్నారు.

తెలంగాణలో ఉన్న అన్ని కార్మిక సమూహాల కన్నా బీడి పరిశ్రమ భిన్నమైనది. నిజానికి బీడీ కార్మికులంటే స్త్రీ శ్రామిక శక్తి. ఎందుకంటే బీడీ పరిశ్రమలో దాదాపుగా నూటికి తొంబై మంది స్త్రీలే. తెలంగాణా జిల్లాలో ముఖ్యంగా నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, అదిలాబాద్, జిల్లాల్లో చిన్న చిన్న పట్టణాల్లో, పెద్ద పెద్ద పల్లెల్లోనూ బీడీ ఫ్యాక్టరీలున్నాయి. సేట్లున్నారు, షేక్‌దార్లున్నారు, లక్షల మంది బీడీ కార్మికులున్నారు.

బీడీ కార్మికులకు సంబంధించి పరిశీలించినట్లయితే ఈ రంగంలోని శ్రమ శక్తిలో బహుజనులే అధికం. వ్యవసాయంలో బతుకు దెరువు లేకపోవడం, (ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న కుటుంబాలు రావడం వలన) రోజు రోజుకు పట్టణీకరణ పెరగడంతో అర్బన్, సెమి అర్బన్ పట్టణాలు పెరగడం వలన పట్టణాల్లో బతుకు దెరువు అంత సులభం కాదు కాబట్టి అలాగని బయటికెళ్ళి పనిచేసే చదువు, విజ్ఞానం లేకపోవడం వలన ఉన్న దగ్గరే (ఇంటి దగ్గరే) పనిచేయడం అనే అంశం ప్రాథమికంగా మహిళలను బీడీలు చుట్టే పనికి దగ్గర చేసింది. ఇప్పుడైతే ప్రపంచీకరణ పుణ్యమా అని షాపింగ్ కాంప్లెక్స్, సూపర్ మార్కెట్లు పెరగడంతో అక్కడ కాస్త పని దొరుకుతుంది, కాని 20, 30 ఏండ్ల క్రింద షాపింగ్‌మాల్స్ కల్చర్ లేదు. పట్టణీకరణ, నగరీకరణ ఈ స్థాయిలో లేదు. అప్పుడు గ్రామాలకు అనుబంధంగా ఉండే మండలాలు, మున్సీపాలిటీ స్థాయి డివిజన్ వరకే పట్టణీకరణ విస్తరించి, అపుడు మహిళలు చేయడానికి వ్యవసాయంపై ఆధారపడి చేసే పనులు వ్యవసాయ కూలీలు, (నార్లు వేయడం, కలుపు తీయడం, పంట ఏరడం) లాంటివే ఉండేవి. ఆ క్రమంలో ఇంకాస్త ముందుకు అడుగు వేసి ఆలోచిస్తే అణగారిన మహిళలకు దొరికిన మార్గం బీడీలు చుట్టడమే ముఖ్యంగా బీసీల్లో పద్మశాలీ, కులస్థులు అధికంగా ఈ వృత్తిపై ఆధారపడిన వారున్నారు.

మన రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో కార్మికులుగా స్త్రీలు పనిచేస్తున్న ఏకైక అతి పెద్ద ప్రైవేటు పరిశ్రమ బీడీ పరిశ్రమ. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల కన్న ఎక్కువ సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమ బీడీ పరిశ్రమ. నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాల్లో ఈ పరిశ్రమ నలభై ఏళ్ళ క్రితమే నెలకొల్పబడినా, గత ముప్పై ఏండ్ల నుండి వ్యవసాయ రంగంలో మిగిలిపోయిన స్త్రీ కార్మికులకు, వంశ పారంపర్యంగా వచ్చే చేతివృత్తులు లాభసాటిగా కాకుండాపోయిన కార్మికులకూ జీవనాధారంగా ఈ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోంది.

రాను రాను బీడీ పరిశ్రమలోను కమీషన్ దార్లు కమీషన్ ఏజెంట్ల సంఖ్య పెరిగి పోయింది. బీడీ కంపెనీల యాజమాన్యం ఈ ఏజెంట్లను చాలా ఇష్టంగా నియమించుకుంది. కారణం ఏంటంటే బీడి కమీషన్‌దారు బీడీ కార్మికులకు - యాజమానులకు మధ్య వారధి లాంటి వారు. ఈ పద్ధతి వలన బీడీ కార్మికుల సమస్యలు పెరిగి యాజమానులకు మాత్రం సౌలభ్యం కలిగింది. బీడీ ఫ్యాక్టరీ యాజమాని బీడీ కార్మికులకు నేరుగా జవాబుదారీ కాదు.

ఇంటి వద్ద బీడీలు చేసేది ఒక విధానమైతే కొన్ని బీడీ కంపెనీలు ఇంటి దగ్గర కాకుండా తమ ఖార్ఖానాల్లోనే పని చేయాలంటారు. గాలి వెలుతురు లేని చీకటి గుయ్యారాల బీడీ కార్ఖానాల్లో రోగాలతో, నొప్పులతో విపరీతమైన పని భారంతో పొగాకు ఘాటుతో, ముక్కుతూ మూల్గుతూ పని చేయవలసి ఉంటుంది. ఇన్ని చేసినా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకను గుణంగా కూలీ రెట్లు పెంచడానికి ఎన్నో ఆర్థిక పోరాటాలు చేసినా వారి ఆర్థిక పరిస్థితులో ఏ మార్పు లేదు.

## బీడీ కార్మికులు- సాహిత్యం

బీడీ కార్మికుల జీవితాలను,బీడీ కార్మికులపై జరుగుతున్న శ్రమ దోపిడీని,వారిపై జరుగుతున్న అణచివేతలను, వారు సల్పిన పోరాటాలను చిత్రిస్తూ సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములు ముప్పయ్ ఏండ్లకిందటే(1982) 'బతుకుపోరు' అనే నవల రాశారు. ఈ నవల సామాజిక పరిణామాల్లో సామాజిక చారిత్రక ఉద్యమ నేపధ్యంలో వెలువడింది. బి.ఎస్.రాములు వి.ర.సం. సభ్యుడిగా తన జీవిత అనుభవాల నేపధ్యం వల్ల బీడీ కార్మికుల జీవితాలను ఉద్యమాలను చిత్రించాలనుకున్నారు.ఈ సామాజిక నేపధ్యంలో వెలువడినదే 'బతుకుపోరు'. విశేషమేమి టంటే... ముప్పయ్ ఏండ్లకిందట ఈ నవలలో ఏయే అంశాలైతే చిత్రించబడినాయో ఆ అంశాలు నేటికి ఏమి మారలేదు.

బతుకుపోరు నవలలో బీడీ కార్మికుల జీవన విధానం,పని సంస్కృతితో పాటు కరీంనగర్ జిల్లాలో సాగిన విప్లవోద్యమాలను అంతర్లీనంగా చిత్రించారు.ఈ నవలలో లక్ష్మి ప్రధాన పాత్ర. లక్ష్మి ఉదయం నిద్ర లేచినప్పటినుండి రాత్రి పడుకునే దాకా సాగిన దినచర్యలో అనేక అంశాలు వస్తాయి.అనేక పాత్రలు సంఘటనలు అత్యంత సహజంగా కన్పిస్తాయి.ఇలా జీవితానికి నవలకు మధ్య, కల్పనకు-వాస్తవికతకు మధ్యఉండే అంతరాలు తొలగి జీవితమే నవలగా సాక్షాత్కరింపజేస్తుంది నవల.వ్యక్తి నుండి సామూహికత్వంలోకి విస్తరిస్తుంది.అందరూ బీడీ కార్మికులే అయినప్పటికీ ఎవరి వ్యక్తిత్వం వారికి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన తీరు స్పష్టమవుతుంది. ఆ పాత్రలు వాస్తవిక జీవితంలో మనకు ఎదురైనట్టు సజీవంగా ఉంటాయి.

తెలంగాణాలో ఉద్యమిస్తున్న ప్రజల గురించి ఇప్పటికి 500లకు పైగా కథలు, 20 దాకా నవలలు, 10-12 దాకా సినిమాలు వెలువడ్డాయి. విప్లవోద్యమంలో రైతు కూలీలు, విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు,ఉద్యోగులు, విద్యావంతులు, రచయితలు, కళాకారులు, ప్రజాస్వామిక వాదులు, సింగరేణి కార్మికులు, ఆర్టీసి కార్మికులు, బీడి కార్మికులు మొదలైన అన్ని వర్గాలు కలిసి నడిచారు. తమ సమస్యల కోసం

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


ఉద్యమించారు. దీన్ని కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మేధావి ఐక్యత అని ప్రచారం చేశారు. గ్రామీణ రైతు కూలీల గురించి, వారి ఉద్యమాల గురించి తాడిగిరి పోతరాజు, ఎం.వి.తిరుపతయ్య, చెరబండరాజు, లక్ష్మీ, అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, పి.చంద్ యాదగిరి, కాలువ మల్లయ్య తుమ్మేటి రఘోత్తమరెడ్డి, వనమాల చంద్రశేఖర్, ముప్పాళ లక్ష్మణ్ రావ్, అన్నవరం దేవేందర్,అల్లం వీరయ్య, కె. రామ్మోహన్ రాజు, మునీర్, పిట్టల రవీందర్, మొదలైన రచయితలు అనేక కథలు రాశారు. పులుగు శ్రీనివాస్, అక్కినేని కుటుంబరావు, జాతశ్రీ, ఆడెపు లక్ష్మీపతి కార్మిక వర్గం గురించి ప్రత్యేక దృష్టిలో కథలు, నవలలు వెలువరించారు. ఐతే బీడీ కార్మికుల గురించి వెలువడిన సాహిత్యం అంతగా కనిపించదు. ఇట్లాంటి పరిస్థితుల్లో బీడీ కార్మికుల వాస్తవ జీవితాన్ని, వాళ్ళ కష్టాలు, కడగండ్లు అక్షరీకరించి, వాళ్ళ బతుక్కి వాళ్ళ బాధలకి మూలాన్ని, ఇప్పుడున్న వ్యవస్థకు ఉన్న సంబంధాన్ని, బతుక్కీ ఆర్థిక చట్రానికి ఉన్న బంధాన్ని వివరిస్తూ అట్లాంటి బతుకులోంచి ఎదగడానికి, మారడానికి ప్రజల జీవితాన్ని రికార్డు చేయడం అవసరమని ఆ పని బి.యస్. రాములు 'బతుకు పోరు' నవలా రచన చేశారు. స్వతహాగా రచయిత కుటుంబం కూడా బీడీ కార్మిక కుటుంబం కావడం చేత బతుకుపోరు నవల సహజరూపం తీసుకుని వాస్తవాలను ప్రతిబింబింపజేసింది.

బతుకుపోరు నవలపై ఎం.ఫిల్ పరిశోధన గ్రంథం వెలువరించిన పల్లా మాలతి చంద్ర బీడీలు చేయడం ఎంతో అందమైన కళ అనే విషయాన్ని చెప్పారు.

"బీడీలు చెయ్యడం నైపుణ్యం గల కళ. ఆకులు కత్తిరించడం ఒక నైపుణ్యం. ఎండిన ఆకును ఒక మోతాదులో నానబట్టడం ఒక నైపుణ్యం. ఆకు నార తీయడం ఒక నైపుణ్యం.పగిలిన భాగంను వదిలి బీడీకి పనికి వచ్చే విధంగా ఆకును సైజుకు కత్తిరించడం ఒక నైపుణ్యం. బీడీకి ఒకటిన్నర చుట్లు ఆకు చుట్టడం, అందులో సమానంగా పొగాకును సుతిమెత్తగా సర్దడం ఒక నైపుణ్యం. ఒకటిన్నర చుట్లు బీడీ ఆకును పొగాకులో చుట్టిన తర్వాత పొగాకు రాలిపోకుండా మూతినినొక్కడం ఒక ప్రత్యేక నైపుణ్యం. చివరి కొసను సన్నాయి పీకలాగా మలిచి లోపలికి నొక్కడం ఒకనైపుణ్యం. బీడీ విచ్చుకుపోకుండా దారం కట్టడం ఒకనైపుణ్యం. 20 లేదా 25 బీడీలను గుండ్రంగా పేర్చి కట్టలు కట్టడం.., వాటిని అందంగా తీర్చిదిద్దడం ఒక ప్రత్యేక నైపుణ్యం. ఇలాంటి కట్టలను చాటలో చక్కని వరుసలుగా పేర్చడం కూడా ఒక నైపుణ్యం. బీడీ ఆకు ఎక్కువగా నానితే 'మరక' అవుతుంది. ఎక్కువసేపు నానితే జిగట జిగటగా మారుతుంది. తక్కువ నానితే ఆకు పగిలిపోయి వృధా అవుతుంది. అందువల్ల బీడీ ఆకు సుతిమెత్తగా ఉంచుకోవడం ఒక ప్రత్యేక నైపుణ్యం. ఎక్కువ తడి ఉంటే లోపల ఉన్న పొగాకు కూడా బూజెక్కుతుంది.బీడీ కూడా నల్లబడుతుంది. ఇన్ని నైపుణ్యాల కలయిక బీడీ తయారు చేయడం"- ఈ విధంగా బీడీ పని సంస్కృతిని అందంగా ఆవిష్కరించారు పల్లా మాలతి చంద్ర.

అయితే ఇంత నైపుణ్యత కలిగిన ఈ పని చేస్తున్న కార్మికుల జీవితాలు, కూలీ రేట్లు మాత్రం దుర్భరంగా ఉన్నాయి. ఉదయమే లేసి బీడీ ఆకు (తునికాకు) కత్తిరించడంతో మొదలయ్యే వీళ్ల పని రాత్రి వరకు రెక్కలు ముక్కలు చేసుకున్నా తీరని బతుకులు వాళ్ళవి. అందునా కంపెనీ లో దుర్భరమైన వాతావరణం, పొగాకు, రోగాలు, నొప్పులు బతుకంతా ఇదే పరిస్థితి. యాంత్రిక జీవనం. పొగాకు పడక ఆస్థమా వంటి ఊపిరి సంబంధమైన రోగాలతో జీవితం అంతా భాదపడుతూ ఆమె కత్తిరిస్తూ వేళ్ళు వంకర్లు తేలి ఆర్థరైటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు ఒకవైపు బాధ పెడుతుండగా రోజుల్లో చాలా గంటలు కూర్చుని వంగి పని చేయడం వలన వెన్ను సంబంధ, రక్త ప్రసరణ సంబంధ దీర్ఘకాలిక వ్యాధులు వాటిని అనుక్షణం ఇబ్బంది పెడుతున్నా ఇళ్ళు గడవడం కోసం బీడీలు చుట్టక తప్పని పరిస్థితి. ఇంకా బీడీ ఖార్ఖానా సేట్లు, షేరిదార్లు పొగాకు, ఆకు పంపిణీ తూకంలో చేసే మోసాలు, నాణ్యత బాగాలేదనే సాకుతో (తల్లు బీడీ) మంచి బీడీలను కూడా తీసివేసి డబ్బులు తక్కువగా ఇవ్వడం, చదువు రాకపోవడం వలన సేట్లు కార్మికుల బీడీ ఫారంలో లెక్క తక్కువగా చూపడం వంటి తదితర అన్ని అంశాలు బీడీ కార్మికులను కుంగదీస్తుండగా, ప్రపంచీకరణ పుణ్యమా అని ఉన్న కాస్త ఆసరా కూడా చిన్న సిగరెట్ల రూపంలో వచ్చి వీళ్ళ ఉపాధి అంశాలను దెబ్బతీసాయి.

వ్యవసాయ పనులలో ఉన్నవారు పోగా మిగిలిన వ్యవసాయ కూలీలకు, ఇతర స్త్రీలకు బీడీ పరిశ్రమ ఒక ఆధారమైంది. నీడలో కూర్చొని బీడీలు చేయడం, కాస్త ఎండబారిన పడకుండా వుండవచ్చునని బీడీ పరిశ్రమపై ప్రారంభంలో ఎక్కువ మంది మొగ్గు చూపారు. ముఖ్యంగా చేనేత వృత్తి కోల్పోయిన కుటుంబాలకు బీడీ పరిశ్రమ ఒక ప్రత్యామ్నాయ ఉపాధిగా ఎదుగుతూ వచ్చింది. అలా నేడు నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని సుమారు ఎనిమిది లక్షల మందికి ఈ వృత్తి ఆధారమయ్యింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని ప్రజలకు సింగరేణి బొగ్గగనులలోని కార్మికుల కన్నా ముందు బీడీ పరిశ్రమే అక్కడి ప్రజలకు ఆదాయ వనరుగా ఉండేది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే... ప్రభుత్వ ఉద్యోగాలతో సమానంగా ఉపాధినిస్తున్న పరిశ్రమ బీడీ పరిశ్రమ. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న ప్రాధాన్యంలో వందో వంతు ప్రాధాన్యత కూడా ఈ వృత్తికి లేదు.

ఇక సాహిత్యానికి సంబంధించి పరిశీలిస్తే... బీడీ రంగంలో నూటికి తొంబై శాతం మంది స్త్రీలే...బీడీ రంగం స్త్రీ కార్మిక శక్తి. అయినప్పటికీ ఎందుకనో స్త్రీవాద రచయిత్రులు వీరిపై దృష్టి సారించలేదు. సాహిత్య రంగంలో ఇదొక ప్రధాన లోపం... అయితే ఇందుకు గల కారణాలు లేకపోలేదు... బీడీ పరిశ్రమ ప్రధాన స్రవంతి అయిన ఉత్పాదక రంగం కాకపోవటం..,కుటీర పరిశ్రమగా ఉండి బాహ్య సమాజానికి అనుబంధంగా లేకపోవడం తదితర కారణాల వలన బీడీ రంగం కార్మికులు ప్రధాన పోరాట స్రవంతిలో భాగం కాలేకపోయారు. కనుక సుమారు ఎనిమిది లక్షల మంది కార్మిక శక్తి కలిగిన బీడీ రంగం సాహిత్యంలో అంతగా భాగం కాలేకపోయింది. ఏ కార్మిక రంగంలోనైతే పోరాట శక్తి ఉంటుందో అదే సామాజిక రూపం ఆ తర్వాత సాహిత్య రూపం తీసుకుంటుందనేది వాస్తవం... నిజానికి 'పుర్రె గుర్తు' బీడీ కట్టలపై ముద్రించాలని ప్రభుత్వం ఎప్పుడైతే భావించిందో బీడీ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం చేసి తమ అస్తిత్వాన్ని చాటుకున్నారు. అయితే వీటన్నింటి కంటే ముందే బి.ఎస్.రాములు గారు బీడీ కార్మికుల దయనీయ జీవితాలను ఆవిష్కరిస్తు 'బతుకుపోరు' నవల రాశారు.

ముఖ్యంగా బీడీ కంపెనీల్లో ఏజెంట్ల మోసాల గురించి తెలుసుకోవాలంటే ఈ నవల చదివితే సరిపోతుంది.బీడీ పరిశ్రమలోని ఏజెంట్లు అనునిత్యం చేసే... ఆకు తుట్టి పోయిందని ఆకు విలువను కత్తిరించడం.., తూకంలో మోసాలు మొదలైన విషయాలనన్నింటిని ఈ నవలలో రాములు గారు ముప్పయ్ ఏండ్ల క్రిందటే మనముందుంచారు.

'ఆకు తుట్టి పోయిందని అనే కారణాన్ని చూపుతూ ఏజెంట్ ఆకు విలువను కత్తిరించడం' అనే అంశాన్ని వ్యతిరేకిస్తూ ఈ నవలలో బీడీ కార్మికుల సమ్మె ప్రారంభం అవుతుంది.లక్ష్మి ప్రధాన పాత్ర అయినప్పటికీ రామక్క ఈ నవలలో కార్మిక నాయకురాలిగా ముందుకు వస్తుంది.ఆమె కష్టాల్లో రాటుదేలిన తల్లి. బొంబాయి బట్టల మిల్లులో పని చేయడం కోసం వెళ్ళి జీవితాన్ని కోల్పోయిన ఒక కార్మికుడి తల్లిగా రామక్క ఈ నవలలో మనకు కనిపిస్తుంది. బీడీల తయారీ స్త్రీల ఉపాధిగా మారి తెలంగాణ ప్రజల జీవనాధారంగా ఎలా మారిందో అత్యంత వాస్తవికంగా రామక్క కథలో చిత్రించారు రాములు గారు.

బీడీ కార్మికులు కులాలకతీతంగా అందరూ వరుసలు పెట్టి పిలుచుకునే పరిస్థితిని,ఎవరి ఇంట్లో ఫంక్షన్ జరిగినా అందరూ ఒకరినొకరు సహకరించుకునే విధానం...వారి సామూహిక ఉన్నతమైన భావనను ఈ నవలలో చూడవచ్చు. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడే వారందరిది ఒకటే కులం అదే శ్రామిక కులం అని గొప్ప సామాజిక గతితార్కిక భావనను రాములు గారు బతుకుపోరులో అద్భుతంగా ఆవిష్కరింపజేసారు. ఈ విధంగా సాహిత్యంలో బీడీ కార్మికుల స్థితిగతులను,వారి బతుకు చిత్రాన్ని తనదైన శైలిలో ఆవిష్కరింపజేసి "డిగ్నిటీ ఆఫ్ లేబర్"., డిగ్నిటీ ఆఫ్ వర్క్ కల్చర్‌ను మనముందుంచిన రాములు గారు నిజంగా గొప్ప సామాజిక తత్వవేత్త.

'బతుకుపోరు' నవలను సోషియాలజీ,పొలిటికల్ సైన్స్, ఎకనమిక్స్ సబ్జెక్టుల్లో కూడా రీసెర్చ్ చేయాల్సిన గొప్ప నవలగా పేర్కొంటూ... తెలంగాణా రాష్ట్ర పునర్నిర్మాణ సందర్భంగా తెలంగాణాలోని అస్తిత్వ ఉద్యమాలను,ఉద్యమ నేపథ్యాలను గుర్తించవలసి ఉన్నది.అందులోకి అత్యంత శక్తివంతమైన కార్మిక వర్గ జీవితాలను తెలియజేసే కార్మిక వర్గ సాహిత్యం వెలికితీయడం అందుకోసం ప్రత్యేకంగా కృషి చేయవలసి ఉన్నది.

బీడీ పరిశ్రమ తర్వాత తెలంగాణలో అత్యధిక కార్మిక శక్తి కలిగినవి ఆర్టీసీ మరియు సింగరేణి సంస్థలు.ఆర్టీసీ విషయానికొస్తే సాహిత్యకారులు ఆర్టీసీ కార్మికుల జీవితాల మీద పెద్దగా దృష్టి సారించినట్టు కనపడదు. సాహిత్యంలో ముఖ్యంగా కథల్లో ఆర్టీసీ కార్మికులు అక్కడక్కడ పాత్రలుగా తప్ప పెద్దగా కనిపించిన దాఖలాలు లేవు. ఆర్టీసీలో కూడా చారిత్రాత్మక సమ్మె పోరాటాలు, ఉద్యమాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాట రూపాలున్నప్పటికీ అదంతా ఎందుకనో సాహిత్యీకరించబడలేదు. పల్లెలకు బస్సులు రావడం వలన రవాణ వ్యవస్థ మెరుగుపడి ప్రజాసంబంధాలు పెరిగినాయనేది వాస్తవం. అయితే సాహిత్యం విషయానికొస్తే రవాణ వ్యవస్థ పెరగడం వలన ఊర్లో వచ్చిన మార్పులు బస్సు డ్రైవర్,కండక్టర్‌లు ప్రజల నిత్య జీవితంలో ఏ విధంగా భాగమైనారో తెలిపే సంఘటనలు సన్నివేశాలు అక్కడక్కడ పాత్రల రూపంలోనే కనిపించాయి తప్ప ప్రత్యేకించి ఆర్టీసీ కార్మికవర్గ సాహిత్యం వెలువడిన దాఖలాలు లేవు. సింగరేణి కార్మిక సమాఖ్య(సి.కా.స) లాంటి విప్లవ సంస్థ ఆర్టీసీలో ఆర్టీసీ కార్మిక సమాఖ్య (ఆ.కా.స)గా ఉద్భవించినా ఆ సంస్థ మొగ్గ తొడుక్కుంటున్న కాలంలోనే ప్రభుత్వాలు వాటిని అణిచివేసి భవిష్యత్‌లో ఆర్టీసీలో విప్లవోద్యమాలు రాకుండా జాగ్రత్త పడ్డాయి. కనుక సి.కా.స ప్రభావంతో సింగరేణిలో కార్మిక వర్గ సాహిత్యం వెలువడినట్లుగా ఆర్టీసీలో వెలువడలేదు.అయితే మలిదశ తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మె కాలంలో ఆర్టీసీ కార్మికుల సంఘటిత శక్తి మళ్ళీ వెలుగులోకి వచ్చింది.తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర గురించి భవిష్యత్‌లో సాహిత్యం వెలువడే అవకాశముంది.అంతే కాకుండా రోజు రోజుకి ఆర్టీసీలో విస్తరిస్తున్న ప్రైవేటీకరణ తద్వార కార్మికుల పోరాటాలు...ఇవన్నీ భవిష్యత్‌లో సాహిత్యరూపం తీసుకోవడం కాయం.

ఇక సింగరేణి కార్మిక వర్గానికి సంబంధించిన సాహిత్యాన్ని పరిశీలిస్తే తెలంగాణ సాహిత్య చరిత్రలో సింగరేణి కార్మికోద్యమాలు విప్లవోద్యమాలు ఒక ప్రత్యేక అధ్యాయమే అవు

తాయి. సింగరేణి కార్మిక వర్గానికి సంబంధించి కవిత్వం కాస్త తక్కువ ఉన్నప్పటికి కథలు అధికంగా వచ్చాయి.నల్ల వజ్రం, శేషగిరి, బొగ్గు పొరల్లో, నెత్తుటిధార, సింగరేణి మండుతుంది, విప్లవాగ్ని, మా తుజే సలాం లాంటి నవలలు వచ్చాయి. మునీర్, పిట్టల రవీందర్‌లాంటి జర్నలిస్టులు సింగరేణిని చారిత్రాత్మక కోణంలో పరిశీలించి విస్తృతంగా వ్యాసాలు వ్రాసారు.పర్‌స్పెక్టివ్స్ తరపు ప్రచురణల్లో సింగరేణికి సంబంధించి చాలా సమాచారం వెలుగులోకి వచ్చింది. ఇంకా వ్యక్తిగతంగాను ఆచార్య ఘంటా చక్రపాణి లాంటి వాళ్ళు బొగ్గుపొరల్లో అగ్గి బావుటా లాంటి పుస్త కాల్లో, ప్రొఫెసర్ బాలగోపాల్, బుర్ర రాములు ఓపెన్‌కాస్ట్‌ల మీద పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం వాటినన్నింటిని వ్యాసాల రూపంలో వెలువరించి సింగరేణి జీవితాలను వాస్తవిక ధోరణిలో అక్షరీకరించారు. సింగరేణి కార్మికుల గురించే ముప్పయ్ ఏండ్లకు పైగా కథలు, నవలలు, వ్యాసాలు వ్రాస్తున్న పి.చంద్ వంటి రచ యితలు సింగరేణి సాహిత్యంలో ఉన్నారు.మొత్తంగా సాహిత్య రంగాన సింగరేణి కార్మికుల, సింగరేణి జనజీవిత చిత్రణ ఒక ప్రత్యేక అధ్యాయం. అయితే ఈ రంగంపై చెప్పుకోతగ్గ స్థాయిలో విశ్లేషణలు, పరిశోధనలు జరగలేదనేది వాస్తవం.తెలంగాణ పునర్ నిర్మాణ సందర్భంగా కార్మిక వర్గ సాహిత్యం అందునా సింగరేణి కార్మిక సాహిత్యంపై ప్రత్యేక కృషి జరగవలసిన అవసరంఉంది.

తెలంగాణ పది జిల్లాల్లో కరీంనగర్, వరంగల్, అదిలాబాద్, ఖమ్మం జిల్లాలు సింగరేణి బొగ్గు గనులున్న జిల్లాలు. ఈ జిల్లాలన్ని ఉత్తర తెలంగాణలో భాగం. కనుక సింగరేణి కార్మికులను గురించి అధ్యయనం అంటే ఉత్తర తెలంగాణ కార్మిక వర్గ పోరాటాలని చెప్పక తప్పదు. మరీ ముఖ్యంగా నిజాం కాలం నుండి నడుస్తున్న బొగ్గు గనుల్లోకి ఎక్కువగా ఉత్తర తెలంగాణ దళిత బహుజనులే వచ్చి చేరారు. నిజాం ప్రాంతంలో దేశ్‌ముఖ్, పటేల్ పట్వారీల దోపిడీ పీడనకు తట్టుకోలేక బహుజనులు సింగరేణి బొగ్గు గనుల్లో చేరారు. అయితే అప్పటికే కాంట్రాక్టు విధానంలో కాంట్రాక్టర్లు తీవ్రమైన శ్రమ దోపిడి చేయడం, లెక్కలేని పనిగంటలు ఉండ టంతో పెనంలోంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది కార్మికుల పరిస్థితి. ఈ విధంగా మొట్టమొదటే కార్మికులు అణచివేతకు గురయ్యే పరిస్థితులు దాపురించాయి. అయిన సింగరేణిలోనే అనివార్యంగా పనిచేయాల్సిన పరిస్థితి ఉంది, ఎందుకంటే నిజాం రాజ్యపు దొర పీడనల కన్నా బొగ్గు రాజుల, కాంట్రాక్టర్ల పీడనే నయమనిపించే పరిస్థితులే కారణం కాబట్టి నిజాం రాజ్యంలో దోపిడి పీడనలను భరిస్తూ చీకటి గుయ్యారాల్లో ఆడ, మగ భేదం లేక పనిచేసే పరిస్థితుల నుండి ప్రపంచీకరణ సంధర్భంగా మొదలైన ఓపెన్‌కాస్ట్ బొగ్గు వరకు సింగరేణి గని కార్మికుల స్థితిగతులు, వారి దుర్భర పరిస్థితులు తెలంగాణ సాహిత్యంలో ఏ విధంగా పొందుపర్చ బడ్డాయో ఈ వ్యాసంలో తెలుసుకోవచ్చు.

తెలంగాణ కథానికల్లోని ప్రధానమైన ఇతివృత్తాల్లో కార్మిక వర్గానికి సంబంధించి ఒకటి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో బొగ్గు గనుల పడిన తరువాత కార్మిక వర్గానికి ఒక స్థిరమైన రూపాన్ని సంతరించుకుంది. అదే సమయంలో ఈ వర్గానికి సంబంధించిన సమస్యలుకూడా ఎక్కువయ్యాయి. సింగరేణి కార్మికులు కథా వస్తువులుగా మారడమే కాదు. కవులుగా, కథకు లుగా కూడా మారారు. ఉదా.. తుమ్మేటి రఘోత్తమరెడ్డి, బి.ఎస్ రాములు, అల్లం రాజయ్య, పులుగు శ్రీనివాస్ లాంటి వాళ్లతో పాటు రచయిత పి.చంద్ కథా సంపుటాలు, అనేక కథలు తెలం గాణ కార్మిక వర్గానికి సంబంధించినవి. సమస్యలను ఎదుర్కోవ డానికి కార్మిక వర్గం సంఘటితం కావడం, పోరాటాలు చెయ్యడం అనివార్యమైన విషయం, తద్వారా సమస్యలు కూడా అనివార్యమే అంటే సమస్య పరిష్కారంకోసం చేసే పోరాటం మరో సమస్యకు మూలమవుతుంది. ఇలాంటి సునిశితమైన ఇతి వృత్తాలను తీసు కుని తెలంగాణ కథకులు అనేక కథలు రాశారు.అయితే కార్మిక కథలపై పరిశోధనలు తక్కువగా నమోదయ్యాయి. సింగరేణి కార్మికుల జనజీవిత చిత్రణకు సంబంధించి తెలంగాణ ప్రాంతపు రచయితలు ఎప్పుడైనా ఒక నిబద్ధతతోనే ఉన్నారు. ఈ కార్మిక వర్గం మీద సానుభూతి, వీళ్ళ పోరాటాల పట్ల గౌరవం ఉన్న రచయితలు సింగరేణి బొగ్గు గని కార్మిక సాహిత్యం విస్తృతంగా వ్రాసి బొగ్గుగని కార్మికుల జీవితాలను ప్రపంచానికి తెలియ జేసారు. ఈ విధంగా బొగ్గు గనులు ఎక్కువగా ఉన్న జిల్లాలైన కరీంనగర్, వరంగల్, అదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఎక్కువగా ఈ కార్మికవర్గం మీద విస్తృతంగా వ్రాసిన రచయితలు కరీంనగర్, వరంగల్, అదిలాబాద్ జిల్లా రచయితలే, ఖమ్మం జిల్లా నుండి బొగ్గుగని కార్మికులకు సంబంధించిన సాహిత్యం అంతగా రాలే దనే చెప్పవచ్చు.

ముఖ్యంగా, సమైక్యరాష్ట్రంలో ఆంధ్ర పాలకుల స్వార్థం వల్ల తెలంగాణ తల్లడం మల్లడమైంది. గ్రామాలు సుభిక్షంగా లేక గ్రామాల రూపు రేఖలు మారిపోయాయి. కుల వృత్తులకు కాలం చెల్లిపోయింది. తెలంగాణలో అంతంత మాత్రమే ఉన్న ఉద్యోగత కల్పనా రంగం ఎక్కువ మందిని నిరుద్యోగులుగా మార్చివేసింది. ఈవిధంగా ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బొగ్గు బావులు ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారమైనాయి. అయితే ప్రపంచీకరణ ఫలితంగా ఓపెన్‌కాస్ట్ బొగ్గు బావులు వచ్చి ప్రైవేటీ కరణ, యాంత్రీకరణ, కాంట్రాక్టీకరణ ప్రవేశపెట్టబడి ప్రజలు తమ నేల మీదనే కాంట్రాక్టు కార్మికులుగా, కూలీలుగా జీవనాన్ని కొనసాగించాల్సి వచ్చింది. ఈవిధంగా ఉత్తర తెలంగాణలోని కరీం నగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో మెజారిటీ ప్రజలు సింగరేణి, దానికి అనుబంధంగా ఉన్న విభాగాల్లో చాలీ చాలని వేతనాలతో జీవితాన్ని వెల్లదీస్తున్నారు. సింగరేణికి సంబంధించి...

నల్ల బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉన్న ఉత్తర తెలంగాణ ప్రాంతాలు ఇక్కడి ప్రజల జీవితాల్లో విషాదాన్ని, చీకటిని నింపి ఇతర ప్రాంతాల జీవితాల్లో వెలుగును నింపుతున్నది. ఇక్కడి సహజ వనరుల ఎక్కడి జీవితాల్లో వెలుగును నింపుతున్నదో అటుంచితే, ఇక్కడి జనాలకు కనీసం బ్రతుకు భరోసాను కూడా ఇవ్వడం లేదనేది సింగరేణి సాహిత్యంలో ఇమిడి ఉన్న అంత: సూత్రం. అంతేకాదు, సింగరేణి చుట్టూ అల్లుకున్న అనేక జీవితాలు, ఉద్యమాలు తెలంగాణ ప్రాంత ప్రజల ఆలోచనలను ఈ సాహిత్యం ఏకరువు పెట్టింది. ఇక్కడి జనాలను ప్రభావితం చేసింది.

వ్యవసాయంతో పూట గడవక, జీవితంలో ఎదుగుదల లేకే ఇబ్బందుల పాలైన సన్నకారు రైతులు, కూలీలు సింగరేణి బొగ్గు గనుల్ని ప్రత్యామ్నాయంగా జీవనాధారంగా ఎంచుకున్నారు. పల్లెలోని ఆత్మీయతను, ప్రేమను, పల్లె సంస్కృతిని తమతో మోసుకు వచ్చి బస్తీలుగా నివాసాలు ఏర్పర్చుకున్నారు. పారిశ్రామికీకరణలో ఇలా గ్రామీణ రైతులు భాగస్వాములైనప్పటికీ బతుకు దుర్భరమే అయ్యిందని తెలిపే సింగరేణి ప్రాంత సాహిత్యం. పల్లెలు వదిలి గని కార్మికులుగా స్థిర పడ్డాక పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి కూడా కరువైంది. రోజురోజుకు ఆరోగ్యాలు దిగజారడంతో అప్పులు పెరుగుతూ వచ్చాయి. ఎప్పుడు ప్రాణాలు పోతాయో తెలియని ప్రమాదకరమైన ఉద్యోగంతో సతమతమయ్యే కార్మిక జీవన ప్రస్థానం తెలంగాణా కార్మిక వర్గ సాహిత్యంలో చిత్రితమైంది.

పల్లెల్లో పుట్టి పల్లెల్లో పెరిగి నిజాం ఫ్యూడల్ వ్యవస్థలోని దొరల దోపిడీకి గురైన అణగారిన జనాలు జీవితాన్ని గెలుచుకుందామని సింగరేణిలో చేరితే, ఇక్కడ కూడా అధికార్ల రూపంలో దొరతనం సాగుతుందని గ్రహించడానికి సగటు సింగరేణి కార్మికునికి ఎక్కువ సమయం పట్టలేదు. మొదటగా కిరాయి గూండాలతో ఆ తర్వాత అధికార్లు ప్రభుత్వ యాజమాన్య విధానాలతో కార్మికుల్ని అణచివేస్తూ దోపిడీ చేయడం సర్వసాధారణమైన చోట ప్రశ్నించే శక్తులు పుట్టడం, తదనంతరం, పోరాటాలు, అణచివేతలు మొత్తంగా సింగరేణి రణరంగమైన వాతావరణాన్ని .కార్మిక రంగ సమస్యల పరిష్కార దిశగా దృష్టి నిలపడంతో సింగరేణి కార్మిక సమాఖ్య వంటి తీవ్ర భావజాల సంస్థలు వెలిశాయి. ప్రభుత్వం ఇట్లాంటి సంస్థలను నిషేధిస్తూ అణచివేస్తున్న క్రమంలో కార్మిక నాయకుల్ని టార్గెట్‌గా చేసుకుని ఎన్‌కౌంటర్లకు పాల్పడే ఘటనలు సింగరేణి ప్రాంత కార్మికవర్గ సాహిత్యం ప్రతిబింబిస్తుంది

బొగ్గు గనులలోకి రైతులే కార్మికులుగా వచ్చారు. వీళ్ళు కూడా గ్రామాల్లో దొరలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల చేత ప్రభావితమైనవారే అందుకే బొగ్గుగనులలో యాజమాన్యానికి వ్యతిరేకంగా జరిగిన కార్మిక పోరాటాలకు నాయకత్వం కూడా వహించారు. ఈ అనుకూలతల వలన మొదటిసారి ఈ కార్మిక పోరాటాల నుంచి కథలు వచ్చాయి. గనులలో పనిచేసే కార్మికులే ఈ కథలను సృష్టించారు. పోరాడే ప్రజల నుంచే కథా సాహిత్యం వచ్చింది. పోరాట వస్తువు శ్రమ జీవులు మాట్లాడే భాష, వాతావరణం ప్రతీకలు, సన్ని వేశ కల్పనలతో కూడిన తెలంగాణనాట కథా రచనలకు జీవం పోసిన విషయాలన్నీ కార్మికవర్గ సాహిత్యం ప్రతిబింబిస్తుంది.సింగరేణిని నమ్ముకొని జీవించే లక్షలాది కుటుంబాలు ఊహించలేని కష్టాలు ఎదుర్కొన్నాయి. ఇవే కాకుండా, సింగరేణికి బయట వున్న సమాజం ఈ మూడు దశాబ్దాల్లో విపరీతంగా మారిపోయింది. ప్రజల ఆలోచనల్లో కూడా మార్పులొచ్చాయి. ఆర్థికవిషయాలకు ప్రాధాన్యతపెరిగింది. విలువలకు నిత్యజీవితంలో స్థానం లేకుండా పోయింది. సాంస్కృతికంగా, సామాజికంగా కౌటుంబికంగా ప్రగతినిరోధకమైన మార్పులు తలెత్తాయి. ఈ మార్పులన్నీ కార్మికవర్గ సాహిత్యం మీద బలమైన ముద్రవేశాయి. ఆ ముద్రలన్నీ ఆయన కథను తయారుచేసే పద్ధతిమీద ప్రభావం వేశాయి. ప్రపంచీకరణ ప్రభావం వలన సింగరేణి ప్రాంత ప్రజల జీవన స్థితి గతులు, కార్మికుల హక్కుల కోసం వారి పోరాటాలు, విప్లవోద్యమాలు, విప్లవ కారుల జీవితాలు వారి కుటుంబాల పరిస్థితి, విప్లవ కారులకు జనాలకు మధ్యనున్న ఆత్మీయ వాతావరణం, నిర్భందం, పోలీసుల చర్యలు, ఎన్‌కౌంటర్లు సింగరేణి కార్మిక సమాఖ్య సింగరేణి యాజమాన్యం, కాంట్రాక్టర్ల దోపిడీ, ఈ ప్రాంతపు జనాల నిరుద్యోగం, ఆత్మహత్యలు, ఆకలి చావులు, రివిజనిస్టు యూనియన్లు, ఎన్నికలు, కోస్తాంధ్ర వలసవాదుల దోపిడీ, ఆదివాసీ గిరిజనుల వ్యధాభరిత జీవితాలు లాంటి సీరియస్ విషయాలు ఉత్తర తెలంగాణ ప్రాంత రచయితలు ముఖ్యంగా తమ కథల్లో ప్రస్తావించారు.

1990ల ఆరంభం నాటికి ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో గ్లోబలైజేషన్ దుర్మార్గపు దాడి ఉత్తర తెలంగాణ గ్రామాలని, గ్రామీణ జీవితాల్లో తెచ్చిన మార్పులను, ప్రపంచీకరణ ఫలితంగా ఉన్న కాస్త ఉద్యోగిత స్థితి పోయి ఓపెన్ కాస్ట్ బావులు మొదలైన తర్వాత ఉన్న కాస్త వ్యవసాయం ద్వంసమై వలస బాట పట్టిన ఇక్కడి ప్రజలను చిత్రించిన కథలను, నవలలను ప్రత్యేకంగా పరిశీలించడం అవసరం. ఎందుకంటే... ప్రపంచీకరణలో భాగంగా తక్కువ కాలంలో వీలైనంత ఎక్కువ బొగ్గును వెలికితీయడమే లక్షంగా పెట్టుకున్న సింగరేణి యాజమాన్యం కార్మికులపై అదనపు పని భారాన్ని మోపింది. ఇలాంటి పరిస్థితులల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం మొదలైనటువంటి కార్మిక వ్యతిరేక చర్యలలో కార్మికులు తమంతట తాముగా వైదొలిగే పరిస్థితి కనిపిస్తుంది. సర్‌ప్లస్‌పూల్ విధానాలను అమలు జరిపి కార్మికులను మానసికంగా హింసిస్తుంది. తత్ఫలితంగా

యాంత్రీకరణను ప్రవేశపెట్టి కాంట్రాక్టీకరణ అమలు జరిపిన సింగరేణి యాజమాన్యం కార్మికులకు అతి తక్కువ జీతాలిస్తూ వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నది. ఈవిధంగా కార్మిక వర్గం కొట్లాడి సాధించుకున్న హక్కులను హరించి వేయడం మొదలైంది.

ఈవిధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పించిన దుర్భర దారిద్ర్యాన్ని తట్టుకొంటూ వర్గ వ్యతిరేక పోరాటం హింసాత్మక రూపం తీసుకుంది. రాజ్యాన్ని ధిక్కరిస్తూ సమసమాజం కోసం నక్షల్బరీ పోరాటం సాయుధమైంది. సింగరేణి కార్మికులు ఆ పోరాటానికి ఆకర్షితులయ్యారు. విప్లవోద్యమం సింగరేణి ప్రాంతాన్ని ఒక్క కుదుపుకుదిపింది. సామ్రాజ్యవ్యతిరేక చైతన్యం, ప్రపంచీకరణ వల్ల తలెత్తిన సంక్షోభం, నదులు పుష్కలంగా వున్న వ్యవసాయానికి నీళ్లులేక అల్లాడిన రైతాంగం, గ్రామీణ రైతాంగ సంక్షోభం వల్ల పట్టణాలకు వలసెల్లిన కూలీలు. ఒక్కటేమిటి, తెలంగాణ ప్రాంతంలో ఉత్పన్నమైన అనేక సమస్యలు,సవాళ్లు తెలంగాణ కార్మిక వర్గ సాహిత్యంలో వ్యక్తమవుతాయి. సింగరేణి తర్వాత తెలంగాణాలో ఎక్కువ మంది ఉన్నది అసంఘటిత రంగంలో.భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, హమాలీల కార్మికులు మొదలైనవారు.ఈ రంగంపై సాహిత్య కారులు దృష్టి సారించవలసిన అవసరం ఉంది...భవన నిర్మాణ కార్మికుల మీద ఇటీవల సాహిత్యకారులు దృష్టి సారిస్తున్నారు. ఇటీవల ఈ రంగంలో స్త్రీలు ఎదుర్కొంటున్న లైంగిక దోపిడికి సంబంధించి వెలువడిన 'నర్సు' కథ గొప్ప చర్చనీయాంశమైంది. మొత్తంగా భవన నిర్మాణ కార్మికుల జీవన చిత్రం ఆ కథ. ఇంకా కూలీలు, హమాలీ, ఇంటి పనివారల జీవితాలను చిత్రించే సాహిత్యం వెలువడవలసి ఉన్నది.

ఐతే.. తెలంగాణ కార్మికశక్తి అంటే అది తెలంగాణ బహుజనశక్తి. ముఖ్యంగా చెమటకులాలు,శ్రామిక కులాలు,రైతులే ఒక దశలో శ్రామికులుగా మారారు.అది బీడీ పరిశ్రమ అయినా, ఆర్టీసీ ఐనా, సింగరేణి ఐనా నూటికి ముప్పాతిక భాగం కార్మికులు బీసీలే. కనుక ఈ రంగాలకు సంబంధించి వెలువడుతున్న, వెలువడిన సాహిత్యం కూడా బీసీ రచయితల కలాల నుండి వస్తున్నదే. అయితే ఇది ఇంకా విస్తృతంగా వెలువడాల్సిన అవసరం ఉన్నది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# అన్నమయ్య సంకీర్తనలు - సామాజిక స్పృహ

- డా॥ ఇ. వేసు, తెలుగు అధ్యాపకులు, పి. వి. కె. యన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), చిత్తూరు.

ఏ దేశ జాతీయ సమైక్యతకైనా, ఏ దేశ ఉద్యమానికైనా, కవిత్వమే ఎదురులేని ఒక ఆయుధం. మన భారతదేశంలో సంస్కృత భాషల్లో తప్ప దేశ భాషల్లో కవిత్వం రాస్తే చెల్లుబడి కాని రోజుల్లో 11 శతాబ్దంలో తెలుగులో భారతరచనతో ప్రారంభమైన కవితోద్యమం, 12వ శతాబ్దంలో ద్విపద కవిత్వంలో శైవమతోద్యమం వెలసినట్లుగానే, అష్టాదశ వర్ణనలతో సుదీర్ఘ సంస్కృత సమాస భూయిష్ఠ ప్రబంధ ప్రక్రియతో తప్ప ప్రజాకవిత్వానికి విలువలేని రోజుల్లో 15వ శతాబ్దంలో పదకవిత్వం ఉద్యమంగా సాగింది. అందుకే తెలుగు సాహిత్యంలో 15వ శతాబ్దానికి ఒక విశిష్ట స్థానం వుంది. రాజాస్థానాలకు, పండితుల ప్రశంసలకు నోచుకోని పదకవిత సాహిత్య సింహాసనాన్ని అధిష్ఠించింది.. పదకవితలనే ఆనాడు సంకీర్తనలని కూడా పిలిచేవారు. పదకవిత్వాన్ని రచించేవారిని వాగ్గేయకారులంటారు. సారంగ దేవుడు సంగీత రత్నాకరంలో...

"వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్య భిధీయతే
వాచం గేయంచకురుతేయ: సవాగ్గేయకారక: "

అని వాగ్గేయకారుని గూర్చి నిర్వచించాడు. ఒక పాటలోని మాటలకూర్పును మాతువు అని, సంగీతపు కూర్పును ధాతువు అని, ఈ మాతు ధాతువులను రెండిటిని చేసి తానే పాడేవాడిని వాగ్గేయకారుడంటారని ఈ శ్లోకార్థం అతనినే అభయకారుడని, బయకారుడని, సంకీర్తనాకారుడని, పదకర్త అని పిలుస్తారు.

## అన్నమాచార్యుని జీవిత విశేషాలు :

ప్రథమ వాగ్గేయ కారుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. ఇతడు క్రీ.శ.1408లో కడపజిల్లా, రాజంపేట తాలూకా "తాళ్ళపాక" అనే గ్రామంలో లక్కమాంబ, నారాయణాచార్యులు అనే పుణ్యదంపతులకు క్రోధినామసంవత్సరం, వైశాఖ శుద్ధ పూర్ణిమనాడు విశాఖ నక్షత్రంలో శ్రీ వేంకటేశ్వరుని నందకవంశములో జన్మించాడు. ఇతనికి తిమ్మక్క, అక్కలమ్మ అనే ఇద్దరు భార్యలు. అన్నమయ్య కొన్నాళ్లు సాళువ నరసింగరాయుల కొలువులో నివసించి ఆపైన రాజ దురహంకారాన్ని నిరసించి, రాజాశ్రయాన్ని వదలి నానాదేశ సంచారం చేసి తిరుమలలో స్థిర నివాసం ఏర్పరుచుకుని 32 వేల సంకీర్తనలు రచించడమే కాకుండా, సంస్కృతంలో సంకీర్తనలక్షణం, వేంకటేశ్వర మహత్యం, 12 శతకాలు, శృంగార మంజరీ, ద్విపదరామాయణం రచించినట్లు అతని మనమడు చిన్నన్న వ్రాసిన అన్నమాచార్య జీవిత చరిత్ర ఆధారముగా తెలుస్తుంది. అన్నమయ్య క్రీ.శ.1503 నందు దుందుభి సంవత్సరం ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు శ్రీ వేంకటేశ్వర సాయుజ్యం చెందాడు.

## అన్నమయ్య సంకీర్తనలు - సమాజ సంబంధ ప్రభోదం:

అన్నమాచార్య సంకీర్తనల్లో ప్రధాన లక్ష్యం భక్తి ప్రచారమే. అయినావారి సంకీర్తనల్లో భక్తి ప్రాధాన్యమైన అంశాలను సమన్వయిస్తూ సామాజిక ప్రతినిధియై అతడు చెప్పిన సామాజిక ప్రభోదం కూడా లేకపోలేదు. కవి సమాజంలో పుట్టి సమాజానికి ప్రతినిధియై సమాజ కష్ట సుఖాలను అనుభవించి తన ఆవేదనను, ప్రభోధాన్ని తన కవిత్వంలో వ్యక్తపరుస్తాడు. వాగ్గేయకారుల్లో ప్రాత:స్మరణీయుడైన అన్నమయ్య సంకీర్తనల్లోను సామాజిక సంబంధమైన ప్రభోధం కనిపిస్తుంది. ఇది అనేక అంశాల్లో ప్రస్ఫుటమవుతుంది.

భగవంతుడు సృష్టించిన పంచభూతాలకు హీనాధక బేధాలులేవని ఆహారనిద్రాభయాలు అందరికి సమానమేనని మానవుల్లో ఈ విబేధాలు, హెచ్చుతగ్గులుండకూడదని పరబ్రహ్మం సంకీర్తనలో వివరించాడు.

"తందనాన ఆహి తందనానపురె
తందనాన భళా తందనాన
బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే పర
బ్రహమ్మమొక్కటే పరబ్రహహ్మమొక్కటే!!
కందువగు హీనాధికములిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకులమంతానొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ!!
..............................................................

అన్నమయ్య తాను ఎన్నో శాస్త్రాలు చదివి పరపీడన చేయడం పాపమని, పరోపకారం చేయడం పుణ్యమని, శాంతం కన్నా స్వధర్మం లేదని హరిదాసుడు కావడం కన్నా వేరేగతి లేదని చెబుతూ...

కంటిని దేయర్థము ఘన శాస్త్రములు దవ్వి
నంటున నిందు కంటెను నాణెమందూ లేదు!!
పరపీడన సేయుటకంటే పాపము మరెందులేదు
పరోపకారము కంటే బహుపుణ్యము లేదు
నిరత శాంతము కంటే నిజధర్మమెందులేదు
హరిదాసు డౌకంటే నటగతి లేదు!!
..............................................................

మానవుడిగా పుట్టినందుకు సద్గుణాలు కలిగి ఉండాలని, ధాన ధర్మాలు చేయాలని, దైవాన్ని తలుచుకోవాలని చెబుతూ.....

మనుజుడై ఫలమేది మఱి జ్ఞాని యౌదాకా
తనువెత్తి ఫలమేది మఱి జ్ఞాని యౌదా(కా

ధనికుడై ఫలమేది ధర్మముచేయు దా(కా
చదివియు ఫలమేది శాంతము గలుగు(దాకా
పెదవెత్తి ఫలమేది ప్రియమాడు దా(కా
మదిగల్గి ఫలమేది మాధవుదల(చుదాకా !!

.................................................. అనే సంకీర్తన రచించాడు.

మానవులందరూ పుట్టుకతో సమానులే అయినా మానవ కల్పితమైన అజ్ఞానమైన కులతత్వంతో, కులభేదంతో ఒకరినొకరు అవమానపరచుకోవడం, హింసించుకోవడం, సమాజంలో జరుగుతుంది. కులతత్వాన్ని ఖండిస్తూ అన్నమయ్య ఈ సంకీర్తన వివరించాడు.

"విదురునకు బరలోకవిధి చేసెనట తల్లి
అదెధర్మ సుతుడు వర్ణాశ్రయంబులు విడిచి
కదిసి నీదాసుడైన కతముననే కాదెయీ
యెదురనే తుదిపదం బిహముననేకలిగే"
అంటరాని గద్దకులమంటి జయాయువునకు నీ
వంటి పరలోక కృత్యములు నేసితివిమును
వెంటనే కైంకర్యవిధి కలిమినేకాదె
వొంటి నీహస్తమున యోగమై నిలిచే !!

..................................................................

అన్నమయ్య రాజులను, మానవులను ఆశ్రయించి కొలిచి బ్రతికే వారిని కూడా నిరసిస్తూ

"మనుజు(డై పుట్టి మనుజుని సేవించి
అను దినమును దు:ఖ మందనేలా
జుట్టెడు గడుపుకై చొరని చోట్లు చొచ్చి
పట్టెడు గూటికై బతిమాలి!!

...............................................................

నాస్తికత్వాన్ని, వితండవాదాన్ని, వికృత చేష్టల్ని గమనించి ఆవేదన చెంది వారికి జ్ఞాన ప్రబోధం చేస్తూ అన్నమయ్య క్రింది సంకీర్తనలో

"ఇట్టి నాస్తికుల మాటయేమని నమ్మెడి ది(క
పట్టి సముల మంటానే భక్తుల దూషింతురు"
వేదములు చదువుతా విశ్వమెల్లా గల్లనేరు
అదె సతాము పుట్టుండి అదియును మాయనేరు
పాదగు విష్ణుడుండగా బయలు తత్వమనేరు
లేదు జీవత్వమంటా లేమల బొందుదురు.

................................ అనే సంకీర్తనలు రచించాడు

సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను చిత్తచాపల్యాలను గమనించి ఆవేదనచెంది శాంతి సంరక్షణలకోసం అన్నమయ్య రచించిన సంకీర్తన.

"తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయ చెప్పనేడు కలికాల మహిమ!!
అంగలార్చె కామినుల యంగభంగపు దోపు
లింగతాన మింట సూర్యడెట్టు చూచెనో!!
అరుదుగ గోహత్యలు సేయంగ దూడలంగలార్వ
సరిధర్మదేవలెట్టు సమ్మతించెనో!!
నిరపరాధుల జంపి నెత్తురు హరించగాను
తెరలకెట్టుడెరో దిక్పాలులు
విరస వర్తునులుండే విపరీతకాలమున
గరువాలు కపటాలే కలికాల మహిమ!!

........................................................................

అనే కీర్తనలో స్త్రీలకు మానభంగాలు జరుగుతుంటే సూర్యుడేవిధంగా చూచాడో, గోహత్యలు జరుగుతుంటే ధర్మ దేవత ఎలా సహించిందో, ఇతర దేశీయులు వచ్చి దేవాలయాలను కొల్లగొడుతుంటే దేవతలు ఎలా ఉన్నారో, నిర్దోషులను చంపిరక్తాన్ని హరిస్తుంటే దిక్పాలకులు ఎలా నిశ్చలంగా ఉన్నారో, ఇటువంటి విపరీత కాలంలో నమ్మకద్రోహాలు, గర్వాలు, కపటాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఇదంతా కలికాల మహిమ అంటూ ఆవేదన చెంది దైవానికి విన్నవించుకోవడం కనిపిస్తుంది.

ఐహిక సంబంధమైన సంపదలు మానవ సంబంధాలు ఎప్పటికైనా నశించేవే భోగ భాగ్యాలపై మనసు పోనివ్వకుండా క్రింది సంకీర్తనలో ప్రజలకు ప్రబోధం చేశాడు.

"ఉన్న విచారము లేల వాహో సంసారులారా
యిన్నిటికితండే రక్షయిదే మీకు మనరో !!
భవరోగ వైద్యుని పాదములు సేవించి
భువి రోగముల బాసి పొదలరో
తవిలి పది దిక్కులు తానైన వాని
గా విసి పొగడి దిక్కు గలిగి బ్రదుకరో !!
మెచ్చరో మనుజులార మీరే హరికథలు
పుచ్చరో మీ మదిలోని పొరలెల్లాను
కొచ్చరో మనుజులార కోరకలెల్లను మీకు
నిచ్చుని శుభములు యిదియెల్లా కాలము !!

.........................................................................

సమాజంలో మూఢమైన, ఛాందసమైన, హింసాత్మకమైన భక్తిని ఖండిస్తూ, సహేతుకమైన భక్తిని పెంపొందించడానికి అన్నమయ్య రాసిన సంకీర్తనలు.

మొక్కరో మీరు మోసపోక మీకు
దిక్కు దెసైన ఆది దేవునికి
మారు చేతులీయవద్దు మారుగాళ్ళియవద్దు
బీరాన గుండెలు గోసిపెట్టవద్దు
గోరపడి చిచ్చులోన గుండాలు చొౖరవద్దు
ఊరకే మీ వారమని వున్నచాలు!!

.........................................................................

అనే సంకీర్తనలో దైవానికి జంతుబలి నివ్వవలసిన పని లేదని నీవేదిక్కు అని ఊరకుంటే చాలని ప్రజలకు సులభమైన భక్తిమార్గాన్ని ఉపదేశించాడు.

అన్నమయ్య సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపడమేగాక కుటుంబంలో పురుషాధిక్యత, స్త్రీ అణచివేత, స్త్రీ పారతంత్ర్యం అన్నీ బాగా గమనించి ఆవేదన చెంది, ప్రతి సృష్టికి కారకురాలు, పూజ్యనీయురాలు అయిన స్త్రీ కూడా మనిషే నని ఆమెను హీనపరచకూడదని, సమానత్వ హితబోధ చేస్తూ.....

"పొల(తులు జీవులే పురుషులు జీవులే
తల ప్రభావ బేధములేకాని
బలిమి స్వతంత్ర్యము బరతంత్ర మొకరికి
యెలమి నిందులో జెల్లే హీనాధకములే"
................................... అనే సంకీర్తన రచించాడు.

అన్నమయ్య ఆ కాలంనాటి చదువులు దుస్థితిపట్ల చదువు కున్నవారు చేస్తున్న అజ్ఞానపు పనులవల్ల, వారి మూఢత్వం పట్ల ఎంతో ఆవేదన చెంది వారిలో జ్ఞానదీపం వెలిగించడానికి కొన్ని సంకీర్తనలు రచించాడు.

"చదువు గలిగిన ఫలము సంశయాంబేగాని
సందమల జ్ఞాన నిశ్చయమింతలేదు"
"ఏటి విజ్ఞాన మేటి చదువు
గూట బడి వెడలుగతి గురుతుగనలేడు"
"చదువు గనవలసినను శౌరినామము దిరుగ
జదువుటె సకల శాస్త్ర సమ్మతము"
"సారమైన చదువులు సారెసారె చదివినా
గోరపు దుష్టునికి కోపమేలమాను"

............................................................................

అన్నమయ్య తనకాలంనాడు మత విభేదాలతో వివాదాలా డుతున్న వారిని గమనించి వివిధమతాల సామరస్యం సాధిం చడం కోసం ఎన్నో సంకీర్తనలు రచించాడు.

ఎక్కడి మతములింకనేమి సాధించేము నేము
అన్ని మతములు సరియైతేను వాసిలేదా
వింత చదువుల వల్ల వేవేమతాలు కంటి
పెక్కు మతములు చూచి బెండు పడ్డవారులేరా
దైవముకడే మతము లేవేరే
సరవి ప్రపంచపు సకల మతంబులు
వరుసనెంచు కొదువులు మఱి కలవా"
"ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడ బిండంతే నిప్పటి యన్నట్లు
కొలుతురు మేము వైష్ణవులు కూరిమితో విష్ణు(డిని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తల(తురు మిము శైవులు తగిన భక్తులను శివు(డనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆది భైరవు(డనుచు"

............................................................................

అని పై సంకీర్తనలో అన్నమయ్య మతసామరస్యంను వివరించాడు. పై విధముగా అన్నమయ్య తన సంకీర్తనలో సమా జానికి ఉపయోగపడే అనేక అంశములు సాంఘిక దురాచారాలు, జంతుహింస, కులతత్వము, అసమానతలు, దౌర్జన్యాలు, ఇలాంటి ఎన్నో సామాజిక సమస్యలను రూపు మాపటానికి తన సంకీర్తనల ద్వారా సమైక్యత సాధించడానికి పూనుకున్న ఉద్యమ కారుడు అన్నమాచార్యులు. ఈ సంకీర్తనలు ఒక ప్రాంతానికి చెందినవైనా అందులోని భక్తి, సంగీతం, మానవతా ప్రభోదం ఒక్క తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికి మానవజాతికంతటికి చెందినవి.

మానవులు కుల, మత, భాష, ప్రాంత దేశాలను బట్టి వేరు వేరైనా మానసిక స్థితిలో మాత్రం అందరూ ఒక్కటే. ఇదే భిన్నత్వంలో ఏకత్వం, కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యా లనే అంతశ్శత్రువుల ప్రభావంతో మానవుడు వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎంత పురోగతి చెందిన ఈ అంతశ్శత్రువులను జయించలేకపోతే అంతా నశించి పోతుంది. అందుకే అన్నమయ్య లాంటి సంకీర్తనాచార్యులు తమ సంకీర్తనల ద్వారా ప్రజలలో సుఖశాంతులు, భక్తి ప్రపత్తులును, జాతీయసమైక్యతను కల్గించ డానికి కృషి చేశారు. అంతేకాకుండా సార్వకాలికం, సార్వదేశికం, విశ్వశ్రేయం అయిన అన్నమయ్య సంకీర్తనల ద్వారా జాతీయ సమైక్యతే కాకుండా విశ్వసమైక్యత కూడా సమకూరుతుందని ఆశించవచ్చు.

✿✿✿

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# బాదామి చాళుక్య రాజ్య రాజప్రతినిధి - విజయ భట్టారిక

- డా॥. యమ్. ఎస్తేర్ కళ్యాణి ఆశీర్వాదం, రీడర్ - చరిత్ర విభాగం, సెయింట్ థెరిస్సా మహిళ కళాశాల, ఏలూరు.

కర్ణాటకలోని బాదామిని రాజధానిగా చేసుకొని పరిపాలించిన చాళుక్య వంశానికి చెందిన రాణి, విజయభట్టారిక భర్త మరణం తరువాత పిన్న వయసులో ఉన్న కుమారుని కాపాడుకుంటూ, తన భర్త రాజ్య బాధ్యతలను స్వీకరించి, సాధారణ మహిళ యొక్క అసాధారణ పరిపాలనా దక్షతను గూర్చిన వివరణ ఈ శీర్షిక సారాంశం. శాసన ఆధారాలతో విజయ భట్టారికను గూర్చిన కొన్ని విషయాలను ఇక్కడ ప్రస్తావించటం జరిగింది.

## విజయ భట్టారిక :

విజయ భట్టారిక తన పిన్న వయసు కుమారిని తరపున రాజ ప్రతినిధిగా ఐదు సంవత్సరాలు బాదామి చాళుక్య రాజ్యాన్ని పరిపాలించింది. డి.పి.దీక్షిత్ గారు విజయ భట్టారిక బాదామి చాళుక్య రాజు రెండవ పులకేశి కోడలు అని చెప్పారు. అయితే ఫ్లీటో మరియు సర్కార్ గార్లు విజయభట్టారిక భర్త ఒక సామంత రాజుగా వున్నట్లు తెలిపారు. విజయ భట్టారిక భర్త చంద్రాదిత్య. అభినవాదిత్య తరువాత చంద్రాదిత్య బాదామి రాజ్య అధికారాన్ని చేపట్టారు.

భర్త చంద్రాదిత్య మరణం తరువాత విజయ భట్టారిక పిన్న వయస్కుడైన తన కుమారిని ప్రతినిధిగా పరిపాలన బాధ్యతలు చేపట్టింది.

విజయభట్టారిక తల్లితండ్రులు, వారి వంశం, విజయాలు గూర్చి మనకు చరిత్రలో సరియైన ఆధారాలు లేవు. బాదామి చాళుక్య వంశంలో ఆమె వైవాహిక బంధం గూర్చిన విషయాలు కూడా బయట పడలేదు. విజయ భట్టారిక వేయించిన ఒక శాసనములో ఆమె భర్త చంద్రాదిత్య సహోదరుడు మొదటి విక్రమాదిత్యుడు గూర్చి ప్రస్తావించబడింది. మొదటి విక్రమాదిత్యుడు విజయభట్టారిక ఆస్థానంలో ముఖ్య సైన్యాధిపతిగా ఉంటూ, బాదామి చాళుక్య వైభవాన్ని పదిలంగా కాపాడటానికి తన అన్న కుమారుని ప్రతినిధిగా పరిపాలిస్తున్న వదినకు అండగా వున్నట్లు ఈ శాసనములో వ్రాయబడింది. దీనిని బట్టి యుద విద్యలో పావీణ్యుడైన మొదటి విక్రమాదిత్య సహాయంతో విజయభట్టారిక బాదామి చాళుక్య రాజ్యాన్ని పదిలంగా కాపాడుకున్నది అని చెప్పవచ్చు.

విజయ భట్టారిక రాజ్యాధికారాన్ని చేపట్టిన తరువాత విజయ మహాదేవిగా పిలువబడింది. అనగా ఆమె ఒక రాణి స్థానం నుండి పరిపాలకురాలి స్థాయికి వచ్చింది అని అర్థం చేసుకొనవచ్చు.

నేరూరు ప్రాంతంలో దొరికిన ఒక శాసనంలో విజయ భట్టారిక పొద్ది విజయమహాదేవిగా ప్రస్తావించబడింది. కన్నడ భాషలో పొద్ది అనగా చెట్టు పొద. బాదామిలోని ముక్తేశ్వర ఆలయంలోని శాసనం ప్రకారం కొచిపొద్ది అను పేరు గల ధనిక వ్యక్తితో చాళుక్య విజయాదిత్యకు సాన్నిహిత్యం ఉన్నట్లు తెలుస్తుంది. కాబట్టి పొద్ది అనే పేరు గల కుటుంబానికి చెందిన విజయభట్టారిక ధనిక వర్గానికి, సమాజంలో వున్నత స్థానం కలిగిన కుటుంబంలోని వ్యక్తి అని చెప్పవచ్చు.

చాళుక్య రాజుల శాసనాలు పరిశీలించినట్లయితే రాజ కుటుంబంలోని స్త్రీలు శాస్త్రాలు, పురాణాలు, రాజకీయం, న్యాయ శాస్త్ర, యుద్ధ విద్యలలో పావీణ్యం పొందిన వారైనట్లు తెలుస్తుంది. కాబట్టి విజయ భట్టారిక కూడా పైన చెప్పిన విద్యలలో నిష్ణాతురాలు అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

బహుశా ఇన్ని విద్యలలో ప్రావీణ్యం కలిగివుండటం వలననే విజయ భట్టారిక పరిపాలన భాద్యతలను చేపట్టి, తన పిన్న వయసులోని కుమారిని ప్రతినిధిగా ఐదు సంవత్సరాలు రాజ్య భాద్యతలను సజావుగా, శాంతి సౌభాగ్యాలతో నడపగలిగి ఉంటుంది. ఫలితంగా ఒక రాజుకు ఉండవలసిన ప్రజాపాలన, ప్రజారక్షణ, వర్ణాశ్రమ ధర్మపాలన లక్షణాలతో పరిపాలన చేసింది.

విజయ భట్టారిక దైవ భక్తి కలిగిన స్త్రీ గా, కొచ్చెరు శాసనం ద్వారా తెలుస్తుంది. వైశాఖ మాసంలో పన్నెండు రోజుల ఉపవాస దీక్ష తరువాత దానధర్మాలు చేసినట్లు శాసనం ద్వారా వివరించబడింది. ఆర్యస్వామి దీక్షిత అను పేరు గల వ్యక్తికి, నవకాగహార గ్రామంలో కొంత భూమిని ఆమె దానం చేసిన విషయం ఈ శాసనంలో ప్రస్తావించడం జరిగింది.

మూసపోసిన ప్రభుత్వ విధానాలు కాక, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని తన పరిపాలన సాగించింది విజయ భట్టారిక. పన్నుల విధానమే ప్రముఖ, మొదటి మొట్టుగా భావించే ప్రభుత్వ విధి విధానాలను అనుసరించక పోయినప్పటికీ ప్రభుత్వ యంత్రాగాన్ని తన దైన శైలిలో సజావుగా నడిపించిన ధీర వనిత విజయ భట్టారిక.

దురదృష్టవశాత్తు పిన్న వయసులోనే కుమారుడు అకాల మరణం చెందాడు. మరణ కారణం సహజమైనదా? కాదా? ఆమె పరిపాలన ఏ విధంగా అంతం అయ్యింది? అనే విషయ వివరణకు సంబంధించిన ఆధారాలు లేవు.

మొదటి విక్రమాధిత్యుడు చాళుక్య రాజ్య సింహాసనాన్ని విజయ భట్టారిక నుండి సంగ్రహించినట్లు ఫ్లీట్ మరియు కొంతమంది అభిప్రాయపడ్డారు.

**ముగింపు :** ఈ విధంగా విజయ భట్టారిక తన తెలివి తేటలతో, విద్య శిక్షణతో బాదామి చాళుక్య రాజ్యాన్ని ఐదు సంవత్సరాలు (649 - 654 A.D) విజయవంతంగా పరిపాలించింది. కర్ణాటక రాష్ట్ర చరిత్రలో ఒక విజయ రాణి విజయ భట్టారిక.

విజయ భట్టారిక వంటి ఎందరో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులను చరిత్ర మనకు పరిచయం చేస్తుంది. వారి జీవితా విశేషాలు మన గురిని చేరుకోవడానికి ప్రోత్సాహాన్నీ ఇస్తూ మార్గనిర్దేశం చేస్తాయి అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

❀❀❀

# విదుర నీతి - ఒక అనంత ధర్మ సందేశం

- **డా॥ పి. జయచంద్రుడు,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), చిత్తూరు.

'సత్యం వద ధర్మం చర' అను ధర్మమార్గాన్ని ప్రబోధించిన ఉదాత్త కావ్యేతిహాసం ఆంధ్రమహాభారతం. వేదాంతసారాన్ని తనలో ఇముడ్చుకొని పంచమవేదంగా భాసిల్లిన ప్రపంచ బృహద్గ్రంథం మహాభారతం. పరాశరాత్మజునిచే విరచితమైన సంస్కృత మహాభారతం తెలుగులో నన్నయ, తిక్కన, ఎర్రనలచే జగద్ధితంబుగా, ఆంధ్రావళిమోదమరయ, వివిధాలంకారాల వర్ణనలతో చక్కటి తెలుగు పలుకుబడులతో, జాతీయాలతో అలరారిన కావ్య కుసుమం. సమాజాన్ని ఒక ధర్మమార్గంలో నడిపించడంలో ఒక ధర్మశాస్త్రంగాను, సత్యాన్వేషణలో ఒక నీతిశాస్త్రంగాను, నవరస భరితమైన ఒక మహాకావ్యంగాను, ఒక పురాణంగాను, ఒక ఇతిహాసంగాను ఆంధ్రమహాభారతం భాసిల్లిందని చెప్పవచ్చును. "తింటే గారెలే తినాలి. వింటే భారతమే వినాలి" అనే నానుడి బట్టి మహాభారతమంటే జనులకు ఎంత మక్కువో చెప్పవచ్చును. అటువంటి మహాభారతంలో మానవులను సన్మార్గంలో నడిపించే నీతిమార్గాలకు కొదవే లేదు. అందులో ఉద్యోగపర్వంలో ధృతరాష్ట్రునికి విదురుడు చెప్పిన నీతి ప్రసిద్ధమైనది. ఈ విదురనీతి సర్వకాల, సర్వమానవ సమాజం ఆచరించదగ్గది.

ప్రపంచంలో అతిపెద్ద గ్రంథం మహాభారతం. పురుషార్థాలైన ధర్మం, అర్థం, కామం, మోక్షం - అనే నాలుగు పురుషార్థాలను సాధించడానికి అవసరమయ్యే విజ్ఞానమంతా చక్కగా ఇముడ్చుకొని భారత విజ్ఞాన సర్వస్వంగా' ప్రశస్తి పొందింది. వేదవ్యాసుడు సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి అనుసరించాల్సిన ధర్మమార్గాలను సందర్భానుసారం సూచించాడు. ఆ ధర్మమార్గాలు లేదా నీతిమార్గాలు ఆయా పురాణ పురుషుల పేరు మీదుగా సార్థకతను సాధించుకున్నాయి. పరమపావన పురాణమైన భాగవతంలో శుకనీతి వలె మహాభారతంలో విదుర నీతి గణుతికెక్కింది. సమాజంలో మానవుడు అన్ని కాలాల్లో ధర్మాన్ని ఆచరిస్తూ ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోను ధర్మమార్గాన్ని విడిచిపెట్టకూడదని, విడిచి పెడితే ఆ మానవుడు ఎంతటి అధోగతికి చేరుతాడో విదురుడు కురురాజైన ధృతరాష్ట్రుడికి బోధిస్తాడు. విదురనీతితో పాటు మహాభారతంలో కణిక నీతి, ధౌమ్య నీతి, భీష్మనీతులు కలవు. ఆదిపర్వంలో కణికుడు దుర్యోధనునికి రాజనీతిని ప్రబోధిస్తే, విరాటపర్వంలో ధర్మజుని పురోహితుడైన ధౌమ్యుడు సేవాధర్మాన్ని ప్రవచించాడు. ఉద్యోగపర్వంలో విదురుడు సుమధుర నీతులను ధృతరాష్ట్రుడికి బోధిస్తే శాంతిపర్వంలో భీష్ముడు ధర్మరాజుకు విశ్వజనీనమైన విజ్ఞానాన్ని, సర్వలోక హితులను ప్రబోధించాడు. అలా మహాభారతంలో ఉన్న కణిక నీతి, ధౌమ్యనీతి, భీష్మనీతుల కంటే విదురనీతి లోక సుప్రసిద్ధమైనది.

ఇప్పుడు విదురనీతిని విపులంగా పరిశీలిద్దాం. విదుర శబ్దానికి 'జ్ఞానం' అనే అర్థాన్ని చెప్పుకోవచ్చును. విదురుడు ధర్మానికి ప్రతీక. విదుర నీతి ధర్మమార్గం, జ్ఞానమార్గం, మోక్షమార్గం, ఆచరణీయ సాధ్యం. విదురుడు భారతీయ ఆత్మ ప్రబోధకుడు. ధార్మిక జీవనమార్గ నిర్దేశకుడు. పుత్రవ్యామోహాంధకారంలో చిక్కుకున్న కురుపతి ధృతరాష్ట్రుడిపై విజ్ఞాన వెలుతురును విరజిమ్మిన విదురుని జ్ఞాన పుంజములే విదురనీతి. విదురనీతి విజ్ఞాన దాయకమైన సకల జనహితోక్తులు.

**ధర్మప్రబోధం :**

విదురుడు జనులకు అంగీకారమైన విధంగా ప్రవర్తిస్తూ, లోకం నిందించే పనులు చేయడం మాని, తన సంపదకంటే ఇంకొకడి సంపద ఎక్కువని, ఇంకొకడి సంపదకు ఈర్ష్య చెందక మనుషులతో కలసిమెలసి బ్రతకటం మంచిదని కురువంశ ప్రభువైన ధృతరాష్ట్రునికి ధర్మాన్ని ప్రబోధించాడు.

ఎన్నికష్టాలు ఎదురైనా సత్యప్రవర్తనను విడవరాదని విదురుడు గట్టిగా వక్కాణిస్తున్నాడు. ధర్మరాజుకు సత్య ధర్మపాలనం వల్ల ఎన్నో కష్టాలు అనుభవించాడు. కానీ ధర్మమార్గాన్ని విడిచిపెట్టలేదు.

"నడవడియను మున్నీటిం
గడువం బెట్టంగ నోడకరణిం దగి తా
నొడఁ గూడు ననిని సత్యము
గణచిన గుణమింక నొండు గలదే యరయన్!" ఉద్యోగ పర్వం - ద్వితీయాశ్వాసం (5-2-39)

ఓ ధృతరాష్ట్రా! సత్ప్రవర్తన అనే సముద్రాన్ని దాటించటానికి ఓడ వలె సత్యం ఒప్పి ఉంటుంది. సత్యాన్ని మించిన గుణం ఇంకొకటి ఉంటుందా? ఉండదని భావం.

సత్యం, దయ, క్షమ, ధృతి, మితాహారం, ఆర్జవం, బ్రహ్మచర్యం, అస్తేయం, అహింస, శౌచం అనే దశధర్మ లక్షణాలలో మూలభూతమైనది. సారభూతమైనది. సత్ప్రవర్తన అన్నది దాటరాని సముద్రం వంటిదైతే, దానిని దాటడానికి తోడ్పడే ఓడ వంటిది సత్యం. కాబట్టి ప్రతి ఒక్కరూ సత్యంతోనే సత్పురుషుడౌతాడు. సత్యాన్ని విడువరాదు. సదా సత్యాన్నే పలకాలి. ధర్మాన్నే ఆచరించాలి. 'సత్యం వద ధర్మం చర'.

**శాంతి సందేశం :**

మానవుడు సంఘజీవి, విలక్షణ జీవి, విచక్షణజీవి, వివక్ష జీవి కూడా. ఈ వివక్షమే, ఈ విలక్షణమే సమాజంలో అశాంతికి

కారణభూతం. విపక్షజీవియైన మానవుడు పక్షపాతధోరణిని అవలంభిస్తూ అన్యాయానికి, అవినీతికి మార్గాలు వేస్తాడు. ఈ అవినీతికి, అన్యాయాలకు మనిషిలోని కామ, క్రోధ, లోభ, మోహం, మద, మాత్సర్యాలు సహకరిస్తాయి. దీని మూలం శాంత సమాజంలో అశాంతి నెలకొంటుంది. ఈ అశాంతి మనశ్శాంతిని బాధిస్తుంది. కాబట్టి మానవుడు మనశ్శాంతిగా జీవించాలంటే అరిషడ్వర్గాలను అణచిపెట్టాలని విదురుడు నీతిప్రబోధం చేస్తున్నాడు.

“నియత తపమును నింద్రియ నిగ్రహంబు
భూరి విద్యయు శాంతికిఁ గారణములు
వాని యన్నిటికంటే మేలైన శాంతి
కారణము లోభ ముడుగుట కౌరవేంద్ర!”

కురువంశ శ్రేష్ఠుడైన ఓ ధృతరాష్ట్రా! నియమయుక్తమైన తపస్సూ, ఇంద్రియాలను అదుపులో పెట్టుకొనటమూ, అధిక విద్య అనునవి మనశ్శాంతికి కారణాలు. వాటన్నింటికంటే అసలైన శాంతికి కారణం లోభం విడిచిపెట్టటం. విదురుని దృష్టిలో లోభమే సకల అశాంతికి కారణమని భావించవచ్చును. ఈ మాటలు ప్రతి మానవుడు గుర్తించాలి.

## సమైక్య జీవనం :

మానవుడు సంఘజీవి అయితే సరిపోదు. సమైక్యజీవనం గడపాలి. కర్తవ్య నిర్వహణలోను, కార్యాలోచనలోను, పరస్పర అభిప్రాయాలు పంచుకోవడంలోను సమైక్యభావన కలిగి ఉండాలి. సోదరభావంతో జీవించడం మానవాళి ప్రగతికి ఎంతో అవసరం. దీనివల్ల ధనిక, పేద భావాలు తలెత్తవు. ఉత్పత్తి చేసిన ధాన్యాన్ని, సంపాదించిన ధనాన్ని సమంగా అనుభవించాలని విదురుడు భావిస్తున్నాడు. అందరూ వెళ్ళేదారిలోనే ప్రతిఒక్కరూ వెళ్ళాలని, సమిష్టికార్యాలోచనే శ్రేయస్కరమని బోధిస్తున్నాడు.

“విను మధురాహారంబులు
గొనుటయుఁ బెక్కండ్రు నిద్రగూరినయెడ మే
ల్కని యునికియున్ గార్యాలో
చనము దెరువు నడచుటయును జనదొక్కనికిన్”
ఉద్యోగ పర్వం - ద్వితీయాశ్వాసం (5-2-38)

మధురాహారాలు ఒక్కడు తినడం, పలువురు నిద్ర పోతుంటే ఒక్కడు మేల్కొని ఉండటం, కార్యాలోచనల్లో ఒకరి అభిప్రాయం, నడిచేమార్గంలో ఒంటరితనం కూడదని విదురుడు ధృతరాష్ట్రుడికి బోధిస్తూ కష్టాలు, నష్టాలు, సుఖదుఃఖాలు, ఆనందం ఐశ్వర్యాలను అందరూ సమానంగా అనుభవిస్తూ సమైక్యజీవనం గడపాలని జ్ఞానోదయం కల్గించాడు.

## దుర్జనుడి లక్షణాలు :

మానవుడు తాను చేసే ఆలోచనల వల్ల సజ్జనుడిగా, దుర్జనుడుగా రూపుదిద్దుకుంటాడు. ఒక వ్యక్తిని దుర్జనుడిగాను, సజ్జనుడిగాను సమాజం చేయగలదు. సమాజానికి అంత మహత్తు కలదు. కానీ ఆలోచనా విధానం అతనిపై ఎంతో ప్రభావం చూపుతుందని చెప్పవచ్చును. విదురుడు ధృతరాష్ట్రునికి ధర్మమార్గాలను ప్రబోధిస్తూ దుర్జనుడి లక్షణాలను ఇలా చెప్పాడు.

“కోపము నుబ్బును, గర్వము
నాపోవక యునికియును, దురభిమానము, ని
ర్వ్యాపారత్వము నను నివి
కాపురుష గుణంబులండ్రు కౌరవనాథా!” ఉద్యోగపర్వం
- ద్వితీయాశ్వాసం (5-2-32)

ఓ ధృతరాష్ట్రా! కోపమూ, పొంగిపోవటమూ, గర్వమూ, తృప్తిలేకపోవటమూ, దురభిమానమూ, ఏ పని చేయకపోవటమూ అనేది దుర్జనుడి లక్షణాలు. మనిషి పతనావస్థకు ప్రధానకారణం కోపం. కోపం అజ్ఞానానికి దారి తీస్తుంది. అజ్ఞానం అభివృద్ధిని ఆటంకం పరుస్తుంది. కోపానికి గురైన ఉదంకపౌష్యులు పరస్పరం శపించుకొని పతనమైన సందర్భం తెలిసిందే. వాస్తవిక జగత్తులో కోపం ఎన్నో సమస్యలకు హేతువవుతున్నదో మనం చూస్తూ ఉన్నాం. మనిషి పతనావస్థకు ప్రధానకారణాల్లో దురభిమానం కూడా ఒకటి. దురభిమానం దుఃఖానికి హేతువై పతనానికి దారి తీస్తుంది. గర్వము, పొంగిపోవటం, తృప్తిలేకపోవటం పతనావస్థ కారణ భూతాలే. ఉద్యోగం పురుష లక్షణం. ఎలాంటి ప్రయత్నం లేక, ఏ పని చేయకపోవడం దుర్జనుని లక్షణమని విదురుని సందేశం.

## వివేకవంతుడి లక్షణాలు :

వివేకవంతులు లోకనీతిని అనుసరిస్తారు. అనుసరించే వాళ్ళకు మార్గదర్శకులౌతారు. యుక్తాయుక్త ఆలోచనాపరుడై వివేకవంతుడు సత్ప్రవర్తనతో మెలగుతాడు. సత్ఫలితాలను అనుభవిస్తూ సజ్జనుడై వెలుగుతుంటాడు. విదురుడు వివేకవంతుని గుణశీలాలను ఇలా పేర్కొన్నాడు.

“ఒకటిఁగొని రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి
మూటి నాల్గింట గడు వశ్యములుగఁ జేసి
యేనిటిని గెల్చి యాఱింటి నెఱిగి, యేడు
విడిచి వర్తించువాడు వివేకధనుడు!” ఉద్యోగ పర్వం
- ద్వితీయాశ్వాసం (5-2-37)

వివేకవంతుడైన రాజు ప్రభుత్వాన్ని చేపట్టి మంత్రము, ఉత్సాహము అను రెండింటిని కదలనీయక జోడు చేసి, మిత్రులు, అమిత్రులు, తటస్థులు అనే మూడు వర్గాలను, సామదాన భేద దండములనే నాలుగు ఉపాయాలచేత పూర్తిగా వశపరచుకుని త్వక్కు, చక్షువు, శ్రోతము, జిహ్వ, ఘ్రాణము అనే అయిదు ఇంద్రియాలనూ జయించి, సంధి, విగ్రహ, యానఆసన, ద్వైదీ భావములు అనే ఆరింటిని తెలుసుకొని, వేట, జూదము, పానము, స్త్రీ, వాక్పారుష్యము, దండపారుష్యము, అర్థదూషణము అనే సప్తవ్యసనాలను విడిచి వర్తించేవాడు వివేకధనుడని విదురుడు ప్రబోధించాడు.

**దుర్బుద్ధులకు మదబీజములు - సద్బుద్ధులకు అలంకార ప్రాయములు :**

ధనం, విద్య, ఉత్తమ వంశము అనునవి దుర్బుద్ధులకు మదాన్ని కల్గిస్తాయి. ఇవే సద్బుద్ధులకు అడకువనూ, గౌరవాన్ని తెచ్చిపెడతాయి. దుర్బుద్ధులైన కౌరవులకు, సద్బుద్ధులైన పాండవులకు ధనం, విద్య, ఉత్తమ వంశం అనే మూడు అదృష్టాలున్నాయి. ఇవి కౌరవులకు మదాన్ని కల్గిస్తే, పాండవులకు దమాన్ని కల్గించింది. మదోన్మతులైన కౌరవులు అగౌరవానికి గురికాగా, వినయవంతులైన పాండవులు లోకనీతిలో గౌరవ పాత్రులయ్యారు. .

"ధనమును, విద్యయు, వంశం
బును దుర్మతులకు మదంబుఁ బొనరించును స
జ్జనులైన వారి కడకువ
యును వినయము నివియుతెచ్చు నుర్వీనాథా !"

ఉద్యోగపర్వం - ద్వితీయాశ్వాసం (5-2-35)

**బలప్రయోగం - బుద్ధికుశలత :**

భుజబలం కంటే బుద్ధిబలమే గొప్పదని సకలజన సమ్మతమే. గొప్ప విలుకాడి మంచి బాణం ఒకడిని బాధిస్తే బాధిస్తుంది లేదా తప్పిపోతే తప్పిపోతుంది కానీ నేర్పుగలవాడి నీతిస్ఫూర్తి శత్రురాజునూ అతడి దేశాన్ని నశింపజేస్తుంది.

"అరిది విలుకాని యుజ్జ్వల
శరమొక్కని నొంచుఁ దప్పి చనినం జను నే
ర్పరి యైన వాని నీతి
స్ఫురణము పగరాజు నతని భూమిం జెఱచున్"

ఉద్యోగపర్వం - ద్వితీయాశ్వాసం (5-2-36)

బాణప్రయోగం ఎదుటివారి నొకరినే చంపుతుంది. బుద్ధి ప్రయోగంకు రాజునూ, రాజ్యాన్ని నశింపజేస్తుంది. దుర్యోధనుడు బలప్రయోగాన్ని నమ్ముకున్నవాడు. ధర్మరాజు ధర్మనీతి ప్రయోగాన్ని నమ్ముకున్నవాడు. దుర్యోధనుడు కొందరిని చంపగలడేమో కానీ ధర్మజుడి రాజనీతి కౌరవులనూ, వారి రాజ్యాన్ని కూడా హరించగలదని విదురుడు ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు.

**సుభాషణం - అలంకారభూషణం :**

నోరు మంచిదైతే ఊరుమంచిదనే నానుడి ఆంధ్రదేశంలో ఆబాలగోపాలానికి తెలిసిందే. మాట్లాడే తీరును బట్టే ఇతరుల ప్రవర్తన ఉంటుంది. ఎదుటివాడికి మేలైనవీ, ఇష్టమైన, సంతోష కరమైన మాటలనే మాట్లాడితే అందరికీ శ్రేయస్కరం. సంతోష కరమైన మాటలను పలకకపోయినా దుర్భాషలాడకూడదని విదుర నీతి

"ఎదిరికి హితమును బ్రియమును
మదికింపును గాఁగఁ బలుకు మాటలు పెక్కై
యొదవినను లెస్స యటుగా
కిది యది యన కూరకునికి యెంతయునొప్పున్ "

ఉద్యోగపర్వం - ద్వితీయాశ్వాసం (5-2-59)

మిత, హిత భాషణం మంచిదనీ, అది ఎదుటివారికి ఇంపును కలిగించాలని, అలా నిరంతరం మాట్లాడటం మంచిదనీ, అట్టి నేర్పు లేకపోతే నోరు మూసుకొని ఉండటం భావ్యమని గ్రహించవచ్చు. ఇది ఒక చక్కటి నీతివాక్యం. లోకహిత వాక్యం. మాట తీరునుబట్టే స్నేహం, విరోధాలు, జ్ఞానాజ్ఞానాలు కూడా కలుగుతాయని విదురుడు కురుపతికి ప్రబోధించాడు.

ఇలా మహాభారతంలోని ఉద్యోగపర్వంలో విదురుడు ధృతరాష్ట్రునికి ప్రబోధించిన నీతి యావత్తు మానవ సమాజానికి ఒక ధర్మ సందేశమని చెప్పవచ్చు. ప్రతి మనిషి తనలోని అంతర్గత శక్తులను గుర్తించి వేటిని త్రుంచివేయాలో వేటిని పెంచుకోవాలో అవగతం చేసుకోవాలి. ఉత్తమ ధర్మ జీవనసాధనలో ప్రతి మానవుడు ఎలా కృతకృత్యుడు కావాలో విదురనీతుల ద్వారా జ్ఞానోదయం కావాలి. ధర్మమార్గాన్ని విడిచిన కౌరవులకు అపజయం తప్పదని, దాన్ని ఆచరించిన పాండవులకు విజయం తథ్యమని విదురనీతి సూచనాప్రాయహితోక్తులు.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆధునిక తెలుగు కవుల కవితా నిర్వచనాలు

**- డాక్టర్ కోదండ లక్ష్మణ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కవిత్వం తనకంటూ ఒక ప్రత్యేకమయిన స్థానాన్ని సంపాదించుకొంది. ఆధునిక తెలుగు కవులు కవిత్వానికి సంబంధించిన అభిప్రాయాల్ని తమ తమ కవితల్లో కవిత్వీకరించారు. అంటే ప్రాచీన కవులు లాగే ఆధునిక కవులు కూడా కవిత్వాన్ని నిర్వచించారు. అంటే సంస్కృత కవులు కవిత్వానికి సంబంధించి నిర్వచనాలను తెలియజేసిన విధంగానే ఆధునిక కవులు కూడా కవిత్వానికి సంబంధించిన నిర్వచనాలను వెలువరించారు. కవిత్వంలో ఒక లక్షణం, లక్ష్యంతో పాటుగా వైరుధ్యం, వైవిధ్యానికి సంబంధించిన విషయాలను చోటు చేసుకొని ఉంటాయి. కాబట్టే సమాజంలో కవిత్వానికి అగ్రస్థానం లభించింది. అటువంటి అగ్రస్థానం లభించిన కవిత్వానికి సంబంధించిన కవితా నిర్వచనాలను గురించి కొంతమంది ఆధునిక తెలుగు రచయితలు వారి వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఆధునిక కవిత్వానికి అడుగుజాడయిన గురజాడ అప్పారావుగారు 'బిల్హణీయం'లో కవిత్వానికి సంబంధించిన కింది నిర్వచనాన్ని చూద్దాం-

**"మా తండ్రిగారు కవిత్వం చెప్పబోయేవు సుమా చెడతావని శలవిచ్చేవారు." (గురజాడ అప్పారావు, బిల్హణీయం)**

కవి తండ్రిగారు చెప్పే విషయంలో కవిత్వం పోయిన పోకడలను గురించి తెలియజేశారు. అంటే కవిత్వంలో చెప్పే విషయంలో కూడా చెడతావనే అంశాన్ని వ్యక్తపరిచారు. అంటే గురజాడ అప్పారావు గారి కవిత్వంలో నిగూఢమయిన అర్థం దాగి ఉంటుందనడంలో సందేహం లేదు.

**లోకుల రసనలె యాకులుగా నుండునట్టియవివో కవితల్! (చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రి, కథలు - గాథలు)**

కవిత్వాన్ని వెలువరించడంలో వస్తువు, భాష, శైలికి ఎంతటి ప్రాముఖ్యతను ఇస్తారనే విషయం అందరికీ తెలిసిందే. అంటే ప్రాచీన కవిత్వంలో వర్ణనలు, సౌందర్యం ఎలా దాగి ఉంటుందో అలాగే ఆధునిక కవిత్వంలో కూడా రసానికి సంబంధించినటువంటి అంశాలు కూడా ఉంటుందనే విషయాన్ని చెళ్ళపిళ్ల గారు ప్రస్తావించారు.

**సంగీతంగాని కవిత్వంగాని జీవితానికి స్వాతంత్ర్యాన్ని కలిగించటంలో అందెవేసినవేగాని, వీట్లవెంట దారిద్ర్యం దీపానికి నీడలాగు ఆశ్రయించడం అనుభూతం. (చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రి, కథలు - గాథలు)**

చెళ్ళపిళ్ల గారు సంగీతంలో కవిత్వంలో దాగి ఉందనే విషయాన్ని గురించి ప్రస్తావిస్తూనే అది జీవితంలో స్వాతంత్ర్యం బ్రతకాలంటే ఎలాంటి జీవితాన్ని ఎన్నుకోవాలో అనే అంశాన్ని గురించి చెబుతూ, చీకటిగా ఉండే ప్రదేశానికి వెలుగునిచ్చే దీపంలాగా ఉండాలని తెలియజేశారు.

**కవిత్వమనేది తన హృదయాన్ని యితరులకు విప్పి చెప్పేవుద్దేశంతో పుడుతుంది.(చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రి, కథలు - గాథలు)**

కవి తన మనస్సులో భావనను కవిత్వంగా ఎలా మలుస్తారో అన్నటువంటి విషయానికి పై పాదమే నిదర్శనం. ఎందుకంటే కవిత్వం హృదయాన్ని విప్పి ఇతరులకు ఎలా తెలియజేస్తారో అన్న విషయాన్ని గురించి తెలియజేస్తూనే ఆ కవిత్వం బాగోగులను కూడా వ్యక్తపరిచారు.

**గానమునకుఁ బాములు చేరుటకలదు. మకరందమున కీఁగలు మూఁగుట కలదు. దీపకాంతికి రోకటిబండలు చేరుట గలదు. అదృష్టశాలికి స్తుతిపాఠకులగు నాశ్రితులు చేరుట కలదు. కాని కవిత్వమునకు గబ్బిలములు జేరుట కనలేదు, వినలేదు. (పానుగంటి లక్ష్మీనరసింహారావు, సాక్షి)**

గానానికి పాములు, మకరందానికి తుమ్మెదలు, దీపకాంతికి రోకటి బండలు, అదృష్టశాలికి స్తుతిపాఠకులు చేరుతారు. కాని కవి కలం నుండి జాలువారిన కవిత్వానికి గబ్బిలాలు చేరుతాయంటే చూడలేదు, వినలేదని పానుగంటి వాపోయారు.

మరోచోట పానుగంటి గారు -

**గంద్రతనము కవిత్వమగునా? వడవడ వదరుట వాచానైపుణ్య మగునా? (పానుగంటి లక్ష్మీనరసింహారావు, సాక్షి)**

కవిత్వంలో ఆవేశం ఉండాలి, ఆవేదన ఉండాలి, అనుభూతి ఉండాలి, అనుభవం ఉండాలి. కానీ పానుగంటి గారు సాక్షిలో గంద్రతనం కవిత్వం అవుతుందా అని ప్రశ్నవేసుకొని, వచనంలో రాసింది కవిత్వం అవుతుందా అనేటువంటి విషయాన్ని గురించి తెలియజేశారు. అంటే కవిత్వానికి సంబంధించిన నిర్వచనాలు ఒక్కొక్క రచయిత ధోరణి ఒక్కో విధంగా ఉంటుందని పై పాదం ద్వారా ద్యోతకమవుతుంది.

**త్రాడులేని బొంగర మెట్లు తిరగదో మతములేని కవిత్వమట్లు వర్ధిల్లదు. (పానుగంటి లక్ష్మీనరసింహారావు, కంఠాభరణం)**

జీవితంలో కవిత్వం దాగి ఉంటుంది. అలాగే కవిత్వంలో కూడా జీవితం జీవిస్తుంది. కానీ బొంగరానికి త్రాడులేకపోతే ఎలా తిరగదో అలాగే మతాన్ని దృష్టిలో పెట్టుకొని కవిత్వాన్ని కవిత్వీకరించకపోతే ఆ కవిత్వంలో విశ్వవ్యాప్తంగా వర్ధిల్లదని పానుగంటిగారు వెలిబుచ్చారు.

**మా కవిత్వము కవులూరివారి కవిత్వము నొక్కటాకి వారికి యతిలేదు. మాకు మతిలేదు. వారికి ప్రాసము లేదు. మాకు ధ్యాసము లేదు. వారి కర్థము లేదు. మాకు నర్థము లేదు. (పాను గంటి లక్ష్మీనరసింహారావు, కంఠాభరణం)**

కవిత్వానికి ప్రాణం పోసిన కవులు వెలువరించిన కవిత్వాన్ని ప్రస్తావించారు. అంటే నేను రచించిన కవిత్వం కవులు రచించిన కవిత్వమన్నారు. అంటే పానుగంటి గారు యతిలేదు, మతిలేదు, ప్రాసలేదు, ధ్యాసలేదనే విషయాన్ని వ్యక్తపరిచారు. అంటే ఈయన తెలియజేసిన కవిత్వంలో యతి, ప్రాస అన్ని విషయాలను గురించి కవిత్వీకరించారు.

ఆశుకవిత యొకటి యావుపేఁడ యొకటి
స్వయముగాఁగ శుద్ధచయము భువిని
వాని కిలను వేఱు పరిశోధనముకూడ
దవనిఁ జెలగ వెలయ నమర భువిని. (పానుగంటి లక్ష్మీనరసింహారావు, కంఠాభరణం)

కవిత్వాన్ని గురించి పానుగంటిగారు చాలా విషయాలను తెలియజేశారు. అంటే ఆశుకవిత ఒకటి అన్నారు. అలాగే ఆవు పేడ ఒకటి అన్నారు. అంటే రెండు స్వయంగా శద్ధిచేయడంలో ఉన్నటువంటి పరిశుభ్రతను గురించి పరిశోధనాంశంగా తెలియజేశారు. అంటే ఈ రెండు విషయాలు కూడా అమర భువిని గురించే అనేటువంటి విషయాన్ని ప్రస్తావించారు.

...కవిత్వ కర్థము
స్నాన మొనర్చుచుం గడపినాడ
ననంతనిశాపరంపరల్ (గుఱ్ఱం జాషువ, నాకథ)

గుఱ్ఱం జాషువా గారు 'నా కథ'లో కవిత్వానికి నిర్వచనం ఇచ్చారు. కవిత్వానికి అర్థం స్నానం చేసి జీవితాన్ని గడపినాడు అనంత శాపాన్ని వదలించుకొని జీవితాన్ని కొనసాగించాలన్నారు. కవిత్వం రెండు పాదాలే అయినా ఆ రెండు పాదల్లో నిగూఢమయిన అర్థం ఇమిడి ఉంటుంది. అలాంటి నిగూఢమయిన అర్థాన్నిచ్చే కవిత్వాన్ని వెలువరించడంలో జాషువా ముందు వరసలో ఉన్నారనడంలో సందేహంలేదు.

**"సూక్ష్మంగా చెప్పాలంటే, జ్ఞాపకం ఉండేది కవిత్వమూ, మరిచిపోయేది" చెత్తా అన్నారు. (శ్రీరంగం శ్రీనివాసరావు, జీవితంలో నా గురువులు)**

అభ్యుదయ, విప్లవ కవిగా పేరు ప్రఖ్యాతలను సంపాదించుకొన్న శ్రీరంగం శ్రీనివాసరావు గారు కవిత్వానికి సంబంధించిన ఎన్నో విషయాలను తెలియజేశారు. జ్ఞాపకం పెట్టుకొనేది కవిత్వం, మరిచిపోయేది చెత్తా అని వ్యక్తపరిచారు. అంటే కవిత్వాన్ని చదివిన వెంటనే ఆ కవిత్వం మనస్సులో దాగిపోవాలన్నారు.

**కవిత్వానికి సంవిధానం అనవసరం అని కొట్టి పారేయ్యడం కాదు. అలాగయితే కవిత్వం రాయడమే అనవసరం. ఎలా చెప్పడం అనే దానికన్నా ఏది చెప్పడం అనేదానికే ప్రాధాన్యం ఉండాలి. అపుడు కావ్యంలో నాజూకులూ, నగిషీలు కాక వస్తువు ప్రాముఖ్యానికి వస్తుంది.(శ్రీరంగం శ్రీనివాసరావు, కవిత్వంలో నా ప్రయోగాలు)**

కవిత్వంలో ఏయే అంశాలుండాలనే విషయాన్ని గురించి ప్రస్తావించారు. అంటే కవిత్వంలో సంవిధానం అన్నారు. శైలి, సంవిధానం రెండూ ఒకే అంశానికి సంబంధించిన విషయం. కాని సంవిధానం కవిత్వంలో అనవసరమయిందని తీసేయ్యకూడదనే విషయాన్ని కూడా తెలియజేశారు. కవిత్వం ఎందుకోసం రాస్తున్నామో, రాసినందువల్ల ప్రయోజనం ఏమిటన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని కవిత్వాన్ని వెలువరించారు. అప్పుడే వస్తువుకు ప్రాముఖ్యత లభిస్తుందనే విషయాన్ని వెలిబుచ్చారు.

**"కవిత్వం ఒక ప్రస్వలిపి" అన్నాడు ఒక విమర్శకుడు. అల్పాక్షరముల అనల్పార్థరచన అని అంతకుముందే అన్నాడు మన తెలుగు కవి. (శ్రీరంగం శ్రీనివాసరావు, ఏమిటి? ఎందుకు? రెండు)**

ఎవరో ఒక విమర్శకుడు కవిత్వాన్ని ఒక ప్రస్వలిపిగా భావించాడు. కానీ ఈయన కన్నా ముందే అల్ప అక్షరంలో కూడా అనంతమయిన అర్థాన్ని ఇచ్చే రచనలు అంతకు ముందే ఉందని మన తెలుగు కవి అన్నాడనే విషయాన్ని శ్రీరంగం శ్రీనివాసరావుగారు వెలిబుచ్చారు.

కాబోలు కవిత్వం అందుకే
నిత్యనూతన వర్ణమాల
అడవిలో మనసు నిర్మించి
నివసిస్తున్న పర్ణశాల (కుందుర్తి ఆంజనేయులు, ఎవర్‌గ్రీన్)

కుందుర్తి ఆంజనేయులు 'ఎవర్‌గ్రీన్'లో కవిత్వాన్ని నిర్వచించారు. కవిత్వం కావాలి, అందులో నిత్యనూతనమయిన వర్ణమాలు ఉంటుంది. అడవిలో మనస్సును నిర్మించి, నివసించే పర్ణశాలగా ఉంటుందన్నారు. అంటే కవిత్వానికి నిర్వచనం ఇవ్వడంలో కూడా వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయుల మేటైనవాడనడంలో ఎటువంటి సందేహంలేదు.

ఇన్నేళ్ళు రాసిన కాగితాలన్నీ
హిమాలయపర్వతా లైనాయి
వాటిమీద వాడిన సిరా
వక మధ్యధరాసముద్రమయింది. (గుంటూరు శేషేంద్ర శర్మ, మరోదేవుడు)

గుంటూరు శేషేంద్రశర్మ గారి పై కవితా పాదాల్లో హిమాలయ పర్వతాలు, మధ్యధరాసముద్రం ఈ రెండింటికి ఉన్నటువంటి సంబంధ బాంధవ్యాన్ని కవిత్వంలో కవిత్వీకరించారు. ఇన్ని

సంవత్సరాలు రాసినటువంటి కాగితాలన్నీ కూడా హిమాలయ పర్వతాలైనాయి. ఆ కాగితాల మీద వాడినటువంటి సిరా మాత్రం ఒక మధ్యధరా సముద్రమైందని వెలిబుచ్చారు.

**మతం పేరిట యే వికృతమైనా చెలామణి ఐనట్టే కవిత్వం పేరిట ఏ అసందర్భమైనా మెప్పు పొందుతుంది. (గుడిపాటి వేంకటాచలం, మ్యూజింగ్స్)**

చలం నవలా, కథా రచయిత అయినప్పటికీ ఆయన రచించినటువంటి 'మ్యూజింగ్స్'లో కవిత్వాన్ని గురించి తెలియజేశారు. మతం పేరుతో ఏ అంశామయిన చెలామణి అయిన విధంగానే కవిత్వం పేరుతో ఏ అసందర్భమయినా మెప్పు పొందుతుందనే అంశాన్ని వెలిబుచ్చారు. కాబట్టి నవల్లో, కథల్లో కవిత్వాన్ని పొందుపరవచ్చు. కానీ కవిత్వంలో నవల్ని, కథల్ని పొందుపరచలేమనే విషయాన్ని కూడా ప్రస్తావించారు.

కవిత జీవితానికి కుంటిసాకు
కుంచియ చిత్రించిన అడవి ఆకు. (బైరాగి, అపూర్ణకవిత)

బైరాగి కవిత్వంలో ఒక నైపుణ్యత ఉంటుంది. ఎందుకంటే కవిత్వం జీవితానికి కుంటిసాకన్నారు. అంతటితో వదలకుండా కుంచియను చిత్రించినటువంటి అడవి ఆకుతో పోల్చాడు. బైరాగి కవిత్వం మీద ప్రాచీన కవుల కవితా ప్రభావం ఉన్నది.

మరోచోట -

**చల్లని మలాముకాదు, కాదు కవిత. నాగుబాము! నాగుబాము! కాటేస్తుంది జాగ్రత్త! దీని కాటుకు విరుగుడు లేదు జాగ్రత్త! (బైరాగి, వినతి)**

బైరాగి కవిత్వం నాగుపాము లాంటి. అది కాటేస్తుంది జాగ్రత్తగా ఉండండి. నాగపాము కాటుకు మందు లేదని వ్యక్త పరిచారు. అందుకే కవిత్వంతో చెలగాటమాడవద్దనే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. అంటే కవిత్వం నాగుపాములాగా ఉంటుందని వాపోయారు.

**ఎవడైనా 'కవిత ఇదమిత్థ'మని అంటే గోష్పాదమంత నీటిలో మునిగి చావమనవలదా? (బైరాగి, సూత్రాశ్రమం)**

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో వచన కవిత్వం కాలానుగుణంగా మార్పు చెందుతూ ఉంటుంది. ఎందుకంటే ఎవరయినా కవిత్వం ఇదమిత్థమని చెప్పితే లోతయినా బావిలో మునిగి చావమన్నారన్నారు. అంటే కవిత్వం ఎంత లోతయినదనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

అవధాన కవిత్వంలోని
ఆధిక్య మ్మేమిరా?
సర్కసులో జంతువుపై
సానుభూతియే గురూ? (గజ్జెల మల్లారెడ్డి, యక్షప్రశ్నలు)

అవధానంలో కవిత్వం ఎలా దాగిఉన్నదనే విషయాన్ని మల్లారెడ్డి గారు 'యక్షప్రశ్నలు'లో తెలియజేశారు. అవధాన కవిత్వంలోని ఆధిక్యం ఏమిరా? అంటూనే సర్కసులోని జంతువుపై ఉన్నటువంటి సానుభూతియే గురూ? అని ప్రశ్నార్థకంగా వదిలారు. మల్లారెడ్డి గారు మరోచోట-

ఆశుకవిత్వమ్ములోని
గ్యాసును వర్ణించరా!
కవితాజీవమ్ము పాలి
గ్యాసు ఛేంబ రందు గురూ? (గజ్జెల మల్లారెడ్డి, యక్షప్రశ్నలు)

ఆశువుగా కవిత్వం చెప్పడమంటే అలవోకగా చెప్పడమే అనే విషయాన్ని కూడా వెలిబుచ్చారు. అంటే ఆశుకవిత్వంలో గ్యాసును గురించి వర్ణిస్తారు. కవితా జీవితంలో కూడా గ్యాసునే కవిత్వంగా మలిచారు. అందువల్లే కవిత్వాన్ని చిత్రీకరించడానికి దేనినయినా కవితా వస్తువుగా స్వీకరించవచ్చు.

**కవి చస్తేగాని కవిత్వం బయటపడదు. (శ్రీరమణ, న్యానుడి)**

నన్నయ నుండి నేటి వరకు ఉన్న కవుల్లో కొంత మంది కవులు మరణించినా గానీ వారి కవిత్వం మాత్రం నేటికి అందరి నోళ్ళలో నానుతూనే ఉన్నది. కాబట్టే శ్రీరమణగారు కవి చనిపోయినగానీ వారి కవిత్వం బయటపడదనే విషయాన్ని తెలియజేశారు.

కవిత్వాన్ని మాత్రం కొనకు-వినకు
అది ఉత్తమన్ను
వేలుపెడితే చాలు తగుల్తుంది
ఎవడిదో కన్ను (సోమరాజు, కవిత్వాన్నిమాత్రం కొనకు)

సోమరాజుగారు 'కవిత్వాన్ని మాత్రం కొనకు' కవితలో కవిత్వానికి సంబంధించిన నిర్వచనాన్ని ఇచ్చారు. కవిత్వాన్ని మాత్రం కొనకు అన్నారు వెంటనే వినకు అని హితబోధచేశారు. అలాగే కవిత్వం ఉత్తమన్ను అని తెలియజేశారు. దానిలో వేలుపెడితే చాలు తగులుతుందనే విషయాన్ని వెలిబుచ్చారు. ఈ కవిత్వం మీద ఎవరిదో కన్ను పడిందనే వాపోయారు.

కల్లుకంటెను కఠినమై క్రాలుచుండి
కల్లు కంటెను వాసనాగరిమ నెసగి
ఎల్లవారికి నుల్లాలు పల్లవింప
సల్లలితమైన మీకైత చెల్లుచుండు. (గునుపూడి, బిడాలశాస్త్రి)

కవిత్వం ఎల్లవారికి అవగతమవుతాయో అన్న విషయాన్ని ప్రస్తావించారు. అంటే ఎల్లవారికి పల్లవింపచేయడంలో మీకైత చెల్లును అని వెలిబుచ్చారు.

హర్షవర్ధన్ గారు 'వ్యక్తిత్వం' కవితలో కవిత్వాన్ని గురించి-

**వ్యక్తిత్వానికి పీఠం నీవు**
వ్యవస్థ మార్పుకు సంకేతానివి!

కవిత పేర పొలికేకలు కాదు
నిజ జీవితాన్ని నీలో చూడు! (హర్షవర్ధన్, వ్యక్తిత్వం)

కవిత్వంలో వ్యక్తిత్వం, వ్యక్తిత్వంలో కవిత్వం దాగి ఉంటుంది. ఎందుకంటే రచయిత వ్యక్తిత్వానికి పీఠం నువ్వే అంటూ ఆ వ్యవస్థ మార్పుకు కూడా నీవే సంకేతానివిగా భావించారు. అంటే కవిత పేరుతో పొలికేకలు కాదనే విషయాన్ని నిజ జీవితంలో నీలో చూడని వ్యక్తీకరించారు. అందువల్లే మాన వుడి వ్యక్తిత్వాన్ని కూడా కవిత్వానికి వస్తువుగా తీసుకొని కవిత్వీకరించారు.

**కవిత్వమూ ధార్మికత్వమూ వొకదాని కొకటి చుక్కెదురు. (సుబ్రహ్మణ్యశాస్త్రి, రాజరాజు)**

సుబ్రహ్మణశాస్త్రి పై కవితా నిర్వచనంలో కవిత్వం, ధార్మికత్వం రెండూ కూడా ఒకదానికి ఒకటి చుక్కెదురుగా ఉంటుందన్నారు. కొన్ని విషయాల్లో కవిత్వానికి, ధార్మికత్వానికి మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడవచ్చు. అందువల్లే కవిత్వాన్ని వెలువరించడంలో రచయిత జాగ్రత్తను తీసుకోవలసిన అవసరం ఎంతయినా ఉంటుంది. కాబట్టి కవిత్వం అంటే వచన కవిత్వమే అన్న కవులు కూడా లేకపోలేదు.

**కవిత్వం అనువదించటమే నిరుపయోగం. నాటకానువాదాలు ఇంకా నిరుపయోగం. (కొడవటిగంటి కుటుంబరావు, ట్యూటర్)**

కొడవటిగంటి కుటుంబరావు గారు కవిత్వాన్ని అనువదించడమే నిరుపయోగమన్నారు. అలాగే నాటకానువాదాలు కూడా ఇంకా నిరుపయోగమనే భావించారు. అంటే ఈ రెండు కూడా నిరుపయోగమనే విషయాన్ని గురించి ప్రస్తావించారు.

**కయిత్తమంటే యిలాగా, పెతిమనిషికీ తెలియాలి. (వేదం వేంకటరాయశాస్త్రి, ప్రతాపరుద్రీయం)**

కవిత్వమంటే ఇదా! అనే విషయం ప్రతి ఒక్కరికీ తెలియాలనే విషయాన్ని గురించి వేంకటరాయశాస్త్రిగారు వాపోయారు. అంటే నాటకంలో కూడా కవిత్వాన్ని ప్రస్తావించారంటే కవి రచనా నైపుణ్యం ఎలాంటిదో ద్యోతకమవుతుంది. కయిత్తమంటే కవిత్వమనే విషయం తెలుస్తుంది.

**లోతు లేనిదే కవిత్వం. దాని ఔన్నత్యం వేగం పైన, సహజత్వం పైన ఆధారపడివుంటుంది. లోతుకలది వేదాంతం కావచ్చు. (బుచ్చిబాబు, ఒమర్‌ఖాయామ్)**

లోతయినది కవిత్వమని కొంత మంది కవులు భావించారు. బుచ్చిబాబు గారు లోతు లేనిదే కవిత్వమంటున్నారు. దాని యొక్క ఔన్నత్యం వేగంపైన, సహజత్వంపైన ఆధారపడి ఉంటుందని విషయాన్ని వెలిబుచ్చారు. లోతుకలది వేదాంతం కావచ్చని కూడా తెలియజేశారు. అందువల్లే లోతులేనిదే కవిత్వమని భావించిన కవులు కూడా లేకపోలేదు.

**జీవితంలో పొందలేని అనుభవాలని, వ్రాత పూర్వకంగా జీవిస్తాం గనుక నేను రాసేది కవిత్వం అనొచ్చు. (బుచ్చిబాబు, ఆత్మవంచన)**

కొంతమంది రచయితలు తాము రాసినదే కవిత్వమని తెలిజేసినవారు కూడా లేకపోలేదు. ఎందుకంటే బుచ్చిబుగారు జీవితంలో జరిగినటువంటి విషయాలన్నింటినీ కూడా కవిత్వంలో పొందుపరిచిన కవులు కూడా ఉన్నారు. అది కూడా రాత పూర్వకంగానే జీవిస్తాం కాబట్టి నేను రాసింది కూడా కవిత్వం అనవచ్చని బుచ్చిబాబుగారు వెలిబుచ్చారు.

**అవసరం ఆలోచింపచేస్తుంది. ఆలోచనలో భావం పుడుతుంది. భావానికి అందమైన భాష పేరే కవిత్వం. (పులికంటి, అరికకూడు)**

మనిషికి ఎప్పుడు అవసరం వస్తుందో, అప్పుడే మనసులో ఆలోచన కలుగుతుంది. ఆ ఆలోచన నుంచే భావం పుడుతుంది. ఆ భావంలో ఉన్నటువంటి అందమయిన భాష పేరే కవిత్వమంటున్నారు పులికంటిగారు. అందుకే ఆలోచన ఎప్పుడు కలిగితే అప్పుడే కవిత్వీకరించాలి. అప్పుడు గానీ వస్తువుకు తగినటువంటి భావాన్ని పొందలేం. కవిత్వాన్ని సంబంధించిన నిర్వచనం గానీ, కవి అభిప్రాయాన్ని కవిత్వీకరించడంలో భావుకత ఉండాలనే విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి.

**కాలమే కవిత్వాన్ని నిర్ణయిస్తుంది.(భమిడిపాటి గోపాలం, వేషం తగాదా)**

భమిడిపాటిగారు కాలమే కవిత్వాన్ని నిర్ణయిస్తుందని అభిప్రాయపడ్డారు. అంటే కవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కవిత్వీకరించిన గానీ, భవిష్యత్తు గురించి వారి కవిత్వంలో చూడవచ్చు. ఎందుకంటే అప్పటి కాలాన్ని గురించి కవిత్వాన్ని వెలువరించిన గానీ, భవిష్యత్తులో ఆ కవి యొక్క కవిత్వం ఏలా విస్తృతి చెందుతుందూనే విషయాన్ని రచయిత పసిగట్టాలి.

ఉన్నయది ఉన్నయట్టులఁ గన్నయదియుఁ
గన్నయట్టుల విన్నది విన్నయటుల
నన్నయది యన్నయట్టుల వన్నెలెట్టి
కవితఁ జెప్పిన సంతోషమవు జగాని॥ (శ్రీరాములు, తెలుగునాడు)

కవిత్వం ఎలా చెప్పితే సంతోషం కలుగుతుందనే అంశాన్ని శ్రీరాములుగారు తెలియజేశారు. కవిత్వంలో ఉన్నది ఉన్నట్లుగా చూసినది చూసినట్లుగా, విన్నది విన్నట్లుగా, నన్నయ తెలియ పరిచన వన్నెలా లాంటి కవితను వెలువరించినా జగానికి సంతోషం కలుగుతుందని వెలిబుచ్చారు.

**ఎక్కాల పుస్తకమయినా ఛందస్సులో పెట్టేసరికి కవిత్వమేమో ననిపిస్తుంది. (పాలగుమ్మి పద్మరాజు, వసంతం వస్తేనా....)**

ప్రాచీన కవులు పద్యాన్ని రాయడానికి వ్యాకరణాంశాలను దృష్టిలో పెట్టుకొని పద్యకవిత్వాన్ని వెలువరించారు. కానీ ఆధునిక కవులు రాసినటువంటి కవితా చరణాలల్లో ఒక వైరుధ్యమయిన భావం చోటుచేసుకొని ఉంటాయి. ఎందుకంటే ఎక్కాలు పుస్తకాన్ని ఛందస్సులో పెట్టితే అది కవిత్వంగా అనిపిస్తుందని వ్యక్తీకరించారు.

తనకోస మేడిస్తే దు:ఖం, లోకం కోసం ఏడిస్తే కవిత్వం. (నాళం కృష్ణరావు, పాపికొండలు)

కృష్ణరావు గారు తెలియజేసినటువంటి అభిప్రాయం ఎలా ఉందంటే- తన కోసమే ఏడిస్తే అది దు:ఖం అవుతుంది. అదే లోకాన్ని కోసం మనం ఏడిస్తే అది కవిత్వమవుతుందని వాపోయారు. అంటే కవిత్వం వెలువరించడంలో సమాజాన్ని దృష్టిలో పెట్టుకోవాలనే విషయాన్ని మరో సారి గుర్తుచేశారు.

కవిత్వం వైన్‌కన్నా నిషా. (సూర్యారావు, పంజరం)

కవిత్వం ఎలా ఉంటుందంటే వైన్ కంటే నిషాగా ఉంటుందన్నారు సూర్యారావుగారు. ఎందుకంటే కవిత్వం చదివిన వెంటనే అది మత్తు కలిగించాలి. అందుకే కవిత్వం వైన్‌కన్నా నిషా అని వాపోయారు. అందువల్లే కవిత్వం చదువుతూ ఉంటే వైన్ తాగిన మత్తును వదలాలనే విషయాన్ని కూడా మరోసారి వ్యక్తపరిచారు.

కవిత్వం అనుభవించడానికేగాని అర్థం చెప్పడానికి కాదు. (జయరాం, మరుగుజ్జులు)

జయరాం గారు కవిత్వం అనుభవించడానికి మాత్రమే అంటున్నారు. కానీ వాటిలో ఉన్న అర్థాన్ని చెప్పడానికి కాదనే అంశాన్ని ప్రస్తావించారు. కవిత్వంలో ఉన్నటువంటి అర్థాన్ని తెలుసుకోవాలంటే కవితా బాగోగులను గురించి తెలుసుకోవాలి. అప్పుడు గానీ ఆ కవిత్వం అవగతమవుతుంది.

పైన తెలియజేసినటువంటి ఆధునిక కవులు కవితా అభిప్రాయాలన్ని కూడా నిర్వచనాలుగా భావించవచ్చు. ఎందుకంటే ఒక్కొక్క కవి ధోరణి ఒక్కో విధంగా ఉంటుంది. అందువల్లే వాళ్లు వ్యక్తపరిచినటువంటి అభిప్రాయాలు కూడా ఒక్కొక్క విధంగా ఉంటుంది. అందువల్లే సంస్కృత కవులు కవితా నిర్వచనాల్ని దృష్టిలో పెట్టుకొని ప్రాచీన కవులు కవితా నిర్వచనాలను తెలియజేశారు. అలాగే ఆధునిక కవుల మీద కూడా సంస్కృత, ప్రాచీన కవుల ప్రభావం ఉన్నదనడంలో అతిశయోక్తి కాదు.

**ఆధార గ్రంథాలు :**

రాధాకృష్ణ, బూదరాజు - మరవరాని మాటలు, నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ మందిర్ ఎదుట, కాచిగూడా, హైదరాబాద్-27, ప్రథమ ముద్రణ, ఏప్రిల్ -2004

❀❀❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలంగాణ నిత్య సాహిత్య కృషీవలుడు డా॥వెల్చాల కొండలరావు

- మండలోజు నర్సింహాస్వామి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినంక తెలంగాణ కవులు రచయితలు సంస్థలు తమ బాధ్యతను గొప్పగా నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అనేక సాహిత్య కార్యక్రమాలు తెలంగాణ అస్తిత్వాన్ని చాటుతూ విజయవిలాసం చేస్తున్నాయి. ఆ పరం పరలో భాగంగా డా॥వెల్చాల కొండలరావు సాహిత్యం కోసం చేస్తున్న కృషి అమోఘమైనది.

వెల్చాల కొండలరావు గారి కుటుంబ సనాతనంగా చూస్తే వారిది జ్ఞాన సంపన్న కుటుంబముగా విలసిల్లినది. ఎందుకనగా వెల్చాల కొండలరావు గారి తండ్రి వెల్చాల కేశవరావు తల్లి శ్రీమతి రాధాబాయి గార్లు. వేల్చాల కేశవరావు గారిది రైతు కుటుంబం అయినా వారు ఆ కాలంలోనే గొప్ప పండితులుగా, సకల శాస్త్ర పారంగతులుగా ప్రసిద్ధులు. వారు స్వయంగా కవిత్వం రాసేవారు. సంగీత సాహిత్యాలంటే వారికి అత్యంత అభిమానం. అంతేకాదు దేశాభిమానం మరియు జాతీయత మెండు. సామాజిక అవ గాహనతోపాటు భావిదర్శనం వారిలో ఉండేది.

కేశవరావు కరీంనగర్ జిల్లా రచయితల సంఘానికి అధ్య క్షులుగా ఉన్నారు. గాంధేయవాది వారు నివసించే "గుండి" గ్రామానికి అప్పట్లోనే కృష్ణా పత్రిక, ఆంధ్ర, భారతీ పత్రికలు తెప్పించుకొని చదివేవారు. వారి పిల్లల చేత చదివించేవారు. వారు కరీంనగర్‌లో ఉండగా వారి గృహానికి ఎందరో సాహిత్య వేత్తలు వస్తుండేవారు. వెల్చాల కొండలరావు గారి తల్లి శ్రీమతి రాధాబాయి కూడా రోజుకు నాలుగు వార్తా పత్రికలు చదివేవారు. తాను ఎప్పుడో చదువుకొన్నవి, విన్న సామేతల్ని రంగరించి పిల్లలకు నేర్పేవారు. తండ్రి కేశవరావు "కరీంనగర్ మండల చరిత్ర" కూడా ఆయన గ్రంథస్తం చేశారు. అలాగే "మిత్రార్థ శతకం" రాశారు. వెలిచాల వంశ చరిత్ర రచనకు పూనుకొని "నేను నా వంశం" పేరుతో వారి వంశ చరిత్ర రాశారు. మహాకవి విశ్వనాథ సత్య నారాయణ గారి చేతుల మీద వారి రచన ఖండకావ్యమైన "కేదారగౌళ" కావ్యాన్ని అంకితం పొందిన గొప్ప పండితోత్తముడు కేశవరావు.

ఇంతటి గొప్ప జ్ఞాన సంపన్నులకు జన్మించిన వెల్చాల కొండలరావు వంశపారంపర్యంతో పాటు సాహిత్యం పట్ల మంచి మక్కువను చిన్నతనంలోనే వారిలో నింపి నేటి తరానికి, ఒక జ్ఞాన గనిని అందించారు. విద్యారంగ పాలనావేత్తలకు డా॥ వెల్చాల కొండలరావు గారి జీవితం ఒక "ప్రమోద దీపిక" అంటే అతిశయోక్తి కాదు.

తండ్రి ప్రభావం ఈయన మీద ఎంత ప్రబలంగా ఉందో ఆ కొండలరావు గారి మాటలలోనే తెలుసుకోవాలి. తండ్రి చలువచేతనే, ఆయన రక్తమై ఈ కవిత్వం తనలో ప్రవహించింది అని తన "అంకితం"లో ఇలా చెప్పుకున్నారు.

"ఎవ్వాని అనుభూతి ఈ రీతి కవితయై
నాలోన ప్రవహించె నాది యగుచు
అతని యనుభూతి నా యనుభూతిగా
అతనిదిగా దీనిని అతనికిదిద్దు.
ఎవ్వాని వాత్సల్య మీ తీరు కవితగా
నాలోన లోలోన మసలియుండె"......

అని కూడా తన పితృభక్తినీ వ్యక్తంచేస్తూ నేటి తరానికి తల్లిదండ్రుల పట్ల ఉండాల్సిన భక్తి బాధ్యతలను గుర్తుచేశారు. డాక్టర్ వెల్చాల కొండలరావు గారు సుందర సాహిత్య రస పిపాసి వాణిజ్య విద్యలో స్నాతకోత్తరస్థాయి పట్టభద్రులైనా తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషలలో కవితామార్దవం తెలిసిన మనస్వి. బహుభావనా ప్రేరకుడూ, శబ్దమాధుర్యం అర్థగౌరవం సమపాళ్ళలో మేళవించి రచనల్లో వెల్లివిరిసెలా చేశాడు. ఆ మూర్తిమత్వం వెనుక సాగర మంతటి పరిజ్ఞానముంది. నింగిని తాకేంత దార్శనిక దృష్టీఉంది. తెలంగాణ తెలుగు జనత అన్ని రంగాల్లోనూ పతాకస్థాయి ప్రతిభను ప్రదర్శించాలని కోరుకున్న 1950 ల నాటి యువమేధావుల తరానికి ప్రతినిధి డాక్టర్ వెల్చాల కొండలరావు.

డాక్టర్ వెల్చాల కొండలరావు ఒక ప్రత్యేక వ్యక్తి. తన ముందుఉన్న కవుల తరాన్ని అపూర్వంగా ఆదరించి తన తరాన్ని అభిమానించి తన తర్వాత తరాన్ని హృదయపూర్వకంగా అభినం దించే ఉన్నత హృదయులు డాక్టర్ వెల్చాల కొండలరావు. క్రమ శిక్షణ కదను తొక్కుతున్నట్లుంటుంది. వారు వ్యవహరిస్తుంటే భావు కతా పరిమళిస్తున్నట్లుంటుంది. ఏదైనా అంశాన్ని గురించి ఆలోచి స్తుంటే సహృదయత స్పందిస్తున్నట్లుంటుంది. సహజంగా తల వంచని రీవి. అయినా వెనుదీయని సహసం; మేధావిలా వివేచించే విజ్ఞానం; ఔచిత్యాన్ని గురించి నిగ్గుతేల్చే నిబ్బరం. ఇన్ని విశేషాల విచిత్ర సమ్మేళనం కొండలరావు గారి వ్యక్తిత్వం. అనువాద కవి తలు, స్వంత కవితలు, శాస్త్ర కవితలు, వర్ణనాత్మ కవితలు, ఇలా కవిత్వాన్ని వక్రమనోహరంగా చెప్ప నేర్చి రంజింప చేసిన మరియు వాచ్యరమణీయంగా కూడా చెప్పనేర్చిన వారు డాక్టర్ వెల్చాల కొండలరావు గారు.

తెలంగాణ ప్రాంత సాహిత్యానికి కొండలరావు గారి సేవ వెల్చాల కొండలరావు గారికి సాహిత్యాభిలాష వారి వంశస్తుల నుండే అబ్బినా కూడా వారికి మొట్ట మొదటి సాహిత్య గురువు విశ్వనాథ సత్యనారాయణ గారు. కొండల రావు జీవనంలో ఆయన్ని అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తుల్లో విశ్వనాథ గారు ప్రముఖులు. వారి సాహితీ వ్యాసాంగానికి ఒక పరిపూర్ణమైన ఆకృతిని కల్పించిన వారు విశ్వనాథ సత్య నారాయణ గారే.

వెల్చాల కొండలరావు ఇంటర్మీడియట్ చదువుతున్న రోజులలో చలం గారి నవలలు, రచనలు మరియు విశ్వనాథ గారి నవలలు, రచనలు చదివేవారు. కొండలరావుకి విశ్వనాథ గారు రచించిన "మా బాబు" నవలంటే చాల ఇష్టం. ఇలా సాహిత్యంపైన ఆసక్తి, ప్రేమ ఏర్పడింది. కొండల రావు వివేక వర్థిని కళాశాలలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో విద్యార్థి సంఘానికి కార్యదర్శిగా ఉండేవారు. వారి కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తకావిష్కరణకు కొండల రావు విశ్వనాథ గారిని ఇంటికి వెళ్ళి ఆహ్వానించారు.

వెల్చాల కొండలరావు తెలుగు సాహితీ రంగంలో పరిశ్రమించడం, దానికోసం కష్టనష్టాల నెన్నింటినో సహించడం విచిత్రమే. వారు చదివిన విద్య ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ., పిహెచ్.డి. డిగ్రీలను పొందినవారు. ఉర్దూ మాధ్యమం ద్వారా వారి విద్యాభ్యాసం పూర్తి అయింది. వారికి తెలుగు భాష మాతృభాష కావడం తప్ప వారికి సాహిత్యంతో కించుత్తు కూడా సంబంధం ఏర్పడడానికి వీలేలేదు. కాని వారి పట్టుదల ముందు సాహిత్యం వారికి సొంతమైనది. ఇలా సాహిత్యం వారికి అందడానికి కారణం కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారితో అత్యంతమైన సాన్నిహిత్యం, స్వర్గీయ జువ్వాడి గౌతమరావు, ప్రొఫెసర్ కోవెల సంపత్కుమారాచార్యులు వంటి వారి స్నేహము వారిని సాహిత్య పిపాసిగా మార్చినాయి.

1956 వ సంవత్సరంలో కరీంనగర్ శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకులుగా చేరారు. అక్కడ విశ్వనాథ గారు ప్రిన్సిపాల్‌గా ఉండడం మరింత లాభం జరిగింది. సాహిత్యంపై మరింత పట్టు దొరికింది. తర్వాతా 1965 సంవత్సరంలో జగిత్యాలలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఆ కళాశాలలకు కొండలరావు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన నుండే ఆ కళాశాలకు మంచి క్రమ శిక్షణతో పాటు విద్యార్థులలో అత్యంత చైతన్యాన్ని నింపినారు. విద్యార్థులను మహోన్నతులుగా తీర్చాలంటే వారికి జ్ఞానంను పెంచె బాండగారము గ్రంథాలయం అని ఆలోచించి కళాశాలలో ఒక పెద్ద గ్రంథాలయంను మరియు విద్యార్థులు చదువుకోవడానికి విశాలంగా ఉండే చదువుకొనె గది ఏర్పాటు చేశారు. దేశ విదేశాల నుంచి తెలుగు, ఇంగ్లీషు, హిందీ,ఉర్దూలలో నెలకు కనీసం 60 రకాల పత్రికలు, మేగజైన్లు వచ్చిపడేలా చేశారు. ప్రపంచంలోని వేగాన్ని విద్యార్థులు పట్టుకోవాలని కొండలరావు సంకల్పం. కళాశాలలోపాఠాలు చెప్పడం మాత్రమే కాదు, ప్రతి వారం సెమినార్లు, అధ్యాపకులు, విద్యార్థులు స్వతహాగా వ్యాసాలు రాసి సమర్పించేవారు. అతిథులతో ప్రసంగాలు, కవి సమ్మేళనాలు, సంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కచేరీలు ఇలా సాహిత్య విషయాలలో ఏదో ఒక్కటి నిర్వహిస్తూ విద్యార్థులను కళాశాలలో ఉండేటట్లు చేసేవారు.

1973లో బదిలీ నిమిత్తం హైదరాబాద్‌లోని చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన సిటి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా తనదైన శైలిలో పనిచేసి అందరిచేత మన్ననలు పొందుతూ విద్యార్థులను నిత్య జాగృతులను చేసే వాతావరణం కల్పించడమే ఆయన లక్ష్యం. చదువంటే పాఠ్యపుస్తకాల మత్తులోనో, మడిలోనో ముంచటం కాదు, ఉంచటం కాదు, విద్యార్థి అన్ని రంగాల్లో ఎదిగిపోవాలి అనే లక్ష్యంతో వారికి అన్ని సదుపాయాలను కల్పిస్తూ వారి బాధ్యతలను నిర్వహించారు.

11-08-1985 నుండి 31-07-1990 వరకు తెలుగు అకాడమీ సంచాలకునిగా(డైరెక్టర్) బాధ్యతలు స్వీకరించారు కొండలరావు. కేవలం తెలుగు అకాడమీ అనేది పాఠ్య పుస్తకాల అచ్చు వేసే సంస్థగా కొద్ది మందికి మాత్రమే తెలిసిన విషయం. కాని కొండలరావు బాధ్యతలను చేపట్టిన తర్వాత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని పొందింది. కొండల రావు కంప్యూటర్‌లలో తెలుగును ప్రవేశ పెట్టి ఈనాడు ఉభయ రాష్ట్రాల్లో నాలుగు చెరగులా తెలుగులో కంప్యూటర్‌ల ద్వారా డి.టి.పి. పద్ధతిలో ముద్రణ జర్గడం వెల్చాల కొండల రావు కృషికి ప్రతి ఫలంగా వచ్చినవే.

పుస్తక విక్రయ కేంద్రాన్ని వాహనంలో ఏర్పాటు చేసే రాష్ట్రమంతా పర్యటించేటట్లు చేశారు. మూలకు ములుగుతున్న అనేక మంచి పుస్తకాలకు వెలుగునందించారు. అసలు ముద్రణకే నోచుకోనివి ఐనా మంచి పుస్తకాలు పరిశోధక గ్రంథాలను అచ్చు వేయించి సాహితీలోకానికి అందించారు.

అకాడమీలో ఎప్పుడో ఎవరికీ తెలియకుండా వచ్చే "తెలుగు వైజ్ఞానిక పత్రికను" మాసపత్రికగా మార్చరు. ఈ పత్రికలో సాహిత్య విషయాలు, సాంఘీక విషయాలు, సైన్సు పరిశోధనలు అన్నింటికి ఉచిత స్థానాన్ని కల్పించి రచయితలకు మంచి పారితోషికాన్ని మరియు విద్యార్థులకు బహుమతుల్ని ప్రకటించి వారిని ప్రోత్సహించారు. వీటన్నింటి సహకారాలతో ఈ పత్రిక పోటిపడి ప్రచారంలోకి వచ్చి విద్యార్థులకు, అధ్యాపకులకు ఎందరికో మార్గదర్శకమైనది.

తెలుగు అకాడమీలో కొండలరావు ప్రవేశపెట్టిన పద్ధతులూ, పథకాలూ తెలుగు భాషకూ, రచయితలకూ, కవులకూ, పండితులకూ, ప్రతి కళకూ కొత్తద్వారాలు తెరుచుకున్నాయి.

కొండల రావు అకాడమీ సంచాలకులుగా ఉన్నకాలంలో జరిగిన కొన్ని కార్యక్రమాల్లో ముఖ్యమైనది తెలుగు భాషావ్యాప్తికి తెలుగును అధికార భాషగా తీర్చి దిద్దడానికి అనేక సంస్కరణలు చేశారు.

**సాహిత్యపంరగా అకాడమీలో సంస్కరణలు :**

1. పరిపాలనా రంగంలో తెలుగు అమలు
2. న్యాయ పరిపాలనా రంగంలో తెలుగు అమలు
3. పబ్లిక్ కమీషన్ పరీక్షల్లో తెలుగు అమలు
4. పాఠశాలల్లో తెలుగు భాషా బోధన
5. ఉన్నత విద్యాస్థాయిలో తెలుగులో మానసిక, సాంఘీక శాస్త్రాల్లో బోధన

ఇవేకాక తర్వాతా జరిగిన సదస్సులో 2 అంశాల గూర్చి ప్రస్తావించారు.

1. తెలుగులో ఆధునిక సాహిత్య ధోరణులు
2. తెలుగు భాషాభివృద్ధికి వివిధ సంస్థలు చేసిన కృషి

ఈ విషయాలన్నీ అధికారులంధరి దృష్టినీ ఆకర్శించాయి. మేధావులెందరినో తెలుగు అకాడమీ వేదిక మీదికి తెచ్చారు. వారి చేత వ్యాసాలు రాయించి తెలుగు ప్రత్యేక సంచికలతో ప్రచురించారు. అంతేకాదు పారి భాషిక పద కోశాలను నవీకరించి లక్ష ఇరవై ఐదువేల (1,25,000) పదాలతో ముద్రించి రచయితలకు అనువాదకులకు ఆచార్యులకు, మేధావులకు, పత్రికారంగానికి అందుబాటులోకి తెచ్చారు.

తెలుగు రాని వారికి అకాడమీ ప్రాంగణంలో నిర్వహించే తెలుగు తరగతులు కాక ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్. ప్రొబేషనర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది.

పత్రిక ప్రమాణాలు నిలపడం కోసం అన్ని శాస్త్రాల నిపుణులతో సంపాదక మండలిని నియమించారు.

విశ్వ విద్యాలయాల్లో పిహెచ్.డి. పరిశోధనలు చేసి సమర్పించిన ఉత్తమ రచయితలకు, అనువాదకులకు పారితోషికాలను ఇచ్చె ప్రక్రియను ప్రారంభించారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో 10కి పైగా పుస్తకాలకు సంపాదకియం వహించాడు. నేటి ఆధునిక కవులకు మార్గ నిర్దేశనం చూపుతూ 80 ఏండ్ల వయస్సు దాటిన నేటికి పత్రికలలో వ్యాసాలనందించడంలో ముందువరుసలో ఉన్నారు.

ఇలా భావిభవిష్యత్ తరాలకు ఎన్ని విధాలుగా తోడ్పాటు నందించాలో అన్ని రకాల అందించి ఉభయ రాష్ట్రాల వారికి సాహిత్య పరంగా మేలును చేకూర్చడంలో కొండలరావుకు సాటి కొండలరావే అనే లోకోక్తిని నిజం చేసి చూపారు.

✿✿✿

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# కాలం మారినా......... మారని మనస్తత్వాలు

**- పర్వుల శైలజ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల (అటానమస్), సిద్ధిపేట, తెలంగాణ.

యది హాస్తి తదన్యత్ర, యన్నే హాస్తి నతత్ క్వచిత్

'ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా లేదు' అని భారతం గురించి ఘంటా పథంగా చెపుతారు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని/యధ్యాత్మ విదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని/కవి వృషభులు మహా కావ్యామనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని,/యైతి హాసకు లితిహాసమనియు
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ/యంబని, మహిగొని
యాడుచుండ (ఆది 1 - 32)

ఇలా ఎవరు ఏ కోణంలో భారతాన్ని చూస్తే (అధ్యయనం చేస్తే) ఆ కోణంలో దర్శనమిచ్చే ఒక బృహద్గ్రంథం. క్రీ.పూ. వ్యాసుడు రచించినా కవిత్రయం అనువదించినా భారతంలోని పాత్రలు సార్వకాలిక సమాజానికి అద్దం పడుతున్నాయి. మానవులలో ఎన్ని రకాల ప్రవృత్తులుంటాయో అన్నిటికీ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు, ధర్మ సంఘర్షణలకు భారతం నిలువుటద్దం అనవచ్చు.సమస్యలు, సంఘర్షణలే కాదు వాటి పరిష్కారాలను కూడా భారతం నుంచి మనం తెలుసుకోవచ్చు.

కౌమార దశలోని వారిలో ఒక విధమైన ఉత్సుకత కుతూహలం, ఆకర్షణలకు లోనుకావడం, తమకన్నీ తెలుసుననుకొని తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం సర్వసాధారణంగా ఉండే లక్షణాలు.

మహాభారతంలో శకుంతల, కుంతి, తపతి వీరు ముగ్గురూ తమ కొడుకులను వీరులుగా తీర్చిదిద్దిన వంశకర్తల మాతలు, సద్గుణ సంపన్నలు.

నన్నయ రచించిన మహాభారతం ఆదిపర్వంలోని శకుంతల, కుంతి, తపతి పాత్రలను పరిశీలిస్తే వారు యుక్త వయసులో ఎలా ఆకర్షణలకు, ఉత్సుకతలకు లోనైనారో, ఆయా సందర్భాలలో వారు ఎలా ప్రవర్తించారో, వాటి పర్యవసానాలు ఎలా ఉన్నాయో గమనిస్తే నేటి యువతులు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో పై పాత్రల నుండి నేర్చుకోవచ్చు.

**శకుంతల :**

మేనకా విశ్వమిత్రుల కూతురు. కణ్వమహర్షి పెంపుడు కూతురు. కణ్వమహర్షి దర్శనార్థం వచ్చిన అందంలో జయంతుని పోలిన దుష్యంతుని చూసి, అరణ్యంలో మునల మధ్య పెరిగిన శకుంతల సంభ్రమానికి గురి అవుతుంది. పండ్ల కోసం అడవికి వెళ్ళిన కణ్వమహర్షి తిరిగి రావడానికి ఒక ముహూర్త కాలం పడుతుందని తెలుసుకొని, మనోరాజ్యలక్ష్మి వలె నున్న సర్వ లక్షణ లక్షితాలయిన శకుంతల సర్వావయవాలను చూసి సంచలితుడైన దుష్యంతుడు ఆమె వివరాలడిగి తెలుసుకుంటాడు. శకుంతలకి కూడా తనపై వలపు కలిగి ఉండడం గమనించి

ఈ వల్కలాజినములకు/ నీవన్యఫలాశనముల కీ విటపకుటీ
రావాసములకు నుచితమె/ నీవిలసిత రూపకాంతి నిర్మల గుణముల్
(ఆది 4-53)

నీ అందమైన రూపం, నీ ప్రకాశవంతమైన శరీరం, మచ్చ లేని నీ గుణాలు, ఈ నారచీరలు కట్టుకోవడానికి, ఈ అడవి పండ్లు తినడానికి ఈ పర్ణశాలలో నివసించడానికి తగినవి కావు అంటూ ఆమె అందాన్ని పొగుడుతాడు.

ఈ మునిపల్లె నుండు టిది యేల కరంబనురాగ మొప్పగా
భామిని! నాకు భార్యవయి భాసురలీల నశేష రాజ్య ల
క్ష్మీ మహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనిందితేందుపా
దామలతుంగ హర్మ్యముల హారిహిరణ్మయ కుట్టిమంబులన్
(ఆది 4-54)

శకుంతులా! ఈ విధంగా మునిపల్లెలో ఉండడమెందుకు? ఎంతో ప్రేమతో నాకు భార్యవయి సకల సంపదలతో తులతూగే ఎత్తైన, అందమైన బంగారు మేడలలో సుఖాలను అనుభవించు అంటూ ఆశలను కల్పిస్తాడు.

నీకూ నాకూ పరస్పరం ప్రేమ కలిగింది. కాబట్టి ఆలస్యం చేయకుండా గాంధర్వ వివాహం చేసుకుందామని తొందర పెడతాడు. పెళ్ళి ప్రస్తావన తేకపోతే అమ్మాయిలు లొంగరు కాబట్టి దుష్యంతుడు గాంధర్వ వివాహాన్ని ప్రతిపాదించాడేమో (ఎరగా వేసాడేమో) అనిపిస్తుంది.

కరుణానిరతులు ధర్మ/ స్వరూపులింతకు మదీయ జనకులు సనుదెం
తురు, వారు వచ్చి నీకి/చ్చిరేని పాణి గ్రహణము సేయుము నన్నున్
(ఆది 4-56)

దయాపరులు, ధర్మ మూర్తులు అయిన మా తండ్రి కణ్వ మహర్షి ఇంతలోనే వస్తారు. వారు వచ్చినన్ను నీకు భార్యగా కన్యాదానం చేస్తే నన్ను నీవు పెండ్లి చేసుకో అని చెపుతున్న శకుంతల మాటలను త్రోసిపుచ్చి, గాంధర్వ వివాహ స్వరూపాన్ని చెప్పి ఒప్పిస్తాడు దుష్యంతుడు.

శకుంతల, దుష్యంతుని వలన తనకు కలుగబోయే పుత్రున్ని ఈ విశాల సామ్రాజ్యానికి యువరాజ పట్టాభిషేకం చేస్తానని నాకు వరమిస్తే నీకూ నాకూ వివాహమౌతుందని కోరగానే

మాటే గదా ఇస్తే పోలా అనుకున్నాడేమో సంతోషంగా వరమిచ్చి గాంధర్వ వివాహం చేసుకొని ఇష్టసుఖాలననుభవించి, నిన్ను వెంటపెట్టుకొని రావడానికి కణ్వ మహర్షి ఆశ్రమానికి మంత్రులను పంపుతాను అని ఒప్పించి, నగరానికి వెళ్ళిపోతాడు. ఎంతకాల మైనా తిరిగిరాకుండా మొహం చాటేస్తాడు.

ఈ ఘట్టంలో అమ్మాయిలను పొగడ్తలతో ముంచెత్తి అంద మైన ఆశలు కల్పించి వారికి ఆలోచించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా వారిని ఉక్కిరి బిక్కిరి చేసి, అనుభవించి పరారయ్యే పురుషులకు ఉదాహరణగా దుష్యంతుడు నిలిస్తే, ఆకర్షణలకు లోనై అపరిచితులను నమ్మి తనవారెవరినీ సంప్రదించకుండా బలైపోయే అమాయకపు యువతులకు ఉదాహరణగా శకుంతల నిలుస్తుంది.

భరతునికి యుక్త వయసు వచ్చేవరకు దుష్యంతుని కొరకు వేచి చూసి తరువాత శకుంతల భరతుని వెంటపెట్టుకొని దుష్యంతుని వద్దకు వెళ్ళి తనను, తన పుత్రుని ఆదరించమని ఎంతో ఓర్పుతో, మాటనేర్పుతో ఎన్నో విధాల వేడుకుంటుంది. సత్యం విలువ, కుటుంబం విలువ తెలుపుతుంది. అసత్య వచను లకు ఇహపరాలు రెండు చెడతాయని హెచ్చరిస్తుంది. అయినప్ప టికీ దుష్యంతుడు శకుంతలను నీవెవరో నాకు తెలియదని బుకాయిస్తాడు, ఆమెను నిండు సభలో అవమానిస్తాడు, అవ హేళన చేస్తాడు. చివరకు అందరి ఎదుట ఆకాశవాణి నిజం చెప్పడంతో శకుంతలా భరతులను భార్యాపుత్రులుగా స్వీకరించి ఆదరిస్తాడు.

ఇలా తమని మోసం చేసిన యువకుడిని ఒప్పించడానికి ప్రయత్నించి విఫలమై అతడి ఇంటి ముందు ధర్నాలు చేసి సాక్ష్యాల సహాయంతో, పోలీసుల సహాయంతో పోరాడి విజయం సాధించే యువతులను నేటికీ సమాజంలో తరచు చూస్తూనే ఉన్నాం.

**కుంతి :**

యాదవ వంశరాజు శూరుని పెద్ద కూతురు. కుంతి భోజుని పెంపుడు కూతురు. వినయ విధేయతలు కలిగిన యువతి. నిత్యం బ్రాహ్మణులను, అతిథి అభ్యాగతులను ఆదరించేది. తమ ఇంటికి అతిథిగా వచ్చిన దుర్వాసుడంతటి మహా మునినే తన సేవలతో మెప్పించగలిగినంతటి ఓర్పు, నేర్పు కలిగిన గుణవతి. అయినప్పటికి కౌమార చాపల్యంతో దుర్వాసుడిచ్చిన వరాన్ని పరీక్షించాలనుకుంటుంది. మంత్ర శక్తి గురించి తెలియక పిల్లలాటగా భావించి మంత్రాన్ని జపించి సూర్యుని ఆహ్వా నిస్తుంది. నిజంగానే సూర్యుడు వచ్చే సరికి భయపడి పోయి అజ్ఞానంతో తాను ఆ మంత్రాన్ని జపించానని తెలియక చేసిన తప్పును క్షమించమని పరిపరి విధాల వేడుకుంటుంది. దుర్వా సుని మంత్ర శక్తి వృధాగా పోదని సూర్యుడు తెలుపగా అయ్యే! తెలియక కోరకూడని కోరిక కోరాను, నాకు గర్భం వస్తే నా తల్లిదండ్రులు, బంధువులు నవ్విపోరా? ప్రజలందరూ ఏమను కుంటారు? అంటూ లోకాపవాదుకు భయపడుతుంది. చేసేది లేక మంత్ర ప్రభావంతో సూర్యుని వల్ల సహజ కవచ కుండలాలతో ప్రకాశిస్తున్న కర్ణునికి జన్మనిస్తుంది.

ఈ బాలు నెత్తుకొని యింటకి జన్న నన్నున్ / నా బంధు
లందరు మనంబున నేమనా?రె
ట్లీ బాల సూర్యనిభు నిట్టుల డించి పోవం/ గా బుద్ధిపుట్టు?
నని కన్య మనంబులోనన్ (ఆది 5-29)

ఈ బాలునెత్తుకొని ఇంటికి వెళితే నా బంధువులందరూ దూషిస్తారు. అట్లని బాల సూర్యుని వంటి ఈ బాలుని వదలి వెళ్ళడానికి ఎట్లా బుద్ధి పుడుతుంది. అని మానసిక వేదనకు గురౌతుంది. చివరకు కర్ణుని పెట్టెలో పెట్టి నదీ ప్రవాహంలో వదిలేస్తుంది.

ఇలా తొందరపాటుతో ముందు వెనుకలు ఆలోచించ కుండా కౌమార చాపల్యంతో పిల్లలను కని, సమాజానికి భయపడి మురిక్కాలవల పక్కన, చెత్త కుప్పలలో పడేసి చేతులు దులుపు కునే (వారిని) సంఘటనలను తరచు నేటికీ పత్రికలలో చూస్తూనే ఉన్నాము.

**తపతి :**

సూర్యుని కూతురు, సావిత్రికి చెల్లెలు నిగర్వి. ఎంతో అందమైనది. తొలిచూపులోనే సంవరణుని ఆకట్టుకుంటుంది. ఆమె అందానికి ముగ్ధుడైన సంవరణుడు మాట్లాడడానికి ప్రయ త్నిస్తే సమాధానం ఇవ్వకుండా అంతర్ధానమవుతుంది. దానితో తట్టుకోలేక నేలపై బడి తనకోసం దు:ఖిస్తున్న మన్మథుని వలెనున్న సంవరణుని చూసి ఇష్టపడి తిరిగి వస్తుంది. "ఇట్లేల మోహగ తుండవైతివి" అని అడిగిన తపతితో సంవరణుడు

ధరణి నతిప్రతాప బలదర్పములన్ విననేన పెద్ద నె
వ్వరికిని మున్ భయపడనివాడ భయార్తుడ నైతి నిప్డు; పం
కరుహదళాయతాక్షి! దయగావుము నన్ను ; భవన్నిమిత్త దు
ర్ధరతర పంచబాణహతి బంచత బొందక యుండు నట్లుగన్
(ఆది 7-79)

నన్ను గాంధర్వ వివాహంబున వరియింపుము
(ఆది 7-80)

గొప్ప బలగర్వ పరాక్రమాలలో ఈ భూమి మీద నేనే గొప్పవాడిని ఇంతవరకు ఎవ్వరికీ భయపడని వాడిని కాని, ఇప్పుడు భయంతో బాధితుడనయ్యాను. ఓ పద్మాక్షీ! నీ కారణంగా భరింపరాని మన్మథుని దెబ్బతో మరణం పొందకుండా దయతో నన్ను రక్షించి గాంధర్వ వివాహం చేసుకొమ్మని ప్రాధేయపడతాడు.

సంవరణుడు వివాహానికి తపతిని తొందరపెడతాడు. నువ్వు లేకపోతే నేను చనిపోతానంటాడు అయినా శకుంతల లాగా తపతి తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా నాపై నీకు ప్రేమ ఉంటే మా తండ్రిని అడుగు, అతడిని మెప్పించి నన్ను వివాహం చేసుకొమ్మని చెప్పి సూర్య మండలానికి వెళ్ళిపోతుంది. సంవరణుడు తపస్సు చేసి వశిష్ఠుని సహాయంతో సూర్యుని ఒప్పించి తపతిని వివాహం చేసుకుంటాడు.

**ముగింపు :**

ఈ మూడు కథల నుంచి యువతులు -

ఆకర్షణకు లోనై అపరిచితులను నమ్మి తమ వారినెవరినీ సంప్రదించకుండా ఏపనీ చేయకూడదని, ఒకవేళ తమ వల్ల పొరపాటు జరిగితే ఆత్మ స్థైర్యంతో చివరి వరకు పోరాడి విజయం సాధించాలేకాని, నిరాశానిస్పృహలకు లోను కాకూడదని శకుంతల కథవల్ల తెలుసుకుంటారు.

అనాలోచితంగా ప్రవర్తించకుండా ఎప్పుడూ జాగరూకతతో ఉండాలని, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేమీ ఉండదని కుంతి కథవల్ల తెలుసుకుంటారు.

తమని ఎంత ప్రేమిచే వారైనా తమకోసం ప్రాణాలనిచ్చే వారి విషయంతోనైనా తొందరపడకుండా సరైన మార్గంలోనే తనని వివాహం చేసుకొమ్మని నిక్కచ్చిగా చెపితే ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవితం సాఫీగా సాగుతుందని తపతి కథ వల్ల తెలుసు కుంటారు.

అయితే ఏ సందర్భంలో ఎలా ప్రవర్తిస్తే ఎలాంటి పరిణా మాలు ఎదురవుతాయో వ్యాసుడు కానీ, కవిత్రయం కానీ ఆనాడే అంత చక్కగా చెప్పినా అలాంటి సమస్యలనే ఎదుర్కొనడానికి గల కారణం మన తలవాకిట భారతం ఉంటుంది. కానీ మనత లలో ఉండట్లేదు. పుస్తకం (భారతం) మస్తకంలో ఇంకి ఆచ రణలోకి వచ్చిన నాడు ఈ సమస్యలు పునరావృతం కాకుండా ఉంటాయి.

**ఆధార గ్రంథాలు :**

కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# ఛాత్రోపాధ్యాయుల దోష విశ్లేషణ

- **ప్రవాసీ చిన్నయ్య** మహాత్మా గాంధీ సంస్థ - మారిషస్.

ఉపాధ్యాయ శిక్షణ కోసం శిక్షణ కేంద్రానికి విచ్చేసిన పదిహేనుమంది ఛాత్రోపాధ్యాయుల భాషణ నైపుణ్యాన్ని సమీక్షించటానికి వాళ్లతో ఇష్టాగోష్ఠి సంభాషణ జరపటం జరిగింది. ఛాత్రోపాధ్యాయులకు స్పష్టంగా, ధైర్యంగా మాట్లాడేటట్లు చేయటానికి, ధారాళత వృద్ధి చేయటానికి సంభాషణలు ఉపయోగపడతాయని భావించబడింది. వాళ్లలో సంభాషణా చాతుర్యాన్ని పెంపొందింపజేయటం ఆవశ్యకం. దోషయుక్తమైన ఉచ్చారణగల ఛాత్రోపాధ్యాయులు తమకు తాము సరిదిద్దుకొని మాట్లాడేటట్టు ప్రయత్నించబడింది. ఛాత్రోపాధ్యాయుల గురించి, వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబం, ఇంట్లోని పెంపుడు జంతువులు, స్నేహితులు, ఇరుగుపొరుగులు, పరిసరాలు, వాళ్లపకు తెలిసిన పండగలు, ఉత్సవాలు మొదలైన వాటిని గురించి సమాచారాన్ని వాళ్ల నుంచి రాబట్టడానికి ప్రయత్నించబడింది. వాళ్లకు పరిచయమైన, ఆసక్తికరమైన అంశాలను, అభిరుచికి అనుగుణమైన అంశాలను, వాళ్లు నిత్యం చేసే అంశాలను గురించి విరివిగా నాలుగు/ఐదు నిమిషాల కాలంలో వాళ్లచేత మాట్లాడించే ప్రయత్నం చేయబడింది. వాళ్లను ప్రశంసించే ధోరణిలో సంభాషణలు కొనసాగించబడింది. విషయం సులభం అయినప్పటికీ, శిక్షణోపాధ్యాయులు మొదట తమ భావాలను వ్యక్తం చేయటానికి పొడి మాటలనే ఉపయోగించారని గమనించబడింది. రాను రాను చిన్న చిన్న వాక్యాల్లో సమాధానం చెప్పించే ప్రయత్నం చేశారు. కొందరి ఆలోచనల్లోగాని మాటల్లోగాని లేదా రెండింటిలోగాని నైపుణ్యం లేదనిపించింది. శిక్షణోపాధ్యాయులు అక్షర, పద, వాక్య, వ్యాకరణ, భావ వ్యక్తీకరణ దోషిఆలు చేశారు. టేప్ రికార్డర్ మీద రికార్డ్ చేయబడిన సంభాషణలను పరిశీలించినప్పుడు కొందరు విద్యార్థులు తెలుగు వాక్యాలు పూర్తిగా మాట్లాడినా, అది వాచకాలలో ఉపయోగించిన భాష కాదు అని స్పష్టంగా తెలుస్తుంది. ఎక్కువ ఆంగ్ల పదాలను వాడుకుంటూ తమ భావాలను వ్యక్తం చేయటానికి ప్రయత్నించారు. ఇంకా కొందరు క్రీయోల్ భాషా పదాల సహాయంతో మాట్లాడే ప్రయత్నం చేశారు. క్రీయోల్ మాతృభాషగా గల విద్యార్థులు, కొందరు తెలుగు భాషని అనర్గళంగా దోషరహితంగా మాట్లాడగలిగారు. పరిసరాల్లోనున్న ఫ్రెంచి, ఆంగ్ల భాషల ప్రభావం ఉన్నప్పటికీ ధారాళంగా మాట్లాడగలిగారు. కాని, వాళ్లు క్రీయోల్, ఆంగ్ల మరి ఫ్రెంచి మాధ్యమం ద్వారా వ్యవహరిస్తున్నారని చెప్పవచ్చు. వాళ్ల వ్యాకరణ, పదాంశాలు తెలుగు భాషకు సంబంధించినవి. కాని, ఉచ్చారణ మాత్రం క్రీయోల్, ఆంగ్ల మరి ఫ్రెంచి భాషలకు సంబంధించినది. కొందరు విద్యార్థులు కొన్ని పదాలు ఉపయోగించినా వాక్య నిర్మాణం తెలియకపోవటం వల్ల వాళ్ల సంభాషణలో పొడి పొడి మాటలు మాత్రమే కనిపించాయి. వాక్య నిర్మాణంలో ఎన్నెన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. భాష మీద అధికారం లేనందువల్ల చాలామంది మాట్లాడటానికి సంకోచించారు. ప్రతి విద్యార్థి తన అలవాట్లు కారణంగా వాక్యంలో ప్రయోగించబోఏ పదాల్ని తమ మాతృభాష అఇన క్రీయోల్ భాషలో ఊహించి తద్వారా మాట్లాడారని గమనించబడింది. తగిన వ్యక్తీకరణకు అవసరమైన పదాలు, వాక్య నిర్మాణాలు ఒకవేళ విద్యార్థులకు తెలియకుంటే, ముఖ్యోద్దేశాన్ని వ్యక్తీకరించేందుకు ఏదో ఒకవిధంగా తమకు తెలిసిన పదాల్ని ఉపయోగించి వెలిబుచ్చారని చెప్పవచ్చు. తరగతిగదిలో శిక్షణోపాధ్యాయులతో సంభాషణలు జరిగేటప్పుడు వాళ్ల మాటలలో దొర్లే దోషాలు గుర్తించబడ్డాయి. సంభాషణలో తప్పులు లేదా దోషాలు చేయటం చాలావరకు సహజం. ఒకవిధంగా చెప్పాలంటే అభ్యసన తక్కువగా జరుగుతున్నది అనటానికి ఆనవాలే దోషాలు.

This goes in line with Yule (2006. p.194) who is of the opinion that "one radical feature of most communicative approaches is the toleration of errors produced by students". He illustrates by saying that an error does not hinder the progress of a student but rather is a clue to the active learning process.

దోషాలు విద్యార్థుల అభ్యసనలో ఏర్పడిన లోపాలు. కాబట్టి కారణాలను కనిపెట్టి వాటిని తొలగించాల్సి ఉంది. భాషాపరమైన దోషాలు ఒక శిక్షణోపాధ్యాయుడు మాత్రమే చేయలేదు. ఒక జట్టు విద్యార్థులు మాత్రమే చేయలేదు. తరగతిగదిలో చాలామంది చేశారన్న అంశాన్ని గుర్తించబడింది. పలికేటప్పుడు ఒత్తుల ఉన్నచోట తీసివేయటం లేని చోట పలుకునట్లుగా తప్పు చేశారు. ఉచ్చారణ సమస్యలే కాకుండా పదాలు, పదబంధాలు, వాక్యాల మొదలైనవాటి మధ్య ఇవాల్సిన విరామాల సందర్భంలోనూ, ఊనిక, తానకల్పనలకు చెందిన సమస్యలు ఏర్పడ్డాయని పరిశీలించబడింది. కర్తకర్మ క్రియలతో కూడినటువంటి సంపూర్ణ వాక్యాలు చెప్పలేకపోయారు. కొన్ని సందర్భాల్లోను వాక్యాల్లో కర్తగాని, కర్మగాని లోపించాయి. ఛాత్రోపాధ్యాయుల కంఠస్వరాల్లో కూడా మార్పులు కనిపించాయి.

Sauvignon (2002.p. 13) shares the same opinion saying that native speakers are never "ideal" and in fact. vary widely in range and style of communicative abilities. Mistakes in subject-verb agreement often occur. verb endings are omitted very often with incorrect prepositions. Littlewood (1984, p. 88) supports this point by emphasizing on "yolerance of error in speaking which

appears to be common among majority of native speakers who are not irretrievably irritated by mistakes"

ఒకసారి ఆరోహణ స్వరంతో, ఇంకొకసారి అవరోహన స్వరంతో, మరోసారి ఆరోహణావరోహణ స్వరంతో తమ భావాలను వ్యక్తీకరించారు. అటువంటి సందర్భంలో వాళ్లను నిందించటం లేదా అపహాస్యం చేయకుండా అసలు వాళ్ల దోషాలకు గల కారణాలను తెలుసుకొని నివారణ చర్యలను చేపట్టబడ్డాయి. మందలించటం, ఎగతాళి చేయటం వల్ల వాళ్ల సంభాషణ ఆగిపోవటం జరిగిందొకసారి. మళ్లీ నోరు తెరవడానికి సమయం పట్టింది. కనుక తన సంభాషణలో తప్పులున్నాయి అనే భావం ఛాత్రోపాధ్యాయుల్లో కలగలేదనే రీతిలో సంభాషించబడేట్లు చేయబడింది.

తెలుగు భాషను కొంత చదవటం, రాయటం చేయవచ్చు గాని మాట్లాడటం మాత్రం అంత సులభం కాదని ఇష్టాగోష్ఠి సందర్భాన ఛాత్రోపాధ్యాయులందరు నొక్కి చెప్పారు. ప్రాథమిక స్థాయినించి ఎల్లప్పుడూ లేఖనం ద్వారానే వాళ్లు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే అలవాట్లను పెంచుకొన్నారని తెలిపారు. లేఖనం ద్వారానే పరీక్షల్లో సమాధానాలు రాసి తమ సామర్థ్యాన్ని నిరూపించుకొంటున్నారని చెప్పారు. మాట్లాడుతున్నప్పుడు ఎదుటి వ్యక్తికి వాళ్ల భావం స్పష్టంగా అర్థం కాలేదని గమనిస్తే మరోమారు చెప్పవలసి వస్తుంది. అవసరమైతే మళ్ళీ మళ్ళీ మాటలు మార్చి ఎదుటిఇ వ్యక్తికి అర్థం అయ్యేటట్లు చెప్పాల్సిందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కానీ రాసే రాసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉంటారు. వాళ్లు సరిగ్గానే రాస్తున్నారో అని చాలాసార్లు అనుమానం వస్తూ ఉంటుంది. ఈ అనుమానంవల్ల పొరపాట్లు కూడా దొర్లుతూ ఉంటాయి. ఎక్కువ సమయం ఉండటం వల్ల ఒకసారి రాసిన తర్వాత ఆ రాత ఎదుటి వారికి అర్థం కాకపోతే రాసినది దిద్దుకొనే అవకాలుంటాయి. తప్పులను సవరించి మరోసారి రాయవచ్చు. అయితే రాసేటప్పుడు లేని సమస్యలు కొన్ని మాట్లాడేటప్పుడు ఏర్పడుతూ ఉంటాయని తెలిపారు. వాళ్లు మాట్లాడే భాషలో ఎన్నెన్నో లోటుపాట్లును, తప్పొప్పుల్ని గమనించబడ్డాయి. వాళ్లు చేసే దోషాలను ఈ కింది విధంగా విభ జింపవచ్చు.

## ఒక ధ్వనికి మరో ధ్వనిని ప్రయోగించటం :

| | | | |
|---|---|---|---|
| 1) | డ | - | ద |
| | డంద | - | దండ |
| | దెబ్డతిను | - | దెబ్దతిను |
| | దురడృష్టంగా | - | దురదృష్టంగా |
| 2) | ద | - | డ |
| | పందగ | - | పండగ |
| | అక్కద | - | అక్కడ |
| | దృధనిర్ణయం | - | దృఢనిర్ణయం |
| 3) | ట | - | త |
| | అంటే | - | అంతే |
| | కోట | - | కోత |
| | పాటకాలం | - | పాతకాలం |
| 4) | త | - | ట |
| | వింతాను | - | వింటాను |
| | పాతలు | - | పాటలు |
| | కోతి | - | కోటి |
| 5) | ర | - | డ |
| | పరమర | - | పడమర |
| | గురికి | - | గుడికి |
| | దేవురు | - | దేవుడు |
| 6) | స | - | శ |
| | ప్రసంస | - | ప్రశంస |
| | స్రుంగారం | - | శృంగారం |
| | మనస్సాంతి | - | మనశ్శాంతి |
| 7) | ష | - | శ |
| | షబ్దం | - | శబ్దం |
| | శిషిరం | - | శిశిరం |
| | శషి | - | శశి |
| 8) | శ | - | ష |
| | ఆకర్శించు | - | ఆకర్షించు |
| | విశయం | - | విషయం |
| | విసేశం | - | విశేషం |

మాతృభాష జోక్యం వలన ఇది ఏర్పడుతున్నది. మూర్ధన్య ధ్వనులు క్రియోల్ లో లేనందున మూర్ధన్య, దంత్యాల మధ్య ఒకదానికి మరొకటి వాడుతున్నారు.

## క్రియారహిత వాక్యాలు - క్రియాసహితం చేయటం :

1) Collective pronoun = possessiveగా మార్చటం

**ఉదా:** (ఎ) నా తండ్రి ఒక డాక్టరుగా ఉన్నారు.

(బి) నేను ఒక అమ్మాయి(ని)/అబ్బాయి(ని). నేను రిష్మార్ గ్రామంనించి వస్తున్నాను I come from Richemare village ఇక్కడ తెలుగు భాషలో మా అన్న Collective pronoun ను ఉపయోగించటం సహజ లక్షణం. కానీ ఇక్కడ క్రియోల్‌లో (ఎఎ) ఎశీ అనే ప్రయోగం ఉంది. దీనికి సమానార్థకంగా 'నా' అనేది తెలుగులో ప్రయోగించారు. ఇది మాతృభాషా జోక్యం వలన కలిగిన దోషం. దీనికి తెలుగు భాషా లక్షణాన్ని వివరించి చెప్పి సవరించవచ్చు. ఇదేవిధంగా 'ఉన్నారు' అనే ప్రయోగం ఫ్రెంచి, ఆంగ్ల భాషా ప్రభావం వలన ఏర్పడినది. My father is doctor అని తెలుగు భాషలో అనువదించటం జరిగింది. అయితే

అనువాదం మూల భాష అయిన ఆంగ్ల భాష నుండి లక్ష్య భాష అయిన తెలుగులోనికి చేయబడింది. ఇందులో ఎఎ అనే ఆంగ్ల పదానికి "నా" అని అనువదించటం జరిగింది. కాని వ్యవహారానికి అందులో పై వాక్యానికి అసలే పొసగటం లేదు. కృత్రిమంగా ఉంది. ఇది వ్యావహారికి రీత్యా సమంజసమైందే. అనువాదంలో నూటికి నూరుపాళ్లు సమానార్థకాలు రావటమనేది అరుదుగా జరుగుతుంది.

**2) భాష నిర్మాణం :** సాంస్కృతిక అంశాలు: గౌరవవాచకాలు వాక్యానికి అసలు పొసగటం లేదు. కృత్రిమంగా ఉంది. ఇది వ్యావహారిక రీత్యా సమంజసమైందే. అనువాదంలో నూటికి నూరుపాళ్లు సమానార్థకాలు రావటమనేఎది అరుదుగా జరుగుతుంది.

2) **భాషనిర్మాణం :** సాంస్కృతిక అంశాలు : గౌరవవాచకాలు
**ఉదా :** (ఎ) నా ఇంట్లో అందరి కన్న నా తాత పెద్దవాడు (మా ఇంట్లో అందరి కన్న మా తాతగారు పెద్దవారు)

(బి) నా (మా) కుతుంబంలో నా (మా) తల్లితండ్రి (తల్లి దండ్రులు), అక్కచెల్లెళ్లు, తాతబాబమ్మ (లు-బహువచన ప్రత్యయం లోపించటం) ఉన్నారు. నా ఇల్లు (ఇంటి - ఔప విభక్తికాలు) వెనక నా (మా)బఅష్రీవ (పెద్దనాన్న), పెద్దమ్మ, తమ కుతుంబంతో జీవిస్తున్నారు. (ఉంటారు/ నివసిస్తారు).

(సి) నా (మా) అమ్మ నేను కానుకగా ఒక నల్లని బుజ్జి కుక్క ఇచ్చింది.

మనం తెలుగులో పేరుకు "గారు" అని చేరుస్తాం. ఆంగ్లంలో ప్రతి పేరుకు "గారు" చేర్చే అలవాటు లేదు. మధ్యమ పురుషలో "నీవు" కు బదులు మర్యాద సూచకంగా "మీరు" కాని ఆంగ్లంలో నిఎశిబు మాత్రమే వాడుకలో ఉంది. "మీరు" అనే మర్యాద సూచక పదం లేదు. తండ్రితోగాని, తాతగారితోగాని మాట్లాడేటప్పుడు కూడా "నీవు" అంటారు. మీరు, వారు అని ఒకే వ్యక్తి గురించి బహువచనం ఆంగ్లంలో వాడరు. గౌరవ సూచకంగా ఏకవచనాన్నే ప్రయోగిస్తారు.

**వాక్యనిర్మాణం :** - కర్మ
**ఉదా :** నిన్న నేను తిన్నాను చేపల కూర
(నిన్న నేను చేపల కూర తిన్నాను) (I ate fish curry yesterday)

తెలుగులో కర్మ వాక్యం చివరలో రాదు. ఇక్కడ అటువంటి ప్రయోగం ఆంగ్ల భాష ప్రభావం వలన ఏర్పడిన నిర్మాణ, ఆంగ్ల భాషలో వాక్య నిర్మాణం కర్త, క్రియ, కర్మ అనే క్రమంలో ఉంటుంది. కాని తెలుగులో కర్త, కర్మ, క్రియ అనే క్రమం ఉంటుంది. ఆంగ్ల వాక్యాల్ని ఆంగ్ల వాక్య నిర్మాణానుసారంగా తెలుగులో అనువదిస్తే అది తెలుగు వాక్య నిర్మాణానికి విరుద్ధమవుతుంది. కాబట్టి ఆంగ్ల వాక్య నిర్మాణాన్ని అనుసరించికాక, తెలుగు వాక్య నిర్మాణాన్ని అనుసరించి అనువదించటం సమంజసం.

## 1) వచనం - దోషాలు

కర్త బహువచనంలో ఉండగా క్రియాబంధంలో ఏకవచనంగా రాయటం:

ఉదా :

(ఎ) రకరకాల తాజా కూరగాయలూ పళ్లూ పూలూ తాజా మాంసాలూ చేపలూ (మొదలైనవి) దొరుకుతుంది. - (దొరుకుతాయి)

(బి) చీర, గౌను, టావలు, చొక్కా, లాగు, టోపి, దుప్పట్లు అన్నీ దొరుకుతుంది. (దొరుకుతాయి)

(సి) మా గ్రామంలో చాలా ఋఎఅశ్రీఱఅవం (సౌకర్యాలు) ఉంది - (ఉన్నాయి)

(డి) పాఠశాలకు opposite (ఎదురుగా) చిన్న ఆసుపత్రి, Government buildings (ప్రభుత్వ కార్యాలయాలు) ఉంది - (ఉన్నాయి)

(ఇ) తెలుగు, తమిళం, హిందీ అనేక భాషలు మాట్లాడే వారు ఉన్నాయి - (ఉన్నారు), మేం ఒక్కరే - (ఒక్కటే).

(ఎఫ్) నా కుక్కను బాగా చూస్తున్నాను. అందుకంటే నాకు కుక్క అంటే చాలా ఇష్టం - (కుక్కలు)

కర్త ఏకవచనంలో ఉన్నప్పుడు క్రియలో ఏకవచనం రావాలి. అయితే కర్మలు అనేకం ఉండటం వలన విద్యార్థులు బహువచనం రాస్తున్నారు. వర్గాన్ని సూచించేటప్పుడు బహువచనం వస్తుంది. కానీ ఏకవచనం రాదు.

## 2) భూతకాలానికి వర్తమానకాలం రాయటం :

ఉదా :

(ఎ) నిన్న శ్రీను బడికి పెందలకడనే వస్తున్నాడు - (వచ్చాడు)

(బి) పొద్దున అమ్మ వంట చేస్తున్నది - (చేసింది)

(సి) పోయినవారం పిల్లలు పుస్తకం చదువుతున్నారు - (చదివారు)

## 3) తద్ధర్మానికి బదులు భూతకాలం రాయటం :

ఉదా:

(ఎ) మా అమ్మ కుట్టుపని కూడా చేసింది - (చేస్తుంది)

(బి) పండగ ముందు మేం ఇంటిని అలంకరించాం - (అలంకరిస్తాం)

(సి) మేం పెందలకడనే లేచి, తలంటు స్నానం చేశాం - (చేస్తాం)

(డి) రంగురంగుల అందమైన ముగ్గులు వేశాం - (వేస్తాం)

(ఇ) అందరూ సహాయం చేశారు - (చేస్తారు)

(ఎఫ్) ఇంట్లో పూజ చేశాం - (చేస్తాం)

**4) తద్ధర్మానికి వర్తమాన ప్రత్యయాలను ఉపయోగించటం :**

ఉదా :

(ఎ) నేను ప్రతిరోజు పెందలకడనే లేస్తున్నాను - (లేస్తాను)

(బి) స్నానం చేసి, దేవుడిని పూజిస్తున్నాను - (పూజిస్తాను)

(సి) ప్రతి శుక్రవారం నేను గుడికి వెళ్లి, కీర్తనలు పాడుతున్నాను - (పాడుతాను)

(డి) మా అమ్మ ఉద్యోగం చేయటంలేదు - (చేయదు). ఇంటి పనులన్నీ చేస్తున్నది - (చేస్తుంది). చీపురుతో ఇంటిని స్వీప్ చేస్తున్నది - (చేస్తుంది)

(ఇ) నా ఇంటిలో ఎవరు తెలుగు మాట్లాడటంలేదు - (మాట్లాడరు/తెలుగుభాష రాదు) నా ఏరియాలో చాలామంది తెలుగువాళ్లు నివసిస్తున్నారు. - (నివసిస్తారు) వాళ్లు తెలుగు మాట్లాడటం లేదు. - (మాట్లాడరు)

(ఎఫ్) చిన్న ద్వీపాలు ఎందరో విదేశ యాత్రికులన ఆకర్శిస్తున్నాయి - ఆకర్శిస్తాయి.

**5) ప్రేరణార్థక క్రియకు బదులుగా సాధారణ క్రియ వాడటం :**

ఉదా :

(ఎ) అమ్మ పాపకు భోజనం (భోజనం - అన్నం) తింటుంది - (తినిపిస్తుంది)

(మారిషస్ దేశంలో వ్యక్తిగత (సన్నిహిత) సందర్భాలలో తెలుగుభాష వాడకం తక్కువగా ఉన్నందున గౌరవ సందర్భాలలో వాడటమే ఉన్నందున రెండు రకాల వ్యవహారాలు (అన్నం - భోజన) కనిపించవు)

(బి) తెలుగువాళ్లు ఒక పెద్ద మందిరం కట్టారు - (కట్టించారు)

**6) ఔపవిభక్తికాలు - దోషాలు :**

తెలుగులో ఇ, టి, తి లు ఔపవిభక్తిక ప్రత్యయాలు. విభక్తి ప్రత్యయాన్ని చేర్చటానికి ముందుగా కొన్ని పదాలకు చేరే ప్రత్యయాలు ఇవి ప్రయోగించటంలో సామర్థ్యం లేనప్పుడు దోషాలు ఏర్పడతాయి.

ఉదా :

(ఎ) నా ఇల్లు వెనక మా పెద్దనాన్న, పెద్దమ్మ ఉంటారు - (ఇంటి వెనక)

(బి) పక్షి గూడులో ఒక గుడ్డు ఉంది - (గూటిలో)

(సి) కుక్క నోరుకి దెబ్బ తగిలింది - (నోటికి)

**7) ద్వితీయా విభక్తి ప్రయోగం - దోషాలు :**

ఉదా:

(ఎ) పండగ ముందు ఇల్లంతా శుభ్రం చేసి ఇంటి (ని) అలంకరిస్తాం

(బి) నాన్నగారు అమ్మకు పిలిచాడు - (అమ్మను)

(సి) బాబు ఆ కుక్కకు కొట్టాడు - (కుక్కను)

**8) షష్ఠి విభక్తి ప్రయోగం - దోషాలు :**

షష్ఠి విభక్తి ప్రత్యయం వాడకపోవటం - ద్వితీయాను వాడబడటం

ఉదా :

(ఎ) ఆ రోజు తయారు చేసిన పొంగళ్లు దేవుడిని (కి) నైవేద్యంగా అర్పిస్తాం

(బి) చెట్టును పళ్లు ఉన్నాయి - (చెట్టుకు)

(సి) అమల తన మిత్రురాలిని ఫక్షను చేసింది - (మిత్రురాలికి)

**9) క్రియా విశేషం - దోషాలు :**

- గా

ఉదా :

(ఎ) పండగరోజు మేం చాలా సంతోషంతో ఉంటాం - (సంతోషంగా)

(బి) గుర్రపు పందెంలో గుర్రాలు వేగంతో పరుగెత్తుతాయి - (వేగంగా)

(సి) ఈ భవనం ఎత్తులో ఉంది - (ఎత్తుగా)

**10) Dative - ఉత్తమ పురుష సర్వనామాన్ని షష్ఠి విభక్తి ప్రత్యయం చేర్చటం లేదా ప్రయోగించటంలో దోషం చేయటం**

(ఏకవచనం) నాకు - నేను అని ప్రయోగించటం
(బహువచనం)మాకు - మేము
(బహువచనం) మనకు - మనము

ఉదా :

(1) నేను సహాయం చేస్తుంది - (నాకు సహాయం చేస్తుంది)

(2) నేను ఆకలి లేదు - (నాకు ఆకలి లేదు)

(3) మా అమ్మ నేను ఒక నల్లని బుజ్జి కుక్క ఇచ్చింద - (నాకు)

(4) మేం పుస్తకాలు లేవు - (మాకు)

(5) మనం ఉగాది పండగ ముఖ్యమైన పండగ - (మనకు)

**11) ఇతర భాషా పదాల ప్రయోగం :**

తెలుగులో వ్యక్తీకరించలేక ఆంగ్లంలో వివరించబడింది. మొత్తం వాక్యాన్ని ఆంగ్లంలో ప్రయోగించటం జరిగింది. ఆంగ్ల భాషా పద ప్రయోగాలు ఎక్కువ. ఇటువంటి పద ప్రయోగం మిశ్రమ భాషకి దారి తీస్తుంది.

ఉదా :

(1) మా ఊరికి మా పాఠశాల ఉంది. దూరంగా ఒక పెద్ద librairy ఉంది. librairy లో వెళ్లి newspapers, story

books చదవటానికి facilities ఉన్నాయి. (వార్తాపత్రికలు, కథల పుస్తకాలు చదివే సౌకర్యాలు), టెలిఫోను, వైఫై వంటి modern facilities (ఆధునిక వసతులు) కూడా ఉన్నాయి. పోస్టు ఆఫీసు, చిన్న బ్యాంకు కూడా ఉన్నాయి.

(2) మా నాన్న కారు tyreru puncture అయింది.

(3) తెలుగు సినిమాలు చూసినప్పుడు నేను subtitle చదువుతాను. పాటలు కూడా వింటాను. ప్రభాస్ అంటే నా favourite hero. బాహుబలి movie 5 times చూశాను.

(4) వాళ్లకు అరథం అయిన ..వచ్చిన తర్వాత ...వచ్చుwhen I see that they understand

(5) మన దేశంలో Hindus, Muslimlu (మహమ్మదీయులు), Christianslu (క్రైస్తవులు) మొదలైన అనేక జాతులకు చెందినవాళ్లు ఉన్నారు.

ఈ దోషాలు చేయటానికి ప్రాథమిక మాధ్యమిక స్థాయిల్లో భాషా బోధనలో ఉన్న లోపాలని, ఇతర కారణాలని కూడా కారణాలుగా గమనించడమైనది. "మాతృభాష, లక్ష్య భాషల ధ్వనుల్లో పోలికలుంటే అలాంటి ధ్వనుల ప్రయోగంలో విద్యార్థులకు మరింత కష్టం అవుతుందని శ్రీ నరసింహారావుగారు మరి శ్రీ పరంధామ రెడ్డిగారు (  ) అభిప్రాయపడ్డారు"

ఈవిధంగా ఛాత్రోపాధ్యాయులు విషయ, భాషాగతమైన అనేక దోషాలు చేస్తున్నారు. ఇవి శ్రద్ధ, శ్రవణ, పఠన అవగాహన లోపాల వల్ల జరిగేవి. వాటిని సరియైన రూపాలను ఛాత్రోపాధ్యాయులకు తెలుపటం ద్వారా తొలగించవచ్చు. కుశాగ్ర బుద్ధులను, సామాన్యులను మందబుద్ధులను దృష్టిలో ఉంచుకొని వేరు వేరు నియోజనాలను తయారు చేసుకొని వాటి ద్వారా కృషి జరిపిచి అభివృద్ధిని సాధించవచ్చు. పఠన శక్తిని బాగా పెంపొందించుకొంటే భాషణ శక్తి కూడా మరింత అభివృద్ధి అవుతుంది. ఈ రెండు బాగున్నపుడు లేఖనం చక్కబడుతుంది.

**ఉపయుక్తగ్రంథాలు :**


* నరసిహారావు, కె.వి.వి.యల్, పరంధామ రెడ్డి/యెమ్. (1993), భాషా బోధన పరీక్షణ మూల్యాంకనం. భారతీయ భాషా సంస్థ సిఐఎల్ మైసూరు.
* Littlewood, W.T. (1984), Foreign and Second Language Learning: Language Acquisition Research and its Implicatiions for the classroom, Cambridge: University Press.
* Sauvignon, S.J (2002), Interpreting Communicative Language Teaching: contexts and concerns in teacher education, London: Yale University Press.
* Yule, G. (2006), The Study of Language, (3rd editiion), Cambridge: Cambridge University Press.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# మహాభారతం : ద్రౌపతి వివాహం - పంచ భర్తృత్వం

- డా॥. పులపర్తి శ్రీనివాసరావు, పి.డి.ఎఫ్. సాల్కర్, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్టణం.

క్రీ:శ: 11వ శతాబ్ధంలో శ్రీకారం చుట్టుకొన్న ఆంధ్ర సాహిత్యం వయస్సు నేటికి వెయ్యేళ్ళు దాటింది. ఆంధ్ర కవితా జగతికి శకపురుషుడు నన్నయ్య. రాజ రాజనదేంద్రునికి ఆస్థానకవి. తన కాలానికి గానట బీనటగా ఉన్న తెలుగు మాగాణికి మునుము బెట్టి మహాకావ్య నిర్మాణానికి శంకురార్పణచేసి 'ఆది కవి' స్థానాన్నందుకొన్నాడు. తన రచనా వ్యాసంగానికి లక్షణం కూడా నిర్ణయించుకొని "శబ్ధశాసనుడు"గా ముద్రవేసుకున్నాడు.

వ్యాసమహర్షి "జయ" అను పేరుతో సంస్కృతంలో రాసిన ఇతిహాసాన్ని మహాభారతంగా కవిత్రయం వారాంధ్రీకరించారు. నిగమాగమ సారాన్ని పాత్రలద్వారా ప్రతిష్టించే ప్రయత్నం మూల కర్తది. దానిని కవిత్వీకరించే దృష్టి కవిత్రయానిది. ఏవో కొన్ని ప్రతేక్య విశేషాలు తప్ప మిగతా కవితా గుణం సామాన్య లక్ష ణంగా ఉంది. కవిత్రయం వారు ఒకే కలంతో రాశారా అన్నట్లుంది తెలుగు భారతం. ఆంధ్ర వాఙ్మయాన్ని సంస్కరించి సంస్కృత సంప్రదాయం నుండి పద్య విద్యా గంగను తెలుగులోకి ప్రవ హింపజేసిన నన్నయ బాణి ఆంధ్ర కవిత్వానికి ఒరవడి దిద్దింది అని చెప్పకతప్పదు.

అష్టాదశ పర్వాత్మకమైన భారతం విషయ ప్రాధాన్యం దృష్టా ఆది పంచకం, యుద్ధషట్కం, శాంతి సప్తకమని మూడు భాగాలు మొదటి భాగంలోని ఆది సభాపర్వాలు మఱియు ఆరణ్య పర్వం, చతుర్థాశ్వాసమందలి 142 శ్లోకాలను నన్నయ అనువదించాడు. తదాంధ్రీకరణకు నన్నయలో రాజరాజు చూసిన అర్హతలు ఇతివృత్త పరంగా, 1) ఆవిరళ జపహోమ తత్పరుడు: 2) లోకజ్ఞుడు, భాషా ఛందో వాహికల విషయంలో విపుల శబ్దశాస నుడు, ఉభయ భాషా కావ్య రచనాభి శోభితుడు భాష, భావం కావ్యానికి బాహ్యంతర భాగాలైతే మొదటి రెండు గుణాలు ఇతి వృత్తానికి, మిగిలిన రెండూ కావ్యశరీరానికి వర్తిస్తాయి.

జగద్ధిత కావ్యాని కుపకరణాలు "ప్రసన్న కథా కవితార్థ యుక్తి అక్షర రమ్యత: నానారుచిరార్థసూక్తిని దాని తత్వమును గుణత్రయంగా సూత్రీకరిచుకొని దానిని తన కవితా విధానముగా నన్వయించుకొన్నిడు నన్నయ ఇతని జగద్ధిత దృష్టి "విశ్వశ్రేయ: కావ్యమ్" సూక్తిలోని పరమార్థాన్ని నిరూపిస్తుంది.

జగద్ధితాన్ని భారతామ్నాయంలో ఎలా ప్రామాణికం చేశాడో పరిశీలించేటప్పుడు ఏది జగద్ధితం? అనే సంప్రశ్న ముత్పన్నం కాక మానదు. ఆ కావ్యం ఆవిర్భవించిన సమాజాన్ని అధ్యయనం చేయక తప్పదు. కవి, దృక్పథము కవితా సిద్ధాంతాల మేరకు పరిశీలించవలసి ఉంటుంది. మార్పులు, చేర్పులు అనువాదకుని కాలానికి పరిణమించిన, నాగరికతా వికాసం మీద ఆధారపడి ఉంటుంది.

శ్లో॥ ధర్మే చార్దేద కామేచ మోక్షచ బరతర్ష భ
యది హాస్తి తదన్యత్ర యన్నే హస్తిన తత్ క్వచిత్॥

అనే ఆదర్శం భగవద్గీతా తాత్వికతకి ప్రత్యక్ష ప్రమాణంగా భారతాన్ని రచించాడు వ్యాసుడు, భగవద్గీతకు మూలం వైదిక తత్త్వం. వ్యామని నుండి నన్నయ కాలానికి వందలయేళ్లు గడిచి, దేశకాల పరిస్థితుల్లో వ్యత్యాసాలేర్పడ్డాయి, అయినప్పటికీ,

"వివిధ వేద తత్వ వేది, వేద వ్యాసుడు
విశ్వ జనీనమై బరుగుచుండ జేసె భారతంబు" అని విశ్వసించే తత్వం నన్నయ్యలో కనిబడుతుంది. కావున అతడు చేసిన సవరణలు కవితౌచిత్యానికి దోహదం చేసేవిగాని పరమార్థం విషయంలో మాతృకకు, భాషాంతరీకరణకు ఏమాత్రం భేదం లేదు. ఇప్పుడు నన్నయ ఆశించిన జగద్ధితం వేద ప్రమాణమైందని స్పష్టమౌతున్నది. దానిని ఇతివృత్త పరంగా ప్రతిబింబించిన వైనం ముఖ్యముగా అది ఆవిష్కరించిన మహిళ "సామాజిక ప్రతిపత్తి" ఏ రూపంలో ఉందో సమీక్షిస్తూ, సాహిత్యపరంగా నన్నయకవితా వైభవాన్ని విశ్లేషించటం ఈ రచన ఉద్దేశ్యం,

నన్నయ భారత సంహితా రచనబంధురుడయ్యాడు, సంహిత అంటే ఇతిహాసం, కర్మఫల స్వరూపమైన వేదార్థాన్ని జీవి తంతో ప్రతి బింబించే వ్యక్తుల చరిత్రయే ఇతిహాస మని గుప్త పాదుల నిర్వచన్నాని గ్రహించవచ్చు.

## ద్రౌపది వివాహ మహోత్సవం:

మహాభారత కావ్య నాయిక ద్రౌపది, పతివ్రతయైన నాయి కకు ఐదుగురు వ్యక్తులను సమకూర్చి వారిలో ఏక నాయకత్వాన్ని నిరూపించడంలోనే కావ్యసందేశం నిక్షిప్తం చేయబడింది. బీజ ప్రాయమైన సందేశాన్ని తెలుగులో నాటి నన్నయ్య తన ప్రసన్న కథా కవితార్థయుక్తితో మెప్పించడం ప్రధానమైన విషయం. దాన్ని పరిశీలనాత్మకంగా చూస్తే అనేక విషయాలు ద్యోతకమవుతాయి.

ద్రౌపది స్వయంవర అనంతరం పాండువులు తమ మాతృ దేవీ సహితులై ద్రుపదుని మందిరంలో ఉన్నారు. ఒకనాడు వ్యాసుడు వారి సమక్షానికి వచ్చి యుధిష్టిరునితో వివాహాన్ని గూర్చి సూచిస్తూ -

"నేడు పుణ్య దినము నెమ్మితో రోహిణీ
యుక్తుడై శశాంకు డున్న వాడు
మంత్ర వంతయుగ క్రమంబున నేవురు
పెండ్లి యగుడు కృష్ణ బ్రీతితోడ". (1.ఆది.,7వ ఆ., 282వ ప.)

ఈ పద్యంలో 'నేడు' అనే ఎత్తుగడ వల్ల అందరూ మంచి రోజు కోసం వేచిఉన్నారని ధ్వనిస్తున్నది. భారతీయ సాంప్రదాయం ప్రకారం దినఫలం చూచి ముహూర్తం నిర్ణయించడం మన ఆచారం. నేటి విశేషం చంద్రుడు, రోహిణీ నక్షత్ర సమేతుడై ఉన్నాడు. కావున ఇది పుణ్య దినంగా భావించారు. 'పుణ్యదినము' అనే పద బంధమే ఇతిహాస వస్తువును దీపింపజేసేదిగా ఉంది. ఇటువంటి సమయంలో శాస్త్రోక్తంగా వివాహమడిన దంపతులు కూడా రోహిణీ చంద్రులలాగే అన్యోన్య దాంపత్య కలిగి ఉంటారనే ఆకాంక్షను వ్యాసుడు సూచించాడు. ఇది వాచ్యార్థం కంటె భిన్నమైన రమణీయ అర్థాంతరం, రోహిణి చంద్రుల దాంపత్యం వంటి దాంపత్యమే మీకు అలవడునుగాక అనే దీవెన ధ్వనింపజేయడం నన్నయ వ్యంగానికి, ప్రసన్న కథా కలితార్థయుక్తికి తార్కాణం. క్రమంగా ఐదుగురూ వివాహమాడవలసినది అని నిశ్చయించి పురాన్ని అష్ట శోధనంగా అలంకరించారు నవగోమయ శ్యోరుణంగా, హిరణ్మయ కల్యాణవేది సమిద్ధాగ్ని కుండములో నమర్చి ధౌమ్యాది విద్వద్భూసురులతో, నొప్పినంతటవివాహోచిత వేషాలతో, పాండవులు వధూచిత అలంకారాలతో, వని తాజన సహస్రంతో ద్రౌపది కళ్యాణ వేదిక ప్రవేశించగానే మంగళ వాద్యాలు మోగి, వివాహ ప్రయుక్త మంత్రాలతో ప్రదీప్త శిఖా ప్రదక్షిణం చేశారు.

"ఇట్లు వ్రేల్చిముందర ధర్మపుత్రునకు ద్రుపద రాజపుత్రిం బాణి గ్రహణంబు సేవించి - తొల్లి యేవురకు వివాహము సేయునప్పుడు కన్యాత్వంబు దూషితంబు గాకుండ ఈశ్వరు పరంబునం గౌమారత్వంబు పడసిన యక్కన్యకం గ్రమంబుగ భీమార్జున నకుల సహ దేవులకుంబాణి గ్రహణంబు సేయించిన"

పుష్ప వృష్టి కురిసి దేవ దుందుభులు మ్రోగుతాయి. మంగళసూత్రధారణ ప్రసక్తిలేదు. అప్పటికి పాణిగ్రహణంతో వివాహ తంతు పూర్తవుతుంది. ఇక్కడ ఉన్న ఇతిహాసిక సామాగ్రి అంతా తొల్లి - కన్యాత్వంబు దూషితంబు - కౌమారత్వంబు ఈశ్వరు వరంబు - అనే పదజాలంలో ఇమిడిఉంది. లౌకికంగా అయితే ధర్మరాజుతో పాణిగ్రహణం జరిగినతనే ద్రౌపది అతని గృహిణియై భీమాదులకు "వదిన" కావలసినది, వదినను వివాహ మాడడం సంప్రదాయ విరుద్ధం, దీనిని సంప్రదాయకంగా తలచడానికి చూపించిన కారణం "కౌమారికత్వవరం". తొల్లి అంటే పూర్వజన్మలో ద్రౌపది జన్మ వృత్తాంతం వివాహానికి కొంచెం ముందుగానే ద్రుపదునికి పంచేంద్రోపాఖ్యానం శీర్షికలో చెప్ప బడింది.

"కుడుచు నెడు వాని పెను వ్రేలు కూటిలోన
దునిసి పడియున్న వ్రేల్ పుచ్చి తోయజాక్షి
యేవగింపక యుచ్ఛిష్ట మిష్టలీల
దగిలి కుడుచుచున్నంత సత్తరుణి జూచి" ( 1.ఆది.,7వ ఆ., 258వ ప.)

పూర్తి తెలుగు పదాతతో గూడిన ఈ పద్యంలో యాజ్ఞసేనపతి భక్తి నిరూపితమౌతుంది. ఆతడు కుష్ఠురోగి భోజనంలోకి చేతి వేలు ఊడిపడింది. రోగిలేచి చేయి కడుగుకొని ఉంటాడు. యాజ్ఞసేని ఆ వేలిని తీసి అవతలవేసి అన్నాన్ని ఏమాత్రం ఏవగించుకోక ఆరగిస్తుంది. ఇష్టలీల దగిలి అనుపదంతో భర్త ఉచ్చిష్టమందలి ఆపేర్లను ఇనుమడింపచేసి చెప్పడం జరిగింది. తరుణి శబ్దమూ సార్థకమే, తగుణ వాంఛలేవి అంటనీయక భయంకర వ్యాధి పీడతుడైన భర్తనారాధిస్తుంది. వ్యాధిగ్రస్తుని ఈ ఆరాధన కర్మ వశంగా పైన పేర్కొనబడింది. కావున ఆమెకు అప్పటికొక జన్మ గడిచినట్లు తెలియవస్తుంది. ఉచ్ఛిష్టాన్ని భుజిస్తున్న యాజ్ఞసేనపతి భక్తి మెచ్చి మౌద్గల్యుడు వరం కోరమంటాడు.

"మనోహరంబయిన రూపంబున పంచధా విభక్తుండవయి (ఐదుగురెందుకో) కామోపభోగంబులదనుపు" మనికోరింది ఆమెకు ఇష్టమైన విధంగా అనేక సహస్ర వర్షంబులామెను ఉపభోగించి (తనను "దనుపు" మని ఆమె కోరితే అతడు "తృప్తుడై" బ్రహ్మలోకానికి వెళ్లిపోతాడు. ఆమె కాలవశమున శరీరాన్ని విడిచి కాశీ రాజను రాజర్షికి పుట్టి పతిని కోరి పశుపతిని ఉద్దేశించి ఉగ్రతపస్సు చేయుచుండగాన,

"దానికడకు ప్రత్యేకంబ! ధర్మ వాయు
3 నాస 4-5 వాస్వినుల్ ప్రీతులై వచ్చిదాని
నాత్మ దేహం శంజులకు దేహంతరమున"
పత్నిగాగోరి రధికీ సౌభాగ్యయుక్తి ( 1.ఆది.,7వ ఆ., 260 వ ప.)

నన్నయ గారి కవితా శైలి అయిన నానారుచిరార్థసూక్తి నిధిత్వం ఇచ్చట నిక్షిప్తమైఉంది. వాచ్యార్థకంటె మిక్కిలిగా మనోహరమైన మరొక భావాన్ని స్ఫురింపజేసింది. వ్యంగ్యవైభవం తలపిస్తుంది కన్య. కోరబడేది కన్య. 1 ఆమె వద్దకు ధర్మవాయు వాసవాదులేవురువచ్చి తమ అంశ సంభవులైన వారికి దేహాంతరాలలో భార్యవుకమ్మని కోరుతారు. అందుచేత జన్మించడం దేవతాధర్మం మరియు కర్మఫల రూపానికిది అనుబంధ సంధాయకం కూడా.

ఆమె తపస్సు తీవ్రతరం చేసిన తర్వాత ఈశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటాడు. ఆకన్యక (ఆమె పేరు లేదు.) పతి దానం ప్రసాదింపుమని ఐదు మారులు వేడిన నేవురు పతులు దేహాంతరమున (ఈ దేహమున ఇవ్వలేడేమో) అవుతారని వరమిస్తాడు ఈశ్వరుడు. పంచధావిభక్తుడనై రమ్మని వెనుక జన్మలో తాను కోరినది జన్మల రాపిడిలో మరచినట్లుంది.

'పతులు పలువురౌవుట' అంటూ అతని వరాన్ని త్రిప్పికొట్టే ప్రయత్నం చేస్తుంది. కానీ చివరకు అంగీకరించి

నాకు కౌమారంబును : (పతివ్రతలు కోరదగిందదొక్కటే కనుక) పతి శుశ్రూషము కోరుకొంది. ద్రౌపతి వివాహ కర్మకాండలో విదితమైన ప్రస్తుత కౌమారత్వానికి పూర్వ జన్మ సంబంధం ఇలా

జోడించబడింది, ఇలా కర్మఫల రూపం పతత్రు హృదయ రంజకంగా నిర్ధారించబడటం నన్నయ ప్రసన్న కథా కలితార్థ యుక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు.

కావ్యం ప్రభవించిన నాటి సమాజంలో కవిదృక్పథం ప్రకారం జన్మలు, కర్మలు, సమర్థనీయమైన కావ్యం దీని నిర్దోష మైనది సమాజంలో స్త్రీకి పాతివ్రత్యం ప్రధాన మూల్యం, పతి శుశ్రూష విధ్యుక్త ధర్మం, ద్రౌపది కోరి వరం తీసుకుని వివాహ అనంతరం చేసింది కూడా పతి శుశ్రూష.

శ్లో॥ చతురు ధరి వలయ నిఖల
క్షితి తల సామ్రాజ్య లక్ష్మిని మూలంబై
సతి యాజ్ఞసేని పతులకు
సతి ముద మొనరించె తుల్యమగు శుశ్రూషన్.

నిరాశ్రయులైన స్థితిలో ద్రౌపది లభించడం పాండవులకు శ్రీమయ భవితన్యానికి ఆధారం ఆమె తానా గర్వేశ్వరియైనా పతులందరికీ సమానంగా సేవలు చేసింది. మనవాళ్ళు దాంపత్య ధర్మములో పతి శుశ్రూష స్త్రీకి విధించినట్లు గతి తార్కిక దృష్టికి చిక్కకపోదు, ఈనాటికీ పాటించబడుతున్న "ఉచ్ఛిష్ట" భోజనం ఆనాడు స్థిరబడ్డ దోపిడి సంప్రదాయమని బోధపడక మానదు మనిషికి మనిషి దాస్యం చేసే స్థితి దోపిడికి అస్కారమిచ్చెనని గ్రహించవచ్చు.

## పంచ భర్తృత్వం :

ద్రౌపది పంచభర్తృత్వాన్ని నివారించడానికి ద్రుపదుడు మొదట విఫలయత్నం చేస్తాడు. స్వయంవర విజేత అర్జునుడు కావున అతనితో వివాహం జరిపించమంటాడు. నేను భీముడు ఉండగా అర్జునుడు వివాహితుడగుట ధర్మవిరుద్ధమని ధర్మరాజు అభ్యంతరం తెలుపుతాడు. అలా అయితే ఈమెను నీవే వివాహ మాడమని సూచిస్తాడు. కానీ ధర్మరాజు తమ మాతృవియోగాన్ని వ్యాజం చేసి ఐదుగురం కలసి పెళ్ళాడతామంటాడు. ఇది ద్రుపదునికి నచ్చలేదు.

"విమలమతి యన్యులకు విష
యమె ధర్మా ధర్మ నిర్ణయము సేయగది
వ్య మునీంద్ర దీని సువిచా
రము చేయుము ధర్మ సంకరము గాకుండన్"

ఈ పద్యం కూడా నన్నయ అక్షర రమ్యతకు నిదర్శనంగా చెప్పవచ్చు. విమలమతి శబ్దంతో ధర్మజని స్వార్థాన్ని దెప్పిపొడవడం కనిపిస్తుంది. 'అన్యులకు' అనే పదం అర్థాంతన్యాసాత్మకంగా ధ్వనిస్తుంది. 'ధర్మాధర్మ నిర్ణయము' 'సువిచారము', 'ధర్మసంకరము' అను మృదువర్ణాణాత్మక శబ్దాల ద్వారా దృష్టిని ఆనాటి వివాహ సంద్రాయం వైపు మరల్చేలా చేశాడు.'దివ్య మునీంద్ర' సంబోధనతో వ్యాసుని ధర్మనిర్ణయ వైదగ్ధ్యాన్ని ధృవ పరిచినట్లు ఉంది. ధర్మజుని ప్రతిపాదనలోని అసమంజస్యాన్ని బట్టబయలుగా చూపి దానిని నివారించే నిర్ణయం ఇవ్వమని వ్యాసుని కోరుతాడు ద్రపదుడు. ధర్మరాజు అంతటితో వదలక-

"తొల్లి గౌతముండైన జటిలుడను ఋషకూతురు తప:
ప్రభావంబున నేడ్వురు ఋషులకు ఒక్కతియ భార్యయయ్యె."

"దాక్షాయణి యను మునికన్య ప్రచేతసులనంబడిన పదుండ్రకు ఒక్కతియే భార్య యయ్యెని కథల వినంబడు" (1.ఆది.,7వ ఆ., 260 వ ప.) అని తానెరిగిన యుదంతాలు వివరిస్తాడు వ్యాసుడు.

నితంతడనే రాజర్షికొడులు 1. సాల్వేయ, 2. శూరసేన, 3. శృతసేన, 4. బిందుసార, 5. అతిసారులను ఐదుగురు నౌశీ నరపతి కన్యయైన 'అజిత' అనే ఆమెను పెళ్ళాడి వేరు వేరుగా సంతానంపొంది కులవృద్ధి చేశారు. 'తొల్లింటి మహాత్ముల యుందును ఇట్టి చరితంబులు గలవు' అని ద్రుపదునికి తెలియజేసి ద్రౌపది పంచభర్త ృకత్వాన్ని ఖాయపరుస్తాడు. ఇక వైవస్వతుని సత్రయాగ ఫలితంగా అప్రాప్తమరణితులైన మానవులను మర్త్యులను చేయటానికి పంచేంద్రులుగా జన్మింపనున్న ఇంద్రుని ఉదాంతం పంచ భర్తృకత్వానికి మద్దతుగా ఎలాగో ఉంది. కావున ఇది అనివార్యమైంది. కారణభూతంగా ఉన్న ఈ కార్యానికి అన్ని వైపుల నుండి విధి సహకరిస్తుంది. పెద్దల నిర్ణయాన్ని శిరసావహించిన స్త్రీ మూర్తిగా ద్రౌపదిని తీర్చిదిద్దటంలో నన్నయ కృతకృతుడైయ్యాడని చెప్పకతప్పదు. విధి విధానానికి కన్య బానిస కాగా, స్వయంవర హక్కులు నామమాత్రమైనాయి. 'కర్మ' సారధ్యం వహించిన సమాజంలో కన్య ఇష్టా ఇష్టాలు ప్రసక్తి ఉండదు. స్త్రీ వ్యక్తిత్వస్థాయి ఏంటో మన దృష్టికందకపోదు. యమవాయ శక్రాశ్వనులు పాండవుల రూపంలో ద్రౌపదికి భర్తలయ్యారేగాని పాండవులైదుగురూ ఒకతల్లి బిడ్డలు కారనే విషయాన్ని గ్రహించాలి.

సంతానం స్త్రీదిగా పరిగణించబడడం మాతృస్వామ్య వ్యవస్థ లక్షణం.గాంగేయుడు కౌంతేయులు, రాధేయుడు ఇలాంటి వారు పురుష ప్రాధాన్యం లేనందున కుటుంబంలోని అన్నదమ్ములందరికీ ఒకే భార్యవచ్చే ఆచారం కొంత కాలం రాజ్యమేలిన మాట వాస్తవమే.

తదనంతర కాలంలో సంతానోత్పత్తిలో పురుషుని ప్రేమేయం గుర్తించబడడంతో వారసత్వం పితృస్వామ్యానికి మారింది. సంతానం సంకరం కాకుండ ఉండటానికే పాతివ్రత్యం విలువగా విధించబడింది. దీని ప్రకారం స్త్రీకి ఒక్కడే భర్త. దీనికి విరుద్ధంగా గత వ్యవస్థలోని బహు భర్తృత్వాన్ని పాటించడంవల్ల ద్రౌపదిని సమాకాలిక సమాజం వేలెత్తి చూపింది. 'పంచ భర్తృక', 'భంధకి,' అనే పేర్లతో అనేకులు అనేక విధాలుగా ఆమెను ఎద్దేవ చేయడం గమనించిన విషయం.

ఒకానొక సందర్భంలో శిశుపాలుడు 'నీ 'మగలకు' క్షేమమా' అని బహువచన ప్రయోగంతో ఎత్తిపొడుస్తూ హేళన చేస్తాడు

"ఈవచ్చు రథంబులపై
నేవురు నీ మగలె అంబుజేక్షణ వీరిన్
భావించి ఎవ్వడవ్వం
డే విధమున వాడు చెప్పుమ వినగా వలయున్"

అంటూ పచ్చిగా వెటకరిస్తాడు. సమాజంలో కర్మ సామాన్యమై జన్మలు, కర్మలు నిరూపతమౌతుంటే, వీరి దాంపత్యం ఎందుకు ఆవహేళనలకు గురవుతుంది. ఒకవేళ తపశ్శక్తి అయితే సమకాలీన సమాజం తప్పు పట్టవలసిన అవసరం ఏముంది? కావున ఇందులో సామజిక వాస్తవికత కనిపించలేదు. వేదాల్లో చెప్పబడ్డ జన్మ, కర్మల విశ్వాసం మీద కల్పనా ప్రక్రియలో అల్లబడిన కావ్యం భారతం ఆ దృష్టితో ఇది ఉత్తమ గ్రంథం. కాని దీనిని యథా తథంగా విశ్వసించడం, అనుసరించడం ఈ ఇరవయ్యో శతాబ్దానికి కుదరదు. పైగా మనుషులు అమర్త్యులైతే వారికి, దేవతలకు భేదం లేదు. కావున ఇది నేటి సమాజానికి అంగీకారయోగ్యం కాదు. కానీ ఆనాటి సమాజానికి నూటికి నూరు పాళ్ళు సమంజసమే. కాబట్టి నన్నయ్య మనస్తత్వాన్ని కూడా అంగీకరించవలసిందే.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర- కొర్లపాటి శ్రీరామమూర్తి
2. ఆంధ్ర మహాభారతం - టి.టి.డి. ప్రచురణలు
3. నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి- విశ్వనాథ సత్యనారాయణ

❁❁❁

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# ప్రబంధయుగ సాహిత్యంపై శ్రీనాథయుగ సాహిత్య ప్రభావం

- రొంభట్ల వేంకటరాయశర్మ, పరిశోధకవిద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

"నానద్యత నవత్ క్రియా ప్రబంధ సామీప్యయోః"

- అష్టాధ్యాయి. అధ్యా. 3 పాద-3 సూ-1651.

క్రీ.పూ. 7 వ శతాబ్దిలో పాణిని అష్టాధ్యాయిలోనిదీ సూత్రం. "ప్రబంధ" శబ్దం ప్రప్రథమంగా ఇందులోనే కనిపిస్తోంది. తెలుగులో ప్రబంధాలు పదహారవ శతాబ్దంలో పుట్టి పరిపూర్ణ వికాసాన్ని పొందినట్లు సాహిత్య చరిత్రలు తెలియజేస్తున్నాయి. ప్రబంధ శబ్దం మాత్రం నన్నెచోడుడి నాటి నుండి తెలుగులో కనబడుతోంది. తరువాత తిక్కన, ఎర్రన వంటి కవులు ప్రయోగించారు. కాలక్రమంలో ప్రబంధ శబ్దం కావ్యానికి సంబంధిగా ప్రయోగింపబడింది.

ప్రాచీనాంధ్ర సాహిత్యంలో "శ్రీనాథ యుగం" ఆరవది. ఈ యుగానికే కావ్యయుగమని, పూర్వ ప్రబంధ యుగమని కూడా పేర్లు. ఈ యుగంలో వెలసిన కావ్యాలలో ప్రబంధ చాయలు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలతో ఉన్న కథావస్తువులను గ్రహించి, తదనంతర ప్రబంధ కవులు ప్రబంధాలుగా తీర్చిదిద్దారు. అలాగే కావ్య యుగ కవులను అనుసరించిన ప్రబంధ కవులు ఉన్నారు.

శ్రీనాథ యుగాన్నే ప్రబంధ పూర్వ యుగమని చెప్ప వచ్చును. ఈ యుగంలో కొంత భాగం అనువాదంగా మరికొంత స్వతంత్రంగా ఇంకొక కొంత యథోచితానుసరణంగా సాహిత్యం నానావిధాలుగా ఆవిర్భవించింది. ఈ యుగంలోమహాకవుల ప్రయత్నాలన్నీ ప్రబంధ రచనోన్ముఖాలుగానే పరిణమించాయి. ప్రబంధ ప్రక్రియకు తగిన దోహదమంతా ఈ యుగంలోనే ఏర్పడింది. శ్రీనాథుడు ప్రబంధ కవితా మార్గానికి ఆచార్యుడు. "విద్వదౌషధం" అనదగిన శ్రీహర్షుడి నైషధ చరితాన్ని శృంగార నైషధంగా తెనిగించాడు. కాశీఖండంలో సూర్య రథ వర్ణనా సందర్భంలో మయూరుడి శ్లోకాలను ఆంధ్రీకరించాడు. సంస్కృత శ్లోకాలను తెనిగించడంలో ప్రబంధ కవులకు శ్రీనాథుడే మార్గదర్శకుడు. ప్రబంధ శయ్యకు శ్రీనాథుడు మెరుగులు దిద్దాడు. అనువాద పద్ధతిలో క్రొత్త తెన్నులు, శైలిలో అలంకారిత, భావాలలో భక్తి శృంగారార్ద్రత అనే గుణాలను శ్రీనాథుడు తరవాతి ప్రబంధ యుగంలో కవులకు ప్రసాదించాడు. పినవీరన మొదలైన సమకాలీన కవులు శ్రీనాథుడి అడుగుజాడలను అనుసరించి పద్య రచన చేశారు.

ఈ యుగంలో పురాణాల్లో సైతం ప్రబంధావయాలైన రసోత్కర్ష వర్ణనా బాహుళ్యం, అలంకార ప్రియత్వం నెలకొన్నాయి. వరాహ పురాణ కర్తలు, పురాణ ఫక్కి కంటె ప్రబంధ ధోరణినే ఆదరించారు. ఈ యుగ కవులలో జక్కన, పినవీరభద్రకవి పోతన మొదలైనవారు రమణీయమైన శయ్యకై ప్రయత్నించారు. తర్వాతి కాలంలో ప్రబంధ కవులలో ప్రముఖులైన వారు శ్రీనాథుడి శైలినే అనుకరించారు.

కావ్యయుగంలో శ్రీనాథుడు, పిల్లలమర్రి పినవీరన, జక్కన, గౌరన అనంతామాత్యుడు, నందిమల్లయ, ఘంటసింగనలు తమ కావ్యాలను ప్రబంధ లక్షణాలతో రచించారు. ఈ శయ్యను తదనంతర కవులు అనుసరించారు. అలాగే శ్రీనాథ యుగ కవుల ప్రయోగాలను కూడా అనుసరించిన ప్రబంధ కవులున్నారు. అష్టాదశ వర్ణనలు కావ్యాలలో ఉండాలని కొరవి గోపరాజు తన సింహాసన ద్వాత్రింశికలో ఇలా చెప్పాడు.

కం. పుర మధు జలలీలాంబుధి
పరిణయ నయ విప్రలంభ పతిగుణ సుత భా
స్కర చంద్రోదయ రణగతి
గిరి వన దూతర్తు రతులగ నృతి చెప్పదగన్

(సింహాసన ద్వాత్రింశిక ప. 37)

నన్నెచోడ, రామరాజ భూషణులకు మధ్య కావ్య యుగంలో ప్రబంధ లక్షణాలు చెప్పిన కవి కొరవి గోపరాజు. ఈ అష్టాదశ వర్ణనలో ముఖ్యమైన నగరవర్ణన, సముద్రం, ఋతు వర్ణన, చంద్రోదయ వర్ణన, సూర్యోదయ వర్ణన, ఉద్యానవనం, సలిలక్రీడ, వివాహం ,కుమారోదయం మొదలైన వర్ణనలను కావ్య యుగ కవులు తమ కావ్యాల్లో చేశారు. నగర వర్ణనలో నానా అలంకారాలతో సంప్రదాయానుసారంగా, కోట, అగడ్తలు, దేవాలయాలు, బ్రాహ్మణ, క్షత్రియ వీర భటులు, పురస్త్రీలు, విటులు ఉద్యాన వనాలు, భవనాలను, గర్భవతి లక్షణాలు, శ్రీనాథుడు తనకావ్యాలలోనూ జక్కన విక్రమార్క చరిత్ర లోనూ పుర వర్ణన అనంతామాత్యుడి భోజరాజీయంలోనూ, పిల్లలమర్రి పినవీరన శృంగార శాకుంతలంలోనూ ఉన్నాయి. పినవీరన, గౌరనలు చేసిన వేట వర్ణనను పెద్దనాదులు అనుసరించారు. వరాహపురాణంలోని దుర్జయోపాఖ్యానం, రెండాశ్వాసాలలో ఉన్న స్వతంత్ర ప్రబంధాన్ని తలపిస్తుంది. ఇందులో అష్టాదశ వర్ణనలు ఉన్నాయి. నాయక విరహవ్యథ, శీతలోపచారాలు, మన్మథుణ్ణి, చంద్రుణ్ణి నిందించటం కావ్య యుగం నుండే ప్రబంధ యుగానికి సంక్రమించాయి. ఈ అనుసరణ మూడు రకాలుగా కనిపిస్తోంది. 1. భావానుసరణ, 2. పద్యానుసరణ, 3. కథానుసరణ.

### 1. భావానుసరణ :

ఆంధ్ర కవితాపితామహుడైన అల్లసాని పెద్దన రచించిన

స్వారోచిష మనుసంభవం అనే "మను చరిత్ర" ప్రబంధంలో పూర్వకవుల శైలిని, పదబంధాలను పద్యం ఎత్తుగడలను అనుసరించాడు. అందులో కావ్య యుగ కవుల పద్యాలనే ఎక్కువగా అనుసరించాడు. వాటిని పరిశీలిస్తే మను చరిత్ర పీఠికలో పెద్దన చేసిన వినాయక ప్రార్థనలో...

ఉ. అంకము జేరి శైల తనయా స్తన దుగ్ధములానువేళ బా
ల్యాంక విచేష్ట దొండమున నవ్వలి చన్ గబళింపబోయి యా
............................................ (మనుచరిత్ర పీఠిక ప. 4)

మాతృ స్తన్యపానం చేస్తున్న గజాస్యుడి బాల్య చేష్టలను వర్ణిస్తూ ప్రార్థించాడు. అయితే కావ్యయుగ కవి అయిన పిల్లలమర్రి పినవీరన, తన శృంగార శాకుంతలంలో,

మ. జననీ స్తన్యము గ్రోలచుం జరణక జాతంబునణ్ గింకిణీ
స్వన మింపారగ,దల్లి మేన మృదుల స్పర్శంబుగా దొండమ
ల్లన నాడించుచు జొక్కు విఘ్నతి ......... ( శృం. శా. ఆ.1. ప.4)

అని మత్తేభంలో ప్రార్థించి వృత్తౌచిత్యాన్ని పాటించాడు. శ్రీనాథుడి నుండి భావాలను గ్రహించిన ప్రబంధ కవులలో పెద్దన అగ్రగణ్యుడు. శృంగార నైషధం, కాశీఖండం, భీమఖండం, హర విలాసం, కావ్యాలలోని భావాలను మనుచరిత్రలో సందర్భాను సారంగా ఉపయోగించాడు పెద్దన. ఉదాహరణకు హరవిలాసం 6,7, ఆశ్వాసాలలో నఖపంచ, కసటువో, బీరెండ, నడికిరేయి- అనే పదాలున్నాయి. వీటిని పెద్దన కూడా మనుచరిత్రలో వాడాడు. భోజరాజీయం (1-47), విక్రమార్కచరిత్ర( 1-114) ను కూడా పెద్దన ( 2-99), (1-148) అనుసరించాడు.

## 2) పద్యానుసరణ :

### సింహాసనద్వాత్రింశిక :

శ్రీనాథయుగ కవుల పద్యాలను ప్రబంధ యుగంలో అనుసరించారు. ఈ అనుసరణలో పెద్దన ముందున్నాడు. సింహాసనద్వాత్రింశికలో కొరవి గోపరాజు మలయవతి వీణాగాన వర్ణనకు, కొంతవరకు వరూధిని వీణాగాన వర్ణనకు సామ్యం ఉంది. విక్రమార్కుడు ఇంద్రకీల పర్వతానికి వెళ్ళిన సందర్భంలో గోపరాజువర్ణించిన పద్య శైలిని ప్రవరుడు హిమాలయానికి వెళ్ళిన సందర్భంలో పెద్దన గ్రహించాడు.

చం. అటజని కాంచె భూవరుడర్జున సిద్ధి తపోనుకూలమున్
గుటిల కిటి ద్విపారి మద కుంజర సేవిత సానుకూలమున్
జటుల గుణచ్చటారటిత సంయమిరక్షణ పుణ్య శీలమ్మొ
గటక మణిద్యుతి ప్రకటకందర కూలము నింద్రకీలమున్
(సిం. ద్వా. 10-157)

దీనినే పెద్దన -

అటజని కాంచె భూమిసురుడంబరుచుంబి శిర సాజరీ
..........................................................
కటక చరత్కరేణుకర కంపిత సాలము శీత శైలమున్ (మను 2-3)

పెద్దన ఈ పద్యాన్ని గోపరాజు వలె ప్రారంభించి, అను ప్రాసలతో ముగించినా" అంబరచుంబి" మొదలుగా ఒక పెద్ద సమాసాన్ని "శబ్దధ్వని" ప్రధానంగా విసిరి పద్యశైలికి పరిపుష్టి కలిగించాడు.

### శృంగార శాకుంతలం :

దుష్యంతుడు వేటకు బయలుదేరుతున్నట్లు చాటింపు వినగానే వేటగాళ్లు తెచ్చిన వేటకుక్కల పేర్లను పిన వీరభద్రుడు, శృంగార శాకుంతలంలో ఈ క్రింది పద్యంలో చెప్పాడు.

పులిమల్లడడవి పోతులరాజు గరుడుండు గాలి వేగంబు పందేల పసిడి
విష్ణుప్రసాదంబు వేడి గుండులు పరిపచ్చిమిర్యము వెర్రి పుచ్చకాయ
వేటమాణిక్యంబు బిరవాది మెడబల్మి పెట్టుగాడు వకారి పిడుగు తునా
జగురుండు చిత్రాంగి శ్రీరాముబాణంబు పులియుండు కస్తూరి బొడ్డుమల్లె
(శృం.శా.ఆ.1- 108)

మనుచరిత్రలో స్వరోచి వేట సన్నాహ వర్ణనా సందర్భంలో అల్లసాని పెద్దన పై వర్ణనను పొల్లుపోకుండా ఎలా అనుసరించాడో చూడండి.

చం. పులియడు బూచిగాడు సురపోతుల రాజును మంతిగాడు చెం
గలువ సివంగి భైరవుడు గత్తెర సంపగి వెండి గుండు మ
ల్లెలగుది వాయువేగి చిటిలింగడు సాళ్వడు వత్సనాభి యే
కలముల మిల్తి గచ్చియన గాగల వాని గ్రహించి యుద్ధతిన్

శృంగార శాకుంతలంలో తృతీయాశ్వాసంలో దుష్యంతుడు శకుంతల నుండి వీడ్కోలు తీసుకుంటున్న సందర్భంలో పినవీరన పద్యం -

గిరిజావిభుండు ముంగిట పెన్నిధానంబు
కృత్తివాసుండు "తంగేటి జున్ను " (శృం.శా.ఆ.4-4)

మనుచరిత్రలో తృతీయాశ్వాసంలో మాయాప్రవరుడు వరూధుని నుండి వీడ్కోలు తీసుకున్న సందర్భంలో పెద్దన

"కేల కున్న తంగేటిజున్ను గృహమేధి
యజమానుడంకస్థితార్థపేటి" (మను.చ 1 )

### వరాహపురాణం :

పుష్పాపచయ రగడ (ఆ. 3 ప.92) ను మొట్టమొదట ఈసందర్భంలో వాడిన వారు నందిమల్లయ, ఘంట సింగయలు. ఈ జంట కవులను అనుసరించి, పెద్దన తిమ్మనలు ఈ సందర్భంలో ఇలాగే రగడలు రాశారు. అలాగే మరో సందర్భంలో వరాహపురాణంలో .... చాలను దుఃఖితేమనసి సర్వమసహ్యామటం బెరుంగరే (ఆ.12.ప- 65) మనుచరిత్రలో ... అనాశ్వాసిత దుఃఖితేమనసి సర్వమసహ్యమనా నెరుంగనే (మను. చ. ఆ. 3- ప-99) గా అనుసరించాడు.

మనుచరిత్ర నాల్గవ ఆశ్వాసంలో మనోరమను, ఋషి కోపగించుకున్న సందర్భంలోని ఈ క్రింది పద్యం.

ఉ. ఓసి దురాత్మురాల గృహమొల్లక సర్వసుఖంబులన్ నిరా

యాసమునన్ దొరగి మిహిరాంశు మరుచ్చద నీరనీరస
............................................ ( మను. చ. ఆ. 4-.82)

వరాహపురాణంలో ధర్మవ్యాధోపాఖ్యానంలో ధర్మ వ్యాధుడి కూతురైన అర్జునకిని అత్తగారు కోపగించుకున్న సందర్భంలో జంటకవులు చెప్పిన పద్యమిదిగో-

ఉ. ఓసి దురాత్మురాల! మృగయూదములన్ మొరవెట్టగా మెడల్
గోసి వధించు పాతకుని కూతుర ! బుద్ధులు చెప్పి చెప్పినే
.............................................- ( వ.పు. ఆ. 2-.133)

## పద్మపురాణోత్తరఖండం :

మడికిసింగన రచించిన పద్మపురాణోత్తర ఖండంలోని ఈ క్రింది పద్యాన్ని నంది తిమ్మన పారిజాతాపహరణంలో అనుసరించాడు.

చం. అనవుడు వ్రేటువడ్డ భుజగాధిపు కైవడి బొంగి మ్రోగుచున్
ఘనతర విస్ఫులిఙ్గముల గ్రాలెడు కన్నుల దంత ఘట్టన
....................................................... (పద్మ.పు.ఆ. 7- .100)

## నందితిమ్మన పద్యం :

చం. అనవిని వ్రేటువడ్డ యురగాంగనయు బలె నేయి వోయ భ
గ్గన దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచి హె
చ్చిన కనుదోయి కెంపు తన చెక్కుల గుంకుమ పత్ర భంగ సం
........................................................ ( పారి. ఆ. 1-.82)

పైన చెప్పినవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రబంధ యుగ కవులు అనుసరించిన పద్యాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి.

## 3. కథానుసరణ :

ప్రబంధరచనలో కథ ప్రఖ్యాతం, కల్పితం, మిశ్రమంగా ఉండవచ్చును. ప్రఖ్యాత కథకు మనుచరిత్ర, కల్పితకథకు కళాపూర్ణోదయం, మిశ్రమ కథకు వసుచరిత్ర ఉదాహరణలు.

కావ్య యుగంలో కొన్ని కావ్యాలలోని ఉపాఖ్యానాల నుండి చిన్న కథను గ్రహించి తమ వర్ణనలతో ప్రబంధంగా మలచిన కవులున్నారు. అందులో మాదయ్యగారి మల్లన, చింతలపూడి ఎల్లనార్యుడు, అయ్యలరాజు రామభద్రుడు ముఖ్యులు.

## రాజశేఖర చరిత్ర :

ప్రబంధ యుగంలో మాదయ్య గారి మల్లన రచించిన రాజశేఖర చరిత్ర మూడాశ్వాసాల ప్రబంధం. ఇది కల్పిత కథ అని చాలా కాలం వరకు భావించారు. అయితే జక్కన విక్రమార్క చరిత్రలో సప్తమాశ్వాసంలో కళావతి అనే పాతాళ రాకుమారిని మౌనం మాన్పించి రెండవసారి మాట్లాడించ దలచిన విక్రమార్క చక్రవర్తి, కర్పూరకరండాన్ని చూసి, వినోదార్థం ఒక కథ చెప్పమని కోరితే అది రాజశేఖరుడనే రాకుమారుడు కర్పూర మంజరిని వివాహం చేసుకున్న కథను వినిపిస్తుంది. ఈ కథనే గ్రహించి మాదయ్య గారి మల్లన కొన్ని మార్పులతో కొంత కల్పనతో ప్రబంధాన్ని రచించాడు.

## విష్ణుమాయా నాటకం :

రాయల యుగంలో రాధామాధవ కవిగా పేరెన్నిక గన్న చింతలపూడి ఎల్లనార్యుడు విష్ణుమాయానాటకాన్ని రచించాడు. కావ్య యుగంలో మడికి సింగనకు అనంతయ్య అనే తమ్ముడుండే వాడని ఇది అతని రచనే అని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. అంతకన్నా ముందే మడికి సింగన రచించిన వాసిష్ఠ రామాయణంలో గాధ్యుపాఖ్యానం, విష్ణుమాయా నాటకం లోని మూడవ ఆశ్వాసంలో పుండరీకోపాఖ్యానికి మూలం.

## రామాభ్యుదయం :

అయ్యలరాజు రామభద్రుడి రామాభ్యుదయం 8 ఆశ్వాసాల ప్రబంధం. ఇందులో మంధర పాత్ర లేదు. అంతే కాకుండా రాముడే స్వయంగా శూర్పణఖ ముక్కు చెవులు కోసినట్లుగా ఉంది. ఈ కథకు మూలం మడికి సింగన పద్మ పురాణోత్తరఖండంలోని రామకథ. అందులో కూడా మంధర పాత్రలేదు ( 8-103). శ్రీరాముడే శూర్పణఖ ముక్కు చెవులు కోసినట్లుగా ఉంది. ఈవిధంగా ప్రబంధ యుగం పై శ్రీనాథ యుగ సాహిత్య ప్రభావం చూపించింది.

## ఉపయుక్త గ్రంథ సూచి:

1) అష్టాధ్యాయి- పాణిని
2) తెలుగు సాహిత్య సమీక్ష- ఆచార్య జి. నాగయ్య.
3) శృంగార నైషధం- శ్రీనాథుడు
4) శృంగార శాకుంతలం- పిల్లలమర్రి పినవీరభద్ర కవి
5) విక్రమార్క చరిత్ర- జక్కన
6) సింహాసన ద్వాత్రింశిక- కొరవి గోపరాజు
7) భోజరాజీయం- అనంతామాత్యుడు
8) వరాహపురాణం- నందిమల్లయ,ఘంటసింగయ
9) పద్మపురాణోత్తరఖండం- మడికి సింగన
10) వాసిష్ఠరామాయణం- మడికి సింగన
11) మను చరిత్ర- అల్లసాని పెద్దన
12) పారిజాతాపహరణం- నందితిమ్మన
13) రామాభ్యుదయం- అయ్యలరాజు రామభద్రుడు
14) రాజశేఖరచరిత్ర- మాదయ్యగారి మల్లన

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# యక్ష ప్రశ్నల్లో వాస్తవికత

- డా॥. ఉమ్మిడి శాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, అంబేద్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం.

మారుతున్న సేద్యపు విధానాలు, ప్రకృతి వైపరీత్యాలు, రైతుల ఆలోచనల్లో వచ్చిన మార్పులు వలన బతుకు కోసం వున్న పొలాన్ని తాకట్టు పెట్టిన రైతు జీవితంలో ఎలా మనగలగు తాడోనని అనేకానేక ప్రశ్నలు వెల్లడి చేసిన కథ 'యక్ష ప్రశ్నలు'. రచయిత శ్రీ సింగమనేని నారాయణ.

సింగమనేని నారాయణ అనంతపురం జిల్లా 'మరూరు బండమీదపల్లి' గ్రామంలో 1943లో జన్మించారు. వీరిది సామాన్య మధ్య తరగతి రైతు కుటుంబం. తిరుపతి ఓరియం టల్‌లో కళాశాలలో శిక్షణ పొందారు. గ్రామీణ ప్రాంతాల ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితులుగా పనిచేసి 2001లో ఉద్యోగ విరమణ పొందారు. అనంతపురం జిల్లా కథకులకు వీరు మధ్య వారధిలాంటి వారైనా ఆధునిక కథకు మాత్రం వీరే ఆద్యులు. ఈ జిల్లాలో వీరికన్నా ముందుగా 1940ల ప్రాంతంలో జి.రామకృష్ణ, చిలుకూరి నారాయణ, ఆచార్య తూమాటి దోణప్ప, తదనంతరం ఆచార్య గంగప్ప లాంటివారు కొన్ని కథలు రాసినా సలక్షణమైన ఆధునిక కథకు శ్రీకారం చుట్టిన వారు సింగమనేని నారాయణే. ఆ ప్రాంతానికి చెందిన ఇప్పటి ప్రతిభావంతులైన కథకులు స్వామి, చిలుకూరి దేవపుత్ర, శాంతి నారాయణ మొద లైన వారికి వీరు మార్గదర్శకులు.

సింగమనేని తొలి కథ 'జూదం' 1978 నవంబరు ప్రజా సాహితి సంచికలో వెలువడింది. వీరు ఇప్పటి వరకు 40కి పైగా కథలు రాశారు, అవి 'జూదం', 'సింగమనేని నారాయణ కథలు' అనే పేర్లతో రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. వీరి గురించి చెప్పవలసిన ముఖ్య విషయం తెలుగు పాఠకలోకానికి, తెలుగు దేశానికి వీరు చేసిన సాహిత్యసేవ. తెలుగు కథా రచయితలలో ప్రసిద్ధులైన వందమంది కథకుల గురించిన సమగ్ర విషయాలను 'తెలుగు కథకులు-కథనరీతులు' అనే పేరుతో ప్రముఖ కథకులు శ్రీ మధురాంతకం రాజారాం గారి ఆధ్వర్యంలో సహ సంపాద కులుగా రెండు సంపుటాలను, వారి తదనంతరం మరో రెండు సంపుటాలను వెలువరించారు. ఇది వారు చేసిన విశేషమైన తెలుగు సాహిత్య సేవకు నిదర్శనం. వీరిని అనంతపురం జిల్లా రైతు రచయితగా పేర్కొనవచ్చు. వీరు రాసిన రైతు కథల్లో-జూదం, అడుసు, ఊబి, ఉచ్చు, విముక్తి, అలజడి, యక్షప్రశ్నలు మొదలైనవి.

"యక్ష ప్రశ్నలు", "సింగమనేని నారాయణ కథలు" నుండి స్వీకరించబడింది. ఈ కథలో ప్రధానపాత్ర రైతు సంజీవప్పదే. అప్రధాన పాత్రలు-వడ్డీకి అప్పులిచ్చే సీతారామయ్య, ఇల్లు, పొలాలను తాకట్టు పెట్టుకొని డబ్బులిచ్చే రామానాయుడు. సంజీవప్ప తండ్రి వెంకటరమణప్ప అరవై ఎకరాల పెద్దరైతు. అతనికి ముగ్గురు కొడుకులు. వెంకట రమణప్ప అనంతరం ముగ్గురన్న దమ్ములు పొలాలు పంచుకున్నారు. ఎవరి సేద్యం వారు చేసుకుంటున్నారు. అయితే వ్యవసాయ పద్ధతులు మారిపోయి, ఖర్చులు పెరిగిపోయి క్రమంగా ఆర్థిక పరిస్థితి క్షీణించసాగింది - సంజీవప్పకు. ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు. కొడుకును పట్నంలో చదివిస్తున్నాడు. మొదటి కూతురు పెళ్ళి చేసేసరికి కొంత పొలాన్ని అమ్మవలసి వచ్చింది. రెండో కూతురు పెళ్ళి ఘనంగా చేయాలనుకొని పెద్ద సంబంధం చూశాడు. ఆ పెళ్ళికి ఒకరి దగ్గర 50వేలు అప్పు చేశాడు. ఇంకొకరికి మిగిలి వున్న తోటను తాకట్టు పెట్టాడు. పెళ్ళి ఘనంగా జరిగింది. పెళ్ళి తర్వాత సంజీవప్ప చేతిలో చిల్లిగవ్వ లేదు. సంజీవప్ప పరిస్థితి ఏమిటి? తోటను తాకట్టు నుండి విడిపించుకున్నాడా? తోటలో వేసిన శనక్కాయ పంట పండిందా? అప్పు తీరిందా? మొదలైన 'యక్షప్రశ్నలు' అతనిని చుట్టుముట్టాయి.

రైతుల భవిష్యత్తు ఈ కథలో రచయిత ప్రధానంగా చర్చించింది రైతు బతుకు సమస్య. ఈ ఆధునిక కాలంలో రైతు జీవితం అతని చేతుల్లో వుండడం లేదు. తను రెక్కలు ముక్కలు చేసుకొని సాగుచేసినా బతుకుబండి సాఫీగా సాగలేకపోతుంది. ప్రకృతి వైపరీత్యాలైన అతివృష్టి, అనావృష్టులు ప్రధాన కారణమైతే తద్వారా సంభవించే కరువు కాటకాలు వాటినుండి బైటపడేం దుకు, బతుకు సాగించేందుకు ఇతరుల వద్ద చేసే అప్పులు, అవి తీర్చలేక పడే నానా రకాల ఇబ్బందులు, ప్రత్యేకించి నేటి కాలంలో వస్తున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రైతుల్లో కలుగు తున్న అధునాతనమైన ఆలోచనలు మొదలైనవన్నీ కలిసి రైతును ఉక్కిరిబిక్కిరి చేసి ఊపిరి నాపేస్తున్నాయి. ఆత్మహత్యలే శరణ్య మనిపిస్తున్నాయి.

'యక్ష ప్రశ్నలు' కథలో రచయిత మారుతున్న వ్యవసాయ విధానాలను చూపించారు. పల్లెల్లో, రైతు కుటుంబాల్లో కలుగు తున్న అత్యాధునికమైన ఆలోచనలను చిత్రించారు. పేరుకోసం, గొప్పకోసం మోయరాని భారమైన పనులుచేసి తద్వారా చితికి పోతున్న రైతులు ఆర్థిక పరిస్థితిని ఆవిష్కరించారు.

## మారిన వ్యవసాయ పద్ధతులు :

పూర్వకాలంలోని వ్యవసాయానికి నేటి వ్యవసాయానికి ఎంతో తేడా వుంది. పూర్వకాలంలో వ్యవసాయానికి సంబంధిం చిన ప్రతి పనీ మానవ శక్తితోనే సాధ్యమయ్యేది. దానికి అయ్యే ఖర్చు తక్కువ. ఎరువుల వాడకం తక్కువ. కుటుంబంలో అందరూ

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



కష్టపబడి పనిచేసేవాళ్ళు. కానీ నేడు అటువంటి పరిస్థితులు లేవంటూ ఈ కథలో చెప్పారు రచయిత. వ్యవసాయానికి పనికి వచ్చే కపిల స్థానంలో కరెంటు మోటర్లు వచ్చాయి. రసాయానిక ఎరువులూ, మందులూ వచ్చాయి. వ్యవసాయానికి శ్రమ స్థానంలో డబ్బు పెట్టుబడిగా మారింది. పెట్టుబడికి తగినవిధంగా పంట గిట్టటం లేదు. కూలి జనం తగ్గారు. కూలీరేట్లు పెరిగి పోయాయి. పొలం పని చేయలేని, చేయని కోడళ్ళు రావడం, వర్షాలు సరిగ్గా కురవకపోవడం మొదలైన వాటన్నిటి వలన రైతుల ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి.

**గ్రామీణ దృక్పథంలో మార్పులు :**

రైతుల ఆర్థిక పరిస్థితి దిగజారిపోవడానికి వారి ఆలోచనల్లో వస్తున్న మార్పులు కూడా కొంతవరకు కారణమవుతున్నాయనే అంశం ఈ కథలో స్పష్టంగా చూపించబడింది. వ్యక్తి ఎవరైనా తన తాహతుకు తగిన విధంగానే ఆలోచించి వ్యవహరించాలి. తాహతుకు మించిన చర్యలు చేస్తే తిప్పలు తప్పవు. సన్న, చిన్న కారు రైతులు వారి వారి ఆర్థిక స్థితినిబట్టి ఆలోచించి నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తే ఇబ్బందులు రాకుండా జీవించటానికి అవకాశముంటుంది. కానీ నేటి కాలంలో రైతులు అలా ఆలో చించక ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కారణం లగ్జరీ జీవితంపై మోజు, ఆధునికమైన ఆలోచనలు. ఈ కథలో ఓ మోస్తరు పెద్ద రైతైన సంజీవప్ప, అతని కుటుంబం, ఆ ఊరి ప్రజలందరూ ఇదే విధమైన ఆలోచనలతో వుంటారు. ఓ మేరకు ఆస్తిపాస్తులున్నవాడు ఆడపిల్లను సేద్యగానికిచ్చి పెళ్ళిచేయడం నామోషిగా కూడా భావించే పరిస్థితులొచ్చి పడ్డాయి. పైగా పదవ తరగతి వరకు చదివిన ఆడపిల్లను మళ్ళీ రైతుకివ్వటం అంటే ఎంత నామార్దా అనే వాళ్ళు కూడా తయారయ్యారు. కడగొట్టు ఆడపిల్లకయినా మంచి సంబంధం చూడమని ఇంట్లో ఆడ వాళ్ళు పోరు. బంధువుల ఒత్తిడి. కొడుక్కి పెళ్ళిచేసి కట్నం వసూలు చెయ్యొచ్చులే అనేవాళ్ళు, పంటలు చేతికొచ్చి అప్పు తీరుతుందిలే అనేవాళ్ళు, అదీగాక ఈ మధ్య ఊళ్ళో ఏ సెకండరీ గ్రేడు టీచరుకో,, ఏ గుమస్తాకో ఇచ్చి చేసిన పెళ్ళిళ్ళు మరీ ఎక్కువై పోయాయి. ఇరవై ఎకరాల భూమి వున్నా, వాడికిచ్చే బదులు నెలకు ఏ మూడువేలో సంపాదించే ఉద్యోగి మేలు కదా! పిల్ల సుఖపడుతుంది'' అని అందరూ అనసాగారు. ఆ మాటలతో తలకుమించిన భారమైనప్పటికీ సంజీవప్ప మూడు రూపాయల వడ్డీతో కొంత అప్పు తెచ్చి కూతురు పెళ్ళి ఘనంగా చేశాడు. తర్వాత తన పరిస్థితి ఏమటి? అన్నది ఆలోచించలేదు.

**యక్ష ప్రశ్నలు-వాస్తవికత :**

పెద్ద కూతురి పెళ్ళికోసం సగం పొలం అమ్మి, పట్నంలో కొడుకు చదువుకోసం డబ్బులు పంపించి, రెండో కూతురు పెళ్ళి కోసం అందినంత వరకు అప్పులు చేసి ఘనంగా పెళ్ళి జరపించిన తర్వాత సంజీవప్ప కథ ఏమిటి? అతనికి శనక్కాయ పంట పండిందా. సీతారామయ్య అప్పు తీరిందా? ఎంత అప్పు తీరింది? వడ్డీ మాత్రమే చెల్లించాడా? అసలు ఎప్పుడు తీరుతుంది? చదువు కున్న కొడుకుని ఉద్యోగం వచ్చిందా? ఉద్యోగం రాకపోతే కట్నం ఎంత వరకు వచ్చింది. రామానాయుడుకి తాకట్టు పెట్టిన భూమిని విడిపించుకోగలిగాడా? మూడు రూపాయల వడ్డీ బాకీ ఎంత పెరిగింది? ఇవేమీ తీర్చలేకపోతే సంజీవప్ప ఏమవుతాడు? అనే యక్ష ప్రశ్నలు లేవనెత్తి నాలుగేళ్ళ తర్వాత సంజీవప్పను చూస్తేనే చాలు అతను చెప్పకుండానే తెలుస్తుందని కొసమెరుపుగా రైతు భవిష్యత్తు ఎలా వుంటుందో చెప్పారు. అంటే సంజీవప్ప పెద్దరైతు స్థాయి నుండి పేదరైతు కూలీగా మారిపోయి బ్రతుకు భారంగా ఈదుతూ వున్నాడనే అర్థాన్ని స్ఫురింపచేశారు.

ఈ కథలో ఇక్కడే రచయిత స్పష్టమైన వాస్తవికతను తెలియచేస్తున్నారు. ఒక ప్రక్క ప్రకృతి రైతు పరీక్షిస్తుంటే, మరో ప్రక్క అలంకరణల కోసమో, ఆర్భాటాలకోసమో, ఊర్లో పేరు కోసమో వున్న కొద్దిపాటి పొలాన్ని తాకట్టు పెట్టో, వడ్డీకి అప్పులు తెచ్చో ఘనత చాటుకోవడం సామాన్య రైతుకు అవసరమా? అనే ప్రశ్న వేస్తూనే 'అవసరం లేదు' అని పరోక్ష సమాధానం చెబు తున్నారు.

**ముగింపు :**

నేటికాలంలో రైతును ప్రకృతి దగ్గర నుండి సాటి మాన వుడు వరకు అందరూ మోసం చేస్తున్నారు. దానికితోడు రైతులు 'ఆధునికత' అనే మోహపుటూబిలో పడి బైట పడలేక అల్లాడి పోతున్నారు. ఆత్మహత్యలకు సిద్ధపడుతున్నారు. రైతులేని సమా జాన్ని ఒక్కసారి ఊహించండి? పరిస్థితి ఎలా వుంటుందో?నని, సమాజంలో సంజీవప్పలాంటి రైతులు ఎంతోమంది వున్నారని, వారిని అటువంటి దుస్థితి నుండి బైటపడేటట్లు చైతన్యవంతం చేయవలసిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరికి వుందని తెలియజూస్తూ రైతు ఆనందంగా జీవించాలని ఆశిస్తున్నారు సింగమనేని.

❀❀❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి భక్తి సాహిత్య కృషి - ఒక పరిశీలన

- శ్రీనివాసులు నాయక్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

శ్లో॥ గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః ॥

గురువనగా బ్రహ్మ, గురవనగా విష్ణువు, గురువనగా మహేశ్వరుడు అంతే కాదు గురువనగా పై త్రిమూర్తులకు అతీతమైన పరబ్రహ్మము. ఇలాంటి కోవకు చెందిన వారు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

ప్రభాకరశాస్త్రిగారు తెలుగు సాహిత్యంలోని ప్రతిశాఖకు చేసిన కృషిని వివరించే సందర్భంలో డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారు శాస్త్రిగారిని స్మరించిన తీరును తెలుసుకోవడం ఉత్తమం.

తెలుగు భాష మొగ్గదొడిగె నీ సాధనలో
తెలుగు చరిత పూలు పూచె నీ శోధనలో
తెలుగుకైత కొత్త కొత్త నెత్తావులను
పుక్కిలించె ప్రభాకరా ! నీ బోధనలో
నిన్నుగాంచి పులకించెను తాళపత్రజాలం
నిన్నుతాకి వికసించెను ప్రాఙ్నన్నయ కాలం
మట్టిని దాగిన మణులను ప్రభాకరా
వెలికితీసి పంచెను నీ జిజ్ఞాసశీలం
హేమగిరులు కదిలినవి నీ శిరస్సులో
హిమశిఖరులు కరిగినవి నీ మనస్సులో
ప్రభాకరా! ఓ మానవతామూర్తీ!
ప్రజారుజలు తొలగినది నీ తపస్సులో
కమలబంధు కిరణాలు పూచేదాక
కృష్ణానది కెరటాలు పొంగేదాక
ప్రభాకర! నీ చరిత్ర నిత్యనవ్యమై
విభాసించు తెలుగుజాతి నిలిచేదాక

అంటూ శాస్త్రిగారిపై పలికిన పలుకులు అతిశయోక్తి కాదని అనేకమంది విద్వన్మూర్తుల ఏకాభిప్రాయం.

తెలుగు సాహిత్యంలో శ్రీప్రభాకరశాస్త్రిగారిది విశిష్టమైన స్థానం. వారెంతటి కవులో అంతటి పరిశోధకులు. ఎంతటి సరసులో అంతటి గంభీరులు. ఎంతటి సాహిత్య ప్రియులో అంతటి యోగసాధన ప్రియులు. శాస్త్రిగారు ఎంతటి పండితులో అంతటి భక్తితత్పరులు కూడా. ఎందుకంటే శాస్త్రిగారు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వైభవానికి వినూత్న కృషి సల్పిన యుగ పురుషులు.

సాహిత్యం అన్ని తరగతులవారు అనుభవింపదగిందిగా ఉండాలన్నది శాస్త్రిగారి అభిప్రాయం. అది భావకవిత్వమయినా, భక్తికవిత్వమయినా. శ్రీ శాస్త్రిగారు 07.02.1888న కృష్ణాజిల్లా పెదకళ్ళేపల్లి గ్రామంలో జన్మించారు. వీరి దృష్టిలో సజీవరచన సత్పురుషుని శీలం లాంటిది. ప్రభాకరులు తాడిచెట్టు గురించి రాసినా, తాళపత్ర గ్రంథం గురించి రాసినా, తాళ్ళపాక అన్నమయ్య గురించి రాసినా అన్నింటిలో వారి మౌళిక పరిశోధన పాటవం సువ్యక్తం కాకమానదు. భక్తసాహిత్య కోణంలో శాస్త్రిగారిని పరిశీలించినట్లైతే మరుగునపడిన తాళ్ళపాకవారి కృతులను తెలుగులోకి తెచ్చిన ఘనత శ్రీ ప్రభాకరులదే.

శ్రీ వేదం వెంకట్రాయశాస్త్రిగారిచేత 'కవిచూడామణి' గా ప్రస్తుతింపబడిన ప్రభాకరులు అనేక లఘుకృతులు రచించారు. పద్యకవితాఖండికలలో తిరుపతికవుల స్మృతిపదములు (1921), తిరుపతి వేంకటేశ్వరస్వామి (1926) వంటి రచనలు సరసమనోజ్ఞ భక్తికవితా ఖండికలు. శ్రీశాస్త్రిగారు వైష్ణవభక్తి తత్పరులు ఈయన రచించిన సంకలన గ్రంథాలయిన శ్రీవేంకటేశ్వర లఘుకృతులు (1948), శ్రీవేంకటేశ్వర స్తుతిరత్నమాల (1951) వంటి రచనలు శాస్త్రిగారి వైష్ణవభక్తికి తార్కాణాలుగా చెప్పవచ్చు.

శ్రీప్రభాకరులు కావించిన ఒంకొక మహత్కార్యము శ్రీఅన్నమాచార్యుని సంకీర్తనలను వెలుగులోకి తీసుకురావడం. 500 సంవత్సరాలుగా శ్రీవేంకటేశ్వరుని మందిరములో తిరుమలలో తాళ్ళపాక వారి కొట్టులో నిక్షిప్తములై రాగిరేకులపై చెక్కబడియున్న శ్రీ అన్నమయ్య రచనలను తేళ్ళుజర్రులకు జంకక, పైకి తీయించి నకళ్ళు రాయించి ప్రచురణ కార్యక్రమము ప్రారంభించడం ఆయన భక్తికి ప్రతీకగా చెప్పవచ్చు. దాదాపు 32,000 పై చిలుకు కీర్తనలలో ఇంకా కొన్ని నేటికీ అచ్చుకావలసిన అవసరం ఉన్నవి. శ్రీ ప్రభాకరులే పూనుకోకపోతే ఈ అపారసంపదను తెలుగుజాతి కోల్పోయేది. శ్రీప్రభాకరులు భాషాసాహిత్య దృష్టితో అన్నయ్య రచనల ప్రచురణ ప్రారంభించగా, ఆ కృషిని సంగీతదృష్టితో శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు కొనసాగించడం జరిగింది. నేడు దేశమంతా అన్నమయ్య సుధామృత గానాన్ని ప్రఖ్యాత గాయకుల ద్వారా మనము వింటున్నాము. నేటికీ మేలట్టూరులోని భాగవత మేళమువారి వార్షిక ఉత్సవప్రారంభములో గానము చేసే తోడయ మంగళం లోని ప్రముఖ రచనలు శ్రీఅన్నమయ్య రచనలుగా నేడు గుర్తించగలుగుతూనే ఉన్నామంటే శ్రీప్రభాకరుల ప్రాథమిక ప్రచురణలే కారణము అని ఎలాంటి సందేహం లేకుండా చెప్పవచ్చు.

కవి, రచయిత, సంపాదకర్తలందరూ ఒకే తాటిపై నిలుస్తారు. ఎందుకంటే తాను చేసిన రచనలు తన వల్ల కాకపోయినా ఇంకొక వ్యక్తి ద్వారా లోకకళ్యాణం కోసం జనబాహుళ్యంలోకి రప్పించడం కూడా ఉన్నతమైన కార్యంగానే చెప్పవచ్చు. ఇలాంటి ఉన్నత కవిశేఖరులైన ప్రభాకరశాస్త్రిగారు తెలుగు భక్తి సాహిత్యానికి చేసిన కృషి అద్వితీయమైనది. తెలుగు తల్లులందరూ నేటికీ పాడుకునే 'జో అచ్చుతానంద జోజో ముకుందా " అనే జోలపాట శ్రీ అన్నమయ్య రచనగా తెలియపరిచినది ప్రభాకరులే.

అన్నమాచార్యుని గురించి ప్రభాకరశాస్త్రిగారు చేసిన సేవ గురించి చెప్పుకునే ముందు తెలుగు సాహిత్యం యొక్క స్వరూపాన్ని ఒకటి రెండు మాటలలో చెప్పుకోవలసి వస్తుంది. తెలుగు సాహిత్య చరిత్రను మొదటి నుండి చూసినట్లయితే మార్గ, దేశి ఈ రెండు విభేదాలు అటు సాహిత్యంలో కానివ్వండి ఇటు సంగీతంలో కానివ్వండి, నాట్యంలో కానివ్వండి క్రమం తప్పకుండా చిరంతనంగా సాగుతూనేవస్తున్నది. అందులో పాల్కురికి సోమనాథునికాలం తీసుకుంటే అది దేశికవిత్వానికి పట్టంకట్టినటువంటి యుగం, 12వ శతాబ్ది కాలం అని చెప్పవచ్చు. మళ్ళీ 15వ శతాబ్దం అన్నమాచార్యులు దేశికవిత్వాన్ని ఒక ఉద్యమంగా తీసుకెళ్ళిన కాలంగా చెప్పవచ్చు. అటు సోమనాథుడు శైవం, ఇటు అన్నమయ్య వైష్ణవం పేర్లు భేదమే కాని స్థూలదృష్టికి వాటి హృదయం ఒక్కటే, ఆత్మ ఒక్కటే, ఆదర్శం ఒక్కటే, లక్ష్యం కూడా ఒక్కటే అని రూఢమవుతున్నది.

ప్రభాకరశాస్త్రిగారిని ఈ రెండు ఉద్యమాలు బాగా ఆకర్షించాయని స్పష్టంగా చెప్పవచ్చు. అటు శైవసాహిత్యానికి ఎంతసేవ చేశారో ఇటు వైష్ణవ సాహిత్యానికి అంతే సేవ చేశారు. ఈ క్రమంలోనే పదకవిత భగీరథుని వలె, పదకవిత పితామహుని కవితలన్నిటిని కూడా భగీరథుడు విష్ణుపాదోద్భవమయిన గంగోత్రికి తీసుకువచ్చినట్టు, వేంకటేశ్వరుని పాదోద్భవమైన అన్నమయ్య కీర్తన వాఙ్మయాన్ని వెలుగులోకి తెచ్చిన మహాతపస్వి శ్రీ ప్రభాక రులు.

1925 అక్టోబర్ 2న శ్రీ ప్రభాకరశాస్త్రిగారు చెప్పిన పద్యాలు చిరస్మరణీయమైనవి.

సీ॥ మరలనెన్నడు మాకు దొరుకునో మీఁగడ
పాలఁగ్రొమ్మెఱుఁగు ముక్త్యాల పెరుగు
మరలనెన్నఁడు మాకు దొరుకునో రాజర్షి
చంద్రమౌళి నృపాలు నమ్ము ఖమ్ము
మరలనెన్నఁడు మాకు దొరకునో చిఱునవ్వు
చెన్నారు యువరాజు చెల్మికల్మి
మరలనెన్నఁడు మాకు దొరకునో రాజసౌ
ధమ్మునఁ గళ్యాణ దర్శనమ్ము

ఆ॥ మ్రొక్కులిడుదు నీకు ముక్తీశ్వరస్వామి !
కీలుమోడ్తు నీకుఁ గృష్ణవేణి!
మరలవత్తు మమ్ము దరిసింతు; ముక్త్యాల
పత్తనమ్మ! పోయి వత్తునమ్మ!

పై రెండు పద్యాలు కృష్ణాపుష్కరాల సందర్భంలో ముక్త్యాలను సందర్శించినపుడు సీతమ్మతల్లి గూర్చి చెప్పారు.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు భక్తికి నిదర్శనంగా ఈయన రచించిన పీఠికలు నిలుస్తున్నాయి. మచ్చుకు రెండు తెలుపుతాను.

1. వేంకటేశ్వర వచనములు పీఠిక (1945)
2. వేంకటేశ్వర లఘుకృతులు - తొలిపలుకు (1948)
3. అన్నమాచార్య చరిత్ర పీఠిక (1949)
4. శ్రీకృష్ణమాహాత్మ్యము - పండితాభిప్రాయము (1999, 1932)
5. శ్రీ శివభారతం - అభిప్రాయము (1943)

వంటి రచనలు ద్వారా శ్రీ ప్రభాకరశాస్త్రిగారి మనస్విత, భావసౌకుమార్యం, సాధుప్రవృత్తి, హృద్యమైన సౌశీలసుందరమయిన అభిప్రాయం వెలువరించారు.

శ్రీప్రభాకరశాస్త్రి సారస్వతమూర్తికి వందనములు.

✿✿✿

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# దేవులపల్లి విశ్వనాథం వచన కవిత్వం - సామాజిక దృక్పథం

- సూరె శ్రీనివాసులు, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆధునిక సాహిత్యంలో వచన కవిత్వానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అన్ని సామాజికాంశాలను సమకాలీన పరిస్థితులను వచన కవులు తమ కవితల్లో విస్పష్టంగా ప్రకటిస్తున్నారు. భాష, శైలిలో సరళతను పాటిస్తుండుటవలన పాఠకులు వచన కవిత్వాన్ని విశేషంగా ఆదరిస్తున్నారు. ప్రాచీన కాలంలో పద్యం రాసిన వారు కవులైతే ఆధునిక కాలంలో వచన కవిత్వం రాసినవారు కవులుగా పరిగణించబడుతున్నారు. ఈ దృక్కోణంలో చూసినపుడు ఎందరో కవులు వచన కవిత్వాన్ని పండిస్తున్నారు. అలాంటి వారిలో చెప్పదగిన వచనకవి దేవులపల్లి విశ్వనాథం.

దేవులపల్లి విశ్వనాథం గారు 'చెట్టు', 'వర్తమానం', దేశం పిలుస్తోంది వంటి వచన కవిత సంపుటాలను వెలువరించారు. చెట్టు కవిత సంపుటిలో చెట్టు, శైశవం, భూసూక్తం, నాగలికో నమస్కారం, నాయకులొస్తున్నారు జాగ్రత్త, భద్రమమ్మా! భరత మాత!, తూరుపు తెలవారింది, అమ్మభాష, నాభాష, తిమిరంతో సమరం, సర్వజన హితాయ, ఓటు లేని జీవితం ఓటికుండ, ఓటి కుండరా.... ఇది, నవరత్నాల కోట, సంతోష సాగరం, జీవిత యాత్ర, ఆకలి, శఠగోపం, పుస్తకం, పెండ్లి, సత్య దర్శనమ్, కర్మసాక్షి, పత్రికలు, పండుగ వంటి కవితలు ఉన్నాయి. వర్తమానం కవితా సంపుటిలో వర్తమానం, మా ఊరు దొడ్డది, దేవుడా! రక్షించు నా దేశాన్ని!, ఎక్కడుంది స్వాతంత్ర్యం, ప్రకృతి పాఠం, మానవత్వమా! నీవెక్కడ?, ఓ మనిషీ! నీ పయనం ఎటువైపు? పరోపకారికి ప్రణామం, ఓతల్లీ! విచారించకు, తల్లి భారతిని ప్రేమించరా!, భజన సేయుమురా! నరుడా! నాలోనేను, పతాక గీతం, ప్రపంచం, కాలం, మనిషి, కనిపించేది నీది కాదురా!, ఓనవ యువకా! మాతృభాష, శారదా నివేదన, పాపం తెలుగుతల్లి, అడవి గోవు, మృత్యువు, బాపూజీ మళ్ళీ వస్తే! దేవుని రూపాలు, సినిమా, దేవాలయాలు, వందేవిశ్వనాథమ్, తెలుగుతల్లీ! భారత మాత, మేలు కొలుపు కవితలు ఉన్నాయి. 'దేశం పిలుస్తోంది' కవితా సంపుటిలో దేశం పిలుస్తోంది, మహా ప్రస్థానం, ఎక్కడుంది దీపావళి?, పల్లె, మానవత్వం మంటగలసిన వేళ, నేటి యువకుడు, చదువులయ్య, నా అక్షరం, విద్యార్థి, అమ్మ, బాలల్లారా!, కసిమొగ్గ, మానవత, సృష్టి రహస్యం, స్వధర్మం, ప్రకృతి, అహింసా పరమోధర్మః, మానవుడా! ఓ మానవుడా! ఈ చదువులు మాకొద్దు, ప్రజాస్వామ్యం, నీ చిరునామా ఎక్కడ? జీవితం, తెలుగు వైజయంతి, సంగీత సరస్వతి, చూడాలని ఉంది, సర్వేజనా సుఖినో భవంతు, మరచిపోకు మాతృభాషను, నాదేశం నవ్వు తోంది కవితలున్నాయి.

దేవులపల్లి విశ్వనాథం వచన కవితల్లో సామాజిక స్పృహ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్య పర్యావరణం కలుషితం కావడం. ఇలా కలుషితం కావడానికి ప్రధాన కారణం చెట్లు లేకపోవడం. ఈ విషయాన్ని గుర్తించిన కవి ఇలా అంటాడు.

చెట్టు ప్రకృతికి తొలి మెట్టు
పరోపకారానికి ఆయువు పట్టు
ప్రేమకు ప్రతిరూపం చెట్టు
ప్రగతికి మణి దీపం చెట్టు - అంటాడు.

ప్రగతికి పరోపకారానికి ప్రేమకు చెట్టు తొలి మెట్టని, ఆయువు పట్టని, ప్రేమకు ప్రతి రూపమని కవి చెబుతాడు.

మన మాతృ భాష తెలుగు. మన సంస్కృతి తెలుగు. ఈ విషయం అందరికీ తెలిసినా తెలుగును చిన్న చూపు చూస్తున్నారు. తెలుగులో మాట్లాడటమే మహా నేరంగా, అవమానంగా, ఘోరంగా భావిస్తున్నారు. ఈ దుస్థితి ప్రపంచంలోనే ఒక్క తెలుగు వారిలోనే ఉందని ఘంటా పథంగా చెప్పవచ్చు. అందువల్ల కవి ఒక తెలుగు వాడిగా ఆవేదన, ఆందోళన చెందుతున్నాడు. తన ఆవేదనను 'అమ్మభాష' అనే కవితలో ఇలా వ్యక్తీకరిస్తాడు.

"మరచి పోకు మరచిపోకు మాతృ భూమిని
మనసుదీర కొలువు మెపుడు మాతృ భాషను
అమ్మ భాషపై చిన్న చూపు ఏలరా!
కమ్మనైన భాషపై మమకారం చూపరా!
ఆంగ్ల భాషపై వ్యామోహం ఏలరా! - అంటూ ప్రశ్నిస్తాడు.

మాతృ భాషపై ఏవగింపు వీడరా! - అంటూ హితబోధ చేస్తాడు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2050 నాటికి తెలుగు భాష నామరూపాలు లేకుండా పోతుందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. ఈ హెచ్చరికను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే కొనసాగాలని ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అమలులో చిత్త శుద్ధి కొరవడడంతో తెలుగు ప్రగతికి ఆటంకాలు తొలగిపోలేదు. దీనికి తోడు ప్రజలకు కూడా మాతృభాషపట్ల మమకారం కొరవడడం కూడా దీనికి ప్రధానహేతువుగా ఉంది. తమిళ, కన్నడిగులను చూసైనా తెలుగు ప్రజలు మారాల్సిన అవసరం చాలా ఉంది.

సమకాలీన సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న మరో సమస్య 'పల్లె'. భారతదేశానికి పల్లెలు పట్టుగొమ్మలు. ఈ విషయాన్ని గాంధీ మహాత్ముడు నొక్కి చెప్పాడు. అయితే నేడు పల్లెలు బోసిపోతున్నాయి. కరువులు, ఫ్యాక్షన్ సంస్కృతి వంటి కారణాల

మూలంగా ప్రజలు పల్లెలను వదలి పట్టణాలకు వలస వెళుతున్నారు. చాలా పల్లెల్లో వృద్ధులు మాత్రమే ఉంటున్నారు. పల్లెలు తరిగి పట్టణాలు విస్తరించడంతో అరాచకాలు పెరుగుతున్నాయి. దీని మూలంగా మానవ సంబంధాలు కుటుంబ సంబంధాలు ఘోరంగా దెబ్బతింటున్నాయి. ఈ అంశాన్ని గురించి కవి దేవులపల్లి విశ్వనాథం గారు ఇలా అంటారు.

పల్లె మనకు తల్లిరా
అదే మనకు కల్పవల్లిరా!
అది కుల మతాల కతీతం
మాయా మర్మం తెలియని
మంచి మనుషులు
ఎప్పటికీ పుట్టాలి పల్లెలో
ఆతల్లి ఒడిలోనే నిదురించాలి
అదే మన జీవన సూత్రం

అదే సహజీవన గాత్రం - అంటూ కొనియాడతారు. నేడు పట్టణీకరణ పెరగడంతో ప్రజలు టెన్షన్‌కు గురౌతున్నారు. ఉద్యోగ, ఉపాధిరీత్యా ఒత్తిడికి లోనవుతున్నారు. మురికి కూపంలో దుర్భరంగా జీవిస్తున్నారు. ఈ దుస్థితి తొలగాల్సిన అవసరం చాలా ఉంది.

కవి దేవుల పల్లి విశ్వనాథం నేటి సమాజంలోని పెడ ధోరణులను కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. ఆయన మాటల్లోనే చూద్దాం.

ఎదఎదలో రొదలు
అర్థం కాని సొదలు
జగమంతా విషాద కతలు
ప్రతి గుండెలో వ్యథలు
అంతు పట్టదీ శోకం
అంతే కదా! ఈలోకం
కన్నవారు కసాయి వారై
కన్న కొడుకును కడతేర్చడం
వ్యసన లోలుడై పీడిస్తున్నాడని
కట్టుకున్న వాడినే గొంతు కోయడం
పుస్తె నమ్మ నీయలేదని
ఆలిని చితిమంటల కాహుతి చేయడం
బుద్ధులు నేర్ప వలసిన గురువు
శిష్యురాలి శీలాన్ని అపహరించడం - జరుగుతున్నదంటాడు.

నేటి నవ నాగరికతా చిహ్నాలు - అంటూ నేటి సమాజ పోకడలను ఎండకడతాడు. కవి పై కవితలో పేర్కొన్నవన్నీ అనైతిక అసాంఘిక కార్యక్రమాలే. ఇవి ఇలాగే కొనసాగితే మన సంస్కృతి సంప్రదాయాలు మంటగలవక తప్పవు.

కవి దేవుల పల్లి విశ్వనాధంగారు 'సినిమా' కవితలో ఇలా అంటారు.

నిన్నటి సినిమా మానవ వినోదసాధనం
విజ్ఞాన దోహదం ఆనందహేల అద్భుత లీల
కమనీయ దృశ్యాల కథా వినోదం
రమణీయ గీతాల రసమయనాదం ఈ నాటి సినిమా
హింసా క్రౌర్యాల నేపథ్యం
ద్వంద్వార్థాలతో సాగే వాగ్యుద్ధం
భారతీయ సంస్కృతీ విచ్ఛేదకం

విష సంస్కృతీ పోషకం - అంటూ తూర్పార బడతాడు. సినీ మాద్యమం చాలా బలవత్తరమైనది. అది సమాజంపై గాఢమైన ముద్రవేస్తుంది. అందువల్ల సినీ నిర్మాతలు చక్కని సామాజిక బాధ్యతతో సినిమాలు తీయాల్సి ఉంది. ఇలా దేవుల పల్లి విశ్వనాధంగారు వివిధ కవితల్లో తన సామాజిక దృక్పథాన్ని, స్పృహను అభివ్యక్తం చేశారు. అలా చేయడం ద్వారా ఒక రచయితగా, కవిగా తన బాధ్యతను నెరవేర్చుకున్నారు.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# సినారె దివ్య స్మృతికి నివాళి "విశ్వంభర పై మరోచూపు"

– డా॥ జి. స్వర్ణలత, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

తెలుగు సాహిత్యాన్ని రెండవసారి జ్ఞానపీఠంపై సగౌరవంగా కూర్చోబెట్టిన డా॥ సి.నారాయణ రెడ్డి గారు ఎన్నెన్నో సంప్రదాయ ప్రక్రియలతో పాటు ఆధునిక ప్రక్రియలతోనూ తన జీవితకాల పర్యంతమూ తెలుగుభారతికి గుణాత్మక సేవచేశారు. అరుదైన వ్యక్తిత్వంతోనూ, అత్యున్నతస్థాయి వృత్తి ప్రవృత్తులతోనూ జీవితాన్ని సుసంపన్నం చేసుకున్న సినారె దివికేగిన ఈ సంవత్సరం సాహితీ లోకానికి, సినారె అభిమానులకు అసంఖ్యాక శిష్యప్రశిష్యులకు తీరని వేదనను మిగిల్చింది.... అయినప్పటికీ సుకవి జీవించు ప్రజల నాల్కలయందు' అన్నట్లు సినారె తెలుగువారి హృదయాలలో ఎప్పటికీ నిలిచివుంటారు. ఆయన సుదీర్ఘ సాహితీ ప్రస్థానంలో ఎన్నెన్నో పురస్కారాలు వరించినప్పటికీ భారతీయ సాహితీ క్షేత్రంలో శిఖరాయమానమైన జ్ఞానపీఠ్ పురస్కారం చాలా ప్రత్యేకమైనది. మానవ వికాసాన్ని ఐతిహాసిక దృక్పథంతో, కావ్య స్పృహతో చిత్రించాలనుకున్న సినారె వెలయించిన "విశ్వంభర" ఒక పరిణత ప్రయోగంగా రూపొంది జ్ఞానపీఠాన్ని కైవసంచేసుకొంది.

జీవిత పరమార్థాన్ని వివేచిస్తూ, జీవిత రామణీయకతను చిత్రిస్తూ మానవతకు జోహార్లర్పించిన విశ్వంభర చాలా లోతైన సుదీర్ఘకావ్యం. సుదీర్ఘ మానవ ప్రస్థానంలోని వైజ్ఞానిక, ఆధ్యాత్మిక తాత్త్విక ఆవిష్కరణలు మానవ సమస్యలను పరిష్కరించేవిగా కాక ఎన్నో సమస్యలను, మరెన్నో ప్రశ్నలను రేకెత్తించడం చూస్తూనే వున్నాం. ఈ సమస్యలకు ప్రశ్నలకు పరిష్కారాలు అన్వేషించే దృక్పథం ఆధునిక మానవుడి నైజం. ఈ లక్షణమే ఆధునిక సాహిత్యంలోనూ ప్రతిఫలిస్తూ ప్రశ్నోపనిషత్తులకు ప్రాణం పోస్తోంది. Frank Kermode అన్నట్లు The modern classic... offers itself only to readings which are encouraged by its failure to give a definitive account of itself. Unlike the old classic, which was expected to provide answers, this one poses a virtually infinite set of Questions". (The classic (Essay) : contemporary criticism - An Anthropolgy - Edited by V. Sethyraman (1989) - P.88) ఈ లక్షణం విశ్వంభరలో విస్పష్టంగా కనిపిస్తుంది.

మనిషి సాధన త్రిముఖం - కళాత్మకం, వైజ్ఞానికం, ఆధ్యాత్మికం. ఈ సాధనలో అడుగడుగునా ఎదురు దెబ్బలు. క్షతుడైనా మనిషి తిరోగతుడు కాలేదు. విశ్వంభర కావ్య రచనకు నాలో గీసుకున్న రేఖాచిత్రమిది" అని నారాయణరెడ్డి గారు కావ్య ప్రస్తావనలో పేర్కొన్నారు. ఈ సాధనకు మొదలెక్కడ? అనే ప్రశ్నకు పాక్షిక సమాధానమే ఈ కావ్య ఆరంభం.

"నేను పుట్టక ముందు -
ఎంతగా మబ్బులెదురు చూశాయో
చూపుల సోపానాలపై సాగివచ్చి
తమను పిండుకునే ఆ తపన ఏదని
ఎంతగా నక్షత్రాలు నిరీక్షించాయో
గణిత సూత్రాలతో తమ గతుల్ని
మణులుగా కూర్చే ఆ మననం ఏదని
ఉషస్సు లెంతగా
ఉద్వేగ పడ్డాయో
విచ్చుకున్న తమ కంటికడలిలో
పిచ్చిగా నురగెత్తే విముక్తాత్మలేనవి" అంటూ మానవుడి ఉదాత్తతను, ప్రకృతిలో మానవుడి ప్రత్యేకతను, అపారమైన అతడి మేధోసంపత్తిని ప్రకృతి ఒడిలో తనని తాను తీర్చిదిద్దుకున్న విధాన్ని అత్యంత రమణీయంగా వర్ణిస్తారు. ఈ కావ్యానికి మొదటగా బైబిల్‌లో చెప్పబడిన ఆడమ్ ఈవ్ కథను ఎన్నుకున్నారు. ప్రణయఫలాన్ని తిన్న వారిని దైవత్వం ప్రశ్నిస్తే మానవత్వం జవాబిచ్చింది.

"తెలుసా! శాసనధిక్కారానికి ఫలితం
తెలుసు మట్టిలో మొలకెత్తే మరో జీవితం
ఆ జీవితానికి అనుక్షణం మృత్యుభయం
ఆ మృత్యువు కోరలతో ఆడుకోవడం మాకు ప్రియం
అయితే వెళ్ళిపో మట్టి మనిషీ! ఆ మట్టిలోకి
అలాగే వెళ్ళి పొంగిస్తాను ఆ మట్టిని నింగిపైకి
అందాకా వచ్చిందా నీ అహంకృతి?
అక్కడే మొదలౌతుంది మానవ సంస్కృతి".

స్త్రీ పుం సంయోగరూపమైన ప్రణయాన్ని దైవత్వం పతనమంటే అది బ్రతుకు తీయదనమని అది జీవిత ఫలమని మానవత్వం అంటుంది. మానవేతిహాసానికి ఒక ప్రతీకాత్మకతను సంతరింపచేయడం దాన్ని కావ్యమంతా నిర్వహించడం ద్వారా సినారె ప్రతిభ పతాకస్థానంలో నిలబడుతుంది. పరిణామ వికాస సుందరమైన ఐతిహాసిక స్పృహ కలిగిన మానవశక్తి యొక్క చలనచిత్రం విశ్వంభర.

అనన్య సామాన్య ప్రతిభాపాటవాలతో మనిషి వెన్నుచూపని ఒరవడితో భౌతిక జగత్తును తనకు సౌకర్యవంతంగా మలచుకున్నాడు. క్రమంగా మనస్సును సౌందర్యభరితం చేసుకోవడమెలాగో గ్రహించాడు. ఉదయాస్తమయాలు, పక్షుల కిలకిలారావాలు, సకల విశ్వం అతనిలో నిండి ప్రతిసృష్టిగా లలిత

కళా చైతన్యం వెల్లివిరిసి నాదమై, భాషై, పాటై, స్వప్నమై, చిత్రమై, శిల్పమై, కవితై, రసమై మానవ ప్రస్థానం అగణ్యరూపాలను పొందిన క్రమాన్ని నాయాణ రెడ్డి గారు

"గోటికి ఎదురు ఈటె
కోరకు ఎదురు ఖడ్గధార
ఆత్మరక్షణకు నేర్చుకున్న
ఆదిపాఠమది
మృత్యుహత్యకు వేసుకున్న
మూలపీఠమది" - అంటూ ఆత్మ రక్షణ కోనం పదునుపెట్టిన మొదడు మరింత మొనదేలి తరులూ, ఝరులూ, గిరులూ, సాగరులూ, గహనాటవులు... ఒకటేమిటి.

"విస్తరించాడు మనిషి
విశ్వాన్ని ఆత్మీకరించుకుని
ఆవరించాడు మనిషి
అంబరాన్ని పిడికిలించుకుని
మనిషి మనసు చూసుకుంది
తన నీడను అగణ్యరూపాలుగా
రసాహంకృతి కూర్చుకుంది
రక్తిని చైతన్య కోశాలుగా"... అంటారు సినారె

మానవుడి మనస్సే అతడి సంస్కృతికి మూలమంటారు సినారె. శాంతి సౌభాగ్యాలు, రక్తదాహాలు, అన్నీ మనిషి సృష్టించి నవేగా మరి.

"తెల్లగా నవ్విందా
తెరచాపలెత్తే జ్యోత్స్నా సరిత్తులు
నల్లగా నవ్విందా
నాగఫణాలెత్తే విషమ రాత్రులు
పచ్చగా నవ్విందా
పగుళ్ళువారిన నేలలో
పల్లవ జయంతులు
ఎర్రగా నవ్విందా
వెర్రెత్తి అరిచే రుధిర స్రవంతులు" - అంటూ మానవుడి లోని జ్ఞానబీజం మనశ్శక్తిగా శాఖోపశాఖలై విస్తరించిన తీరును అక్షరబద్ధం చేస్తారు సినారె.

మానవేతిహాసాన్నిలోని పలుమలుపులు తిప్పిన విశిష్ట వ్యక్తులు వారి సంకల్పాలు, ప్రయత్నాలు, త్యాగాలను నవ్య మానవతకు అఖండ దీపికలుగా అభివర్ణించారు సినారె. ఒక విశ్వామిత్రుడు ఒక భోదిసత్త్వుడు ఒక అలెగ్జాండర్, ఒక అశో కుడు, ఒక సోక్రటీస్, ఒక క్రీస్తు ఇలా ఎవరినీ వాచ్యం చేయన ప్పటికీ మనోనేత్రాలకు వారిని గోచరింపచేస్తారు. మానవుడి అభి వృద్ధి పథంలో వెలిగిన ఆధ్యాత్మిక జ్యోతుల మైలురాళ్ళు వారు. ఒక్కొక్కరూ ఒక్కో అనుభవానికి ప్రతీకలుగా

"ఆ తేజం విశ్వచరితకు
అభినవ భూమిక
ఆ జ్ఞానం నవ్యమానవతకు
అఖండ దీపిక" అంటూ మానవ చరిత్రను తేజోమానం చేస్తారు.

తాను సాధించిన విజయాలను సింహావలోకనం చేసు కుంటూనే తనలో తాను తరచి తరచి ప్రశ్నించుకుంటాడు.

"ఎందాక ఈ నడక?
ఈ అడుగు సాగినందాక
ఎన్నాళ్ళు సాగుతుందీ అడుగు?
ఎదురుగా లోయ నిలిచేదాక,
ఏమంటుంది ఆ లోయ?
ఈడ్చుకుంటుంది అగాధం దాక,
ఏమౌతుంది ఆ పైన ?"

ఇది ప్రశ్నగా మిలిగిన ప్రశ్న. మృత్యువు అంటే ఏమిటో ? దానికి ఆవల ఏముంటుందో అనే ప్రశ్నలు ఎన్నటికీ ముడివిప్ప లేని సమస్యలే. జనం లేని స్థితి ఉంటుందా? గమనం లేని గతి ఉంటుందా? అమృతత్వం పైన ఉంటే, అవని కుటుందా చావు దిగులు?" ప్రకృతిని జయించాననుకున్న మానవుడి తృప్తి అశా శ్వతమే. మృతి అతనికున్న శాశ్వతమైన అసంతృప్తి. భౌతిక స్పర్శకు అందని మరెన్నో ఊహలతో సతమతమౌతూ

"దృష్టికందని సృష్టి ఉందేమో? సృష్టికందని దృష్టి ఉందేమో?
వాక్కుకందని అర్థముందేమో? మనసుకందని భావ ముందేమో ?
వ్యక్తిని ఆవరించే శక్తి ఉందేమో ? శూన్యాన్ని చిత్రించే చైతన్యముందేమో?
ఉన్నట్టే ఉంది - ఊగింది శిరస్సు పరవశించింది
ఉన్నట్టే ఉంది - మోగింది శరీరం పరిస్పందించింది"

అంటూ మానవ ఊహల అంతులేని హద్దులను, కనిపించే ప్రపంచానికావల తెలుసుకోవాలనే ఉత్సుకతను, ఈ లోకానికి భిన్నమైన లోకం ఒకటుంటుందనే నిర్ధారణకు మానవుడికి రావడం లాంటి అతడికి ఆనందం కలిగించే విషయాలకు కవితా రూపమిస్తారు సినారె. కళాత్మకతలోనూ వైజ్ఞానికంగానూ ఎన్నో ఎత్తులు చూసిన మానవుడు ఆధ్యాత్మికతను సాధించడంలో మాత్రం వెనుకంజలో ఉన్నాడు. ఆధునిక మానవుడి అహం దైవత్వానికి ఒక స్థిరమైన ప్రాతిపదికను కల్పించలేకపోవడం కూడా చూస్తున్నాం. మానవుడి అభివృద్ధిపై దేవుడికి ఉన్న ఫిర్యాదులను కవితాత్మకం చేస్తారు సినారె.

"పరమాణువుల శిరసుల్లో చొరబడి
పరికించిన సత్యాల పరమావధి
వినూత్న చైతన్య సృజనమా ?
విశ్వ గోళ విధ్వంసనమా?
ఎంత పచ్చగా వెలుగుతున్నది

ఇన్నాళ్ళు నువ్వు పెంచిన సంస్కృతి
మానవ హననంలో
సమజీవన దహనంలో"

సాధించిన సాంకేతికాభివృద్ధి రెండంచుల కత్తిగా మారిన తీరును చెబుతూ నిజానికి జరిగింది పురోగతా? విధ్వంసమా? అంటూ ప్రశ్నిస్తారు సినారె. అయితే ఎన్ని సమస్యలెదురైనా తన అవిరళకృషికి అంతం లేదంటాడు మనిషి

"ఆకులు రాలిపోతేనేమి?
చిగురాకులు పుట్టవా?
నీళ్ళు ఇగిరిపోతేనేమి?
నీలిమబ్బులు గజ్జెకట్టవా?"

అంటూ అంతులేని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తాడు మనిషి. మానవ సాధన ఎక్కడ ప్రారంభమైందనే ప్రశ్నతో మొదలైన విశ్వంభర. మానవుడి సానుకూల దృక్పథం కలగలసిన ప్రశ్నతో ముగుస్తుంది. ఇది సినారె సంప్రదాయ, ఆధునిక కావ్య సంస్కృతుల మేలి మేళనను, అద్భుతమైన శిల్పచాకచక్యతనూ సూచిస్తుంది. ప్రశ్న, అన్వేషణ మానవ ప్రగతికి, ఆధునికతను సంకేతం. ప్రశ్నతోనే ఆధునిక మానవ జీవితం ప్రారంభమై, ప్రశ్నతోనే ముగుస్తుంది. విశ్వంభర అదే రీతిగా ప్రస్థానించి భారతీయ మానవ జీవితపు సాధనా త్రయమైన సత్యం, శివం, సుందరాలను భావించి, దర్శించి, చిత్రిస్తుంది. అందుకే అత్యున్నతస్థాయి ఆధునిక వచనకావ్యంగా గుర్తింపు పొందింది.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పర్యావరణ వేదన... కొండెపోగు ఆవేదన

- యు. అంజిరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగము, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ప్రాచీనకాలంలో కావ్యాలలో అష్టాదశ వర్ణనలలో ప్రకృతి ఉన్నత స్థితిని అందుకొంది. అది అప్పటి అవసరం. సాహిత్యం సామాజిక అవసరాలకు అనుగుణంగా రూపాంతరత చెందుతుంది. ప్రజలను విజ్ఞానోన్ముఖులను చేయడం కోసమో, ధర్మాచరణని ఉపదేశించడం కోసమో, కష్టసుఖాల సమతౌల్యతను వివరించడం కోసమో, మానవత్వానికి పాదులు వేయడం కోసమో, విస్తారమైన విజ్ఞానానికి రూపం ఇవ్వడం కోసమో, శాస్త్ర సాంకేతిక విషయాలను మర్మాలను ప్రభోదించడం కోసమో, దేశీయ అవసరాలైన స్వేచ్ఛ కోసమో, స్వాతంత్ర్యం కోసమో సాహిత్యం నిరంతరం పంథా మార్చుకొంటూ ప్రవహిస్తుంటుంది.

విజ్ఞానంతో విశ్వాన్నే జయిస్తున్న ప్రస్తుత రోజుల్లో సహజ ధర్మాలు, సహజవనరులు, సహజనైపుణ్యాలు, సహజ బంధాలు కునారిల్లిపోతున్నాయి. తక్కిన విషయాలెలా ఉన్నా ప్రకృతి తీవ్ర నిర్లక్ష్యానికి గురికావడం ఒక వినాశకర విషయం. కాలుష్యపు కోరల్లో మహానగరాలే ప్రాభవాన్ని కోల్పోతున్నా, కర్మాగారాల విషవాయువులకు క్షామం ఆవరిస్తున్నా గుక్కెడు నీళ్ళు కరువై జనం అలమటిస్తున్నా, ఘోర్లిన్ భూతానికి బలై ప్రాణులు అంతరిస్తున్నా, ఈ పాపం మొత్తం మనదే. నాగరికత ముసుగులో మనం చేస్తున్న విధ్వంసానికి మూల్యం చెల్లించాల్సింది మనమే. ఎంతో కీలకమైన ఈ విషయాన్ని తన కవితా వస్తువుగా ఎంచుకొని రచనలు చేశారు.

నాడు విలాసమైన ప్రకృతి నేడు విలాపమై కనిపిస్తోంది. ఆ వేదనే నేడు డా॥ కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్ ఆవేదనై "ఆకుపచ్చ శోకం" గా కవన రూపం దాల్చింది. స్వయంగా సామాన్య శాస్త్రంలో ప్రవీణులైన డా॥ కొండెపోగు శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశ్వవ్యాప్తంగా జరుగుతున్న విస్రుంఖలతను, విధ్వంసాన్ని కవిత్వీకరిస్తూ జనజాగృతి కోసం దృష్టి సారించారు. అందులో భాగంగా వెలువడిందే "ఆకుపచ్చ శోకం". పరి + ఆవరణం = పర్యావరణం అన్న పదంలో మనం, మన చుట్టూ అనే అర్థాన్నిస్తాయి.

మన చుట్టూ ఉండే పరిసరాలు, నీరు, గాలి, వాతావరణం, శబ్దం, వస్తూత్పత్తి, జీవితపు ముఖ్యసమస్యలు, అడవులు, ఆనకట్టలు, ఆరోగ్యం, శక్తివనరులు, వన్యప్రాణులు మొ॥ సహజవనరులపై పరిసరాల ప్రభావాన్ని పర్యావరణంగా భావిస్తున్నాం.

డా॥ కొండెపోగు కలుషితమౌతున్న పంచభూతాత్మిక ప్రపంచాన్ని కళ్ళముందు చూపిస్తూ, తత్పరిరక్షణ జనుల వివేకంతోనే సాధ్యమవుతుందనే సందేశాన్నిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కూడా భగవంతుని చేరే మార్గమేనని వాతావరణాన్ని కలుషితం చేయకుండా ఉండడమే నిజమైన పూజ అని భూగోళాన్ని కాపాడుకోవడం మన విధి అని ఉద్బోదించారు. తాను సృష్టించలేని దానిని నాశనం చేసే హక్కు మనిషికి లేదనే విషయాన్ని కవిత్వీకరించారు. వీరి కవిత్వంలో అడుగడుగునా పర్యావరణాన్ని కాపాడుకోవాలనే తపన కనిపిస్తోంది.

డా॥ కొండెపోగువారి "ఆకుపచ్చ శోకం" పర్యావరణం కవితా వస్తువును స్థూలంగా పరిశీలిస్తే

### 1. వృక్ష విలాపం

"చివరి చేప కనుమరుగైనపుడు
చివరి నది విషపూరితమైనపుడు
చివరి చెట్టు కూడా కోతకు గురైనపుడు మాత్రమే
డబ్బును తినలేనని మానవాళి గుర్తిస్తుంది.

ఒక పర్యావరణ వేత్తగా పి.యస్ హారిపై అభిప్రాయాలు తెలియజేయడానికి మన కళ్ళ ముందు అడ్డు అదుపులేకుండా జరుపుతున్న పర్యావరణ విధ్వంసమే కారణం. ప్రపంచ మానవాళి అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేయడాన్ని చూస్తూ ఊరికే ఉండలేని వాళ్ళు తమ గొంతులు ఎక్కుపెట్టడం అనివార్యమయింది.

చెట్టును నరకడమంటే మనిషి తనను తాను విధ్వంసం చేసుకోవడమేనని తెలుపుతూ ఊరు పెరిగే కొద్దీ ఇప్పుడు చావు చెట్లదై పోతుందని ఆవేదన చెందుతారు.

ఆధునికీకరణ తంత్రంలో
పొలిమేరల్లోని చెట్లూచేమలన్నీ
యుద్ధంలో వీరోచితంగా మరణించిన
సైనికుల ఖండిత విగతదేహాల్లా
మైదానమంతటా భీభత్సంగా పడుంటాయి.
(ఆకుపచ్చ శోకం పుట. 28)

నగరీకరణ, విస్తరణ ద్వారా వృక్ష విచ్ఛిత్తి ఎక్కువగా జరుగుతోందని నగరంలో ప్రతిదానికీ చెట్టు అడ్డమనే పేరుతో నిర్మూలించడాన్ని ఈ కవి తీవ్రంగా నిరసించారు. ఇదే కవితలో ఒక వైపు చెట్లను నరికేస్తూ ప్లాస్టిక్‌చెట్లను అలంకరించడాన్ని వ్యతిరేకిస్తూ ప్లాస్టిక్ కొబ్బరిచెట్లు ముస్తాబైన శవాల్లా దర్శనమిస్తుంటాయనడం కవిలోకజ్ఞతకు చక్కని ఉదాహరణ "మనిషికి ఎప్పటికి తెలిసొచ్చేను? చెట్టు విలువ !" అంటూ వృక్షాల్ని నరుక్కుంటూ పోతే నేల ఎడారయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## 2. భూమి కాలుష్యం :

సకల చరాచర జీవకోటితో పాటు మానవుడు కూడా భూమి మీద ఆధారపడి జీవిస్తున్నవాడే. మనిషి కూడా ప్రకృతిలో భాగమే కాని అతీతుడైన వాడు కాడు. అతను కూడా ప్రకృతితో సహజీవనం చేయక తప్పదంటూ ప్లాస్టిక్ వ్యర్థాలవల్ల అనర్థాల్ని నిశ్శబ్దంగా అవి సృష్టించే విధ్వంసాల్ని తెలియజేస్తూ "క్యారీ బ్యాగ్ విషాదం" కవితలో

ఏదోచిన్న
ప్లాస్టిక్ క్యారీబ్యాగ్ అనుకుంటాం
కానీ అదెన్ని అవాంతరాలు సృష్టిస్తుందో
ఎన్ని మూగజీవాలకు
ప్రాణ సంకటంగా మారిపోతోందో అంటూ
(ఆకుపచ్చ శోకం పుట.17)

ఈ క్యారీబ్యాగ్ నేల తల్లిగుండెల్లో కర్కశపు బాకులా దిగి పోతుందని పర్యావరణ సమతుల్యాన్ని తలకిందులు చేస్తూ ప్రకృతి పచ్చటి దేహంలోకి తూటాలాగా దూసుకుపోతోందని కవిత్వీక రించారు. క్యారీబ్యాగ్ విచ్చలవిడిగా వాడటమంటే... అది జాతి విధ్వంసమేనని తద్వారా మనం పర్యావరణ నాశకులమేనని తేల్చే శారు. అంతేగాక టన్నుల కొద్దీ రసాయనాల్ని కుమ్మరించి మట్టి చర్మాన్ని ఇష్టారాజ్యంగా పెకలించేవారు, పారిశ్రామిక వ్యర్థాల్ని వదిలే కర్మాగారాలు, చీడపీడల నిర్మూలనకై వాడే పెస్టిసైడ్లు చేసే అనర్థాల వలన నేలతల్లి విషరసాయనాలతో అగ్నితల్పంగా మారి మానవాళి బుగ్గి పాలవుతుందని హెచ్చరించారు.

## 3. ధ్వని కాలుష్యం :

ఆధునికీకరణ, నగరీకరణ ప్రభావం వల్ల ప్రయాణ సాధ నాలు ఎక్కువై రణగొణ ధ్వనుల వల్ల కలిగే శబ్దాలు, వాహనాల్లో పాటల హోరు, పెళ్ళిపేరంటాలు, దీపావళి సంబరాల సమ యంలో వచ్చే భీకర శబ్దాలు, సగటు ప్రజల మానసిక స్థితిపై ప్రభావం చూపుతున్నాయని శృతిమించిన ధ్వనితో మానవ శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయని డా॥కొండెపోగు తన "శబ్ద ఘాతం" కవితలో కవిత్వీకరించారు. "సెల్లు చీటి" అనే కవితలో శబ్దతరంగాల ద్వారా, రేడియేషన్ ఆధారిత తరంగాల ద్వారా మానవులకు జరుగుతున్న నష్టాలను తెలియజేస్తూ

చేతుల్లో ఇమిడిపోయే
ఒక యంత్రం
నడుపుతోంది తంత్రం
ఏ చెవికి విరామం లేదు
ఏ కర్ణ భేరికీ భద్రత లేదు
(ఆకుపచ్చ శోకం పుట. 24)

సెల్లును పిల్ల భూతంతో పోల్చి ఏదైనా మితి మించితే ప్రమాదం అని, చెట్లు విషవాయువుల్ని పీల్చుకొని ప్రాణ వాయువును జీవరాశికి వరంగా ఇస్తుంటే ఈ సెల్ టవర్లు మాత్రం రేడియేషన్ తరంగాల్ని, ప్రాణాల్ని హరించే అయస్కాంత క్షేత్రాన్ని మారణాయుధాలుగా మనిషి మీదికి అవిశ్రాంతంగా వదులు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏదో నిగూఢ బాణం గుప్తంగా
నెత్తురు చిందని హత్యలు చేస్తుంది.
(ఆకుపచ్చశోకం పుట. 26)

అంటూ సెల్లును వినియోగించడం మోతాదుకు మించితే ఆయుష్షుకు చెల్లుచీటి రాస్తుందని లివింగ్‌స్టన్ గారు హెచ్చ రించారు.

## 4. వాయుకాలుష్యం :

వాయుకాలుష్యం మానవ మనుగడపై ఎంత వేగంగా ప్రభావం చూపుతుందో 'విషవీచిక' కవితలో

ఇప్పుడు నీళ్ళను కొంటున్నట్టు
క్యూబిక్కుల చొప్పున గాలిని కూడా
కొని దాచుకు బతుకాలేమో
(ఆకుపచ్చ శోకం పుట.50)

అన్న సందేహాన్ని వ్యక్తం చేయడం సముచితంగా ఉంది. కాలుష్య రహిత సమాజానికై పెట్రోరహిత దినాన్ని ఆచరిస్తూ ప్రత్యామ్నాయ సౌరశక్తిని ఆశ్రయిస్తూ పొగరాని వాహనాలకై పాటు పడాలని ఇకో ఫ్రెండ్ షిప్ కర్మాగారాల్ని నిర్మిస్తూ జనావాసాల్ని నరకానికి నకళ్ళుగా మార్చకుండా

స్వచ్ఛమైన గాలిని
ముందుతరాలకు
వారసత్వంగా అందిద్దాం! (ఆకుపచ్చ శోకం పుట.53)

అని మంచి సూచనజేసిన కవి అభినందనీయులు.

## ఉపసంహారం :

పర్యావరణాన్ని కాపాడుకొనే ప్రయత్నంలో భాగంగా ప్లాస్టిక్ సంచుల సమస్యతో మొదలు పెట్టి వాయు, శబ్ద కాలుష్యాలతో పాటు సెల్లు కాలుష్యం, గురించి అవలీలగా చేసిన పద ప్రయో గాలు అనుసరించిన వైఖరి రచయిత సునిశిత పరిశీలనకు అద్దం పడతాయి. "మనం తిరిగి ఎంత ఇవ్వగలమో అంతే భూమి నుండి వాతావరణం నుండి మనం గ్రహించాలి" అంటూ స్వచ్ఛ మానవులుగా మానవ సమాజాన్ని మళ్ళీ పునర్నిర్మించుకొనే దిశగా ప్రయత్నిద్దామన్న సందేశాన్ని ఆహ్వానిస్తూ ఈ కవితా సంపుటి "ఆకుపచ్చశోకం" అనే పేరుతో "పర్యావరణ వినాశనాన్ని" అరికట్టే ప్రయత్నంలో ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించిన రచయిత "డా॥ కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్" గారు తన వంతు విశిష్ట ప్రయత్నమే చేశారనడం అతిశయోక్తి కాదు.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆధునిక తెలుగు సాహిత్యం - కరువు ప్రభావ చిత్రణ

- డా॥ గుండ్లూరి వెంకట రమణ, ఆంధ్రోపన్యాసకులు, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల, గుడివాడ, కృష్ణా జిల్లా.

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం. సమాజం మంచి చెడ్డల్నీ, దాని ఉత్థాన పతనాల్ని అర్థం చేసుకోవటానికి సాహిత్యం ఒక ప్రధాన సాధనంగా ఉపయోగపడుతుంది. సమాజంలో ఉండే అంశాలే సాహిత్యంలో ప్రతిఫలిస్తుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 'మానవ జీవన మేధోసారమే సాహిత్యం'. ఈనాడు మనం సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యమనీ, ఆధునిక సాహిత్యమని రెండు రకాలుగా చెప్పుకుంటున్నాం. ఆధునిక సాహిత్యంలో నవల, కథ, కథానిక, నాటకం, గేయం, విమర్శ, వ్యాసం, స్వీయ/జీవిత చరిత్రలు ప్రధాన సాహిత్య ప్రక్రియలు.

మానవ జీవితానికి సాహిత్యం ప్రతిబింబం అనుకుంటే ఆ మానవ జీవితాన్ని నిర్దేశించే అంశాలయిన సాంఘిక, ఆర్థిక రాజకీయాలు మనిషి చుట్టూ ఉన్న ప్రకృతినీ, దాని నియమాలను భావ దృష్టితో అధ్యయనం చేస్తున్నామా? లేదా భౌతిక దృష్టితో అధ్యయనం చేస్తున్నామా? అన్నది చాలా ప్రధానం. భావదృష్టి నమ్మకంపైన ఆధారపడితే, భౌతికదృష్టి పదార్థ విజ్ఞానం పైన ఆధారపడి ఉంటుంది.

ఆధునిక సాహిత్యంలో ప్రజాస్వామిక భావాలూ, అభ్యుదయ భావాలూ, సామాన్య మానవులు, వాళ్ళ జీవన ఉత్థాన పతనాలూ, కన్నీళ్ళు, కడగండ్లూ, ఆశానిరాశలు ఇలాంటి అంశాలు ప్రాధాన్యత వహించాయి.

రచనాపరంగా చూసినప్పుడు ఆధునిక సాహిత్యంలో నవీన ధోరణులు కనిపిస్తాయి. ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక విద్యలు విస్తారంగా అభివృద్ధి చెందడంవల్ల, పాశ్చాత్య దేశాల్లో సంభవించిన అనేక మార్పులవల్ల, ఫ్రెంచి విప్లవం ముందుకు తెచ్చిన ప్రజాస్వామిక భావాలవల్ల పారిశ్రామిక విప్లవం తెచ్చిన వస్తూత్పత్తి వల్ల, వలసలవల్ల, అచ్చు యంత్రాల ఆవిష్కరణల వల్ల, పత్రికలు ప్రచార, ప్రసార సాధనాల అభివృద్ధి వల్ల పాశ్చాత్య దేశాల్లో 16, 17 శతాబ్దాల్లో ఆధునిక సాహిత్య ఆవిర్భావం జరిగిన తర్వాత, వాటి ప్రభావాలతో భారతదేశంలో 19వ శతాబ్దం ఉత్తరార్థంలో ఆంగ్లభాషా సంస్కృతుల ప్రభావ ఫలితంగా ఆధునిక సాహిత్యం ఆవిర్భవించింది.

## కరువు క్షామం :

సాధారణంగా కరువు అనే మాటకు మట్టిముద్ద, కరిగే మూస, పోతపోసే అచ్చు, గర్భం, గర్భస్థపిండం, కాటకం, ఎద్దడి, బంగారం, కాటకతనం, కిరాతత్వం, దాడి, దోపిడీ, క్షామం, ఆకలి, నీటి ఎద్దడి, శుష్కత, తడిలేకపోవడం, ఎండిపోవడం, దప్పిక, వర్షాభావం అనే అర్థాలున్నాయి. క్షామం అనే మాటకు - కృశం, సన్నగిల్లిన, చిక్కిపోవడం, అల్పం, చిన్నది, నాశం అనే అర్థాలున్నాయి. ప్రధానంగా కరువు, క్షామం, కాటకం అనే మాటలకు నిఘంటువుల్లో, శబ్ద వ్యుత్పత్తి కోశాల్లో 'ఆకలి' అనే అర్థాన్ని ఇవ్వడం జరిగింది. ఇక్కడ కరువంటే నీటికొరత, వర్షాభావం, ఆహారకొరత, ఆకలి చావులు, అప్పుల బాధలు అనే అర్థాల్లో తీసుకోవడ జరిగింది.

కరువంటే నిలువ నీడ లేకపోవడం, కట్టుకోవటానికి బట్టలు లేకపోవడం మాత్రమే కాదు. మింగడానికి పిడికెడు మెతుకులు లేకపోవడమే అసలైన కరువని చెప్పవచ్చు. నిట్ట నిలువునా నిండు ప్రాణాల్ని మరణానికి నెట్టేసే భయంకర పరిస్థితే కరువు. తిండి గింజలకు విపరీతమైన కొఱత ఏర్పడి, కొనుక్కోవడానికి డబ్బులు లేక, ఒకవేళ డబ్బున్నా కొనుక్కోవడానికి ధాన్యం ఏమీలేక, జనసామాన్యానికి బతుకు దుర్భరమై, చివరికి అధిక సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే దుస్థితిని కరువని చెప్పుకోవచ్చు

ఒక ప్రాంతంలో పెద్ద ఎత్తున ఆహార కొరత, ఆకలి చావులు, అధికధరలు ఉంటే ఆ స్థితిని కరువు అంటారు. ఒక సంవత్సర కాలంలో ఒక ప్రాంతంలో వర్షపాతం 75 శాతం కన్నా తక్కువగా ఉంటే ఆ స్థితిని క్షామం అంటారు.

అమెరికా (శాస్త్రజ్ఞులు) వాతావరణ శాస్త్రజ్ఞులు "తీవ్రమైన పొడివాతావరణంలో తగుమాత్రం నీరులేక పంటల్లో నష్టం ఏర్పడితే ఆ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా చెప్పవచ్చు" అన్నారు.

"కొన్ని నెలలు లేదా సంవత్సరాలు కొద్దిపాటి వర్షంతో దేశం అల్లాడి పచ్చిగడ్డి, నీరు మాయమైపోయి, పంటలన్నీ పనికి రాకుండాపోయి, పశువులు చనిపోతే ఆ పరిస్థితిని క్షామ పరిస్థితి అనవచ్చు" అనేది ఆస్ట్రేలియా శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

"తీవ్రమైన నీటి ఎద్దడిని క్షామ పరిస్థితి"గా చెప్పవచ్చు అనేది వాతావరణ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. "గాలిలోని తేమ కొరత"ను కూడా క్షామ పరిస్థితిగా పేర్కొనవచ్చు. ఆరోగ్యానికి అవసరమైన పదార్థాల కొరత ఏర్పడినపుడు దానిని ఆకలి సమస్యగా పేర్కొంటాం. ఆహారపదార్థాలు ఏమాత్రం కొఱత ఏర్పడినా దాన్ని 'కొఱత' అంటారు. మనదేశం ప్రధానంగా వ్యవసాయక దేశం. అందులోనూ వర్షాధార వ్యవసాయ దేశం. అందుకే వద్దన్నా కరువు పలకరిస్తుంది. ప్రజల్ని బలిగొంటుంది. వ్యవస్థను స్తంభింపజేస్తుంది.

## కరువుకుగల కొన్ని ప్రధాన కారణాలు :

కరువు రావడానికి గల కొన్ని ప్రధాన కారణాలుగా క్రింద పేర్కొన్న అంశలను చెప్పవచ్చు.

1. వర్షాభావం (అనావృష్టి), 2. అధిక వర్షపాతం, 3.వరదలు, 4. ఉప్పెనలు, 5. మంచు తుఫాన్లు, 6. ప్లేగు, 7. చీడ పురుగుల ద్వారా పంట నష్టం, 8. యుద్ధం, 9. అంతరంగిక కల్లోలాలు, 10. దరిద్రం, 11. భూకంపాలు, 12. లహోర్‌లు, 13. కొండ చరియలు రాలడం, మట్టి ప్రవాహాలు, 14. అగ్ని పర్వతాలు ప్రేలడం, 15. ప్రాణాపాయ వాయువులు ఆకస్మిక విడుదల, 16. సునామీలు, 17. వడగండ్ల తుఫానులు, 18.ఉష్ణ పవనాలు, 19. వాయుగుండ తుఫానులు, 20. వడగాలులు వీచడం, 21. అగ్ని ప్రమాదాలు, 22. ప్రభావాల సంఘటనలు, 23. సౌరజ్వాలలు.

## కరువు దుష్ఫలితాలు :

1. పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. 2. జనాభా పెరుగుదల రేటు తగ్గిపోవటం. 3. నేరాల సంఖ్య పెరగటం, 4.బందిపోట్లు, దొంగలు పెరగటం, 5. దాడులు, హత్యలు పెరగటం, 6. రోగాలు, అంటువ్యాధులు వ్యాపించడం, 7. కలరా, విరోచనాలు సంభవించడం, 8. ఆకలి, అనారోగ్యం పెరగటం, 9. అధిక ధరలు, 10. వలసలు ఏర్పడటం, 11. పనిలో ఉదాసీనత స్వభావం, 12. ఆకులు అలములు తినడం, 13. భూముల్ని, పశువుల్ని అమ్ముకోవడం, 14. స్త్రీలు తమ శరీరాల్ని అమ్ముకోవటం, 15. ఆత్మహత్యలు చేసుకోవటం, 16. వ్యభిచారాలు, దొంగతనాలు పెరగటం, 17. ఆహారం / నీరు కొఱత, 18. పంటలు పండకపోవడం, 19. మనుషులు నైతికంగా పూర్తిగా పతనం కావడం, 20. ఆర్థిక వ్యవస్థ పతనం వంటి నష్టాలు సంభవిస్తాయి. కరువు అట్లాగే రిజర్వాయర్లలో, సరస్సుల్లో నీరు ఇంకిపోవడం వల్ల జల సంబంధమైన కరువు ఏర్పడుతుంది.

## కరువు - నివారణ చర్యలు :

1. వ్యవసాయం కోసం సముద్రపు నీటిని 'నిర్లవణీకరణ' చేయటం, 2. కరువు ప్రాంతాలు పర్యవేక్షించాలి. 3. ఉపరితల నీటి వినియోగంపై ఆంక్షలు ఉండరాదు. 4. వాన నీటిని నిల్వచేయాలి. 5. పునరుపయోగ జల వినియోగం పెరగాలి. 6.నీటి మళ్ళింపులు జరగాలి. 7. ఆహార భద్రత కల్పించాలి. 8. అడవుల నిర్మూలన నిషేధం చేయాలి. 9. నష్టపరిహార చెల్లింపులు జరగాలి. 10. ప్రభుత్వ తక్షణసాయం అందించాలి. 11. రైతులకు సబ్సిడీ రుణాలు/ పంటల భీమా ఇవ్వాలి. 12. ఆరోగ్యం కుటుంబ సంరక్షణ కల్పించాలి.

ఆధునిక సాహిత్యం ఆధునిక జీవితమంత విస్తృతమైంది. ఆధునిక సాహిత్య ప్రక్రియలైన వచన కవిత్వం, నవల, కథానిక, గేయం/ పాటల్లో చిత్రించబడిన కరువులను అధ్యయనం చేయడం. గురజాడ, శ్రీశ్రీ, తిలక్, కృష్ణశాస్త్రి, బైరాగి, అజంతా, పురిపండా అప్పలస్వామి, చలం, జాషువా, విశ్వనాథ వారందించిన కవిత్వాన్ని పరిశీలించడం, అందులోని కరువుల్ని చిత్రించడం. బుచ్చిబాబు అందించిన 'చివరకు మిగిలేది' నవల, ఇనాక్ 'సర్కారుగడ్డి', జి. కళ్యాణరావు 'అంటరానితనం', ఉప్పెన (సరిపల్లి క్రిష్ణ), వి.ఆర్. రాసాని వరస, పరస బతుకాట, వేంపల్లె గంగాధర్ నేలదిగినవాన, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కాడి నవలల్ని పరిశీలించడం, చింతా దీక్షితులు, శంకరంమంచి సత్యం, కేతు విశ్వనాథరెడ్డి, సభా, సింగమనేని నారాయణ, మధురాంతకం రాజారాం, పలమనేని బాలాజీ, వేంపల్లి గంగాధర్, వేంపల్లి షరీఫ్, శాంతి నారాయణ, బండి నారాయణస్వామి, కథకులందించిన కథల్ని పరిశీలించడం, దాశరథి, ఆత్రేయ, సి.నా.రె., సుద్దాల హనుమంతు, గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ అందించిన పాటల్లో చిత్రించబడిన కరువుల్ని పరిశీలించడానికి పై రచనల్ని తీసుకోవడం జరిగింది.

శాంతినారాయణ అందించిన - దళారి, మట్టి మరకలు, జీవనాడులు, కల్లమయిపాయ, విజయవిహారం, పల్లేరుముల్లు, గర్భస్రావం, తాలుగింజలు, మనిషయినందుకు, ఎటుచూస్తే అటు, బమ్మా బరుసూ, నిర్ణయం, రొంపి, ఉక్కుపాతం, మట్టి మనుషులు అనేవి కరువు కథలు.

చక్రవేణు రాసిన 'కసాయి కరువు కథలో ప్రేమగా పెంచుకున్న ఆవును కరువువల్ల అమ్ముకోవాల్సి వచ్చిన దుస్థితిని వివరించడం జరిగింది.

జింబో రాజేందర్ - ప్రముఖ నాయవాది. తెలంగాణా ప్రాంతంలోని పల్లెల పూర్వరూపాల్ని తన కథల్లో అత్యంత సహజంగా చిత్రీకరిస్తున్న నేటి కథకుల్లో జింబో ఒకరు. ఆయన రాసిన పాతాళగరిగె కథలో తన ఊర్లో ఎండిపోయిన బావుల్ని, నీళ్ళు లేకపోవడంవల్ల పూడ్చివేసిన బావుల్ని మన కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు. 'చెరువు' కథలో కరువువల్ల 'చెరువు' ఎండిపోయిన విధానాన్ని చూపించారు.

మధురాంతకం రాజారాం రాసిన కథలు - రాతిలో తేమ, ఎదురుగాలి, సాక్షాత్కారం, రంగయ్య తమ్ముడు, రోడ్డుమీద మనిషి, ఆశ్రయం, రాణీసాహేబా, రంగయ్యరావు, నేలా నింగీ మొదలయినవి. "ఇక్కడ మేమంతా క్షామం" అనే కథలో ఈరయ్య అనే పనోడు మూడోతరం వ్యక్తికి తన గురించి చెబుతూ వాళ్ళ ఒక్క బోరింగు బాయిలో తప్పితే యింకెక్కడా నీళ్ళులేవు. పూర్వ కాలం గురించి చెబుతూ వరిమల్ల ఆశ ఎపుడో వదులుకొన్రి. తడిసాలక సెరుకు దోటలు గూడా వాడిపోయి గరికపోసయినా నోటికి దొరక్క గొడ్డు గోదలన్నీ ఎముకల గూళ్ళయిపోయే. రైతులు దిగులుతో చిక్కి సగమైపోయిరి. మన అరిజనవాడలో నాలుగైదు కుటుంబాలు దప్పితే మిగిలినోళ్ళందరూ పొట్టసేతబట్టుకొని దేశాలపాలై పోయిరి అంటాడు.

దస్తగిరి రాసిన - భగీరథుడు వ్యాపారి, తిండికొరకు, ఉరితాడయిపో, కొట్లాట, తగాదా, రాక్షసి, వ్యాపారి, రొట్టెముక్క,

పంత, పెండ్లి పిలుపు, మాడం తులసమ్మ రాజీ, అనువంటి వంటి కథల్లో కరువుకు సబంధించిన అనేక విషయాలను చిత్రించారు. కరువువల్ల ఏర్పడిన అనర్థాల్ని, దాని నష్టాల్ని చూపించారు.

గిడుగు రాజేశ్వరరావు రాసిన - ఎక్కడ మబ్బు ఎక్కడవాన, పంజరం నచ్చిన చిలుక, గుప్పెడు ఆకాశం, ఇబ్రహీం - కాలానికి ఎదురీదుతున్నవాడు, ఎస్.వి. ప్రసాద్ - వ్యసనం, ఇంజేటి శ్యాం బాబు - ఆకలేమయిందమ్మా, స్వామి - తెల్లదెయ్యం, కె.ఎన్. బాలాజీ - సంకోచం, వాడ్రేవు వరలక్ష్మీదేవి - ఇలా ఉన్నాం, పెద్దింటి అశోక్‌కుమార్ - తెగినబంధాలు, వేంపల్లి గంగాధర్ - మూడు పదున్లవాన, మొలకలపున్నమి, దింపుడు కళ్ళం, మైనం బమ్మలు మొదలగు కథల్లో కరువు పరిస్థితులు చిత్రించబడ్డాయి.

బోయ జంగయ్య రాసిన 'ఒయాసిస్సు'లో కథలు వరద లవల్ల సంభవించిన కష్టాల్ని "లేకి మనుషుల్లో" కరువు కాలంలో పరిగె ఏరుకున్న మనిషిని నీలదీసి పరిగెను కూడా సగం ఉంచి సగం తీసుకెళ్ళమంటారు.

ఈ విధంగా సభా, కేతు విశ్వనాథరెడ్డి, సదుం జయరాం, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, చక్రవేణు, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, దాదిహయత్, శశిశ్రీ, విశ్వప్రసాద్, చిలుకూరి దేవపుత్ర, చింతా అప్పల్నాయుడు, అట్టల్ అప్పల్నాయుడు, అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, సుంకోజి, దేవేంద్రాచారి, జాతశ్రీ, బి.ఎస్. రాములు, తుమ్మేటి రఘూత్తమరెడ్డి మొదలైన అనేకమంది కథకులు రాసిన కథకుల కథల్ని సేకరించి, పరిశీలించి పరిశోధించడం జరుగుతుంది.

**అయిదవ అధ్యాయం - పాట / గేయం - కరువు ప్రభావ చిత్రణ :**

**పాట** : శ్రీశ్రీ, ఆత్రేయ, కృష్ణశాస్త్రి, దాశరథి కృష్ణమాచార్యులు, సుద్దాల హనుమంతు, అశోక్‌తేజ, గద్దర్, సినారె, అందెశ్రీ, గోరటి వెంకన్న మొదలగు గేయరచయితల గేయాల్ని తీసుకొని పరిశీలించడం జరుగుతుంది.

**ముగింపు :**

కరువనేది అనాది కాలం నుంచి మానవ సమాజాన్ని అతలాకుతలం చేసిన సమస్యల్లో ఒకటి. వీటిపై పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి పరిశోధనలవల్ల సమాజానికెంతో ఉపయోగపడుతుంది. కరువు ఏ ప్రాంతంలో ఎక్కువుందో గుర్తించవచ్చు, ముందస్తు నివారణా చర్యల్ని తీసుకోవచ్చు. ప్రభుత్వ సహాయలు, ప్రాజెక్టుల నిర్మాణాలు, దీర్ఘకాలిక ప్రయోజనాల్ని ఆశించి చేయవచ్చు. సాహిత్యం సమాజంతో, సమాజం సాహిత్యంతో ముడివడి ఉంటాయి. కాబట్టి ఇలాంటి సామాజిక పరిశోధనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# ఆధునిక ఆంధ్ర భాషా సాహిత్యాలపై 'గిడుగు' ప్రభావం

– డా॥ ఎ. ఎ. నాగేంద్ర, పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము, అనంతపురము.

భారతదేశాన్ని ఆధునీకరించడానికి అవసరమైన మేధావులు, కళాకారులు దేశవ్యాప్తంగా 18వ శతాబ్దం చివరిలోను, 19వ శతాబ్దంలోనూ జన్మించారు. వీళ్ళందరినీ భారతీయ పునర్జీవన యుగ మేధావులు అంటారు. రాజారామమోహన్‌రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, మహాత్మా జోత్యిరావ్ పూలే, మహదేవ గోవింద రనడే, డా॥ బి.ఆర్. అంబేద్కర్, కందుకూరి వీరేశలింగం పంతులు, నారాయణ గురు మొదదలైన సంఘ సంస్కరణ ఉద్యమకారులంతా ఈ కాలంలో పుట్టినవారే. అలాగే రవీంద్రనాథ్ ఠాగూర్, బకించంద్ర చటర్జీ, మున్షీ ప్రేమ్‌చంద్, హరినారాయణ ఆప్టే, సుబ్రమణ్యం భారతి, గురజాడ అప్పారావు, కుమార నాశాన్ వంటి రచయితలు కూడా ఈ కాలంలోనే పుట్టారు.

భూస్వామ్య వ్యవస్థలో వేల సంవత్సరాలుగా కొనసాగిన భారతదేశం వలస పాలకుల రాకతో, అనివార్యంగా మార్పులకు లోనైనది. 18వ శతాబ్దం నాటికి భారతదేశంలో రాచరిక యుగ సాహిత్యం గిడసబారిపోయింది. వస్తువులోనూ, భావుకతలోనూ, భాషలోనూ భారతీయ సాహిత్యం ఒక శిథిల దశకు చేరుకుంది. ఆ సమయంలో వలస పాలకులు తమ పెట్టుబడీదారీ వ్యవస్థను భారతదేశంలోకి తీసుకొచ్చారు. యాంత్రిక నాగరికతను తీసుకొచ్చారు. పాశ్చాత్య విద్యావిధానాన్ని ప్రవేశపెట్టారు. ఇవి భారతీయుల ఆలోచనల్లో, అభిరుచులల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాయి. భారతీయ ప్రజాజీవితంలో అంతకు ముందెన్నడూ ఊహించని మార్పులు వచ్చాయి. సమాజంలో వచ్చే మార్పులు సాహిత్యంలోను మార్పులు తీసుకురావడం సహజమైన పరిణామము.

తెలుగుసాహిత్యం 19వ శతాబ్దం చివరి నాటికి గారడీల స్థితికి దిగజారిపోయింది. సాహిత్యం సమాజం కోసమని, అది సామాజిక వాస్తవికతను ప్రతిబింబించాలనే స్పృహ కోల్పోయి, కవిత్వమంటే భాషాపరమైన విన్యాసంగా మిగిలిపోయింది. చిత్ర, బంధ, మధుర కవిత్వాలు ఏ కాక్షర కందాలు వంటివి సాహిత్యంగా రాజ్యమేలుతున్నాయి. కన్యాశుల్క వివాహం, బాల్యవివాహం, స్త్రీల అవిద్య, వేశ్యావృత్తి, విగ్రహారాధన, అస్పృశ్యత, కులపీడన వంటి అనేక రుగ్మతలతో నాటి సమాజం కునారిల్లుతున్నది. సమాజము, సాహిత్యము రెండూ శిథిల దశకు చేరుకున్నాయి. ఆ సమయంలోనే తెలుగులో ముగ్గురు మహానుభావులు పుట్టుకొచ్చారు. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ వేంకట అప్పారావు, గిడుగు వేంకట రామమూర్తి పంతులు. ఈ ముగ్గురూ ఒక త్రయం. వీళ్లు నియోగీ బ్రాహ్మణులు. ప్రాచీన కాలంలో అనేక రకాల ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి బాహ్యార ప్రపంచంతో, సమాజంతో సజీవ సంబంధం కలిగిన నియోగీ బ్రాహ్మణుల వారసులు వీళ్లు. ఆధునిక యుగంలో కొత్తగా వచ్చిన అభివృద్ధికర సామాజికాంశాలు అందుకోవడంలో కూడా వీళ్లు ముందున్నారు. ఇలా ముందుగా నడవ గలిగిన వాళ్ల వారసులు కందుకూరి, గురజాడ, గిడుగు, కందుకూరి 1848లో పుట్టి 1919లో మరణించారు. గురజాడ 1862లో పుట్టి 1915లో మరణించాడు. గిడుగు 1863లో పుట్టి 1940లో మరణించారు. ఈ ముగ్గురూ కోస్తా, ఉత్తరాంధ్రకు చెందినవారు. అలాగే ఈ ముగ్గురూ వలస పాలనా యుగంలో పుట్టారు. ఆ యుగంలోనే భాషా సాహిత్యాలకు కృషిచేశారు. ఆ యుగంలోనే మరణించారు. ఈ ముగ్గురూ పుట్టే నాటికి వలసపాలన వ్యతిరేక ఉద్యమాలు మొలకదశలో ఉన్నాయి. ఈ ముగ్గురూ మరణించే నాటికి భారత స్వాతంత్ర్యోద్యమం వేగం పుంజుకుంటున్నది. కందుకూరి ప్రధానంగా సంఘ సంస్కరణ ఉద్యమకారుడు, సాహిత్యాన్ని తన ఉద్యమ ప్రచారానికి సాధనంగా ఉపయోగించుకున్నాడు. గురజాడ సంఘ సంస్కరణోద్యమ రచయిత. ఉద్యమకారుడు కాదు. కానీ తన సాహిత్యం ద్వారా సంఘ సంస్కరణోద్యమ పురగోమనానికి దోహదం చేశాడు. గిడుగు సంఘ సంస్కరణోద్యమ కాలంలో ప్రజల భాషకు సామాజిక గౌరవం సంపాదించి పెట్టాడు. డా॥ సి. నారాయణరెడ్డి గారు "కందుకూరి సంఘ సంస్కరణ, గురజాడ సాహిత్య సంస్కరణ, గిడుగు భాషా సంస్కరణ కలసి ఆధునిక తెలుగుసాహిత్యానికి గట్టి పునాదులు వేశారు" అని అభిప్రాయపడ్డారు.

గిడుగు వేంకటరామమూర్తి పంతులు వ్యావహారిక భాషోద్యమకారుడు. ఆయన వ్యావహారిక భాషోద్యమానికి నాయకత్వం వహించటం ఒక నిర్దిష్ట నేపథ్యంలో జరిగింది. పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునే భాష, రాసే భాష, వారి ఇంటిలో వారు మాట్లాడే భాష వేరువేరుగా ఉండటాన్ని గమనించిన ఒక విద్యాధికారి, గిడుగు రామమూర్తి పంతులు గారి దృష్టికి తీసుకు పోయినప్పుడు ఆయనకు వ్యావహారిక భాషోద్యమాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉన్నదని ఆలోచన వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఇంట్లో వ్యావహారిక భాష, విద్యాసంస్థల్లో గ్రాంథిక భాష, అలాగే సాహిత్యంలోనూ గ్రాంథిక భాష అమలులో ఉన్న పరిస్థితి మార్చి, మాట్లాడేభాష, రాసే భాష, చదివే భాష ఒకటిగానే వుంటే శాస్త్రీయంగా ఉంటుంది. అన్న ఆలోచనల్లోంచి గిడుగు వారు వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపారు. జె.ఎ. ఏట్సు, పి.టి. శ్రీనివాసయ్యం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి ఈ నలుగురిని ఒక చతుష్టయుగంగా ఆ రోజుల్లో పిలిచేవారు. గ్రాంథిక

భాషకు వీడ్కోలు పలికి, వ్యావహారిక భాషను అన్నిరంగాలలోనూ ప్రతిష్ఠించడం గిడుగు ఉద్యమ లక్ష్యం. గిడుగు తన ఉద్యమ జీవితంలో పానుగంటి, జయంతి రామయ్య పంతులు వంటి గ్రాంధిక భాషావాదుల పరిహాసానికి గురిఅయ్యాడు. పైన పేర్కొన్న నలుగురూ భాషను, సంస్కృతిని, సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేయడానికి పుట్టినవాళ్ళుగా ప్రచారం చేశారు. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో గిడుగు తన ఉద్యమాన్ని కొనసాగించారు. గురజాడ కన్నుమూస్తూ వ్యావహారిక భాషోద్యమాన్ని కొనసాగించమని చేసిన విజ్ఞప్తికి అనుగుణంగా గిడుగు వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపాడు.

1911లో ప్రారంభమైన గిడుగు వ్యావహారిక భాషోద్యమం తన సమకాలంలో ఒకయుద్ధ స్థాయిలో కొనసాగింది. అనేక ప్రతిఘటనలు ఎదుర్కొంది. అయినా విజయం సాధించింది. ఆయన నడిపిన వ్యావహారిక భాషోద్యమం ఆయన జీవించిన కాలంలో తెలుగు భాషా సాహిత్యాల మీద ప్రభావం చూపడం ప్రారంభమైంది. ఆయన మరణించిన తర్వాత ఆయన ఉద్యమం అసలైన విజయం సాధించింది. గురజాడ అప్పారావు ఇలా అన్నారు "తెలుగు సాహిత్య భాషలు నాగరికతా వ్యాప్తికి ఒక గొప్ప సాధనంగా చేయాలంటే దానిని వ్యావహారిక భాషకు దగ్గరగా తీసుకురావాలి. దానిని పూర్తిగా వినూత్నం చేయాలి." (పీఠిక, మొదటి కన్యాశుల్కం)అంతేకాదు రెండో కన్యాశుల్కం పీఠికలో కూడా గురజాడ ఇలా అన్నారు. "గ్రాంధిక భాష తెలుగు వారిపై సంప్రదాయం రుద్దిన ఒక పెద్ద గుదిబండ అని నా అభిప్రాయం సంకెళ్ళను ప్రియంగా చూసుకునేవారు దానిని పూజించనీయండి. నాకు నా మాతృ భాషే, సజీవమైన తెలుగుభాషే. ప్రాశ్చ ఇటాలియన్ అనే భాషే కావాలి. మన సుఖ దుఃఖాలను ఆ భాషలో వ్యక్తం చేయడానికి మన మెవరమూ సిగ్గుపడటం లేదు. కానీ ఆ భాషలో బాగా రాయడానికి మాత్రం మనలో కొందరు సిగ్గుపడుతుంటారు. మాతృభాషా సాహిత్యం రైతుల్ని తట్టిలేపక తప్పదు. అది భారతదేశంలో ఇంగ్లీషు వారిని కూడా తట్టిలేపక తప్పదు. ఆ భాషకు గల అవకాశాలు అపారం."

గురజాడ అప్పారావు అభిప్రాయ పడినట్లు వ్యావహారిక భాష ఒక రైతుల్నే కాదు, ఒక బ్రిటీషు వాళ్లనే కాదు, మొత్తం తెలుగు సమాజాన్ని ఎలా తట్టిలేపిందో గిడుగు వారి ఉద్యమం రుజువు చేసింది. గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషోద్యమాన్ని నడపడానికి అనేక సంస్థల్ని స్థాపించాడు. పత్రికలను స్థాపించాడు. ఉపన్యాసాలు ఇచ్చాడు, వ్యాసాలు రాశాడు. అంతేకాదు. ఎవరైతే గ్రాంధిక భాషావాదులుగా పేరుబడ్డారో, వాళ్ళకు శాస్త్రీయమైన గ్రాంధిక భాష రాయటం చేతకాదని 'ఆంధ్ర పండితభిషక్కుల భాష భేషజము' అనే గ్రంథంలో రుజువు చేశాడు. సవరులు నివశించే అటవీ ప్రాంతాల్లో సవరుల మధ్య నివశిస్తూ, వాళ్ళకోసం, వాళ్ళ భాషకోసం నిఘంటువులు తయారు చేశాడు కథలు, పాటలు, వాచకాలు రచించాడు. ఆ క్రమంలో ఆయన దోమలు కరచి తన వినికిడి జ్ఞానాన్ని కూడా పోగొట్టుకున్నాడు. వ్యావహారిక భాషా ప్రాముఖ్యాన్ని గురించి ఆయన చేసిన తుది విన్నపం తెలుగు వ్యావహారిక భాషోద్యమంలో ఒక మైలురాయి.

గిడుగు ఉద్యమం తర్వాతి కాలంలో తెలుగుభాషా వికాసానికి, తెలుగు సాహిత్య వికాసానికి ఎంతో దోహదం చేసింది. గిడుగు కన్నా ముందే సి.పి. బ్రౌన్ తన గ్రంథ పరిష్కరణలలోను, కల్నన్, కాలిన్, మెకంజీ కైఫీయత్తులోనూ, వాళ్లు సంపాదించిన శాసనాలలోనూ వ్యావహారిక భాష సజీవంగా కన్పిస్తుంది. గురుజాడ అప్పారావు తన నాటకాలలో విజయనగర ప్రాంత వ్యావహారిక భాషను సజీవంగా ఉపయోగించి చూపించారు. నాటక రచయితలు కొందరు ఉత్తమ పాత్రలకు గ్రాంథిక భాషను, అధమ పాత్రలకు వ్యావహారిక భాషను ఉపయోగించారు. కందుకూరి వీరేశలింగం పంతులు కూడా 'ప్రవాసనాల' లో వ్యావహారిక భాషను ఉపయోగించాడు. కానీ ఆయన మరణించే ముందుగానే వ్యావహారిక భాషా ప్రాముఖ్యాన్ని ఆమోదించారు. అయినప్పటికీ గిడుగు వ్యావహారిక భాషోద్యమ ఫలితంగానే తర్వాతి కాలంలో తెలుగు భాషలోనూ, తెలుగు సాహిత్యంలోనూ అనేకమైన మార్పులు వచ్చాయి. గురజాడ అప్పారావు బ్రతికి వుండగా మద్రాసు విశ్వవిద్యాలయంలో పరీక్షా విధానంలో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టడంలో సెనేట్ సభ్యుడుగా ఆయన గ్రాంథిక భాషావాదుల చేతిలో ఓడిపోయారు. కానీ 1955 తర్వాత విశ్వవిద్యాలయాలల్లో విద్యార్థుల పరీక్షలు, పరిశోధకుల సిద్ధాంత గ్రంథాలు వ్యావహారిక భాషలో కూడా రాయవచ్చునని ఆమోదించాయి.

రెండు, మూడు దశాబ్దాలు ఆలస్యమైన గిడుగు విశ్వవిద్యాలయాల మీద తన ప్రభావాన్ని చూపించ గలిగాడు. కొలకలూరి ఇనాక్, మద్దూరి సుబ్బారెడ్డి అలాగే ఆర్.వి.ఎస్. సుందరం వంటి వాళ్లు వ్యావహారిక భాషలో సిద్ధాంత గ్రంథాలు రాసిన తొలితరం వాళ్ళు. వార్తా పత్రికలలో మొదటి నుంచీ గ్రాంథిక భాషే అమలులో ఉండేది. అనేక పత్రికలలో గ్రాంథిక, వ్యావహారిక భాషోద్యమాల వాదోపవాదాలు అనేక సంవత్సరాలు జరిగాయి. తెలుగు పత్రికలలో మొట్టమొదట వ్యావహారిక భాషను ప్రవేశపెట్టిన వారు తాపీ ధర్మారావు. తాపీ ధర్మారావు మొదట్లో వీరగ్రాంథిక వాది. ఆ తర్వాత ఆయన వ్యవహారిక భాషావాదిగా మారాడు. 'జనవాణి' అనే పత్రికలో ఆయన మొదట వ్యావహారిక భాషను ఉపయోగించాడు. ఆ తర్వాత తెలుగు పత్రికారంగం వ్యావహారికభాషా మయంగా మారింది.

20వ శతాబ్దం ప్రారంభంలో గిరిజనుల భాష మీద గిడుగు రామమూర్తి చేసిన కృషి క్రమక్రమంగా తెలుగుభాష మీద, తెలుగు సాహిత్యం మీద విశేషమైన ప్రభావాన్ని చూపింది. ఇవాళ ఎవరైనా గ్రాంథిక భాషలో ఒక వ్యాసం రాస్తే దానిని గత కాలపు అవశేషంగా మాత్రమే మనం గుర్తిస్తాం. ఇది గిడుగు సాధించిన విజయం.

1921-22 ప్రాంతంలో ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు 'మాలపల్లి' నవల రచించాడు. అది వ్యావహారిక భాషలో వచ్చిన నవల. ఆ తర్వాత కొంత విరామం తీసుకొనైనా సరే తెలుగు నవలల్లో తొంభైపాళ్లు వ్యావహారిక భాషలోనే వచ్చాయి. గురజాడ తర్వాత చలం, శ్రీపాద వంటి వాళ్ళు కథకులు అనేకులు వ్యావహారిక భాషలో కథలు రచిచారు. 'కన్యాశుల్కం' నాటకం తర్వాత కొంచెం విరామం వచ్చినా తెలుగు నాటకం పూర్తిగా వ్యావహారిక భాషలోకి మారిపోయింది. పద్యకావ్యాలు, గేయకావ్యాలు గ్రాంథిక భాషలో కొనసాగుతున్నా, వచన కవిత్వం 1930 తర్వాత స్వచ్ఛమైన వ్యావహారిక భాషను తన వాహికగా చేసుకుంది. తెలుగు సాహిత్య విమర్శ తిరుగులేని విధంగా వ్యావహారిక భాషలోనే వస్తున్నది. ఇవాళ స్థానిక లేదా ప్రాదేశిక భాష తెలుగు సాహిత్యానికి ఏకైక వాహికగా కొనసాగుతున్నది.

గిడుగు నివశించిన ఉత్తరాంధ్రలో ఉత్తరాంధ్ర భాష గురజాడ తర్వాత చాగంటి సోమయాజులు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కాళీపట్నం రామారావు మొదలుకొని తర్వాతి తరం రచయితలైన భూషణం, అట్టాడ అప్పల్నాయుడు వంటి అనేకులు ఉత్తరాంధ్ర భాషా సౌందర్యాన్ని తమ కల్పనా సాహిత్యంలో ప్రదర్శిస్తూ ఉన్నారు. శ్రీపాద సుబ్రమణ్యంశాస్త్రి రాజమహేంద్రవరం ప్రాంతం వైదిక బ్రాహ్మణుల భాషను, అలాగే ఇతర కులాల వారి భాషను తమ కథలలో, తమ స్వీయచరిత్రలలో ప్రదర్శించారు. ఇవాళ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి, గోదావరి భాషా మాధుర్యాన్ని రుచి చూపిస్తున్నారు. మా గోఖలే 1940 ప్రాంతాలలోనే గుంటూరు జిల్లా ప్రాదేశిక భాషలో ఉత్తమోత్తమ కథలు రచించాడు. కరుణకుమార నెల్లూరు జిల్లా ప్రజల భాషలో అద్భుతమైన కథానికలు రచించాడు. అక్కినేని కుటుంబారావు గుంటూరు జిల్లా భాషలో 'సొతంత్రం' వంటి రచనలు చేశారు. కొలకలూరి ఇనాక్ నవలలు, కథానికలలో గుంటూరు జిల్లా శ్రామిక జన భాష స్వరూపంలో కన్పిస్తుంది. కె.సభ, మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి, నాయని సుబ్రమణ్యం నాయుడు వంటి అనేక తరాల చిత్తూరు జిల్లా రచయితలు తమిళం కలిసిన తెలుగు భాష సువాసనల్ని వెదజల్లుతున్నారు. గుత్తి రామకృష్ణ 1940 ప్రాంతాలలోనే అనంతపురం జిల్లా స్థానిక భాషా మాధుర్యాన్ని రుచి చూపించగా, సింగమనేని నారాయణ, శాంతినారాయణ, విద్వాన్ దస్తగిరి, బండి నారాయణస్వామి, చిలుకూరి దేవపుత్ర వంటి తరువాత తరం తెలుగు కల్పనా సాహిత్య రచయితలు కన్నడ వాసనలు గల అనంతపురం తెలుగుభాషను వాస్తవికంగా గ్రంథస్థం చేస్తున్నారు. సడ్లపల్లి చిదంబర రెడ్డి, హిందూపురం ప్రాంతంలో కన్నడం కలిసిన తెలుగుభాషలో కవితలు, కథలు, స్వీయచరిత్ర రచించాడు. బండి నారాయణస్వామి, చిలుకూరి దేవపుత్ర, కళ్యాణ దుర్గం, రాయదుర్గం ప్రాంతాల ప్రజల భాషలో రచనలు చేశారు. సింగమనేని నారాయణ, శాంతినారాయణ, అనంతపురానికి చుట్టు ప్రక్కల గల గ్రామాల ప్రజల భాషలో రచనలు చేస్తున్నారు. నాగప్ప గారి సుందర్రాజు కర్నూలు జిల్లా పత్తికొండ, ఆదోని ప్రాంతాల దళితభాషకు సాహిత్య గౌరవం కల్పించారు. ఇనయతుల్లా, జి. వెంకటకృష్ణ, కె. సుభాషిణి వంటి వాళ్లు కర్నూల్ జిల్లా భాషకు సాహిత్య మర్యాద కల్గిస్తున్నారు. కడప జిల్లాలో సొదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, పి. రామకృష్ణారెడ్డి, వై.సి.వి. రెడ్డి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, పాలగిరి విశ్వప్రసాద్, వేంపల్లి గంగాధర్, శశిశ్రీ, సత్యాగ్ని, వేంపల్లి షరీఫ్ మొదలైన రచయితలు వాళ్ళు ఎక్కడ జీవిస్తున్నా, కడప జిల్లా భాషలోని వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు.

కొలకలూరి ఇనాక్ జన్మతా గుంటూరు జిల్లాకు చెందిన వారు. అయితే ఆయన జీవితం అంతా అనంతపురం లోనే సాగింది. అయినప్పటికీ ఆయన తొంభై తొమ్మిది పాళ్ళు గుంటూరు జిల్లా భాషలోనే రచనలు చేశాడు. పి. కేశవరెడ్డి, జన్మతా చిత్తూరు జిల్లాకు చెందినవారు కానీ ఆయన జీవితం అంతా తెలంగాణలోని నిజామాబాద్‌లోనే గడించింది. అయినప్పటికీ ఆయన రచనలన్నీ తన ప్రాంతపు జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. ఆ ప్రాంతపు భాషలోనే రాయబడ్డాయి.

తుమ్మల రామకృష్ణ, ఎం.కె. దేవకి ఇద్దరూ జన్మతా చిత్తూరు జిల్లాకు చెందినవాళ్లు. రామకృష్ణ చాలాకాలం కర్నూల్‌లో నివశించి, ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లారు. ఎం.కె. దేవకి అనంతపురంలో స్థిరపడ్డారు. అయినప్పటికీ ఈ ఇద్దరూ తమ ప్రాంతపు జీవితాన్నే, తమ ప్రాంతపు భాషలోనే రచిస్తున్నారు. రాప్తాడు గోపాలకృష్ణ పుట్టుకతో అనంతపురానికి చెందిన వారు. ఆయన కర్నూల్ జిల్లాలో నివశించారు. ఆయనకూడా అనంతపురానికి చెందిన భాషలోనే రచనలు చేశారు.

ఇవన్నీ ఎలా ఉన్నా ఇవాళ తెలుగు సాహిత్యం బ్రాహ్మణుల దగ్గర మొదలై, పట్టణాలలో మొదలై, గ్రామాలలోకి రైతుల దాకా వచ్చి రైతు కూలీలు దాకా వచ్చి క్రమక్రమంగా కొండలలోకి, అడవులలోకి, అడవికొండ జీవుల దగ్గరకు చేరుతున్నది. ఆయా ప్రాంతపు జీవితాలను వస్తువులుగా చేసుకొని ఆయా ప్రాంతపు భాషలోనే వ్యక్తం చేస్తున్నది.

ఇదంతా గిడుగు రామమూర్తి పంతులు నడిపిన వ్యావహారిక భాషాఉద్యమ ప్రభావం అని నిశ్చయంగా చెప్పవచ్చును. గిడుగు రామమూర్తి పంతులు గారి వ్యావహారిక భాషోద్యమం ప్రత్యక్షంగా తెలంగాణాకు ప్రాకి వుండక పోవచ్చు, కానీ కోస్తా, రాయలసీమ నేల మీద వ్యావహారిక భాష సాధించిన విజయం తెలంగాణకు కూడా పాకింది అనటంలో అతిశయోక్తి లేదు.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తుమ్మల సీతారామమూర్తి 'నా కథలు' - అధ్యయనం

- డా॥ పి. సి. .వెంకటేశ్వర్లు, సహాయాచార్యులు, సహాయ సంచాలకులు, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

మన కవి సిరులున్న
వాడు కాడు, పేదవాడయ్యుయు
వేడు నట్టివాడు కాడు సంపన్నుల
వీడునట్టివాడు కాడు పరువు

అని తుమ్మల వ్యక్తిత్వాన్ని ఒక్క పద్యంలో వివరించాడు కుప్పుస్వామి. తుమ్మలవారి 'నా కథలు' రచన చూశాక, పై పద్యంలో కవి చెప్పింది నిజమేననిపిస్తుంది. ఈ ఖండకావ్యం మొదటిసారిగా 1973లో ప్రచురించబడింది. అయితే, అంతకు ముందే ఇందులోని కొన్ని ఖండికలు సామ్యయోగం, భారతి, స్రవంతి, గ్రంథాలయ సర్వస్వం, తెలుగు విద్యార్థి మొదలైన పత్రికల్లో అచ్చయ్యాయి. తుమ్మలవారి వ్యక్తిత్వాన్ని 'నా కథలు' అనే ఆత్మకథ ద్వారా అంచనా వేయడానికి ముందే 'ముందు మాట' ఆధారంగా, అంకితమిచ్చిన మహామనీషి వ్యక్తిత్వం ఆధారంగా, ఆయన గొప్పతనాన్ని అంచనా వేసుకోవచ్చు. ఈ ఖండకావ్యానికి ముందుమాట రాసిన తూమాటి దోణప్ప ఈ రచనను 'సహృదయ జనరంజకంగా, ఒత్తుగా మత్తుగా పండికై వాలిన బంగారు పంట'గా వర్ణించారు. రచయిత ఈ ఖండ కావ్యాన్ని నల్లవాడైనా అకళంక నాయకుడైన, అమెరికాలోని నిమ్న జాతులకోసం పోరాటం చేసిన, డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్‌కు అంకితమివ్వడంలో కవి ఉన్నతమైన మనస్తత్వం అర్థమౌతుంది. ఆయనకు గ్రంథాన్ని అంకితం ఇవ్వడంవల్ల కవి ఒక సందేశాన్ని పంపించాడు. పశుత్వం చేతిలో హత్యగావింపబడ్డ మానవత్వానికి, విదేశీయుడైనా విశ్వమానవతను గుబాళింపజేసిన మహనీయునికి కృతజ్ఞత పూర్వకంగా "ఖలునగ్నతకున్ బలియై కలకాలము నీవు నిల్వగంటివయా రే" అంటూ తన మనసులోని ప్రేమాభిమానాలు తెలియజేశాడు.

సాధాణంగా మన ప్రాచీన కవులందరూ భగవంతుడికి లేదా నచ్చిన పోషకునికి కావ్యాలను అంకితం ఇచ్చి తమ భక్తిని చాటుకొన్నారు. కానీ, తుమ్మల స్పష్టమైన దృక్పథం కలిగిన వ్యక్తి. కావ్యాన్ని దైవాంకితాలు చేయడం వ్యతిరేకించాడు. భగవంతుడికి కవి ఇచ్చే వెర్రికానుకలు అవసరం లేదని ఖచ్చితంగా చెప్పాడు. అయితే, మనిషికి కృతి ఇవ్వడం ఉత్తమమార్గం అయినప్పటికీ, ఆ వ్యక్తి ఆదర్శప్రాయుడిగా, విశ్వశ్రేయో కాంక్ష కలిగినవాడుగా ఉండాలనేది తుమ్మలవారి భావన.

అరిదియగు వారివలచిన,
తెరువున జని నీవు విశ్రుతిం గనిన మహా
పురుషుండవు మార్టినులూ
థరుకింగూ! భవదుదారతకు జోహారుల్

అందుకే తాను గొప్పవాడిగా భావించిన లూథర్ కింగ్‌కు అంకితమిచ్చాడు.

'నా కథలు' అనేది 55 ఖండికలతో కూడిన ఖండకావ్యం. టీకన్న, అనృతఫలము, హరిభక్తి, నారయ్య దివ్వె, నా చదువు, గండము తప్పుట, మొదరిటి పద్యము, జాలి, జ్ఞాన స్నానము, తప్పెటబ్బాయి, కూలి వలదు, జాతీయ విద్యాసేవ, అవధాన కళ, విధి నిర్వహణము, దేవయ్య, నా నాగలి నాకు లేదా, ప్రత్యేక శిక్షణము, గురుడు శిష్యుడామె, జాషువా, కనువిప్పు, తోటకూర బాకీ, రాష్ట్రగానకృతి, అక్షరాస్యత, మానుషము, ఆశు కవిత, పాకీపని, అంకితము, కవ్వర్చ, హరికరుణ, లెక్కవ్రాత, అమృత ధార, కవితావేశము, కృతిపతి బొమ్మ, అచ్చు తప్పుకాదు, కఠోర నియతి, కల్ల నిజమైనది, సుందర వదులు, ఖద్దరు దుస్తులు, ఈవి సహనము, అప్పికట్ల నిలుపు, కుప్పుస్వామి యీవి, సత్తురూపాయ, మాటతప్పరాదు, తెలుగులెంక, ఉపకృతి, మంద లింపు, పాలముబువ్వ, బస్సులో, దంభముల్ మానుడు వాణీ వాత్సల్యము, నూరార్లు కాదు, ధర్మనిధి వలదు, సిగ్గుపాటు, అలతివాడ, నేను ఇలా మొత్తం 1116 పద్యాల్లో సాగిన తుమ్మల వారి జీవిత ఘట్టాలు ఆయన స్వీయచరిత్రనే కాకుండా దోణప్ప చెప్పినట్లు సమకాలీన తెలుగువారి అచ్చమైన చరిత్రను ప్రదర్శించే కావ్యదర్పణం కూడా.

1967 ప్రాంతంనుండి 'నా కథలు' ఖండికలు రాయడం మొదలుపెట్టాడు తుమ్మల. అయితే, తాను డిసెంబర్ 25, 1901లో కావూరులో చెంచమాంబ, నారయ్యలకు పుట్టినప్పటి నుండి, జీవితంలో జరిగిన సంఘటనలను ఒక్కొక్క శీర్షిక కింద చెప్పుకొంటూ వచ్చాడు. ఆ ఖండికలను అన్నింటిని ఒక క్రమ పద్ధతిలో చేరిస్తే ఆయన జీవిత చరిత్ర అవుతుంది.అయితే, వరుసక్రమంలో జీవితంలో ఎలా పెరిగింది చెప్పడం కవి ప్రధాన ఉద్దేశం కాదు. ఏ సంఘటనలు తనను ప్రభావితం చేశాయి? ఎవరు తనకు మార్గదర్శకులు అయ్యారు? వంటి విషయాలను చెప్పుకుంటూ వెళ్ళారు.

'టీకన్న' అనే ఖండిక తుమ్మలవారి వంశంలో ప్రధానమైన వ్యక్తిని గురించి చెప్పే ఖండిక. విజయనగర రాజులు చంద్రగిరి ప్రాంతాన్ని పరిపాలిస్తున్న రోజుల్లో, వారి దగ్గర దండనాథుడుగా ఉన్న వీరన్నకే టీకన్న అనే పేరు స్థిరపడిపోయింది. పద్యానికి వివరణలాగా రాజాస్థానంలో ఆయన చెప్పే వివరణలు టీకలాగా ఉండేవట. అందుకే ఆయన్ను టీకన్న అని పిలిచేవారట. విజయనగర రాజ్యం పతనమైన తర్వాత ఆయన వంశస్థులు

గుంటూరు జిల్లాలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారట. ఆయనకు 10వ తరం వ్యక్తిగా తుమ్మల తనకు తాను మొదటి ఖండికలో పరిచయం చేసుకొన్నాడు. అయితే, తమ వంశస్థులు చాలా గొప్పవారని తమది ఉన్నతమైనచెప్పుకునే ఉద్దేశం తుమ్మలవారికి లేదు. కేవలం తమ వంశ చరిత్రను గుర్తుచేయడానికే అలా చెప్పుకున్నానని తనది కేవలం మానవతావాదమని సవినయంగా ఈ పద్యంలో తెలుపుకున్నాడు తుమ్మల.

ఇది చరిత్రయగుట నింత త్రచ్చితిగాని
కులము గోత్రమన్న గొడవ పట్ల
మమతయుంటగాదు మానవతావాద
లిప్స నాయెడంద లేక కాదు

'అనృతఫలం'లో తనతాత వెంకటపతి సత్యనిష్ఠను చెప్పడం ద్వారా తాను ఆదర్శ ప్రాయమైన నడవడికను ఎలా అలవాటు చేసుకొన్నాడో పరోక్షంగా తెలియజేసుకున్నాడు తుమ్మల. ఒకసారి తన తాత వెంకటపతి పొరుగూరుకు చెందిన మంచన అనే రైతు దగ్గర ఇరవై వరహాలకు ఎకరం పొలం కొనడానికి బేరం కుదుర్చుకున్నాడు. సంచకరువు కూడా ఇచ్చాడు. తెల్లవారి సేద్యం మొదలుపెట్టడానికి పొలం దగ్గరకు వెళ్ళేసరికి తనకంటే ముందే వచ్చిన మరోవ్యక్తి పొలం దున్నుతున్నాడు. తాను పొలం కొన్నానని కాస్త విషపు నవ్వు చెప్పాడు. వెంటనే వెంకటపతి మంచనను పిలిచించి 'బైసి మాలిన పని' చేశావు ఏమిటని అడిగాడు. మంచన మాట తప్పుతూ, తన మామ తనకు తెలియకుండా పొలం అమ్మేశాడని బుకాయించాడు. వెంటనే కోపగించుకున్న తుమ్మల తాత 'నీ అబద్ధం వల్ల రైతులోకానికే చెడ్డపేరు తీసుకొచ్చావు. నీవు అబద్ధం చెప్పి ఈ లోకాన్ని పాలించలేవు. మోసగింపబడ్డ నేను చెడిపోను దేవుడే అన్నిటినీ సరిదిద్దుతాడు' అని చెప్పి ఇంటికి వచ్చేశాడు. అది జరిగిన కొద్దిసేపటికే పొలం అమ్మిన వ్యక్తి తుమ్మల వారింటికి వచ్చి క్షమాపణ చెప్పి వెళ్ళాడట. ఈ సంఘటన కవి తన తాత గొప్పతనం చెప్పడంకోసం కాకుండా సత్యవాక్యం యొక్క విలువను తెలియజేయడం కోసం వివరించాడు.

'హరిభక్తి' అనే ఖండికలో తన తండ్రి పెద్దగా చదువుకోకపోయినా గొప్ప హరిభక్తుడని, ఏ ఊరికి వెళ్ళినా సాయంత్రానికి వచ్చి ఊర్లో జరిగే పురాణ గోష్ఠిలో తప్పక పాల్గొనేవాడని, గజేంద్ర మోక్షం, శబరి చరిత్ర వంటివి విని జ్ఞానాన్ని సంపాదించుకునేవాడని చెప్పుకొన్నాడు. 'మంజరీ ద్విపద'లో కూడా ఇంకొంచెం వివరంగా తన తండ్రి భక్తితత్వాన్ని వివరించాడు. ఒకరోజు ఆయన తండ్రి నారయ గిత్తను కొనడానికి కర్లపాళెం అనే గ్రామానికి వెళ్ళి చాలాచోట్ల తిరిగి తిరిగి అలసిపోయి, ఒక వాగు ప్రక్కన ఆగి చద్దన్నం తినడానికి ఉపక్రమించాడు. తినడానికి ముందు కళ్ళు మూసుకొని విష్ణువును ధ్యానిస్తూ సమాధిలోకి వెళ్ళిపోయాడు. విష్ణుభక్తిలో తాదాత్మ్యం పొందిన అతనికి ఆ మార్గంలో గుర్రంపై వస్తున్న ఆ ప్రాంతపు రాజు విష్ణుమూర్తిలాగా కనిపించాడు. ఎదురుగా వెళ్ళి 'ఓ ప్రభూ నీ దర్శనభాగ్యంతో ధన్యుడనైనా'నని ఆ దొరను ప్రార్థించాడు. ఆ రౌతు అతణ్ణి తాగుబోతుగా భావించి, దూరంగా వెళ్ళమని హెచ్చరించాడు. అతడు వెళ్ళలేదు సరికదా, ఇంకా ఎక్కువగా ప్రార్థించడం మొదలుపెట్టాడు. కోపగించుకున్న రాజు నిర్దయగా అతడిని తిట్టి కొరడాతో కొట్టి దూరంగా నెట్టి వెళ్ళిపోయాడు. శరీరంనుండి రక్తం కారుతున్నప్పటికీ భగవంతుడు తనను కనికరించలేదని బాధపడిన అమాయకుడిగా తన తండ్రి నారయను గురించి చెప్పుకున్నాడు.

చేయూత నిచ్చు శ్రీపతి నాకు
నభయం బొసంగులే హరి నాకటంచు
నైరాశ్యమెరుగని నారయ్యయతడు
మరలెనింటికి నహోమత్స్రియతుడు

అంటూ తన తండ్రి అమాయకత్వాన్ని చెప్పుకున్నాడు తుమ్మల. ఆయన ఎంత దయాహృదయుడో, ఎంత పరోపకారం కలిగినవాడో 'నారయ్య దివ్వె' ఖండికలో వివరించాడు. ఆర్థిక మాంద్యంతో దేశంలోని ప్రజలు నానా బాధలుపడుతున్న సందర్భమది. గ్రామాల్లో పట్టణాల్లో పైసలు కనబడ్డమే గగనమైన పరిస్థితులు అవి. తిండికి బట్టకు కూడా నానా అవస్థలు పడుతున్న స్థితుల్లో తన తండ్రి వద్ద ముసలారెడ్డి అనే రైతు డబ్బు అప్పుగా తీసుకొని పంటలు సరిగ్గా పండక, ఆర్థిక పరిస్థితి చక్కబడక అప్పుకు బదులుగా మూడెకరాల పొలాన్ని అమ్మేశాడు. మూడేళ్ళ తర్వాత పంటలు బాగా పండాయి. ముసలారెడ్డికి కూడా డబ్బులు ధాన్యం ద్వారా బాగా వచ్చాయి. ఆ సందర్భంలో నారయ్య ఆయన్ను పిలిచి తనకు అప్పుకింద జమకట్టిన పొలాన్ని తిరిగి తీసుకొమ్మని భూమి పెరిగిన రేటు కాకుండా ఆరోజు తనకు అమ్మిన ధర తీసుకొమ్మని తనకు ఒక్కరూపాయి కూడా ఎక్కువ వద్దని చెప్పి ఆయన పొలాన్ని ఆయనకు అప్పగించాడు.

వలదు వడ్డీ నాకు, వలదు నేడున్న
వెలయు నీ విచ్చిన వెలకె నీ కిత్తు
ఋణధారమెదను గారించు కాలమున
రిత్త వెచ్చెములు సైరింపడు హాలికు

అని తన తండ్రి గుణగణాలను చెప్పి అలాంటి మనస్తత్వాల మధ్య పెరిగిన తాను కూడా మానవతావాదిగానే ముందుకు సాగానని చెప్పుకున్నాడు తుమ్మల.

'నా చదువు' ఖండికలో కావూరులో శ్రీరామాచార్యుల విద్య ద్వారా మొదలు పెట్టిన దగ్గరనుండి తన తండ్రి కోరికపై చదివిన భాగవతం, పెదపూడి నడిచి వెళ్ళి తన బావ జాస్తి సుబ్బయ్య దగ్గర అధ్యయనం చేసిన మను, వసు చరిత్రలు, ఇలా కొనసాగిన చదువు మధ్యలోనే ఆగిపోయి, సేద్యపు పనుల్లో నిమగ్నమై ఉన్నపుడు పగలు పొలం పనులు చేసుకొంటూ రాత్రి

ప్రక్క ఊరికి వెళ్ళి చదువుకోవడం, ఇలా 1933లో విశ్వవిద్యాలయ పరీక్ష ఉత్తీర్ణుడై బోర్డు స్కూలులో పండితుడయ్యేంత వరకు సాగిన ఘట్టాలను చెప్పుకుంటూ వచ్చాడు. ఎంతోమంది తనకు చదువు చెప్పినారని, లేకుంటే తాను ఇంతటి వాణ్ణి అయ్యేవాణ్ణి కాదని సవినయంగా చెప్పుకొన్నాడు.

ఎందరో సజ్జనులు బుధులింత యంత
నేర్ప లెక్కకు వచ్చితి నేను నేటి
కైన నేమాయె నెరిగిన దరువుపాటి
యెరుగనిది మిహికామహీధరము పాటి

తనకు తెలిసింది ఆవగింజంత అనీ, తెలియాల్సింది భూగోళమంత అనీ చెప్పుకొన్న గొప్ప తాత్వికుడు తుమ్మల.

చదువుకునేటప్పుడు తుమ్మల ఎదుర్కొన్న సమస్యలను కూడా చెప్పుకొంటూ వచ్చాడు. శ్రీరామాచార్యుడి దగ్గర చదువు కుంటున్న సమయంలో ఆయన ఛీత్కారాలు భరించలేని కొందరు విద్యార్థులు గురువుకు గుణపాఠం చెప్పాలని దురాలోచన చేశారట. పాఠాలు చెబుతున్న పూరిపాకకు వేకువజామున వచ్చి నిప్పు పెట్టారు. దాన్ని ప్రత్యక్షంగా చూసిన తుమ్మల గురువుకు నిజం చెప్పేశాడు. నిజం చెప్పినందుకు తుమ్మలపై దుర్మార్గులైన పద్మారావు, అతని మిత్రులు కక్ష కట్టారు. ఒకరోజు ఆటలాడు కుంటున్న సమయంలో కాస్త చీకటి పడ్డాక మెల్లగా తుమ్మలను తీసుకెళ్ళి ఒక తాడిచెట్టుకు కట్టేసి చితక్కొట్టారు. అంతటితో వదలిపెట్టకుండా తాటాకులతో అతడిని మంటపెట్టడానికి ప్రయత్నించారు. అంతలో ఎద్దుకోసం గాలిస్తూ అటువైపు వచ్చిన దొంతిరెడ్డి ఆ ఘాతుకం చూసి తులవ పిల్లలను అరిచాడట. తుమ్మలను కట్లు విప్పి విడిపించాడు. అందుకే, కృతజ్ఞతగా తనను గండం నుంచి బయట పడేసిన ఆయన్ని ఇలా కీర్తించాడు తుమ్మల.

ఎవ్వరెట్లు తలంచిననేమి నేను
విశ్వసించెద నీ రెడ్డి వే ల్పటంచు
నేరమెఱుగని నాదుకైవారమునకు
గరగి ప్రభు డాపదపహర్తగాగ మాఱె

ఆడుకునే సమయంలో ముసలివాళ్ళను వెక్కరించడం తోటివారిని ఆటపట్టించడం, ఊర్లోవాళ్ళని సరదాగా ఇబ్బంది పెట్టడం వంటివి పిల్లలకు అలవాటే. అలా ఆటపట్టించే సమయంలో ఒక్కోసారి ఎదుటివారికి ఇబ్బందులు కూడా కలుగుతుంటాయి. అయితే, ఆ పసిహృదయాలకు ఆ విషయం పెద్దగా తెలియదు. చిన్నతనంలో తుమ్మల ఆడుకునే సమయంలో కూడా ఒక సంఘటన జరిగింది. పశువులు తోలుకొనిపోయి తాను కూడా తోటిపిల్లలతో ఆడుకుంటూ ఉన్నాడు తుమ్మల. వారు చేసే కొంటె చేష్టలలో తాను కూడా భాగస్వామి అయ్యాడు. అందరూ కలసి సంతకు గ్రామస్థులు వెళ్ళేమార్గంలో చిన్న గుంటలు తీసి పైకి కనబడకుండా ఆకులు గడ్డితో కప్పేసి ఎవరో ఒకరు ఆ గుంటలో కాలు వేసి పడితే అందరూ నవ్వుకోవడం ఒక సరదా. అలా చేస్తున్న సందర్భంలో ఒకసారి ఒక పేదవాడు సంతకు వెళ్ళి, కష్టపడిన మిగిల్చిన డబ్బులతో కుండలు కొన్ని భుజాన పెట్టుకొని వస్తూ ఉన్నాడు. పిల్లలు తవ్వినగుంటలో కాలు ఇరుక్కొని చతికిలపడ్డాడు. భుజాన ఉన్న కుండలు పగలి పోవడంతో ఆ పేదవాడి గుండెలు పగిలినంత పనైంది.

ఆత "డెంత చేసిరల్లు; లాకూర నీ
కూర నమ్మి యమ్మి కూర్చుకొన్న
రూకనిచ్చి కొన్ననా కుండ లిట్లాయె
నెట్లు పడతు బనటు లేను మరల

అంటూ ఏడుస్తున్న ఆ పేదవాడి దగ్గరకు వెళ్ళి పసివాడైన తుమ్మల బాధపడి తన మొలతాడు కూర్చిన బేడలను తీసి ఆ వ్యక్తి చేతిలో పెట్టాడు. ఆ పేదవ్యక్తి వద్దు వద్దు అంటున్నప్పటికీ దయచేసి తీసుకెళ్ళమని ఇచ్చి పంపాడు. చిన్నతనంలోనే ఆయన ఆర్ధ్రగుణాన్ని తెలియజేసే సంఘటన ఇది.

గాంధీ గురించి తెలియకముందే వీరేశలింగం సంస్కరణ భావాల గురించి చదవకముందే అరుంధతీయుల ఇంటిలో భోజనం చేసిన సమతా భావన కలిగిన వ్యక్తి తుమ్మల. అదే విషయాన్ని 'జ్ఞానస్నానం' అనే ఖండికలో చెప్పుకొన్నాడు. వయసు పెరిగేకొద్దీ దేశంలో జరుగుతున్న స్వతంత్ర పోరాటంలో తాను భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకున్నాడు తుమ్మల. జాతీయ కాంగ్రెస్ పిలుపునిచ్చిన ప్రతి ఉద్యమంలోనూ తనదైన చొరవ చూపేవాడు. బ్రిటీష్ వారికి శిస్తు కట్టకుండా నిరాకరించే సమ్మె తెలుగు ప్రాంతాల్లో సాగుతున్న సందర్భం. తానే తప్పెట తీసుకొని ఊరూరా తిరుగుతూ శిస్తు కట్టవద్దని చాటింపు వేస్తూ ముందుకు సాగాడు. చక్కగా కవిత్వం చెప్పేవ్యక్తి ఇలా చేయడం బాగాలేదని కొందరు బ్రిటీష్ తొత్తులైన అధికారులు సూచించారు. కానీ, తాను తప్పెటబ్బాయిగానే ముందుకు సాగుతూ వచ్చాడు తుమ్మల. ఉద్యోగం చేస్తున్న తుమ్మల అలా చేయడాన్ని నాటి గుంటూరు కలెక్టర్ రూథర్‌పర్డ్ సహించలేకపోయాడు. మందలించి తనకు క్షమాపణ చెప్పమన్నాడు. అందుకు తుమ్మల ఒప్పుకోకపోవడంతో డబ్బు కట్టమని, శిక్ష వేసి తుమ్మలను చందవోలుకు బదలీ చేశాడు ఆ కలెక్టర్. తాను ఇష్టపడిన పని చేయడానికి ఎలాంటి కష్టమైన ఎదుర్కొనడానికి తుమ్మలవారు సిద్ధపడతాడని తెలియజేస్తుంది 'తప్పెటబ్బాయి' ఖండిక.

గర్వం, అహంభావం గొప్పవాడిననే భావన తుమ్మలలో ఏనాడూ పొడచూపలేదు. ఎదిగినకొద్దీ ఒదిగినతత్వం ఆయనది. జాతీయోద్యమంలో భాగంగా బాపూ జైలు నుండి విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకొని భారతదేశమంతా నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టింది కాంగ్రెస్. కనగాల గ్రామంలో కూడా గిరిరావు వెంకటేశ్వర్లు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సభాధ్యక్షుడిగా

ఒక కార్యక్రమాన్ని రూపొందించాడు. ఆ సభలో పద్యాలు రాసి చదవడానికి తుమ్మలవారికి ఆహ్వానం వెళ్ళింది. ఆయన పద్యాలను అచ్చువేసుకొని బయలుదేరి భట్టిప్రోలు రైల్వేస్టేషన్లో దిగాడు. మోతుబరి రైతులాగా కనబడుతున్న తుమ్మలను చూసి ఆ సభకు వెళ్ళే ఒక చదువుకున్న వ్యక్తి తన పెట్టెను కనగాల వరకు తీసుకు రమ్మని, రెండు అణాలు ఇస్తానని చెప్పాడు. తుమ్మల అలాగే నంటూ ఆ గ్రామం వరకు పెట్టె మోసుకువచ్చాడు. డబ్బులు ఇవ్వబోతుంటే తాను చిన్నవాడనని, అందుకే పెట్టె తెచ్చానని డబ్బులు వద్దని నిరాకరించాడు. తీరా సభ ప్రారంభమయ్యాక, తన పెట్టె మోసినవ్యక్తి పేదికపైకెక్కి పద్యాలు చదవడం చూసిన ఆ పెద్దమనిషికి ఒళ్ళు జలదరించింది. వెంటనే తుమ్మల దగ్గరకు వెళ్ళి 'నన్ను మన్నింపుమన్నా! భవచ్చరిత నాకు నే డొజ్జయై నయనమ్ము దెరచె, ననచు నిరంతరమై జారునశ్రు జలముతో నన్ను గ్రచ్చర గౌగిలించు, కొని' అని ప్రార్థించాడు.

కవిగా తాను సాటి పేదకవులకు ఎంతోమందికి సహాయం చేశాడు. పేదరికంలో ఉన్న కవులకు ఎంతోకొంత సొమ్ము ఇచ్చి పంపేవాడు. గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న కవులు ఉత్తరం రాస్తే ఎంతోకొంత డబ్బు పంపేవాడు. అయితే, తనను దాతగా పరోపకారం చేసే వ్యక్తిగా అనుకోవద్దని ఒక కవిగా తనకు సత్కారాల రూపంలో వచ్చిన సొమ్మును మాత్రమే తనకంటే తక్కువ స్థితిలో ఉన్న కవులకు ఇస్తున్నానని నిజాయితీగా చెప్పుకొన్నవ్యక్తి తుమ్మల. ఇతర కవులకు సొమ్ములు ఇవ్వడం వల్ల తనకు దాత అనే పేరు వచ్చిందని ఇలా చెప్పుకొన్నాడు.

ఇచట నాకు లాభమేమందురా నాది
గాని సొమ్ము లేనివానికిచ్చి
యెరుల దృష్టికేను నొక 'దాత'గా గనం
బడుట యనెద వినయభరముతోడ

తుమ్మల తాను కవితాసభల్లో పాల్గొన్నప్పటికీ, సత్కారాలు పొందినప్పటికీ గౌరవంగా జీవించాడు. వినయపూర్వకమైన ఆహ్వానాన్ని మాత్రమే స్వీకరించేవాడు. ఒకసారి ఒక షావుకారు తాను కవులకు సన్మానం చేస్తున్నానని గుమస్తా ద్వారా ఆహ్వాన పత్రిక పంపాడు. అయితే, తుమ్మల వెంటనే దానికి సమాధానమిచ్చాడు.

పరువులేని సొమ్ము పది లక్షలగుగాక
కవికి గడ్డిపరక కంటె లొచ్చు
కవితకంటె రూక గణనీయమా
యది యమరసృష్టి యిది పయస్త రంగ

కవులకు, రచయితలకే కాదు, ఏ వ్యక్తికైనా ఆత్మాభిమానం అవసరమనేది తుమ్మల భావన. ఆ ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టవలసిన అవసరం లేదని స్వీయ అనుభవం ద్వారా తుమ్మల వివరించాడు. ఆత్మకథను అచ్చువేయించడానికి వెంకన్న అనే చౌదరి దగ్గరకు వెళ్ళాడు. అందుకు ఆ వెంకన్న 'చౌదరికులంలో పుట్టి ఇలా అడగడం మంచిది కాదు' అని మందలించిడంతో ఆత్మాభిమానం దెబ్బతిన్న తుమ్మల అప్పటినుండి తన గ్రంథాన్ని ముద్రించడానికి ఎవరిని అర్థించలేదు. మూడెకరాల మాగాణి అమ్మి ఆత్మకథను ముద్రించి సాధారణ స్వాతంత్ర్య పోరాట యోధుడైన ఎర్నేని సుబ్రమణ్యంగారికి అంకితమిచ్చాడు.

కులవ్యవస్థను, ఈ కులంలో పుట్టినవారు ఈ పనినే చేయాలనే దుర్మార్గమైన ఆలోచనను తుమ్మల 'పాకీపని' అనే ఖండికలో ఖండించారు. మలం ఎత్తడానికే సమాజంలో ఒక వర్గం ఉండటం మనిషిగా ఎవరూ సహించకూడదంటాడు. 'మరుగు దొడ్డినూడ్చ మనెడి పాకీ కంటే/మణికిరీటి దర్ప ఘనుడుగాడు' అని నిక్కచ్చిగా చెప్పాడు. మాటలు చెప్పడం కాదు, తుమ్మల చేతల మనిషి కూడా తానే స్వయంగా పాకీపని చేసి గ్రామ ప్రజల్లో కనువిప్పు కలిగించాడు. ఆయన పనిచేసే పాఠశాల ఊరికి దూరంగా ఉండేది. ఉదయం, సాయంత్రం ఆ ఊరివారు స్కూలుకు పోయే మార్గంలో వెళ్ళాలంటే వాసనతో కష్టంగా ఉండేది. అది చూసి తుమ్మల ఊరివారికి చెప్పి చూశాడు. మార్పు కనిపించలేదు. స్కూలు గంట కొట్టకముందే వెళ్ళి ఆ మార్గంలో ఉన్న మలాన్ని తానే స్వయంగా ఎత్తివేయడం ప్రారంభించాడు. కొంతమంది నవ్వారు. మరికొంతమంది ఆశ్చర్యపడ్డారు. అది చూసి ఊర్లోవారి ఆలోచనల్లో మార్పు వచ్చింది. గ్రామస్థులకు 'పాఠశాల పవిత్ర స్థలం, జ్ఞానపీఠం ఇక్కడ మలం విసర్జించడం న్యాయం కాదు' అని ఇల్లిల్లూ తిరిగి విన్నపం చేశాడు. ప్రజల్లో మార్పు వచ్చింది. ఆ మార్గం బాగుపడింది.

ఇలా తుమ్మలవారి జీవితంలోని కదిలించే సంఘటనలను ఎన్నింటినో 'నా కథలు' ఖండకావ్యంలో వివరించారు. ప్రజల్లో రావాల్సిన మార్పును, అలవర్చుకోవాల్సిన సత్యసంధతను ఋజు మార్గవర్తనను ప్రతి ఖండికలోనూ సూచించారు. మనకు గాంధీ కవిగా, రాష్ట్రసిద్ధికోసం రక్తంగార్చిన తెలుగులెంకగా మాత్రమే తుమ్మల తెలుసు. "కలమెత్తిన, హలమెత్తిన, మలమెత్తిన వారి నొకమై జూడవలెను" అని గళమెత్తి అభ్యుదయ భావనలు వెద జల్లిన తుమ్మల గురించి పెద్దగా తెలియదు. ఆ సంస్కరణ భావాలను అర్థంచేసుకుంటే ఆయనలోని విశ్వకవితాతత్వం సంపూర్ణంగా అర్థమౌతుంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సీతారాం కవితా నిర్మాణ చాణక్యం - సన్నాఫ్ మాణిక్యం

- పోతగాని సత్యనారాయణ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వ విద్యాలయం, వరంగల్.

“కవిత్వ తత్వాన్ని అర్థం చేసుకునేందుకు కవి ఎట్టివాడో తెలుసుకోవాలంటాడు కొలరిడ్జ్. ఎందుకంటే కవిత్వ లక్షణమంతా భావనా శక్తితోనే ముడిపడి ఉండి, కవి చేత కవిత్వాన్ని రాయిస్తుంది కాబట్టి. ఆ శక్తి వల్లనే అతడు (కవి) వైవిధ్యమున్న అంశాలన్నింటినీ, సన్నిహితమెనర్చే, ఏకీకరణ చేసే విలక్షణ వాతావరణాన్ని అసదృశ్యమైన నేర్పుతో కల్పిస్తాడు.

‘సన్నాఫ్ మాణిక్యం’ కవితా సంపుటిలోని కవిత్వాన్ని గురించి వివేచించుకునే ముందు సీతారాం ఎటువంటివాడో తెలుసుకుంటే మనకు ఇతని కవిత్వం సునాయాసంగా బోధపడుతుంది.

‘సీతారాం’, ‘నేను’ అనే స్పృహతో ప్రపంచాన్ని అవగతం చేసుకొని కవితారూపంలో అభివ్యక్తి చేస్తాడు. ప్రతీదాన్ని నమ్మి, ఆ నమ్మకంలోంచి సందేహిస్తూ, వాస్తవాన్ని అన్వేషిస్తాడు. మరణాన్ని పదే పదే పలవరిస్తూ, తాత్వికతను ప్రదర్శిస్తాడు. వాక్యాన్ని శిథిలం చేసి, ఆ శిథిలాల వినూత్న అమరితో భావావిష్కరణకు ప్రయత్నిస్తాడు. జుగుప్సను కలిగించే భాషను సైతం అభివ్యక్తి తీవ్రత కోసం వాడటానికి సందేహించని తత్వం ఇతనిది.

Sholovsky కవిత్వంలోని శాబ్దిక కళ defamiliarization అంటాడు. ఇది మనమెరిగిన దానినే మున్నెరుగని దానిలా, (అపరిచిత మైనదానిలా) రూపొందించడం. దీని వలన మనం అలవాటు పడిన దానిని సరికొత్తగా దర్శించడానికి కొత్త చూపును కలిగిస్తుంది. దీనిలో ప్రధానంగా మూడు విధాలైన సరికొత్తదనాన్ని సాధించడానికి వీలవుతుంది. వాటిలో ఒకటి భాషాపరమైనదైతే రెండవది భావ పరమైనది. చివరిది వస్తు పరమైనది.

భాషలో కనబడే నవ్యత లక్షణం వలన రచన పట్ల ఆసక్తి కలుగుతుంది. ఇక భావాన్ని ‘అపరిచిత’మొనర్చడం వలన గడ్డ కట్టుకుపోయిన ఒక ఆచారాన్ని, సంప్రదాయాన్ని పునర్నిర్మించుకోవడానికి, నిర్వీర్యమైన సమాజాన్ని పునర్జీవింపజేయడానికి ఇదొక సాధనమవుతుంది. ఒక వస్తుపరమైన ‘అపరిచిత’ విధానాన్ని పాటించడం వలన ఆధునిక ఆలోచనా విధానాలు, వాస్తవిక ప్రపంచ పోకడలు అవగతమవుతాయి.

ఈ మూడు రకాల పద్ధతులు మనకు సీతారాం కవిత్వంలో కనబడతాయి. అంతేకాదు ఈ కవి కవిత్వంలో ధ్వనికి ప్రాధాన్యత నివ్వడం వలన అత్యంత ఉన్నతంగా కవితలు ప్రకాశిస్తున్నాయి.

చర్మచక్షువులకందని జీవిత రహస్యాన్ని నిర్దుష్టంగా, కచ్చితంగా నిర్వర్తించడంలోనే ప్రతీకాత్మత ఉంది. ఔచిత్యవంతంగా ప్రతీకల్ని వాడటం వలన ధ్వని పుడుతుంది. ఈ ధ్వనిని సమర్థవంతంగా కవి ఉత్పత్తి చేయగలిగాడని S/o మాణిక్యం కవితా సంపుటి మనకు సాక్ష్యమిస్తున్నది.

జీవితం అందించిన పాఠాల నుంచి, ఉద్విగ్నమైన మానసిక స్థితుల నుంచి ఇందలి కవిత్వాంశాలు సంగ్రహించబడ్డాయి. జ్ఞాత మనస్సు పరిధిలోని ఈ అంశాలు, కవి అవగాహనలో సాధారణ లౌకిక స్థాయి నుంచి కవిత్వ స్థితినందుకున్నాయి.

సీతారాం కవిత్వంలో మనం కనిపెట్టగలిగే మరో విశిష్ట లక్షణం విరోధాభాసము. పరస్పరము విరోధంగా ఉండే భావాలను చేర్చి, వస్తు స్వరూప స్వభవాలను ప్రతీకాత్మకంగా, చమత్కారవంతంగా సమాధానపరచడమే విరోధాభాసము. అసలు భావనా శక్తి విరోధాభాసాత్మకమైనదని అంగీకరించాలంటాడు ‘బ్రూక్స్’. ఈ విరోధాభాసలాగే కవిత్వంలో Irony కూడా గొప్ప పాత్రను నిర్వర్తిస్తుంది. Irony అంటే సాధారణంగా వ్యతిరేకార్థ ప్రదర్శన. శబ్దార్థం ఒకటి కాగా దాని వలన పుట్టిన, ధ్వనించిన ఇతరేతరార్థం వల్ల ఈ వ్యతిరేకార్థం ఉత్పన్నమవుతుంది.

ఒకానొక వాక్యం ప్రతిపాదించే అర్థం (Statement) ప్రకరణం వలన ఏర్పడిన ఒత్తిడికి లోనవగా నిసర్గమైన అర్థానికి వక్రత ఏర్పడడమే Irony అంటాడు “బ్రూక్స్”

భాషలో భావాభివ్యక్తి లేకపోతే అది వొట్టి రొదగానే మిగిలిపోతుందన్న స్పృహ ఉన్నవాడు సీతారాం. అంతేకాదు ఇతడు నిరంతర కావ్యపఠనశీలుడు, కావ్యానుశీలనశీలుడు కూడా. కవిలోని భావయిత్రీ ప్రతిభా విశేషం చేత సత్కవికి ఈ లక్షణం సహజ భూషణమవుతుంది.

కవితలోని కొన్ని పదాలను లేదా, ఏదైనా ఒక ప్రత్యేకమైన పదాన్ని పునరావృత్తి చేయడం వలన చెప్పదలచుకున్న విషయానికి బలం చేకూరుతుందని, అలా రాయడం వలన పాఠకుని మనసులో ఆ విషయాన్ని స్పష్టంగా ముద్రించవచ్చుననే అభిప్రాయాన్ని ఈ కవి కలిగి ఉన్నాడనిపిస్తుంది. అంతేకాదు పద పునరావృత్తుల ద్వారా కవితా వేగాన్ని, ధర్మాగ్రహ ప్రకటనను తెలియజేయవచ్చునని ఇతని ఉద్దేశ్యంగా కనబడుతుంది.

ఇతని కవితలలో అదనంగా దొరికేవేమైనా ఉన్నాయంటే, అవి కృత్రిమ పదచిత్రాలు, నైరాశ్య భావనలు, కొంత సందిగ్థత, మరికొన్ని బూతు పదప్రయోగాలని చెప్పవచ్చు.

పైన ఉటంకించిన కవితానిర్మాణ సంబంధమైన అంశాలన్నీ సీతారాం కవితలలో ఎలా ముఖ్య పాత్రను పోషించాయో తెలుసుకోవాల్సినవే.

కవిగా రచనలు చేసే వారెవరైనా బాల్యాన్ని, అమ్మను కవిత్వం చేయకుండా ఉండలేరు. దీనికి సీతారాం కూడా అతీ

తుడు కాడు. "హరిత నవ్వు" అనే ఈ సంపుటిలోని మొదటి కవితను విశ్లేషిస్తే ఈ విషయం మనకు సుబోధకమవుతుంది.

"గుండెల్లోకి కాళ్ళు విసిరి
చిన్న చేతులతో వెన్నెల మట్టి కుప్పల్ని
ఎగజిమ్ముతుంది
ఎప్పుడైనా, ఎక్కడైనా
ఈ బతుకు మీదికి ఎవరేనా ఇలాంటి నవ్వు
విసిరారా" (హరితనవ్వు - పుట. 17)

పై పంక్తుల్లో 'చిన్న చేతులతో' అనే మాట తప్ప బాల్యానికి సంబంధించిన వస్తువిదని స్పష్టంగా తెలియదు. కవితను కప్పి చెప్పాలంటారు. మార్మికత, గుప్తతలను పాటించడంలో, ఈ సంపుటిలోని ప్రతి కవితా ఒకదానికొకటి పోటీపడ్డట్లున్నాయి. 'వెన్నెల మట్టి కుప్పల్ని' అనే పద ప్రయోగాన్ని పరిశీలిస్తే, అది ఏదో అన్యాపదేశంగా వాడినట్లు కనిపించదు.

అది తాత్వికతను విరోధాభాసగా చెప్పినట్లు తెలుస్తుంది. వెన్నెల, ఆకాశం (శూన్యం) నుండి భూమికి చేరే చంద్రుని వెలుగు, మట్టి, నేలను తవ్వితే వెలువడే, జీవానికి, జీవనానికి ఆధారమైన పదార్థం. ఈ రెండింటికి మధ్యన సామ్యత లేకపోగా పూర్తిగా విరుద్ధ లక్షణాలను, విస్పష్టమైన అంతరాలను కలిగినట్టివి. రెండు పదాలను కలిపి చేసిన కవి ప్రయోగంలోని అంతర్యమేమిటని పరిశీలిస్తే, అది రెండు వేరు వేరు ప్రతీకలను ఏకం చేసి సంధించిన తాత్విక భావ ప్రసారమని అర్థమవుతుంది.

శూన్యం లేదా ఆకాశం ఆత్మకు ప్రతీక, మట్టి అనేది జీవానికి, మానవ దేహానికి సంకేతం. వెన్నెల మట్టి కుప్పల్ని ఎగజిమ్మడంలో ఆత్మ, దేహాల ప్రస్తావన ఉంది. అంటే దేహం, ఆత్మతో కలిసి ఉత్తేజితమవడం అన్నమాట.

ఆ తరువాత పంక్తుల్లో "ఎప్పుడైనా ఎక్కడైనా / ఈ బతుకు మీదికి ఎవరేనా ఇలాంటి నవ్వు విసిరారా" అనే ప్రశ్న పాఠకుల తాత్విక దృష్టికి పదును పెడుతుంది. ఆత్మ దేహంలో భాగమై శిశువుగా జన్మించినప్పుడు తప్ప మరెప్పుడూ ఈ దృగ్విషయాన్ని చూడటానికి వీలుకాదు కదా!

"దుమ్ములో ఆడుకుంటున్నప్పుడు
చెవుల్లో ఆత్మలా నవ్వారా
పళ్ళూడిన అరణ్యంలా
ముసలి నదిలా నవ్వుతుందీ పిల్ల
పచ్చటి ఆకుల మధ్య
సూర్యుడు మరచిపోయిన కిరణంలా
ఇదిక్కడే మిగిలిఉందింకా
పెదవి విప్పుతున్నప్పుడల్లా
పూవు పూస్తున్న మెత్తని ధ్వని
గాలి నీయదు కాని
వికసించి వ్యాపించిన పూల పుప్పొడి
దేహమంతా వొణుకుతుంది." (హరితనవ్వు. పుట. 17)

బాల్యాన్ని వస్తువుగా స్వీకరించి జీవితాన్ని తాత్విక దృష్టితో వ్యక్తం చేయడం ఈ కవితలోని ప్రత్యేకత. "జీవితమే ఒక ఆట" అని తాత్వికులు చెప్తుంటారు. ఇదే దృక్పథాన్ని "దుమ్ములో ఆడుకుంటున్నప్పుడు / చెవుల్లో ఆత్మలా నవ్వారా" అనే వాక్యాలలో చూడవచ్చు. ఆత్మ నిర్మలమైనదని, అది వాస్తవాన్ని అద్దంలో ప్రతిబింబంలా చూపిస్తూ మనల్ని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తుంటుందనేది అనుభవంలోని విషయమే. అయితే ఈ వాక్యాలో తాత్విక నేపథ్యాన్ని మనం అర్థం చేసుకోవాల్సి ఉంది.

మానవుడు బాల్యంలో మట్టితో ఆడుకోవడమనే - ప్రస్తావనతో మట్టి బొమ్మైన మానవుడు, అదే మట్టితో ఆడుకొని చివరకు అదే మట్టిలో మట్టై పోతాడనే సత్యాన్ని, ఆత్మ ప్రబోధిస్తుందని నిగూఢంగా వ్యక్తీకరించబడింది. ఈ క్రింది పంక్తుల్లో కవి ప్రయోగించిన ఉపమానాలు విశ్లేషించదగినవి.

పళ్ళూడిన అరణ్యంలా / ముసలి నదిలా / నవ్వుతుందీ పిల్ల.... పళ్ళూడిన అరణ్యం అనడంలోనే అరణ్యాన్ని మానవీకరించడం ఉంది, అరణ్యానికి పళ్ళూడటం అనే ఊహే కవి అభివ్యక్తిలోని - నవ్యతను, ప్రయోగదక్షతను ఎరుక పరుస్తున్నది. వన్యప్రాణుల అరుపులతో కేరింతలు కొడుతున్నదనే ధ్వనితో... పసిపిల్లల నవ్వును పోలిక చేయడం చక్కని ఔచిత్య నిర్వహణను పట్టి చూపుతున్నది.

బాల్యాన్ని వర్ణిస్తూ వృద్ధాప్య ప్రస్తావన చేయడంలోని ఆంతర్యాన్ని గ్రహించడానికి "ముసలి నదిలా" అనే ప్రయోగాన్ని విశ్లేషించుకోవాలి. అనేక సంవత్సరాలుగా ప్రవహిస్తుండటం చేత నది ఒడ్డులు ఉర్లిపడి శిశువు నోరు తెరిచినట్లుండే చిన్న చిన్న బొరియలు కనిపిస్తాయి. వీటిలోకి నీరు త్రోసుకువచ్చి, అలల తాకిడికి పసిపిల్లల బోసి నోటి చప్పరింతల్లా వినిపిస్తుంటుంది. ఈ భావచిత్రాన్ని ఎంత సుకుమారంగా సమన్వయపరిచి ప్రదర్శించాడో కదా!

అంతేకాదు ముసలితనాన్ని ప్రస్తావించడంలో ఒక తాత్విక భావన కూడా ఉంది. వృద్ధుని నోరు పళ్ళూడిపోయి పసిపిల్లల నోటిని తలపిస్తుంది. నేటి బాల్యమే రేపటి వృద్ధాప్యం కానున్నదనే ధ్వనిని కవి ఉద్దేశించినట్లు అర్థం చేసుకోవచ్చు.

ఆ తరువాత పంక్తిలో "పచ్చని ఆకుల మధ్య సూర్యుడు మరచిపోయిన కిరణంలా ఇదిక్కడే మిగిలి ఉందింకా" అంటాడు. పచ్చదనం ప్రాణానికి, జీవిస్తుండడానికీ ప్రతీక. సూర్యడు మరచి పోయినంత మాత్రాన కిరణం యొక్క వెలుగు సాయంత్రం వేళకు మాయం కాకుండా ఉండదు. ఈ ప్రాణం కూడా ఎట్టకేలకు అదృశ్యం కావాల్సిందే.

"ఇదిక్కడే మిగిలి ఉందింకా" అనే వాక్యంతో ఈ శిశువు వృద్ధాప్యాన్ని పొంది మరణానికి చేరువకావడం తప్పక జరుగుతుందనే భావన బహు సున్నితంగా వ్యక్తీకరించబడింది.

"పెదవి విప్పుతున్నప్పుడల్లా
పూవు పూస్తున్న మెత్తని ధ్వని
గాలినీయదుకాని
వికసించి వ్యాపించిన పూలపుప్పొడి
దేహమంతా వొణుకుతుంది."

శిశుప్రాయంలో చిన్నారి పెదవి విప్పడాన్ని పూలు పూస్తున్నప్పటి మెత్తటి ధ్వనితో ఉపమానించడం ఔచితీవంతంగా ఉంది. పూలు వికసించడమే తెలుస్తుంది గాని, ధ్వని వినిపించదు. అంతా నిశ్శబ్దంగానే జరుగుతుంది. పసిపిల్లల నవ్వు కూడా మెత్తగా పెదవులు విచ్చుకోవడమే తెలుస్తుంది. పూలు వికసించిన తరువాత పుప్పొడితో పాటు ఆ ప్రదేశమంతా పరిమళ భరితమవుతుంది. పసిపిల్లల నవ్వులోని నిర్మలత్వం చిరునవ్వును తిలకించిన మానవ దేహాలను మైమరపింపజేస్తుంది.

ఒక మంచి కవి. ఏ పదాన్నీ వ్యర్థంగా ప్రయోగించడు అని చెప్పడానికి ఈ కవితే నిదర్శనం. ఈ కవితకు కవి ఉద్దేశించిన తాత్పర్యమిదేనా అనే సందేహము కలుగవచ్చు. అయితే ఒక్కొక్కప్పుడు కవి భావన ఏదైనప్పటికీ అతని భావనకు మించి కూడా పాఠకునికి బోధపడుతుంది. ఇది కవి ప్రజ్ఞకు, నిదర్శనమే అవుతుంది.

బెలిన్ స్కీ అనుయాయి Nikolay Dobrolyubov (1836-1861) రచన ప్రాశస్త్యాన్ని నిర్ణయించేది శైలి కాదు, విషయమే నంటాడు. ఇతని దృష్టిలో రచనలో కనబడే 'సామాజిక నమూనాలు' (Social Types) రచయితకు / కవికి తెలియకనే ఒక విశాల దృక్పథాన్ని సూచించవచ్చును. ఏమంటే "రచయిత / కవి జీవితాన్ని సునిశితంగా పరిశీలించి, అవధానం సడలనీయక ఆ జీవిత వాస్తవాన్ని చిత్రించబూనుకుంటాడు. అప్పుడతని రచనలో ఇమిడి ఉన్న అర్థమంతా రచనారంభంలో అతని ఊహ పరిధిలో ఉండకనేపోవచ్చు. అందులో గుప్తంగా నిక్షిప్తమైన అంశాలను ప్రత్యక్షమొనరించే బాధ్యత విమర్శకునిది. (A History of Modern Criticism : Vol IV P. 249-50) అంటే రచయిత సూక్ష్మ పరిశీలన వలన సామాజిక వాస్తవిక చిత్రణ సజీవంగా, ప్రౌఢంగా ఉంటే, అందులోని సామాజిక నమూనాలు, ప్రాదేశిక పరిధులనతిక్రమించి, రచయిత విశాల ప్రపంచ దృక్పథాన్ని (World - view) ప్రతిబింబిస్తాయి. దానిని రచయిత ఊహించాడా లేదా అన్న ప్రశ్న ముఖ్యమైనది కాదు. అది రచయితకు తెలియకనే రచనలో ఉండవచ్చు.

ఈ సంపుటిలోని ఎనభై కవితలలో మృత్యు ప్రస్తావన లేని కవితలు చాలా తక్కువ. మరణాన్ని ప్రేమిస్తూనో, పలవరిస్తూనో రాయబడ్డాయి. జీవితానికి మృత్యువుకు ఈ కవి తన కవిత్వం ద్వారా వంతెన కట్టాడనడం నిజం. ఇంతగా చావును పరితపించిన కవులను మనం అరుదుగా చూస్తాం అనిపిస్తుంది. సాధారణంగా ఇతర కవుల కవిత్వంలో జీవిత వ్యాఖ్యానం, సుఖ దు:ఖాలు, విషాద ఉల్లాసాలు ఉద్యమ సంరంభాలు ఎక్కువగా కనిపిస్తాయి. సీతారాం వీటికి చావు పుట్టుకలను పడుగు పేకల్లా కూర్చి అదనపు హంగులతో సంపద్వంతం చేసినట్టు కనబడుతుంది. విప్లవ కవితోద్యమం సన్నగిల్లుతున్న సందర్భంలో నేను న్నానంటూ శిరసెత్తిన కవి నుండి ఇంతటి నిర్వేద, నైరాశ్యాలను ప్రతిబింబించే కవిత్వం వెలువడటం కొంత ఆశ్చర్యాన్ని, ఆసక్తిని కలిగిస్తుంది.

అయితే ఈ కవి మృత్యువుని పదే పదే ప్రస్తావించడం ద్వారా పాఠకునిలో ఉదాత్త భావాలను ప్రోది చేయడమనే ప్రయోజనాన్ని సాధించాడని చెప్పవచ్చు.

"మృత్యు ప్రసక్తిని తెచ్చిన ప్రతిసారీ కవిత్వంలో కొంత అస్పష్టత గోచరిస్తుంది. (Atkins. P. 335) దాని ఫలితంగా సహృదయుని మనస్సున అద్భుతమైన, సంశ్లిష్టమైన (Confused) బింబాలు (images) ఏర్పడతాయి. అదిగాక తిమిరం, హద్దుల నెరుగని వైశాల్యం, నిశ్శబ్దం వంటివి ఉదాత్త భావాల్ని అంకురింపజేస్తాయి. స్థలానికి, కాలానికి సంబంధించిన 'అనంత' భావాలన్నీ మనకు విస్పష్టంగా ఉండనే ఉండవు. ఇలా అస్పష్టమైన భావాల్ని సమీకరించడానికి రచన కూడా స్పష్టాస్పష్టంగా, సంశ్లిష్టంగా ఉంటే ఉదాత్త భావాల్ని ప్రోది చేస్తుందంటాడు 'బర్క్'

1. "ఇంతచేసీ చెంది ఏమి ఎరుగని వాళ్ళకు మల్లె
   కలలే లేని నిద్రలోకి మీరెలా జారగలరు
   నాకైతే ప్రతి చివరా
   చనిపోవటమే మిగులుతుంది"

   (మాతృక మానదే మరి! పుట. 19)

2. బతికిన చితి కాలుతుంటే చూసి చప్పట్లు చరవరూ నేను
   చనిపోతానని శపించరూ" (లోపల్లోపల్లోపలికి... పుట. 22)

3. మనిషిని నమ్మిన దార్శనికుడు
   చనిపోయెను...
   అవును దేవుడు మరణించెను
   మానవుడూ మరణించెను
   చెట్లు మరణించెను
   మరణించిన వృక్షములు కొన్ని
   కర్రలాయెను...
   ...............................
   మనిషి భీతిల్లెను
   మరణభీతితో ఎటుచనెను(మానవుడు చనెను. పుట. 31)

4. "నాలోంచి నిను తీసేస్తే / నేనూరుకుంటానా
హీనంగా చనిపోతాను. (కూడికలూ తీసివేతలు-పుట. 36)

5. ఈ ఘోర తప్పిదము నేనేల చేసితిని
నిట్టనిలుగా కోసుకొని సిగ్గుతో చచ్చిపోవాలి
.............................................................
చలిస్తాను నేను కూడా మృత శిశువునే అయినప్పటికీ...
.............................................................
నా మోహాన్ని తవ్వి ఇన్ని శవాలు పాతినాక
నేనూరికే యథాలాపంగా బతుకుతానా...
(ఒక దీపశిఖ కూర్చి గురించి... పుట. 39)

6. కనుమూసిన మనిషిని / తెరిచిన రెప్పల మీది చావుని చూశాక
చనిపోయి మాట్లాడాలీ / .......................................
ఆ కత్తి / ఏ మెడకి తనని తాను నూరుకుందో
ఇహ కోసినంత వరకూ చాల్లెమ్మని చనిపోయిందో
(చాలా మాట్లాడాలీ. పుట. 41)

7. చెప్పిన పాఠాన్నే మళ్ళీ చెపుతావు / పలికిన మాటని పలికించి పలికించి
చంపుతావు (గుడ్మెట్టీచర్. పుట : 46)

8. చేజేతుల మారిన జీవితపు మూల మూలల్ని
అన్వేషించాలిప్పుడు / ఎవరికి దొరికాడు మనిషి
ఒక్క చావుకి తప్ప (అనుకోకుండా వెళ్తున్నా. పుట : 51)

9. వాస్తవాతీతంలో మన చావు పిట్టల తీతువులరచి
తోకలు చుక్కలుగా రాలిన వేళ...
(కలకాలముండాలి. పుట. 59)

10. నువ్వు నా దు:ఖాన్ని నవ్వుతూ ఉండు
నా మరణవార్త వినేదాకా.... (ఆ తరువాత..! పుట. 60)

11. ఎంతయినా పనులు తొడుక్కోవాలి కదా
చావుకి ముందూ వెనకా కాళ్ళూ కడుక్కోవాలి
(కాలం చేశాను. పుట : 61)

12. నా శోకమంతా మృత్యువుని గురించే మరి! / ....................
శవాలను ట్రక్కుల్లోంచి పారబోసిన / యుద్ధ సైనికుల చేతుల్ని అడుగు
చావంటే ఏమిటో.... అయినా / మనలో చనిపోయే భాగాలున్నాయి
కనుకే చావు వస్తోంది మనవేపు / వెయ్యిన్నొక్కసార్లు ఈ నిజమే చెప్పాను
అవున్నేనొక మృత్యు జాబితాని / ఇట్లా కూర్చొని చావుని ధృవీకరిస్తున్నాను.
(వీరబాహు. పుట : 66)

13. నీ సాక్షిగా / నీ శవం సాక్షిగా నువ్వు మరణించిన మాట చెప్పు
చావుకబురెవరో చెబితే / నీ కోసం ఏడుద్దామని కళ్ళు సిద్ధం చేసుకున్నాన్లే. (పంకజవల్లి కన్నీళ్ళు. పుట : 69)

14. చచ్చిన మనిషిలాగా వచ్చింది, పోయింది
మీ వైపు నుంచి రైలెడు మృతదేహాలొచ్చాక".
(ఇలా చివరికి మతాలమయ్యాం కదా. పుట : 76, 77)

15. ఆవిడ చనిపోతుంది / అతనికంటే ముందో వెనుకో
.......................................................
ఆవిడ మరణించాక తెలుస్తుంది / అతనూ చనిపోతాడు.
(అతనూ - ఆవిడ. పుట : 78)

పైన ఉదాహరించినవి ఈ సంపుటిలోని ఎనభై కవితలలో మొదటి నలభై నుండి స్వీకరించినవి. మిగతా నలభై కవితల్లోనూ ఎంత మృత్యువును తోడుకుంటే అంత తప్పక దొరుకుతుంది. దీనిని బట్టి ఈ కవి తనను తాను "నేనొక మృత్యు జాబితానని" చెప్పుకోవడంలో అసత్యం లేదనిపిస్తుంది. ఇలా అడుగడుగునా మృత్యు ప్రస్తావనలతో కవిత్వాన్ని సంధించడం వల్లనే ఇతను 'మృత్యు కవి' గా 'సిక్‌పోయెట్' గా ఫిర్యాదుకు గురికాబడ్డాడు.

ఈ కవిత్వాన్ని విశాల దృష్టితో పరిశీలిస్తే దీనిలోని 'మృత్యువు' వ్యక్తిగతమైనది కాదని, అది సామాన్యుడు తాను అనుభవించలేకపోయిన జీవన మాధుర్యమని తెలుస్తుంది. మృత్యువును విస్మరించి చరించువారే హింసాత్మకంగా ప్రవర్తిస్తారనే బుద్ధుని మాటల సారాంశం పట్ల ఎరుక ఉన్నవాడు గనుకనే ఈ కవి పుట్ల కొద్దీ మృత్యువును పలవరించి పరితపించాడు.

అలాగని ఇన్నిన్ని మృత్యు ప్రస్తావనలతో పాఠకునిలోని పఠనాసక్తికి విఘాతం కలుగలేదని నా ఉద్దేశం కాదు.

అయితే మరణ ప్రస్తావనలున్న కవితలన్నీ కేవలం దేహం నుండి ప్రాణం వేరు కావడమనే అర్థంలో లేవన్నది గమనార్హం. ఆ మృత్యువు కొన్ని కవితలలో వైయక్తికమైనట్లు, సామాజిక పరమైనదైనట్లు, తాత్వికపరమైన భావనలతో ఆచ్ఛాదితమైనట్లు కనబడుతుంది.

ఈ కవి దు:ఖాన్ని, వేదనను, అసహనాన్ని కూడా మృత్యు భాషలోనే వ్యాఖ్యానించాడు. నైరాశ్యమానసం నుండి, అసంగత భావ సమన్వయంతో జీవితాన్ని కవిత్వరూపంలో దృగ్గోచరం చేసిన నూతన ఒరవడికి నాంది పలికాడు. అందుకే "పోదాం.. పోదాం.. పోవచ్చు..." అనే కవితలో తను దర్శించి, నమ్మిన సత్యాన్నిలా ప్రకటించాడు.

"నేను తిలకించేదంతా మృత సత్యాన్నే / మృత చరిత్రనే
మృత్యువు వినా ఏదీ బతకలేదనే
ఇలా మొదలెట్టాను తుది నుంచి." అని

ఈ సంపుటిలో కేవలం మృత్యు స్పర్శ కలిగిన కవితలే కాదు, ఉదార దృష్టికోణంతో మానవ పరివేదనను వెలికి తీసినవి, సామాజిక, రాజకీయ, ఆర్థిక పరమైన పరిణామాల దృష్ట్యా ఏర్పడిన అమానవీయతను, అంతరాలను ఎండగట్టినవి, ఒక తాత్విక నేపథ్యంతో ప్రేమను సున్నితంగా బయలుపరిచిన కవితలు కూడా ప్రభాసమానంగా ఉన్నాయి.

ఈ కవితా సంపుటిలో ప్రతి కవితా కవిలోని అనుభూతిని అక్షరాలలోకి ఒంపుకుంది. అది సాదాసీదా అనుభూతి కాదు. ఆత్మాశ్రయంతో మేఘాల కొద్దీ గుండెలోకి ఒంపుకున్న అనుభూతి. ఒక్కొక్కసారి ఈ అనుభూతి పాఠకుని అంతచక్షువులకైనా అందదు. కవితలోకి దారి చూపే కవి అభివ్యక్తిని పట్టుకొని కొంతదూరం నడక సాగినా అంతలోనే మార్గదర్శనం మాయమై మసక చీకట్లు కమ్ముకుంటాయి. ఇది సహజమే. ఒక కవి తన అనుభూతిని ఆత్మాశ్రయరీతిలో పలవరిస్తున్నప్పుడు, చదివే పాఠకునిలో అదే అనుభూతి స్పష్టంగా కలగడానికి అవకాశముండదు. అది కవిలోని అంతర్మథనానికి, అతని కల్పనా జగత్తులోని వ్యక్తిగత హృదయ పరివేదనకు మాత్రమే సంబంధించినదై ఉంటుంది. భౌతిక ప్రపంచంలోని వస్తువులను అవగాహన చేసుకునే పద్ధతిని పరిశీలించుకుంటే ప్రపంచానుభవమెంత ఆత్మాశ్రయమైనదో అర్థమవుతుంది. ఇలా అనుభూతితో పాటు, వ్యక్తిగత అనుభవాలకు సంబంధించిన అభివ్యక్తి కూడా విశేషంగా ఈ కావ్యంలో ప్రదర్శించబడింది.

"ప్రతి వ్యక్తీ తాను నిర్మించుకున్న లోకంలోనే నివసిస్తాడు. అదే అతని అవగాహనలోకి వస్తుంది. ఈ అవగాహన వ్యక్తిగత మైనది. కనుక కళాకారుడు / కవి తన మూర్తిమత్వాన్నే కళ / కవితలో ప్రతిఫలింప జేస్తాడు. ఇట్టి వ్యక్తిగతానుభవాభివ్యక్తి (Self Expression) కుహనా వస్త్వాశ్రయ వర్ణనకన్న ఎంతో సత్యమైనది. వాస్తవానికి సమీపమైనది. విలువైనది అంటాడు "పాటర్."

కవికి గాని, అతని రచనలోని పాత్రకుగాని ఒకానొక మానసిక స్థితిలో లోకమెలా కనిపిస్తుందో, దానిని తన అంతరంగిక అనుభవాన్ని బట్టి ప్రదర్శిస్తాడు. సీతారాం ఈ సంపుటిలో అనుభూతిని వ్యక్తిగత అనుభవాభి వ్యక్తిని నిర్వహించిన తీరు విశ్లేషించుకోదగినదిగా ఉన్నది.

"దు:ఖానికి ముందే / కళ్ళు తుడుచుకున్నాను
కానీ, / ఈ దుస్సహ కన్నీటి బరువెలా మోయను
నా మానసాంతర పుటలోని స్మృతీ!"

(ఏవో కొన్ని కన్నీళ్ళు. పుట : 85)

దు:ఖానికి ముందే కళ్ళు తుడుచుకోవడమనే భారమైన భావంతో కవితను ప్రారంభించడం తోనే కట్ట తెగిన చెరువు నుండి, వరద వెల్లువెత్తినట్టు అనుభూతి ముంపుకు శ్రీకారం చుట్టాడు కవి. దు:ఖం కలుగక ముందే కళ్ళు తుడుచుకోవడంలోని ధ్వని సహృదయుణ్ణి కళ్ళు చెమర్చేలా చేస్తుంది. రాక తప్పని దు:ఖాన్ని ఆపుకోవడానికి ముందుగానే సిద్ధపడటమనే అర్థం, అనుభూతి అంచులకు తీసుకుపోతుంది.

"కానీ, / ఈ దుస్సహ కన్నీటి బరువెలా మోయను" అనే వాక్యంలో ఎంత ప్రయత్నించినా, ఎంతగా సహనాన్ని తోడు తెచ్చుకున్నా భరింపజాలని కన్నీటికి కారణమైన వేదనను మోయలేని నిస్సహాయత హృదయాన్ని బరువెక్కిస్తుంది.

"నా మానసాంతర పుటలలోని స్మృతీ!" అనే ఈ సంబోధనతో పైన కవి వెల్లడించిన అనుభూతి గతంలో జరిగిన సందర్భాన్ని తలచుకొని, తత్సంబంధమైన బాధని అనుభూతిస్తున్నట్లు తెలుస్తుంది. స్మృతీ! అనడంతో అది తేటపడుతున్నది.

"పాత్ర మరణించిన చోట
ఒకానొక కథ ముగిసిన కాలాన
ఇక పాత్రని బ్రతికించలేని కథకుడు
పలికిన చోటనే
బెర్టోలూసీ సినిమాలోని చివరిరాణీ!

(ఏవో కొన్ని కన్నీళ్ళు. పుట. 85)

అనుభూతి ప్రధానమైన కవితలలో చదువరికి లభించే ప్రయోజనం కేవలం తనలో నిద్రాణమైన ఉదాత్త భావనలను ప్రోది చేసుకోవడమే. అనుభూతి వాద కవులు తమ కవిత్వం ద్వారా సాధించవలసిన ప్రయోజనమూ అదే. ఈ పై కవితా ఖండికలోని పంక్తులన్నీ ఈ విషయాన్నే తెలియజేస్తున్నాయి.

"పాత్ర మరణించిన చోట / ఒకానొక కథ ముగిసిన కాలాన కథలో పాత్ర ఆవశ్యకత ముగిసిన తరువాత, తిరిగి ఆ పాత్రను బ్రతికించవలసిన అవసరం రాకపోవడాన్ని తలచుకుంటున్నాడు కవి. "బెర్టోలూసీ సినిమాలోని చివరి రాణీ!" లా గత కాలపు స్మృతులతో వర్తమానంలో ఏకాంతంగా జీవించాల్సి రావడాన్ని వేదన చెందుతున్నాడు.

"ఇంకా ఎందుకు ఎదురుచూపు
నేనే నీ నిరీక్షణను కాదా
నేనున్నా సిరలూ ధమనులున్న మనిషినే"

ఇక్కడ నిరీక్షణంతా మరణించిన పాత్ర గురించే కనుక సిరలు, ధమనులున్న జీవి మరణించడం సహజమే కదా, మరణించిన ప్రాణి తిరిగి జీవించడం ఉండదు కదా, ఇది అందరి విషయంలోనూ ఏదో ఒక రోజు జరిగే ప్రక్రియే అయినప్పుడు ఆ పాత్రను కవి / సృష్టికర్త తిరిగి బ్రతికించుకోవాలని కోరుకోవడం ఎంత కదూ అనే ధ్వని ఉంది.

"అలా, / నీ వినువీధుల్లోకి వొస్తుంటాను / చలిపెడుతన్నా
లోపల తప్పు భయపెడుతున్నా
నైతికా నైతిక సూత్రాల రంపపు పరపర పారలపై

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



వొణికేనా చేతుల్ని తినకుండా కాపాడతావని
నీ పెదవులు దాటిరాని ఆ ఒక్క మాట కోసమే
కళ్ళు కూడా రిక్కించి చూస్తాను."

(ఏవో కొన్ని కన్నీళ్ళు. పుట : 85)

నీ వినువీధుల్లోకి రావడం అంటే గతంలోకి జారిన కాలం మిగిల్చిన స్మృతులలోని సహచర జీవిని తలపుకు తెచ్చుకోవడం. అయితే ఇలా స్ఫురణకు రావడం వెనుక ముగిసిన పాత్ర ఆశ ఏమిటంటే, అది తను జీవించిన కాలంలో తన చేతులతో ఆనాటి సమాజ కట్టుబాట్లకు, కష్టాలకు ఎదురు నిలిచి చేసిన త్యాగాలను వాటి ఔన్నత్యాన్ని, అన్యులెవరూ కించపరచకుండా కాపాడా లన్నదే. తన త్యాగనిరతిని వృధా కానీయకుండా చేయగలననే ఆ ఒక్కమాట నీ పెదవుల నుండి వస్తుంటే, మరణిస్తూ కూడా, కళ్ళను తెరచే ఉంచానని చెప్పడం ఉంది. అంతేకాదు, అది నీ పెదవుల కదలికను చూడాలనే అలా కళ్ళు తెరిచి మరణించానని చెప్పడమన్నమాట.

"నీ నయనాలేమైనా చెబుతాయేమోనని
ఈ వరుసలో అన్నీ గుర్తొచ్చినప్పుడే
ఎందుకో ఏమో ఏదో ఏవో
కొన్ని కన్నీళ్ళొస్తుంటాయిలా"

నీ కన్నులైనా నాతో ఏదైనా చెబుతాయేమోనని జరిగి పోయిన కథనంతా అలా గుర్తు చేసుకుంటూ ఏవోకొన్ని కన్నీళ్ళు కారుస్తున్ననని భావం.

ఇటువంటి కవితలు అనుభూతి ప్రధానమై, మత్యు ప్రస్తా వనతో ఉన్నందువలన సహజంగా కొంత అస్పష్టత ఉంటుంది. అందుకే వీటిని అర్థం చేసుకోవడంలో క్లిష్టత ఎదురవు తుంది. కాని అనుభూతి మాత్రం కవి ఏదైతే అనుభూతించాడో పాఠ కుడూ అదే అనుభూతికి లోనవుతాడు. ఇక్కడ కవి, పాఠకుల మదిలోని అనుభూతి ఒక్కటే. అయితే అది కవితను అవగతం చేసుకోవడంలో ఎవరి దృష్టికి తోచిన విధంగా వారికి మార్గాన్ని తెరిచి ఉంచుతుంది. ఇరువురూ వేరు వేరు దారుల్లో నడిచి అనుభవానికి తెచ్చుకుంటూ చేరుకునేది మాత్రం ఒకే గమ్యానికి.

ప్రధానంగా సీతారాం కవిత్వానికి అనుభూతిని పేలుడు పదార్థంగా ఉపయోగించుకున్న కవి. భాషను సైతం వెనుకటితరం కవులవలెకాక ఒక వినూత్న పద్ధతిలో ప్రయోగించాడు. ఇతని కవితల్లోని పదవిన్యాసం సాధారణ వాక్య నిర్మాణంకన్నా భిన్నంగా ఉంటుంది.

పద పునరావృత్తి విషయంలోనూ మితాన్ని పాటించడం ఈ కవి పరిధిలోనికి రాదు. ఒక పునరావృత్తితో సంతృప్తి చెందడు. రెండుసార్లు పునరావృత్తి చేసినా ఉత్పన్నమయ్యే భావ తీవ్రతతో సమాధాన పడడు. పదే పదే మళ్ళీ మళ్ళీ తిరిగి తిరిగి రిపీట్ చేసి కసి తీర్చుకుంటాడు. అలా తన అనుభూతికి దగ్గరగా పాఠకుడిని చేయి పట్టి లాక్కుని పోయే ప్రయత్నం చేస్తాడు. అటువంటి పునరావృత్తులు గల కవితా వాక్యాలను పరిశీలిద్దాం.

"మళ్ళీ రా! అయ్య పక్షవాతపు హెచ్చరికల్లోకి, తల్లిపాచి పని
వేకువలోకి, కలల్లోంచి నిద్రలోకి, నిద్రనుంచి చావులోకి...
లోకి...లోకి..లోకి.... లోలోలోలోలోలోలోలోలో లోలోలోకి...

(లోపల్లోపల్లోపలికి.... పుట : 22)

ఇక్కడిన్ని 'లో'లలో లోపించిందేమిటో చదువరికి సునా యాసంగానే విదితమవుతుంది. ఒక్కొక్కసారి అవసరానికి మించిన పునరావృత్తుల ప్రయోగం వలన ఆశించిన ప్రయోజనం కలుగక పోగా, చదువరి మదిలో అవి కృతకమైనవిగా అనాదరించబడ తాయి. ఇలాంటివే మరికొన్ని :

"కలలూ వాటి ప్రక్కటెముకలూ
చిటపట చిటపట చితిపట చిరచిర
జంతువులు కాలినట్లు కమురుతుంది."

(పోనీలే ఇక... పుట : 28)

"ఇక ఏ మూడో డిగ్రీల జవాబులు చెప్పించే
దేహాన్ని నొప్పించే / నిజాన్ని కక్కించే
శ్రమలు వదలిపెట్టండి మీరు
అంతో యింతో ఎంతో కొంత
అతనికే ఇచ్చాను ముడుపులు
.........................................................
కలకాలంగా కాలాలున్నాయిగానీ
కష్ట నష్ట కోపశాపతాప కాలాల్లో
.........................................................
నాచేత / నా తోడ / నా వల్ల / నా యొక్క
నేరమేదైనా ఉంటే చెప్పండ్రా"

(మూడు స్వరాలు. పుట : 34)

"నువ్వొకటి / నేనూ ఒకటే / ఒకటొకటి వొకటే"

(కూడికలూ తీసివేతలు - పుట : 36)

"ఈ వనీ ఈమెనీ ఆమెనీ ఈబిడో డొలాయమానంలోకి
ఆడనీ ఈడ్నీ వీడ్నీ లిబిడోలల్లో కీలల చాటుకు
దేహాలు కదా అంతే పోతుంటాయి
.........................................................
ఒక దాన్నొకటి ఒక్కటిగా కట్టుకున్నాయిలే
ఈ తోపులో చింతల వనాంతరరాంతరాళాల్లో
.........................................................
ఆ యిద్దరూ ఓడాక
కువకువ కిచకిచ చకచకామ్మని......"

(తప్పు త్రిభుజాకారం. పుట : 37)

"అందరితో అందరం కాట్లాడాలీ
ఒక్కడ్ని మరి ఇంకొక్కడు ఇంకా ఇంకొక్కడు
ఇంకో ఇంకొక్కడు ఇంకా ఇంకొక్క మందిని
వెంటాడి తరిమి చీల్చి చెండాడాలీ
....................................................
నిప్పుల నిజాల మూటని
ఏ మానవ హస్తాలతో విప్పుకుంటాం
కత్తీ! కత్తీ!! భత్తీ!!!
అకటా! అయ్యో!! హయ్యో!!!
,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,
ఓ మా ఓ మా ఓఓ మా
రామా నీ చెంతకు రాలేమా
పోనీ పోలేమా వెళ్ళిపోలేమా"

(చాలా మాట్లాడాలి. పుట. 41, 42)

"పద పద / గబ గబ గబగబాల్మని
దు:ఖంలోకి కాకుండా / పడకుండా / చెడకుండా
చేరు ఎక్కడికైనా / ఎందుకైనా మంచిది / మంచిది
....................................................................
ఎండల్లో దుముకో దుముకూ
అస్సోమ్ దులా దులా
అప్పై దులా దులా
.........................................................................
మువ్వల చప్పుడు దు:ఖంలోకి
మళ్ళీ పదరా పదరా / పదేహె
.........................................................................
సద్దీ మూటల కూలీల ముఠాలోకి
దాదాదా / ఇది దారి ఇది దారి
ఇది కాదు అది కాదు / అది కానిది దారి దానిది
దారి కానిది నీ దారి / గోదారి చేజారి"

(వొర్ధి ........................ పుట : 55, 56)

"తోకలు చుక్కలుగా రాలిన వేళ
ఒక్కొక్కడు చ్చొచ్చొచ్చొచ్చొచ్చొచ్చొ
హంటూ కలకాలం చెయ్యాలి"

(కలకాలముండాలి. పుట. 59)

"తన లోపలికి తొంగి చూసుకున్న కొద్దీ
తానే మరీ లోపల లోపల లోపలల్లోకి
ప్రతి లోతులో ఒక లోపలి లోపల / దాక్కునే స్థలాలు
...............................................................................
నిన్ను ఇంకేం అడగను
కానీ మతం, కానీ కులం, కానీ కుటుంబం, కానీ
పరువు, కానీ తల్లి, కానీ తండ్రి, కానీ ఉద్యోగం
కానీ పెద్దక్క, కానీ చిన్నక్క, కానీ బంధువులు
కానీ మిత్రులు, కానీ వారు, కాణీకి కొరగాని వారు
కానీ వారు, కానీ వీరు, కానీ కనేవారు, కానీ కననివారు
కానీ సమాజం, కానీ మనకేమీ, కానీ సమాజం...
కానీలలా, కానీ ఎలా, కానీ ఇంకోలా, కానీ అయితేనేం
కానీ కానీలే కానీ యిలాగే చింతనిస్తూ ఒక్కొంత రవ్వంత
గోరంత, కొండంత చింతిస్తూ కూడా స్మరిస్తాన్లే కానీ!

(కానీ పోనీ ఏదో ఒకటి కానీ. పుట : 70, 71)

ఇక్కడిన్ని కానీలతో కవి సాధించిందేమిటి, ఏగానికి కొర గాని కానీల మోత తప్ప... మెడ మీది కాడినొదిలేసి పారిపోయిన దుక్కిటెద్దులా అతి కష్టం మీద లాక్కొచ్చిన భావం ఎటో వెళ్ళిపోయింది.

ఇలా చెప్పుకుంటూ పోతే దాదాపు అన్ని కవితల్లోనూ, ఏదో ఒక చోట అనావశ్యకమనిపించేలా పద పునరావృత్తులు, శబ్ద సామ్యత గల పదాల కృత్రిమ పేర్పులు విరివిగా కనిపిస్తాయి.

ఈ సంపుటిలో అత్యంత సాంద్రవంతమైన కవితలతో పాటు అతి సాధారణమైన కవితలూ ఉన్నాయి. ప్రత్యేకించి సామాజికాంశాలను కవిత్వం చేస్తున్నప్పుడు ఈ కవికి సహజమైన అనుభూతి కూడా పలుచబడి కనిపిస్తుంది. ప్రధానంగా కొన్ని సాంద్రవంతమైన కవితలుగా S/o మాణిక్యం, వంతెన దాటిన నీరు. గుడ్నైట్ టీచర్, హరితనవ్వు, నువ్వు నేను అమ్మమ్మ మొదలైన వాటిని పేర్కొనవచ్చు. కొన్ని కవితలు, సామాన్య పాఠకుని ఊహకు చెమటలు పట్టిస్తాయి. ఆ కొన్ని కవితలను ఎందుకిలా రాశాడని సంశయం కలుగుతుంది. ఒకటికి రెండు సార్లు చదివినా అర్థం కాకపోవడమే కవి కవిత్వ రచనా సామర్థ్యానికి గీటురాయి అనే భావన ఈ కవిలో కూడా ఉందనుకోవాలి. అంతేకాదు. పూర్వ కవుల అభివ్యక్తికి, పదప్రయోగాలకు భిన్నంగా రాయాలనే ప్రయోగశీలత కూడా అయ్యి ఉండాలి.

"కవులందరూ తమకు పూర్వమున్న కవులకు ప్రతిస్పంది స్తూనే వ్రాస్తారంటాడు Bloom. ప్రతి కవితలోనూ వెనుకటి కవులు తొంగి చూస్తూనే ఉంటారు. అభినవ విమర్శకులన్నట్టుగా సర్వతంత్ర స్వతంత్రమైన కవితలుండవు. కావ్యానికి పాఠం అనేది ఉండదు. పాఠాలకు పరస్పర సంబంధాలే ఉంటాయి. ("There are no texts, but only relation ship between texts" - Harold Bloom : A map of Misreading)

"కొత్తగా వచ్చిన కవి, తానింత ఆలస్యంగా కవితారంగం లోకి వచ్చినందుకు చిన్నబుచ్చుకుంటాడు. వెనుకటివాళ్ళు ఎంతో కీర్తి ప్రతిష్టలను సాధించారు. వారు మహానుభావులై కూర్చున్నారు. వారి ప్రమాణాలతోనే తన్నూ కొలుస్తారు. ఈ మృతినొందిన వ్యక్తి. కీర్తిశేషుడైన వ్యక్తి, తనకన్నా మిక్కిలిగా సజీవుడుగా ఉన్నందుకు అతనిలోని బెంగ, తిరుగుబాటు, అసూయ మున్నగు లక్షణాల

వల్ల ఆ వెనుకటి కవిని వక్రంగా పఠిస్తాడు. అతనిని తన రచనలోకి ఆహ్వానిస్తాడు. తిరస్కరిస్తాడు. తనకూ అతనికి గల సంబంధాన్ని, అణగద్రొక్కజూస్తాడు. వాని మీద ఆధారపడే ఉంటాడు. అతనిని పూజ్యస్థానంలోనూ ఉంచుతాడు, అతని గొప్ప ఏముందిలే అను కుంటాడు. ఇలా ప్రతి కవికీ తన కవిత్వానికి సంబంధించిన Oedipuscomplexతో ఆ పితృస్థానంలోని వానిని సంహరిస్తే గాని అతనికి అభివ్యక్తిలో స్వాతంత్ర్యం ఏర్పడదనీ Bloom భావి స్తాడు. ఇది కవుల మీద పూర్వ కవుల ప్రభావాన్ని, వినూత్న పద్ధ తిని వివరించడమే" (పాశ్చాత్య సాహిత్య విమర్శ - చరిత్ర, సిద్ధాం తాలు పుట : 307, 308)

ఇలా ఏర్పర్చుకున్నదే సీతారాం వినూత్నశైలి కూడా. ఇతని కవిత్వం అనుకరణ సాధ్యం కానిది. నేనిలాగే రాస్తాను. నచ్చితే పాఠకుడు స్వీకరిస్తాడు. లేదంటే వదిలేస్తాడు. అనే ధోరణి ఇతని కవిత్వ రచనా నిర్మాణ శైలిలో కనబడుతుంది. దీనిలో భాగమే కొందరు అనావశ్యకమనుకునే జుగుప్స కలిగించే బూతుపద ప్రయోగాలు కూడా.

"ఈ వెలుతురు దేహాన్నీ, మానాన్నీ చూసి ఒకటేనవ్వుతాం"
(ఒక మనిషికి చివరి మాట - 2 పుట : 40)

"బొందులు విప్పదీసుకుని దండేలమీద
వేళ్ళాడుతున్న లింగాల మానాల్ని....
ఎవడు రాయలేదెవడు రాయలేదు
.................................................
నా గర్భ సంచుల్లో మల మూత్రాలు వొంపావా"
(చాలా మాట్లాడాలి. పుట. 43)

"ఇంతకాలం మీ బెత్తాం కళ్ళలో పడి
క్షణం క్షణం ఉచ్చే పోసుకున్నాను"
(గుడ్మైట్ టీచర్. పుట : 47)

"అదో సాంస్కృతిక న్యూనతలోని మొండి మొలసిగ్గూ
దాన్లోంచి వచ్చేపోయే కారమిరియాలు
...........................................................................
ఆ కళ్ళల్లో పశ్చాత్తాపం గుర్తొస్తే
ధనం మీద ఉచ్చపొయ్యాలనిపిస్తుంది"
(తమిళగీతం. పుట. 81)

"ఏ వీధిలో తిరిగినా ఎవడెదురైనా, లుంగీ లేపమంటాడు
అంగం చూసి పోతాడు"
( PALILOGY పుట. 84)

"అవి ఇంకానా ఉబ్బిపోయిన మా ఆవిడ మానంలోంచి కారుతూ ఉన్న రసీన్నూ, ఈదీ నేనూ వేశ్యలం".....

తలలు తెగిన జనాలున్నారు. జననాంగాలు లనివాళ్ళూ ఉన్నారు. ........... ఆకలి సందున ఇరికిపోయే అంగాలు....
(లోపల్లోపల్లోపలికి... పుట. 22)

కవిత్వం చేయదలచిన వస్తువు ఎంతటి ఉదాత్తమైనదైనా, దానికి, కవి ఉద్దేశించిన భావమేదైనా దాన్ని మరింత ప్రభావో పేతంగా వ్యక్తీకరించడానికి కవిత్వమే పరమ సమర్ధవంతమైన, సహాయకారి. అసభ్య పదజాలము, ఎప్పటికీ కవిత్వానికి ప్రత్యా మ్నాయం కాజాలదు. వాదనలో ఓటమిని గ్రహించే అటువంటి అధమస్థాయి గల భాషను ఆశ్రయించడం లోక విదితం. ఎదుటి వారి మనస్సులను నొప్పించడానికో, ఏహ్యభావన కలిగించడానికో అట్టి పదజాలము ఉపయోగపడుతుంది. అంతేగాక బాధితుల బాధల పట్ల సానుభూతిని కలిగించి, వారికి సహాయపడాలన్న ప్రేరణకు, అది మిక్కిలి అవరోధంగా మారుతుంది.

కవులు ఉపయోగించే భాష మరింత సభ్యతతో కూడి ఉండాలని పాఠకలోకం కోరుకుంటుంది. కావ్య భాషను గురించి వర్డ్స్ వర్త్ చేసిన వ్యాఖ్య ప్రత్యేకంగా పరిశీలించదగ్గది. "18వ శతాబ్దారంభంలో అడిసన్ ఒక స్పెక్టేకర్ వ్యాసంలో... అనుదినం వాడుకలోనున్న శబ్దాలూ, నుడికారాలూ పామరుల నోట నలిగి, అవి నీచమైన స్థితికి దిగజారిపోతాయి. అందుచేత అట్టి శబ్దాలను, శబ్ద సముచ్చయాలను, నుడికారాలను పరిహరించాలన్నాడు" (Spectataor No. 285)

బెన్ జాన్సన్, డ్రెడెన్, పోప్ వంటి పాశ్చాత్య సాహితీవేత్తలు భాష అనేది నాగరిక నుడికారాన్ని ఇముడ్చుకొని విద్యావంతులు మాటాడే భాషను పోలి ఉండాలని అభిప్రాయపడ్డారు.

"వ్యుత్పత్తి, అభ్యాసం ఉన్న రచయితకు దివ్యావేశం ప్రాపు దొరికితే మంచి కవిత్వం వస్తుంది. కాని కేవలం ఆవేశం కోసం ఎదురుచూసే కవిలో ఎక్కడైనా ఒక తళుకు ఉండవచ్చు కాని, అది మరుక్షణాన మాసిపోయే అవకాశం ఉంది. కవి జీవితాను భవాన్ని పొందాలి. దానివల్ల ప్రభావితుడవ్వాలి. ఆ అనుభవ మెట్టిదో పరీక్షించాలి. దానిని కవితగా, కావ్యంగా మలచడానికొక అభివ్యక్తి మార్గాన్ని అన్వేషించాలి. అది వాగ్రూపాన్ని పొందినప్పుడు, తాను కట్టిన ఊహ సహృదయునికి అందుతుందో లేదో చూడాలి. ఇన్నింట కవి (అలెర్ట్‌గా) అవధానం సడలకుండా ఉండాలి. కవి దివ్యావేశానికి ఎదురు చూస్తూ, సంవిధానాది శిల్ప లక్షణా లన్నింటినీ వదులుకోలేడు. కవులు దివ్యావేశానికి అవసరానికి మించిన, ప్రాముఖ్యాన్ని ఇవ్వడం వారి బలహీనతే అవుతుంది. (పాశ్చాత్య సాహిత్య విమర్శ : చరిత్ర - సిద్ధాంతాలు. పుట. 168)

సమాజంలో అత్యంత హేయమైన, అమానవీయమైన సంఘటనలు జరుగుతుండటం, వాటి వల్ల కవి స్పందనలో భాగంగా ఆవేశానికి గురికావడం సహజంగా జరుగుతుంది. ఇలా ఆవేశం కలిగినప్పుడు, కవిత్వ సృజనకు సిద్ధపడినప్పుడు, ఆ రచనకు తగిన భాషా ప్రౌఢిమ అవసరమవుతుంది. దానికోసం తీక్షణ భావ వ్యక్తీకరణ కాక అసభ్యకరమైన భాషను ఉపయోగిం చాల్సి రావడం అనేది, ఆ కవిలోని విశృంఖలమైన మనోవికారాలు

తన నిగ్రహశక్తిని ప్రశ్నార్థకం చేస్తాయి. ఉదాహరణకు ఒకే కవితా వస్తువును ఇరువురు కవులు అభివ్యక్తీకరించిన పద్ధతులను, వారు వాడిన భాషను పరిశీలిస్తే జుగుప్సాకరమైన భాషను వాడిన కవిత కన్నా, సహించసాధ్యం కానిబాధనైనా అనుభూతికి తేవడానికి, కవిత్వమయమైన సాధారణ భాషే ఉత్తమమని తేలుతుంది.

స్త్రీలకు ఋతుస్రావం కావడం వారి శారీరక ధర్మం. ఆ సమయంలో వారు అనుభవించే బాధను కవిత్వం చేయనెంచిన ఒక కవి కవితాపంక్తులిలా ఉన్నాయి.

"ఆమె మర్మాంగంలో
కత్తులు, కొడవళ్ళు జొనిపి
పేగుల్ని మెలితిప్పినట్టు
మౌనం మాత్రమే
గొంతు చించుకునే బాధ..."

ఇదే విషయాన్ని మరో కవయిత్రి వర్ణించిన విధానం చూడండి.

"పొత్తి కడుపులో
ముళ్ళపొదలు గుచ్చుకుంటునప్పుడు
మూన్నాళ్ళుగా మూగ బాధను
ఎర్ర మందారాన్నై, ఏకరువు పెడుతున్నాను"

మొదట ఉదహరించిన కవిత్వ భాషకు, రెండవసారి ఉదహరించిన కవితలోని కవిత్వ భాషకు తేడాను విడమర్చి చెప్పవలసిన అవసరమే లేదు. చెప్పిన విషయం ఇరువురిదీ ఒక్కటే అయినా - ఒకరి కవిత జుగుప్సను, ఏవగింపును కలిగిస్తుంటే మరొకరి కవిత బాధితురాలి బాధను, వేదనను అనుభూతి చెందుతూ సానుభూతిని కలిగించేదిగా ఉంది. అభివ్యక్తులెలా ఉన్నా కవిత్వానికి వాడే భాష కూడా వస్తు వర్ణనలో ప్రధాన భూమిక వహిస్తుంది.

కవిత్వ సృష్టి దర్శనాత్మక, అనుభవాత్మకమైనదే గాని మేధకు సంబంధించినది కాదు. మేధ వస్తువును గాని, భావాన్ని గాని విస్పష్టమొనరించడానికి భాషనొక, పరికరంగా భావిస్తుంది. ఏ అంశాన్నైనా శక్తివంతంగా, ఆకర్షణీయంగా వివరించడానికి అది ఒక సాధనమని భావిస్తుంది. కవి కర్మ భావాన్ని విస్పష్టంగా, శక్తివంతంగా అందజేయడమే కాదు, శబ్దానికి ప్రాణ ప్రతిష్ట చేయాలి. వస్తువుకు సంబంధించిన భావోద్రేకాలనూ, మానసిక ప్రతి స్పందననూ మనకు అందజేయాలి. వస్తువు సాక్షాత్కార మవ్వాలి. సృజనాత్మక శబ్దం వల్లనే కవి. ప్రాణులతో, వస్తువులతో, అనుభూతులతో కూడిన జగత్తును సృష్టిస్తాడు.

అయితే సీతారాం కవిత్వానికి కొత్త కాపు కాడు. కవిత్వ మర్మాలు తెలిసినవాడు. ఈ కవితా సంపుటిలోని ఎనభై కవితలలో దేనికదే విశిష్టతను, ప్రత్యేకతను కలిగి ఉంది వాటినన్నింటినీ విశ్లేషిస్తూ, విమర్శన చేస్తూ పోతే ఈ వ్యాసం ఒక బృహద్గ్రంథమే అవుతుంది. ఇప్పటికే ఈ వ్యాసం నిడివి పెరిగిందని నాకు తెలుసు. అందుకే ఈ వ్యాసాన్నిక్కడికి ఆపేయదలచుకున్నాను. ఆపేముందు మరొక్క విషయం ఎవరి అభివ్యక్తి వారికి నచ్చు తుంది, ఎవరి భాష వారికి వినసొంపుగా ఉంటుంది. ఎవరి అభి వ్యక్తులు, భాషా సంవిధానాలు ఎలా ఉన్నా - కవిత్వాన్ని సహృద యుని మనస్సు స్వీకరించి, సంస్కరించబడటమో, స్ఫూర్తిని పొందడమో, ప్రేరణకు గురికావడమో జరిగితేనే ఆ కవిత్వానికి పరమ ప్రయోజనం సిద్ధించినట్టు.

ఏదేమైనా ఈ సంపుటి (సన్నాఫ్ మాణిక్యం) ఇంకా అనేక కోణాలలో విశ్లేషించడానికి, వివేచించడానికి విస్తారమైన వనరు లున్న కవిత్వ నిధి అని చెప్పవచ్చు.

❀❀❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# త్రిపురనేని నాటకత్రయం - మానవత దృష్టి

- డా॥ టి. రాజశేఖర్, పోస్ట్ డాక్టరల్ ఫెలో, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఈ శతాబ్దపు సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆధునితకు కవులు అగ్రపీఠాన్ని వేశారనిపిస్తుంది. అభ్యుదయాన్ని ఆకాంక్షించని ఏ రచనా కూడా ఆధునిక కాలంలో నిలవలేదు. అలాంటి రచనల్లో ప్రాచీనత, నవీనత రెండు కలబోసుకొన్న ఆబాలగోపాలాన్ని అలరించిన సాహిత్య ప్రక్రియ నాటకం. ఆంగిక, వాచక, అభినయ నాలతో 19, 20వ శతాబ్దాల్లో అశేష ప్రేక్షక లోకాన్ని అలరించిన ఈ నాటక సాహిత్యంలో హేతువాద దృక్పథంతో ఆలోచింపజేసిన నాటకాలను తెలుగు శ్రోతలకు, పాఠకులకు అందించిన వారు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి.

వైదిక ధర్మానికి, హిందూ మతానికి మూడు మూల స్థంబాల వంటి గ్రంథాలు మహాభారతం, రామాయణం, భాగ వతం. ఆ గ్రంథాలను హిందువులు పరమపవిత్ర గ్రంథాలుగా ప్రతి గృహంలోను ఉండదగినవిగా భావిస్తారు. అది భగవంతుని మార్గాన్ని మానవులకు తెలపి భక్తి భావాలను పెంపొందిస్తాయి. కాని ఆ గ్రంథాలు భగవంతుని చరిత్రగా కాకుండా పూర్వ మానవ చరిత్రగా కవిరాజు గారు భావించి మానవతాకోణంలో ఆ గ్రంథా లను పరిశీలించినారు. ఆ గ్రంథాల్లో జరిగిన పొరబాట్లను మన పండితులు కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నప్పుడు కవిరాజు మాత్రం వాళ్ళు దేవుళ్ళా? దేవుళ్ళు తప్పు చేస్తే తప్పుకాదా? అని ప్రశ్నించి వారిని దేవుళ్ళుగా కాక మానవులుగానే చిత్రించి, ఆనాడు జరిగిన పొరబాట్లను, ఆచారాల మాటున అన్యాయాలను, అవి కప్పిపుచ్చడానికి మన పండితులు చేసిన అభూత కల్పనలను, అసత్యరాతలను ఎండగట్టడానికి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడానికి మూడు నాటకాలు రాసి ప్రజలలో చైతన్య బీజాలు నాటాడు. అప్పటికే ఒక బలమైన పునాదిగల హిందూ మతవ్యవస్థను ఎదురించి రచనలు చేయడానికి హేతువాద ఉద్యమాన్ని అవలంభించాడు. అందుకే కవిరాజు గారి మీద విస్తృత పరిశోధన చేసిన కె. రెడ్డెప్ప గారు "హేతువాదము ఆయుధంగా స్వీకరించి పురాణాది గ్రంథాల్లోని కుళ్ళును కెళ్ళ గించుటకు సైనికునివలె విజృంభించిన సాంఘిక విప్లవమూర్తి కవిరాజు" అంటాడు.కవిరాజు 3 నాటకాలు రాశారు. 1. కురుక్షేత్ర సంగ్రామం, 2. శంబుకవధ, 3.ఖూని కురుక్షేత్ర సంగ్రామం:- కురుక్షేత్ర సంగ్రామం అనే నాటకం కవిరాజు గారి మొదటి నాటక రచన. 1910లో ప్రచురించబడింది. కురుక్షేత్రం అనే పేరు వినగానే మహాభారతంలో జరిగిన అన్నదమ్ముల పోరు అని మనకు అర్థమవుతుంది. ఇందులో కౌరవుల పరాభవం, పాండవుల విజయం, శ్రీకృష్ణ భగవానుడు చేసిన దుష్టశిక్షణ, శిష్ట రక్షణగా మనం భావిస్తాం. ఇది జరిగిన తీరు సరైనది కాదని కవిరాజు గారు 'కురుక్షేత్ర సంగ్రామమనే' నాటకాన్ని రాశారు. ప్రపంచంలోని అన్ని విషయాలను తనలో ఇముడ్చుకొని పంచమవేదంగా ప్రసిద్ధి కెక్కిన మహాభారతంలో దాయాదుల రాజ్యభాగాల కోసం జరిగిన పోరులో ప్రధాన ఘట్టాల్ని గ్రహించి న్యాయాన్యాయాలను రామ స్వామి వివేచనచేసి, సమాజానికి నిజం చూపాలన్న సాహస హృదయం మెచ్చుకోదగినది.

రామస్వామి చౌదరిగారు, మెట్రిక్యులేషన్ చదువుకునే రోజుల్లో అడగలూరు అనే చోట ఒక సభలో 'పాండవోద్యోగ విజయం' పైన తిరుపతి వేంకట కవులు పాడిన పద్యాలకు జనం ఆహా! ఓహో! అని కరతాల ధ్వనులతో కేరింతలు కొడుతుంటే దానిలో ఏముంది గొప్ప? అని ఒక స్నేహితుడితో అన్నారట. ఆ స్నేహితుడు 'అయితే నీవు చెప్పగలవా పద్యం' అని ప్రశ్నించాడట. కవిరాజు గారు ఎందుకు చెప్పలేను, పైగా పాండవులది ధర్మపక్షం కాదని, కృష్ణుని కుయుక్తులతోనే గెలిచారని నిరూపించాలని ఆయన భావించాడు. దాని ఫలితమే కురుక్షేత్ర సంగ్రామ నాటక రచన.

ఈ కురుక్షేత్ర సంగ్రామ నాటకంలో సంజయుని ద్వారా, కర్ణుని ద్వారా పాండవులకు రాజ్యార్హత లేదని నిరూపించాడు. మూడంకాలు గల ఈ రచనలో సంజయ రాయభారంతో ప్రారం భం అవుతుంది. భారతీయ సాంస్కృతిక జీవనంలో కుటుంబ వ్యవస్థకు, ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. కుటుంబంతో మానవునికి విడదీయరాని అనుబంధం ఉంటుంది. అలాగే కుటుంబ జీవ నంలో ఎన్నో కట్టుబాట్లు, నియమాలు ఉంటాయి. సాధారణంగా ఒక కుటుంబంలో కుటుంబ యజమాని మరణించినా లేదా పెత్తనం నుండి తప్పుకున్నా ఆ బాధ్యతలు ఆ ఇంటి పెద్ద కుమారునికే కట్టబెట్టటం జగద్విదితం. అంతేగాని ఆ ఇంట్లో ఎందరన్నదమ్ములుంటే అందరూ పెత్తనం చేయాలని భావిస్తే ఆ కొంప కొల్లేరే. సామాన్య మానవుని కుటుంబంలోనే అలా ఉంటే మరి రాజ కుటుంబంలో పరిస్థితి ఏమిటి? రాజకుటుం బంలో ఎంతమంది పుడితే అందరూ రాజ్యమేలాలని భావిస్తే అది సంభవమేనా? జ్యేష్ఠులకే రాజ్యార్హత ఇవ్వడం సంప్రదాయం. మహాభారతంలో కూడా అసలు వంశమే లేదనుకునే సందర్భంలో వ్యాసుని అనుగ్రహంతో జన్మించిన ధృతరాష్ట్ర పాండురాజులు ఒక రేమో అంధుడు, మరొకడు రోగిష్టి. చెప్పాలంటే ఇద్దరూ రాజ్యార్హత లేనివారు. కాని జ్యేష్ఠుడైన ధృతరాష్ట్రుడు రాజుగా, పాండురాజు యువరాజుగా పాలన సాగించారు. విధికృతంతో పాండురాజు మరణిస్తే రాజ్యభాగం ఆయన కుమారులడగటం

విడ్డూరంగా ఉందని త్రిపురనేని రామస్వామి చౌదరి సంజయునితో ఇలా ప్రకటింపజేశాడు.

"పూరుని నాటి నుండి మన పూర్వులు జ్యేష్ఠులె రాజ్యమేలుగా గోరిరి గాని, మీవలెనె కొంకక పుట్టినయెల్ల వారలీ ధారుణి మీకు, మాకు సముదాయమటంచును బంచగోరెరే పేరున ధర్మరాజువు తపింపకు పెంపకు రాజ్యకాంక్షలన్".

వెంటనే ధర్మరాజందుకుని జ్యేష్ఠుడను నేనే కదా. కాని ఇక్కడ ధర్మజ్ఞుడైన ధర్మరాజు తాను పెద్దవాడనని చెబుతున్నాడు గానీ తమతండ్రుల్లో ఎవరు పెద్దవారని గ్రహించడం లేదు. అదే ధర్మరాజు రాజ్యకాంక్షను, స్వార్థబుద్ధిని తెలియజేస్తోంది. ధృతరాష్ట్రుడు సింహాసనమధిష్టించిన రాజు. పాండురాజు రాజ్య విస్తరణ చేసిన రాజప్రతినిధి. కౌరవులు రాజపుత్రులు, పాండువులు రాజ కుటుంబీకులు. రాజకుటుంబీకులకు రాజభోగాలు, భరణాలు అనుభవించే అర్హత ఉంటుంది కాని అందరూ రాజులు కాలేరు కదా. ముమ్మాటికీ ధృతరాష్ట్రుడే రాజు. అని కవిరాజు త్రిపురనేని ప్రకటించినా ఇదే విషయాన్ని భారతం కూడా బలపరుస్తోంది.

"లోకనుతుండు పాండుడములుండు మహాగుణ రత్నపూర్ణ రత్నాకరుడు డత్యుదార మతియంధుడైన నన్ను రాజుగా జేసుకొని నాకు భక్తి బనిసేయుచు సర్వజగజ్జిగీషుడై యీ కురు వంశ రాజ్యభారమంతయు దాల్చె బరాక్రమంబుగన్"

(శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం-7ఆ, 25వప)

అంతేగాక పాండురాజు తాను శాపగ్రస్తుడైనప్పుడు శత శృంగ పర్వతం నుండి హస్తినాపురానికి వర్తమానం పంపుతూ

"............ నవయుక హస్తిపురంబున కుంజలి నాతపో వృత్తినునికి రాజునకు, సత్యవతిదేవికి, భీష్మునకు, విదురనకు, గౌసల్యకు, వృద్ధపురోహిత బ్రాహ్మణులకుంజెప్పి"

(ఆం.మ.భా.ఆది.5ఆ-67వ వచనం)

అన్నమాటల్లో రాజు సంభోదన ధృతరాష్ట్రున్నే నని అర్థం అవుతోంది. కవిరాజు ధర్మరాజు, పాండవుల కుటిల బుద్ధి సంజయ రాయభార ఘట్టంలోనే అందరికి అర్థం అయ్యేటట్లు చేశాడు. క్షేమసమాచారాలడుగుతూ, ధర్మరాజు

దురభిమాన మానంబునకు నెల్ల దొంటియిక్క
చంద్ర వంశములోని గంజాయి మొక్క
సుయోధనుండ వరజాతప్తబంధు
యుతముగా గొలువున సుఖమున్నవాడే.

(కు.సం.-1వ అం-పుట.5)

సాధారణంగా ధర్మరాజును అజాతశత్రువంటారు. కాని ఆయనకు శత్రువులు లేకపోవచ్చు. కాని అందరిని ఆయన అసూయతో ద్వేషంతోనే చూస్తూంటాడు. పుట్టుగుడ్డివాడైన ధృతరాష్ట్రుడు రాజ్యానికర్హుడు కాబట్టి మా తండ్రిదే రాజ్యం అని భీముడన్నప్పుడు సంజయుని ద్వారా చెంపదెబ్బలాంటి సమాధానమిస్తాడు కవిరాజు.

పుట్టుగ్రుడ్డి సామ్రాజ్యంబు బొందరాదు
శాస్త్రసమ్మతమునరే యాజన్మపాండు
రోగికెట్లధికారంబు రూఢమగును
మీరే యోచించి చెప్పుడీ ధీరులారా!

అలాగే రాజ్యవారసత్వానికి ఔరస, క్షేత్రజ ప్రస్తావన సంజయునిచేత కవిరాజు చేయించాడు. రాజు ధృతరాష్ట్రుడు కాబట్టి - అతని పుత్రులు ఔరసులు. మహావీరుడు పాండరాజ కొడుకులు క్షేత్రజులు. ఒక్కడ ఔరసులున్నారు కాబట్టి క్షేత్రజులకు రాజ్యార్హత లేదు. అంతటితో ఆగక రెచ్చిపోతున్న పాండవుల నోటికి అడ్డుకట్ట వేయడానికి

నాకంగముని కెళీనున్న మృగమున్ ఖండించి శాపాగ్నిలో
నానాడే పడి సంస్కృతిన్ వద్దులుచున్ వ్యామోహమున్ వీడుచున్
వానప్రస్తంబు బూనె మీ జనకు దాపై మీరు జన్మించిపై
పైన రాజ్యమటన్న నేవిధముగ వచ్చు సగంచేనియునియున్

(కు.సం.1అం, పుట.10)

పాండురాజు వానప్రస్థము స్వీకరించిన తర్వాత ఆయన భార్యలు కుంతీ, మాద్రులు-యమ, వాయు, ఇంద్ర, అశ్వనీ దేవతల వల్ల ధర్మ, భీమ, అర్జున, నకుల సహదేవులను కన్నారు. పాండురాజు రక్తానికి పుట్టని వానికి రాజ్యమెలా వస్తుందని సంజయుని సూటి ప్రశ్న.

పాండవుల అభిప్రాయాలను హస్తినాపురానికి మోసుకెళ్ళిన కృష్ణుడు పాండవుల ఐదుగురికి ఐదూళ్ళిచ్చినా చాలునంటాడు. ఆ ఐదూళ్ళు కూడా ఎందుకంటే వాళ్ళను నమ్ముకున్న బంధుమిత్రుల గ్రాసవాసాలకు. అంతధీనంగా అడిగినా ఐదూళ్ళుకూడా ఇవ్వనన్న దుర్యోధనుడిని లోకులేకాదు మనం కూడా నిందిస్తాం. ఆ ఐదూర్లు ఏవి అడిగారో ఆలోచించం. ఈ సందర్భంగా ఆనాటకానికి తొలిపలుకులు రాసిన కవిరాజు గారి మాటల సారాంశం ఇక్కడ ప్రస్తావించదగింది. "తిక్కన పాండవులడిగిన ఐదూర్లు ప్రస్తావించలేదు. ఎందుకంటే వాటి ప్రస్తావనవస్తే ఆంధ్రులెక్కడ ఆలోచించాస్తారమెనని. సంస్కృత భారతంలో ధర్మరాజు అడిగిన ఐదూర్లు

"కుశస్థలం, వృకస్థలం, మాకందీంవారణావతం,
అవసాభవేద్రత, కంచదేకంచపంచమం'

(సంస్కృత భారతం - ఉద్యోగపర్వం - 30 వ అధ్యాయం)

కుశస్థలం, వృకస్థలం, మాకందీం, వారణావతంతో కలిపి ఏదైనా మరొక గ్రామం. వీటిలో మొదటి రెండు పాంచాల రాజ్యంలోనివి. వాటిని కౌరవపాండవులు ద్రోణునికి గురుదక్షిణగా ఇచ్చారు. కుశస్థలి కర్ణుని స్వాధీనంలో ఉంది. వృకస్థలం మాత్రం

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



హస్తినాపురానికి ఒకరోజు ప్రయాణం అలాంటి రాజ్యంలో పక్కలో బల్లెంలా మరోరాజును ఉంచగలరా. ఇది సంధి జరుగుటకు చేసిన రాయభారమేకాదు. నేడైతే భారతదేశానికి ఆయువు పట్టు లాంటి ఐదు మహనగరాలను పరులకివ్వగలమా. నాడు అదే పరిస్థితి. అందుకే సుయోధనుడు ఇవ్వలేనన్నాడు. అదే సభలో కర్ణుని చేత కవిరాజు అసలు రాజ్యంలో భాగమున్నవాళ్ళు అయితే రాజ్యం అడుగుతారా అని ఐదు ఊర్లు అడుగుతారా? అని సూటి ప్రశ్న వేయించాడు. అసలు పాండవులకు రాజ్యభాగంలో అర్హత లేదని చెప్పించాడు. హక్కు ఉన్నవాడు తనకెంతరావాలో అంత అడుగుతాడు కాని భిక్షమడగుడు కదా.

ఇలా ప్రథమాంకంలో పాండవులకు రాజ్యార్హత లేదని సూటిగా చెప్పించిన కవిరాజు తరువాతాంకాల్లో భీష్మ ద్రోణ యుద్ధాల్లో కృష్ణుని కుయ్యుక్తులు, పాండవుల అధర్మయుద్ధాన్ని బయటపెట్టాడు.

యుద్ధం ప్రారంభంకాగేనే ధర్మరాజు కౌరవసేన దగ్గరకు వెళ్ళి భీష్మద్రోణాదులకు నమస్కరించి అతివినియంతో ఆశీర్వాదం పొంది 'మీరెట్లు చచ్చెదురు' అని అడుగుతాడు. సమరంలో శత్రుపక్షానికి నమస్కరిస్తే పలయనం చిత్తగించినట్లే కదా. ధర్మ రాజు నమస్కరించి పెద్దల దగ్గర 'విజయీభవ' అని ఆశీర్వాదం పొందడం ఆ మెప్పుతో తాతగారి మరణరహస్యాన్ని కనుక్కోవాలని ప్రయత్నించడం ఇదంతా వీరుల లక్షణం కాదు. ప్రస్తుతం వార్తా పత్రికల్లో ప్రచురితం అవుతున్న 'మైండ్‌గేమ్' లాంటిది. శత్రువు లను మానసికంగా వశీకరణం చేసుకునే ఆట. తన మరణ రహ స్యాన్ని అడిగిన ధర్మరాజును మందలించకుండా భీష్ముడు కొద్ది రోజులాగి రమ్మననడం, ద్రోణుడు తాను వినకూడని మాట వింటే అస్త్రసన్యాసం చేస్తాననడం, కృపుడు చిరంజీవి అని అనడం బట్టి ఆలోచిస్తే భీష్మద్రోణులు పాండవ పక్షపాతులు. ఆపక్షపాత బుద్ధే దుర్యోధనుని ఓటమిపాలు చేసింది.

భీష్ముని మరణరహస్యాన్ని కనుక్కోనిరమ్మని కృష్ణుడు పాండవులను ప్రేరేపించడం, పితామహుని మరణం చూడలేనని ధర్మరాజు అనడం అంతా నాటకం. అలాంటప్పుడు ధర్మరాజు ఎందుకు ముందుగానే రహస్యమడగాలి. ఇప్పుడెందుకు మొసలి కన్నీరు గార్చాలి. అసలు రహస్యాన్ని రహస్యంగా కనుక్కొన్న పాండ వులు శిఖండిని అడ్డుపెట్టుకొని అర్జునుడు భీష్ముణ్ణి అంపశయ్యాపై పడేటట్టు చేస్తాడు. ఈ భీష్మున్ని పక్షపాత బుద్ధిని కళ్ళార చూసిన దీనపాలుడు.

"తాతగారెంత పక్షపాతి స్వచ్ఛంద మరణముగల వాడగుట నిట్టియ కార్యము చేసెను. వీని పక్షపాతయుద్ధమున కన్న కర్ణుని యుద్ధము వేయిరెట్లు లాభము కల్గెడిది"

(పుట సంఖ్య.76)

ద్రోణుని మరణం కళ్ళార చూసిన తర్వాత అర్జునునితో కూడా కృష్ణుని మాయోపాయాలపట్ల ఏవగింపు కలుగుతుంది. అభిమన్యుని వధించిన సమయంలో అర్జును ఆగ్రహోదగ్రుడై సైంధవుని ప్రొద్దు గుంకెలోపు వధిస్తానని, అలా చేయకున్న అగ్ని గుండెంలో ప్రవేశిస్తానని ప్రతిజ్ఞచేశాడు. సైంధవుడు ప్రొద్దుపోయే దాకా దుర్యోధనుని రక్షణ ఉండాలని వెళ్తే కృష్ణుడు విష్ణుచక్రాన్ని సూర్యగోళానికి అడ్డుగా నిలిపి లోకాన్ని చీకటిమయంచేసి తీరా రాత్రి అయిందని సైంధవుడు బయటకు వస్తాడు. కృష్ణుడు సూర్యునికి అడ్డుగా ఉన్న విష్ణు చక్రాన్ని తొలగిస్తాడు. సైంధవుణ్ణి అర్జునుడు వధిస్తాడు. ఈ మాయను తెలుసుకొన్న అర్జునుడు కృష్ణుని అధిక్షేపిస్తే

"అర్జునా! చింతింపకము దుర్మార్గుల శిక్షించునపుడా కొంచము చక్కటిగాని మార్గమును ద్రొక్కినను దోషము గానేరదు"

(పుట.సంఖ్య.101)

ద్రోణుని మరణ సందర్భంలో కూడా కృష్ణుడు ధర్మరాజుతో 'ఒక యబద్ధమాడిన నీకేమికొదవ" అని మందలిస్తాడు. బల వంతంగా అబద్ధమాడిస్తాడు.

ఈ విధంగా రామస్వామి చౌదరి గారు కురుక్షేత్ర సంగ్రామ నాటకంలో పాండవులకు రాజ్యార్హత లేదని, భీష్మద్రోణులను వధించడం అన్యాయ పద్ధతులోనని తన హేతువాద ఖడ్గముతో వాటిని లోకానికి వెల్లడిచేశాడు.

**శంబుకవధ :**

రామస్వామి చౌదరి గారి రెండవ నాటక రచన శంబుకవధ. దీనికి మూలం వాల్మీకి రామాయణోత్తరకాండం అలాగే శంబుక వధ వృత్తాంతం గలిగిన భవభూతి ఉత్తరరామచరితం. దీనిని క్రీ.శ. 1920లో ప్రచురింపబడింది. మూలంలో కథను కవియథా తథంగా స్వీకరించి, పాత్రలు మాత్రం కల్పించాడు.

శంబుకుడు శూద్రజాతీయుడు. అతడు సాకేత పురానికి ఉత్తర దిశన తపస్సు చేస్తున్నాడు. ఆ కారణంగా రామరాజ్యంలో బ్రాహ్మణబాలుడు అకాలమరణం చెందాడట. ఆ బ్రాహ్మణుడు రాముని దగ్గరకు వచ్చి నా కొడుకు చనిపోవడానికి ఏమి కార ణమో తెల్పాలని దు:ఖించాడు. దానికి కారణం కనుక్కోవడానికి రాముడు దీర్ఘాలోచనలో పడ్డాడు. నారదుడు ఉత్తర దిశలో శూద్రుని తపస్సే దీనికి కారణమని తెల్పాడు. వశిష్టుని సలహాతో రాముడు శంబుకుని ఆశ్రమానికి వచ్చి అతనితో చర్చించి అతణ్ణి చంపుతాడు. దీన్ని దేవతలు కూడా ఆమోదిస్తున్నట్లు పూలవర్షం కురిపిస్తారు. ఇదిమూలంలో కథా సంగ్రహం.

రామస్వామిగారి శంబుకవధను ఆద్యంతం హేతుబద్ధంగా కార్యాకరణ సిద్ధాంతానికి అనుగుణంగా రాశారు. శంబుక వధలో వర్ణాశ్రమ పరిరక్షణకు, బ్రాహ్మణులు శ్రీరాముణ్ణి ఎలా వాడు కున్నారో వెలుగులోకి తీసుకొచ్చాడు.

బ్రాహ్మణుడు రాజ దర్బారుకు వచ్చి తన కుమారుడు అకాల మరణం ఎందుకు జరిగింది. దానికి కారణం రాజుదే. 'శాస్త్ర విహితంగా రాజు రాజ్యాన్ని పరిపాలించకపోవుటయే' (పుట. 77) అని బ్రాహ్మణుడు రాముణ్ణి వశిష్టుని సమక్షంలో అన్నాడు. ఒక సామాన్యుడు రాజు తప్పును ఎత్తిచూపే ప్రజాస్వామ్యం ఆనాడు బ్రాహ్మణులకే ఉండదెమో అనిపిస్తుంది. ఇక వశిష్టుడు దీర్ఘంగా ఆలోచించి.

'యస్యరాష్ట్రేనృపాలస్యతరీయశ్చతపోధన: తత్ర తథ్యమ్ భవత్యేవ విప్రబాలస్యమరణమ్' అని స్మృతి వాక్యాన్ని వివరిస్తాడు. శూద్రులు ఏ రాజ్యంలో తపస్సు చేస్తారో అక్కడ బ్రాహ్మణ బాలుల మరణం సంభవించిందని ఈ సందర్భంలో రాముణ్ణి కవిరాజు ఆలోచనలో పడేశాడు. వశిష్టునితో రాముడు నిర్జనమైన యరణ్య సీమతలుంబం జేసి కొనుచున్న శంబుకునకు నీబాల మరణంబునకు కార్యాకరణ బాంధవ్యంబు గుర్తింపజాలకున్నానని" (పుట.79) అని ఆశ్చర్యం వ్యక్తంచేస్తాడు. మూలంలో బ్రాహ్మణుల తొత్తుగా ఉన్నరాముడు కవిరాజు గారి నాటకంలో కనీసం ఆలోచించగలుగున్నాడు. అలా ఆలోచనలో ఉన్న రాముణ్ణి వశిష్టుడు 'వంశగురువును నేను చెప్పుచున్నాడను. ఋషి ప్రోక్తములుగా శాస్త్రములను చూపించుచున్నాడను ఇంకను సంశయమేల నాడా పరబ్రహ్మయగు విశ్వామిత్ర వాక్యములయందు విశ్వాసముంచి తాటకిని వధింపలేదా" అన్నాడు. అంటే రాజుల మీద బ్రాహ్మణుల పెత్తనం ఎంత ఘాటుగా ఉండేదో అర్థమౌతుంది. న్యాయ నిర్ణేతగా ఉన్న ఏ వ్యక్తి అయినా ముద్దాయిని విచారించి నిజానిజాలను పరిశీలిస్తాడు. అలా పరిశీలించే అవకాశమే ఇవ్వకుండా తాము చెప్పినట్లే రాజ్యం నడవాలని తమ ఆదేశాలే రాజ్యశాసనాలు కావాలని భావించే అనైతిక శక్తులు నేడేకాదు రామరాజ్యంలోను ఉన్నారంటే ఇదే ఉదాహరణ రాముడేం చేయలేక "మీ యాజ్ఞ ప్రతిఘటింపజాలను- మీ యాజ్ఞ నెరవేర్చదనంటాడు".

యజమానులు తప్పుచేస్తే సేవకులు పైకి ప్రతిఘటించక పోయినా మరొకరితోనైనా అంటారు. కవిరాజుగారు రాముని దైన్యాన్ని హనుమంతునితో ఇలా పలికించాడు. శూద్రుడు తన కులవృత్తి వదలి బ్రాహ్మణుల్లాగా తపస్సుచేస్తే అతడు పాపాగ్ని దగ్ధుడు కావాలి కాని రాజ్యంలో బ్రాహ్మణ బాలుడెట్లా మరణిస్తాడు. బ్రాహ్మణ ప్రతినిధి చైనులుగారు "ఆంజనేయా శ్రమపడి ప్రశ్నసడిగితివి గాని నీకు శాస్త్ర చర్చ చేయునధికారము లేదెఱుంగుదువా? మాబోంట్లు ధర్మ సూక్ష్మములును నీకు జెప్పనుదగదు. నీవు వినను దగదు" అన్నారు. ఇది ఆంజనేయునికి ఎదురైన అవమానంకాదు. ఆనాటి నుండి నేటి వరకు చాలా మంది బ్రాహ్మణేతరలకు ఎదురౌతున్న అవమానమే. శూద్రులు స్మృతులు చదవరాదని నాటి స్మృతులు, ధర్మ శాస్త్రాలు ఘోషించాయి. ఆంజనేయుడు రాముని బంటు. అలాంటి వ్యక్తికే అవమానం తప్పలేదు. ఆనాడు సామాన్య మానవుని పరిస్థితిని అంచనా వేయలేం. చివరకు ఆంజనేయుడు "నిరపరాధిని జంపి శ్రీరామచంద్రుడు యశస్వి కావలసి వచ్చెను గా" అని తనలో తాను బాధపడ్డాడు.

శంబుకునితో చర్చించి వచ్చిన రాముడు వశిష్టునితో ఎక్కడో చిదానందాశ్రమంలో తపస్సు చేసుకుంటున్న శంబుకుని నిరపరాధిగా భావించి చంపి పాపం మూటగట్టుకోలేనంటాడు. "రాజులు సర్వప్రజానురంజకులై నేలనేల దగుదురు" అంతేకాని కొందరి ఉపదేశాలు విని నిరపరాదులను శిక్షంచేవారుకాదు అన్న మాటలను విని వశిష్టుడు కోపంతో ఊగిపోయాడు.

'అవశ్యమ్ భోక్తవ్యమ్ కృతమ్‌కర్మ శుభాశుభమ్' అన్న ఆర్యోక్తినిబట్టి శంబుకుని చంపడం ధర్మమా? అధర్మమా? అని ఆలోచించే బదులు ఆ ఒక్కని మరణం వల్ల మన రెండుకులాలు బాగుంటాయి అని హెచ్చరించి శంబుకని మరణానికి కారకుడయ్యాడు. రాముడు తన జీవితానికి కళంకం తెచ్చుకున్నాడు. ఈ సందర్భంగా డా॥బి.ఆర్. అంబేడ్కర్ గారి మాటలు ఇక్కడ ప్రస్తావించదగినవి.

"ఒక దోషాన్ని సవరించే పని నెత్తిన వేసుకున్న ప్రయత్నంలో చరిత్రలో ఎక్కడా నమోదుగాని ఒక ఘోర దురంతానికి రాముడు ఒడిగట్టాడు. అదే శూద్రుడైన శంబుకుని గాథ".

(రాముని కృష్ణుని రహస్యాలు పుట.11)

అసలు రామరాజ్యంలో అకాల మరణాలు లేవని వాల్మీకి అంటాడు. ఎందుకు ఈ బ్రాహ్మణబాలుని చావు వచ్చిందో అర్థంకావట్లేదు. వర్ణాశ్రమధర్మ పరిరక్షణకు బ్రాహ్మణులు కంకణ బద్దులై రాజులను ఎలా ప్రేరేపించారో, రాజులను ఎలా తమ చేతిలో కీలుబొమ్మలు చేసుకున్నారో, కులవృత్తులను అతిక్రమిస్తే మరణమే శరణ్యమా? అన్నట్లు సాగిన శంబుకవధ నాటకం చివర 'నా మరణము వలన ఆర్యులకు కలుగు లాభము కన్నా అనార్యులకు కలుగు లాభము మెండుగనుండును". అన్న శంబుకుని మాటలు అక్షర సత్యాలు. శంబుకుని విధిలేక చంపాల్సి వచ్చినందుకు రాముడు

తెలిసియపచారమిసుమంత సలుపగుండ
జపము జేసుకొనుచుండ సాధువులను
బట్టి వర్ణాశ్రమాచార పాలనంబ
టంచు బరిమారగా వచ్చెనక్కటకట!

అని పడ్డవేదన ప్రశంసనీయం. శంబుకవధ ఒక అనైతిక చర్య "రాముని భక్తులు శూద్రులైనావారు శంబుక వధ విషయంలో చాలా బాధను వ్యక్తం చేస్తారు. అంతేకాదు రాముడు అ బ్రాహ్మణుడు ఈ నీచకార్యం జరగని ఎడల బ్రాహ్మణులు రాముని శపించి ఉంటారన్న డా॥పి. హెచ్.గుప్త గారి మాటలు వాస్తవాలు.

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



**ఖూనీ** : త్రిపురనేని రామస్వామి చౌదరిగారు రాసిన ముద్రిత నాటకాల్లో చివరి నాటకం ఖూనీ. ఈ నాటకానికి మూలం భాగవతంలోని కథ. ఒకానొక సందర్భంలో ఒక స్నేహితుని కలవ డానికి వెళ్ళిన కవిరాజుగారికి విశ్వనాథ సత్యనారాయణ రాసినవేనరాజు రాతప్రతి కంటపడింది. ఆ మూలాగ్రం చదివిన కవిరాజు గారికి ఆర్షధర్మాని సముద్ధరించాడినికి తన శాయశక్తులా కృషి చేస్తున్న విశ్వనాథవారి దౌర్భాగ్య చిత్రీకరణను హేతువాదంతో ఆలోచించి అందులోని నిజానిజాలు నిగ్గుతేల్చాలని భాగవతం లోని వేనరాజు వృత్తాంతాన్ని అధ్యయనంచేసి వేనరాజు యొక్క నిజస్వభావాన్ని లోకానికి తెలియజేయాలని త్రిపురనేని వారు 1935 సం॥లో ఖూని నాటకాన్ని రచించారు. ఇందులో నాలుగు రంగాలున్నాయి.

ఖూనీ నాటకం మునిపల్లెలో యజ్ఞంచేస్తున్న గౌతమడు, శునశ్శేపుడు మొదలైన ఆర్య ఋషులను వేనరాజు అడ్డుకోవ డానికి వెళ్ళడంతో ఆరంభమవుతుంది. ఆర్య ఋషుల యజ్ఞ నంలో జీవహింస జరుగుతోందని అది అంగరాజ్యంలో నిషేధమని నిలిపివేయమని వేనుడు ఆదేశిస్తాడు. అక్కడ బలికి సిద్ధంగా ఉన్న మేకను బంధవిముక్తిని చేయమని సేనాధిపతి దృష్టవర్మను ఆదేశిస్తాడు. గౌతముని శిష్యుడు శునశ్శేపుడు ఈ యజ్ఞం కోసం బలి కాబోతున్న ఈ మేక స్వర్గలోకానికి వెళ్తుందని, కనుక ఇది జీవహింస కాదని వాదిస్తాడు. ఆచారాల వెనకనున్న అకృత్యాలను, అభూత కల్పనలను నమ్మని వేనరాజు "మీ కులపతియు, గురువైన యీ వృద్ధ గౌతముడుని యజ్ఞ పశువుగాజేసి ముగించి నచో లోకమెంత సంతసిల్లునో" (పుట.19). నోరులేని జీవాలకు మోక్షం చేకూర్చే బదులు బ్రాహ్మణజాతిలో ఎవరూ ఇంతవరకు పొందని మోక్షాన్ని మీరిద్దరు పొందవచ్చుగదా! అని వేనరాజు దగ్గర పలికించిన కవిరాజు గారి హేతవాద దృక్పథం అజ్ఞాన బ్రాహ్మణ్యంపై పడగెత్తి బుసకొట్టికొట్టి కోడెనాగైంది. మరో సంద ర్భంలో "నిండు ప్రాణములతో నున్న యొక్క సాధు మృగంబును నవరంధ్రము బిగించి పట్టి, బగ్గు బగ్గున మండు మంటలో వైచి కాల్తురన్నచో నేపడు మనోవేధన యెవ్వడెఱుంగ నేర్చు? శునశ్శేఫా! లేలెమ్ము యజ్ఞము మాని సర్వభూత సమభావుడవు గమ్ము. ఈ వృద్ధ గౌతముని ఈ వృద్ధ గౌతముని మాటలు విని మతిచెడుగొట్టు కొనకము" అని శునశ్శేపునికి సలహా ఇస్తాడు. ఇందులో వేనరాజు అహింసా వాదమే గాకుండా కవిరాజుగారి జీవకారుణ్యం కూడా ప్రస్ఫుటమౌతుంది. అంతేగాకుండా తాము చేసేది ధర్మమని ఉచితానుచితాలు తెలుసుకోకుండా జీవితంలో మార్పు అనేది లేకుండా బ్రతికే అజ్ఞాన వృద్ధులనుండి శునశ్శేపుని లాంటి యువత దృష్టి మరలాలనేది కూడా రామస్వామి గారి కోరిక.

నాలుగు రంగాలున్న ఖూనీ నాటకంలో మొదటిరంగం లోని హేతుదృక్పథం పరాకాష్టకు చేరింది. వేనరాజు మాటలకు సమాధానాలు చెప్పలేక నీళ్ళు నములుతున్న గౌతముడు మూతి చిట్లించాడు. అదే అదునగా భావించిన రామస్వామిగారు వేనరాజు ద్వారా "ఈ కల్లకన్నీటి బొట్టుతాటికి? నిరంతరము ముసలివతి కన్నీరేల కార్చెదవు? ద్విజేతరుడు వేదంబును విన్నంత మాత్రముననే కర్ణరంధ్రముల గరగరించిన సీసమును బోయు మన్నేపుడు నీ మనస్సెట్లుండును". ఇది యదార్థమైన మాట. గౌతమ ధర్మసూత్రాలు - ×× అధ్యాయం, పుట.4-6. దాకా చెప్పినవి. ఇదే విషయాన్ని బృహస్పతిస్మృతి, మనుస్మృతి కూడా బోధించాయి. వీటన్నంటి పై అవగాహన కల్గిన కవిరాజు ఆర్యఋషులపై దండ యాత్ర చేశాడు. అయితే వైదిక ధర్మాలు. ఈ స్మృతులు, సూత్రాలు కూడా ఒక్కోకాలంలో వచ్చినవి మరొక కాలంలో రావు. నిశ్చయమైన నిలకడ కలిగిన ధర్మసూత్రాలు కరువనే చెప్పాలి. ఒక్కో యుగంలో ధర్మంగా ఆచరించినది మరొక యుగంలో అలానే ఆచరించబడలేదు. ఒకప్పుడు యజ్ఞయాగాల్లో జంతు సంతర్పణలు జరిగేవి రంతి దేవుడనే రాజు ఒక్కోరోజు యజ్ఞంలో 2000 గోవులను బలి ఇచ్చేవాడని ఒక భారతం చెబు తుంది. కాని తరువాత కాలంలో గోవులను దేవతలుగా పూజిం చారు. 'యజ్ఞ పశువు' అనే మాట అప్పుడప్పుడు కొన్ని చోట్ల చదువు తుంటాం. ఈ విధంగా గోవును బలికి సమర్పింప జేసి ఆనందిం చింది బ్రాహ్మణులే కదా! ఈ విధంగా వీళ్ళు మార్చిన ధర్మాలను వేనరాజు మాటల్లో కవిరాజు ఇలా పలికించాడు.

"నిజముగ నీవు సృజించిన భగవంతుడు కూడా! నీయవ సరము కొలది నీభగవంతుని యవతారము లెత్తించ లేదా? వేష భాషాదులు మార్చలేదా! ఒకప్పుడు నిరాకారుడంటివి. ఒకప్పుడు సాకారుడంటివి. ఒకప్పుడు భీకరాకారుడంటివి, ఒకప్పుడు వికారు డంటివి, ఒకప్పుడు నరమాంసము, మరి యొకప్పుడు గోమాం సమును ఇంకొకప్పుడు మృగమాంసము, మఱియొకప్పుడు ఫల పత్రపుష్పాదులు భోజ్యమంటివి. నీ బుద్ధిభ్రమణముతో బ్రాటు భగవంతుని యాకార భాషా భూషావిశేషాదులు మాఱులేదా! మాఱుచుండుట లేదా!" రామస్వామి గారు ఈ ప్రశ్నలద్వారా వేదాల నుండి స్మృతుల దాకా వచ్చిన భావవాదాసారాన్నంతా పిండి పిప్పిచేశాడు. అసలు దేవుడున్నాడా లేడో దేవుడికే ఎఱుక. ఇలా ఋషుల స్వార్థం కోసం తమ ఇష్టం వచ్చినట్లు భగవంతుని చిత్రించి వాడుకోవడం నాటకాల్లోనే గాకుండా సూతపురాణం లోను మనకు కనిపిస్తుంది. సాధుజంతువులను యజ్ఞ గుండంలో తోసి ఆనందించే ఆర్యఋషులని తూలనాడాడు.

ఖూనీ నాటక పీఠికలో త్రిపురనేని వారు సూటిగా స్పష్టంగా ప్రశ్నించారు. అంగరాజ్యానికి వేనుడు భవిష్యత్‌లో కొరకరాని కొయ్య అవుతాడని త్రికాలజ్ఞులైన ఆర్యఋషులకు ఎందుకు తెలియలేదు. భాగవత కథ ప్రకారం వేనుడు యజ్ఞ యాగాలను వద్దన్నాడు కాని జపతపాలను కాదు కదా. ఈ వేనుని ఆదేశం

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



వల్ల కలిగే నష్టమేమి. 'నన్ను దైవంగా ఆరాదించమన్నాడు' వేనుడు. ఇందులో తప్పేముంది "నావిష్ణు: పృధ్వీపతి:" రాజేదైవం అని చెప్పింది ఈ ఋషులు రాసిన స్మృతులే కదా అని హేతువులతో ప్రక్షాళనం చేశాడు.

వేనరాజు కథను విశ్వనాథ సత్యనారాయణగారు పదం కాల్లో ఎంత క్రూరంగా చిత్రించినా, మసిపూసి మారేడుకాయ జేయాలని ప్రయత్నించినా పైన చెప్పిన వేనరాజు సుగుణాలు తన నాటకాల్లో ప్రస్తావించక తప్పలేదు.

వేనరాజు కుమారుడు పృథువును మునిపల్లెకు రప్పించి రాజ్యకాంక్ష చూపి తండ్రి మరణానికి కారకులైన ఆర్య ఋషులు అసలు హంతకులు. దృష్టవర్మచేత వేనుణ్ణి చంపించినా హత్య చేసింది ఆర్య ఋషులే (గౌతముడే). వాళ్ళు హత్య చేసింది మంచిని, ధర్మాన్ని, న్యాయాన్ని, నీతిని. ఈ లోకంలో వైదిక కర్మకాండలు, పుణ్యకార్యాలు, యజ్ఞయాగాలు చేయాలంటే అలాంటి రాజులుండకూడదు. అలాంటి కార్యాలు చేస్తే చని పోయిన తర్వాత స్వర్గలోక ప్రాప్తి, రంభతో సంభోగం లభిస్తాయని ప్రజలలో వాంఛలు లేపి, విశ్వాసాన్ని కలిగించి భావదాస్యులుగా ప్రజలను చేస్తున్నారు. నాడు నేడు ఇదే పరిస్థితి. నేడు పాలకులు సైతం దీనిని నమ్మి యాగాలు చేస్తున్నారంటే ప్రజలలో మౌఢ్యం ఎంత ఉందో ఆలోచించాలి.

ఈ విధంగా సాగిన మూడు నాటకాల్లో త్రిపురనేని రామస్వామి చౌదరి ఒక కొత్త వరవడి సృష్టించారు. మూడు కూడా విషాదాంతంగా ఉన్నాయి. ఈ మూడు నాటకాలల్లో కూడా ఉదాత్తమైన వారి చరిత్ర చిత్రీకరించబడింది. కవిరాజు పురాణాల్లోని ఘట్టాలను స్వీకరించి వానిలోని అసంబద్ధ విషయాలను హేతువాద దృక్పథంతో చర్చించి ఈ నాటకాల ద్వారా వాస్తవాన్ని బహిర్గతం చేశారు. ఇలా జరిగింది అని చెప్పే మన ఇతిహాసాలు మనకు సిద్ధాంత గ్రంథాలు కాని వాటికి సహేతుకంగా ఋజువు లుండాలి. అంతేగాని పుక్కటి పురాణాలు నమ్మకూడదు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ తల్లి దివ్య చరిత్ర

- రావిరాల లక్ష్మీకాంతం, తెలుగు అధ్యాపకురాలు, దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల, నెల్లూరు.

అనాదిగా భారతావనిలో స్త్రీని ఆదిశక్తిగా, పరాశక్తిగా కొలుస్తూ పూజిస్తున్నారు. వేద భూమి, కర్మభూమి అయిన ఈ భారతావనిలో హరిహరబ్రహ్మాదులనే పసిపిల్లలను చేసి ఉయ్యాల ఊపినది సతి అనసూర్య. భగభగమండే మంటలనే పూలరాశిగా మార్చిన లోకపావని సీతమ్మ, సూర్యోదయాన్నే ఆపి తన భర్త ప్రాణాలను కాపాడుకొంటుంది సతిసుమతి, యముడ్నే ఎదిరించి పతిప్రాణాలు దక్కించుకుంది సతి సావిత్రి. అలాంటి ప్రాతి వత్యాన్నే పరమావదిగా భావించి మానవమాత్రులైన ఎందరో ప్రతి వ్రతామతల్లులు భూమి మీద దేవతలుగా అవతరించి కొలువై ఉన్నారు. వారి మార్గంనే అనుసరించి దేవతగా అవతరించి భక్తుల కోర్కెలను తీరుస్తూ అనునిత్యం వారి పూజలను అందుకొంటున్న పవిత్రమూర్తి పెనుగంచిప్రోలులో వెలసిన శ్రీ తిరుపతమ్మ.

## పెనుగంచి ప్రోలు ప్రాశస్త్యం :

ఆసేతు హిమాచల పర్యంతము వ్యాపించి ఉన్న భారత దేశాన్ని వింద్యపర్వతాలు రెండుగా విభజిస్తున్నాయి. అందు దక్షిణ భాగమున ఆంధ్రదేశములో గుంటూరు మండలానికి చెందిన అమరావతి చాలా చరిత్ర గలిగిన ప్రాంతం. ఇది నేటి ఆంధ్ర ప్రదేశ్‌కు రాజధానిగా నిర్ణయించడం జరిగింది. ఈ అమరావతిలో అమరలింగేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధమైనది. ఈ అమరావతి కృష్ణానదీతీరంలో నిర్మింపబడింది. అమరావతిని పరిపాలించిన ప్రభువులలో శ్రీమాన్ రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయడు ప్రసిద్ధుడు. ఈ వంశానికి చెందిన శ్రీమాన్ రాజా వాసిరెడ్డి జగ్గయ్య పాలనాకాలంలో శ్రీ తిరుపతమ్మ చరిత్ర క్రీ.శ.1695 సం॥న జరిగింది. అమరావతి ప్రభువుల పాలనలో పెనుగంచిప్రోలు కృష్ణా జిల్లా ముఖ్యపట్టణమైన విజయవాడ నుండి నందిగామ మీదుగా జగ్గయ్య పేటకుపోవు రాజమార్గం మధ్యలో కుడిప్రక్కగా కొంచెం దూరంలో ఉంది. నాటి పెనుకంచి ప్రోలునే నేడు పెనుగంచి ప్రోలు అని పిలుస్తున్నారు. పెనుగంచి ప్రోలులో నేటికి కన్పిస్తున్న శాసనాలు బట్టి అక్కడ నూటొక్క దేవతామూర్తులు ఉన్నట్లుగా తెలుస్తుంది. ఈ పెనుగంచిప్రోలు ప్రసిద్ధమైన ముని ఏటిఒడ్డున (ముని + ఏరు) ఉంది. దీనినే మున్నేరు నది అని కూడా అంటారు. ఈ నది మౌద్గల్యముని వరప్రభావముచే అవతరించెనని పురాణ ప్రసిద్ధి.

## శ్రీ తిరుపతమ్మ తల్లిదండ్రులు :

పెనుగంచి ప్రోలుకు సమీపగ్రామమైన అనిగండ్లపాడులో సదాచార సంపన్నరైతు కొల్లా శివరామయ్య గారు. వీరి సతీమణి రంగమాంబ, వీరు ధర్మమూర్తులు, బీదసాదలకు దానధర్మములు చేస్తూ పుణ్యమూర్తులుగా పేరు గాంచారు. ఇంతటి పుణ్యమూర్తులైన వీరికి సంతాన ప్రాప్తించలేదు. వారు ఎన్నో పూజలు, వ్రతాలు నిర్వహించారు. చివరకు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వరుడ్ని దర్శించుకొనుటకు తిరుపతి యాత్ర చేయడానికి నిశ్చయించుకుంటారు.

## తిరుపతి యాత్రా ఫలితము :

తిరుపతి ప్రయాణం చేయుచూ దారిలో అనేక పుణ్య కార్యాలు నిర్వహిస్తూ తిరుమల క్షేత్రమునకు చేరుకుని స్వామి సన్నిదానములో ఒక వసతి గృహాన్ని ఏర్పరుచుకొని స్వామిని ప్రతి రోజు దర్శించుకొంటు ఉన్నారు. ఒక రోజు ఆ స్వామి ముందు దంపతులిరువురు సాష్టాంగపడి సంతానమొందిన యెడల బంధు మిత్రులతో కలసి కొండకు వచ్చి ధ్వజమునకు మా బిడ్డను సమీకరణము చేసి మీ అనుమతిచే ఆ బిడ్డను గ్రహించుతమని మ్రొక్కుకున్నారు. ఆ రాత్రి స్వామి ఒక మునిరూపంలో ఆ దంపతులకు దర్శినం ఇచ్చి మీకు ఒక స్త్రీ సంతానం కలుగునని ఆ సంతానానికి శ్రీ వెంకటేశ్వరుని నామమును ఒసగమని చెప్పాడు. అంతే కాకుండా స్వామి వరప్రసాదముతో జన్మించనున్న ఆ పుత్రిక ద్వారా మీ కీర్తి చంద్రికలు దశదిశలా వ్యాపిస్తాయని ఆమెను అందరూ కొనియాడుదురు అని చెప్పి అదృశ్యమయ్యాడు. శివరామయ్య దంపతులు తెల్లవారిన తర్వాత పాపనాశినలో స్నానమాచరించి ఒక వట వృక్షము వద్ద సేదతీరుతుండగా ఆకాశమున వారికి సురగంగ మెరుపుగా కనిపించి ఆకాశవాణి ద్వారా పలికింది. ఓ పుణ్య దంపతులారా! పరమేశ్వరుని కరుణాకటాక్షవీక్షణములచే ప్రభవించు బాలికకు సేవలందించుటకై 'పాపనాశిని' అను ఈ గంగ 'పాపమ్మ' అను పేరుతో మీ వద్దకు రాగలదు. మీకు పుత్రికగా జన్మించు తిరుపతమ్మతో పాటు ఈ పాపమ్మ నామము కూడా చిరస్మరణీయము అగుగాక! అని ఆ వెలుగు అంతర్ధానమయ్యింది. అంతట వారు శ్రీమన్నారయణుని నామస్మరణ చేస్తూ తిరుగు ప్రయాణం అయ్యారు.

## తిరుపతమ్మ జననం :

తిరుపతి నుండి వచ్చిన శివరామయ్య దంపతులు అనేక దానధర్మాలు చేశారు. కొన్ని రోజులకు రంగమాంబ గర్భం ధరించింది. శివరామయ్య తన భార్యను అపురూపంగా చూసుకొంటూ అనేక దానధర్మాలు చేయించాడు. పదినెలలు నిండిన తర్వాత రంగమాంబ రత్నంలాంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శివరామయ్య దంపతుల ఆనందానికి అవధులు లేవు. పుత్రిక జన్మించిన పదకొండవ రోజున సమస్త బంధువర్గాన్ని పిలిచి విందు భోజనం పెట్టి, వేద పురోహితులచే పుణ్యవచన మహోత్సవము

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


జరిపి కుమార్తెకు తిరుపతమ్మ అనే నామకరణం చేసినారు. తిరుపతమ్మ అల్లారుముద్దుగా పెరుగుతూ 5వ సం॥లో పాఠశాలకు వెళ్ళి చదువులో, సంస్కారంలో మిన్న అనిపించుకొంది. భారత, రామాయణ, భాగవతాలను తల్లి నుండి నేర్చుకొని అందరి మన్ననలను పొందుతూ పెరుగుతున్న తిరుపతమ్మకు చిన్నతనం నుండే వెంకటేశ్వరునిపై భక్తి మెండుగా ఉండేది. అంతేకాకుండా గోవులన్నా ఆమెకు అమితమైన ఇష్టం. అందుకే గోపూజ క్రమం తప్పకుండా ప్రతిరోజు చేసేది.

## మరలా తిరుపతి యాత్ర - మునిదర్శనం :

నాడు తిరుపతిలో మ్రొక్కుకున్న విధంగా వెంకటేశ్వరునికి ధ్వజం ఎత్తదలచి, ముఖ్యమైన బంధువులను మరియు తన కుమార్తె, భార్యను తీసుకొని శివరామయ్య తిరుపతికి బండ్లమీద బయలుదేరినాడు. దారిలో చంద్రగిరి ప్రాంతంలో వృక్షజాల మందలి ఒక చేవగలిగిన వేపమానును ధ్వజము కొరకు కొట్టించుటకు ఆగుతారు. వృక్షము నరకడానికి పనివాండ్లు మొదలుపెట్టగా ఆ వృక్షము నుండి ఓంకారనాదం వినిపిస్తుంది.. సగము నరిగిన తర్వాత ఆ వృక్షము నుండి రక్తము కారుతూ కన్పించినది. అందరూ ఆశ్చర్యచకితులై చూస్తుండగా, ఆ వృక్షము నుండి మహర్షి ఒకరు దివ్యకాంతులతో కన్పడి ఓయీ! శివరామా! ఈ వృక్షము నీ ప్రార్థనచే భగవతార్పితమైనది. ఈ వృక్షమే నీ కూతురు జీవితానికి ప్రతీక, ఇప్పటి వరకు ఇది ఓంకారము పలికినది, తర్వాత కన్నీరు కార్చినది. నీ కూతురు జీవితం కొంతకాలమైన తర్వాత మున్నేటి ఒడ్డున కన్నీరు తో కన్పించును. స్వానుభవముతో మీ కుమార్తె జీవితమునకు ఈ వృక్షమునకు ఉన్న సంబంధాన్ని తెలుసుకుంటారు. అని చెప్పి ఆదృశ్యమైనాడు. అంతట వారు భవిష్యత్‌ను తలచుకొని దు:ఖించి దైవలీలను తలచి భగవంతునిపై భారం వేసి వేపమానును కొట్టించి తిరుపతికి తీసుకొని వెళ్ళి దేవాలయ ప్రాంగణంలో నిల్పి తిరుపతమ్మను ధ్వజమునకు కట్టి యధావిధముగా పూజా కార్యక్రమము చేసి ఆమెను మరలా విడిపించారు. అంతట పాపనాశనము దర్శించుకొని తిరిగి బంధు మిత్రుల పరివారంతో శివరామయ్య అని గండ్లపాడుకు చేరుకుంటాడు. తిరుపతమ్మ దినదిన ప్రవర్థమానంతో పెరిగి పెద్దదౌతుంది.

## తిరుపతమ్మకు గోపయ్యతో పెళ్లి :

కృష్ణా జిల్లాలోని మున్నేటి ఒడ్డున ఉన్న పెనుగంచిప్రోలులో కాకాని రామయ్య, కృష్ణయ్య అను అన్నదములు ఉన్నారు. వీరి చెల్లెలు రంగమాంబ ఈమెను అనిగండ్లపాడులోని కొల్లా శివరామయ్యకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరే తిరుపతమ్మ తల్లి దండ్రులు కాలక్రమంలో రామయ్య భార్య ఒక పురిటి కందుకు జన్మనిచ్చి అకాల మరణం పొందుతుంది. పుట్టిన బిడ్డకు మల్లయ్య అని పేరు పెట్టి కృష్ణయ్య దంపతులు ఆ పసివాడిని అల్లారు ముద్దుగా పెంచసాగారు. కొన్ని దినాలకు రామయ్య కూడా కన్ను మూశాడు. మరికొంత కాలానికి కృష్ణయ్య భార్య ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ మగబిడ్డ గోపయ్య మల్లయ్య, గోపయ్య పెరిగి పెద్దవారైన తర్వాత మల్లయకు సమీప గ్రామమైన అనిగండ్ల పాడులోని కన్నేటి వారి ఆడపడుచు అయిన చంద్రమ్మతో వివాహం జరిపిస్తారు. గోపయ్యకు కూడా పెళ్లి చేయదలచిన కృష్ణయ్య, భార్య సమేతుడై తన చెల్లెలు రంగమ్మ ఇంటికి మేన కోడలైన తిరుపతమ్మను తన కుమారునికి ఇచ్చి పెళ్లి చెయ్యమని అడగడానికి వెళతాడు. కాని శివరామయ్యకు ఈ సంబంధం ఇష్టం లేదు. అయినా భార్య మాట కాదనలేక తిరుపతమ్మను గోపయ్యకు ఇచ్చి పెండ్లి చెయ్యడానికి ఒప్పుకుంటాడు. దానితో శివరామయ్య గోపయ్య తిరుపతమ్మల వివాహం అంగరంగ వైభావంగా జరిపిస్తాడు.

## తిరుపతమ్మ అత్తవారింటికిరావడం :

పెళ్లి జరిగిన పిమ్మట శివరాయమ్య ఇంటి నుండి నూతన దంపతులు పెనుగంచిప్రోలుకు మేనాలో బయలుదేరుతారు. బోయలు అలసి దాహం తీర్చుకోవడానికి మేనాను దించిన సమయంలో ఒక నాగుపాము తిరుపతమ్మకు ఎండపొడ తగలకుండా పడగవిప్పి ఆమెకు నీడనిచ్చింది. అచట ఉన్న గోపయ్య నిచ్చేష్టుడై చూస్తుండినాడు. బోయలు నివ్వెరపోయి చూస్తుండగా ఆ నాగ రాజు కొంతసేపు తిరుపతమ్మ పాదాలను చుట్టుకొని ప్రదక్షణ చేయుచు వెళ్ళిపోయింది. ఇదంత జరుగుతున్నప్పుడు తిరుపతమ్మ అలసటతో నిద్రలో ఉంది అది చూచిన గోపయ్య ఆమె కారణజన్మురాలు అని అప్పుడే అనుకొన్నాడు. తిరుపతమ్మ అత్త వారింటికి వచ్చిన తర్వాత అత్తవారిల్లు సిరులతో నిండిపోయింది. ఆలమందలు రెట్టింపు అయినవి. తిరుపతమ్మ అత్తమామలను తల్లిదండ్రుల్లా చూచుకొంటు బావ తోడికోడల ఆజ్ఞలను పాటిస్తూ, భర్తను మిక్కిలి ప్రేమతో చూచుకొంటు ప్రతివ్రతా ధర్మచర్యతో మసలుకొంటూ ప్రతిరోజు శ్రీవేంకటేశ్వరుని నామాన్ని స్మరిస్తూ నిత్యం గోపూజ చేస్తూ అత్తవారి గృహాన్ని స్వర్గసీమగా మార్చింది.. తిరుపతమ్మ భక్తిభావాలు ఆ పురవాసులందరికి తెలిసి తిరుపతమ్మను ప్రతి ఒక్కరు పొగుడుతూ ఉండగా విని ముదిరాజు కులానికి చెందిన పాపమ్మ తిరుపమ్మతో ప్రేమ పూర్వకంగా మెలుగుతూ తిరుపతమ్మను కన్నతల్లిలా కాచుకొని ఆమె వెన్నంటి ఉండేది. ఇంత మంచి పేరు తెచ్చుకున్న తిరుపతమ్మను చూచి తోడికోడలు చంద్రమ్మకు ఈర్ష్య అసూయలు కలిగి తిరుపతమ్మపై అత్తగారికి చాడీలు చెప్పి ఆమె మనసు మలినపరిచింది. అత్త గారు తోడికోడలు కలిసి తిరుపతమ్మను సూటిపోటి మాటలతో హింసించేవారు. అత్తగారు తిరుపతమ్మకి బిడ్డలు కలుగలేదని ఆమెను గొడ్రాలు అని తిడుతూ ఉండేది. తిరుపతమ్మ అత్త వారింట అనేక కష్టాలు పడుతూ తన బాధను భర్తకు కాని, తల్లి దండ్రులకు కాని చెప్పకుండా గుట్టుగా కాపురం చేసుకుంటూ ఉండేది.

## కరువు సంభవించుట :

ఇలా కాలం గడుచుచుండగా వరుసగా పెనుగంచిప్రోలు ప్రాంతంలో వానలు లేక కరువు సంభవించింది. పశువులకు గ్రాసం లేక విలవిలనాడిపోతున్నాయి. దానితో ఊరిలో వారందరు పశువులను భద్రాచలం అడవులకు తోలుకొని వెళ్లాలని, దానికి ఇంటికి ఒకరు చొప్పున ఆలమందలతో వెళ్లాలని నిర్ణయిస్తారు. గోపయ్య కూడ ఆలమందలతో వెళ్ళవలసి వస్తుంది. గోపయ్యకు కాని తిరుపతమ్మకు కాని ఒకరినొకరు వదిలి వుండటం ఇష్టం లేదు. కాని తప్పని పరిస్థితులలో గోపయ్య వెళ్ళవలసి వస్తుంది. దానితో తిరుపతమ్మ భర్తకు అన్నీ సమకూర్చి, గోపూజ చేసి, గోపయ్యకు హారతి ఇచ్చి సాగనంపుతుంది.

## తిరుపతమ్మకు కుష్టువాధి సోకుట :

తిరుపతమ్మ పరిస్థితి భర్త వెళ్లిన తర్వాత ఇంకా దిగ జారింది. అత్త తోడి కోడలు ఆరళ్లు ఎక్కువైనాయి. సరి అయిన ఆహారం లేక, నిద్ర సరిగా లేక ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఒంటిపై బొబ్బలు లేచి అవి చీమలు పట్టి చివరకు కుష్టువ్యాధికి దారి తీస్తుంది. ఆసమయంలో తిరుపతమ్మను కంటికి రెప్పలా చూసుకొనె పాపమ్మ కూడ ఊరిలో లేదు. ఆమె తన స్వకార్యం కోసమై పొరుగూరికి వెళుతుంది. తిరుపతమ్మను పట్టించుకునే వారు లేకపోయారు. ఆమెను అత్త తోడికోడలు గొడ్లసావిట్లో ఒక మూలన పడవేశారు. తిరుపతమ్మ అన్న పానాదులు లేక చినిగిన వస్త్రములతో, జడలు కట్టిన జుట్టుతో దుర్గంధభరితమై ఉంది. ఆమె తన భర్త రాకకై ఎదురుచూస్తు ఉండగా పాపమ్మ ఆ వూరులోకి వచ్చి తిరుపతమ్మ గురించి ఆరా తీసి ఆమె పరిస్థితికి దు:ఖించింది. పాపమ్మ తిరుపతమ్మకు స్నానం చేయించి నూతన వస్త్రాలు కట్టించి భోజనం పెట్టి సకల సపర్యలు చేస్తూ తిరు పతమ్మకు తోడుగా ఉంది.

## గోపయ్య వీరమరణం :

భద్రాచలం అడవులకు వెళ్ళిన గోపయ్యకు తిరుపతమ్మకు ఏదో కీడు సంభవించినట్లుగా ఒక రోజు పీడకల వచ్చింది. వెంటనే గోపయ్య భార్యను చూడదలచి పెనుగంచిప్రోలు బయలుదేరి వచ్చాడు. ముందుగా తల్లిదండ్రులను తరువాత అన్నవదినలను కలిశాడు. తిరుపతమ్మ ఎక్కడ ఉంది అని వారిని అడిగాడు. వారు తిరుపతమ్మ పుట్టింటికి వెళ్ళింది అని అబద్ధం చెప్పారు. దానితో గోపయ్య మళ్ళీ భద్రాచలం అడవులకు బయలుదేరుతాడు. దారిలో పెనుగంచిప్రోలు వాసులు కలిసి తిరుపతమ్మకు కుష్టువ్యాధి సోకిన విషయాన్ని తెలియజేస్తారు. దానితో అతడు తన తల్లి వదిన చేసిన మోసాన్ని, అబద్ధాన్ని గ్రహించి తిరిగి తిరుపతమ్మ వద్దకు వస్తాడు. తిరుపతమ్మను చూచి ఆమె దురవస్థకు చింతిస్తాడు. అపురూపంగా పెరిగిన తిరు పతమ్మ ఇంతటి అవస్థలుపడుతుంటే గోపయ్య చూడలేక ఆమెతోడుగా ఉండాలని నిర్ణయించుకుంటాడు. కాని ఆల మందలను అడవిలోనే వదిలి వచ్చినందున మరల వెళ్లి వాటిని తోలుకొని వస్తానని చెప్పి తిరుగు ప్రయాణం అవుతాడు. ఎందుకో తిరుపతమ్మ మనసు కీడును శంకిస్తుంది. భర్తను అడవులకు వెళ్ళవద్దని బతిమాలుతుంది. కాని గోపయ్య తిరుపతమ్మకు నచ్చ జెప్పి వెంటనే తిరిగి వస్తానని వెళతాడు. గోపయ్య ఆలమందలున్న అడవికి చేరుకొనే సరికి అక్కడ అంతా అస్తవ్యస్తంగా ఉంది. పశువుల కాపరులు అందరు తలా ఒక చెట్టు ఎక్కి భయంతో బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. గోపయ్య రాగానే చెట్టుదిగి వచ్చారు. గోపయ్య విషయం ఏమిటి అని అడిగాడు అపుడు వారు ఆవులపై పులి దాడి చేసిందని తిరుపతమ్మ అరణపు ఆవుని పులి చంపివేసిందని ఆలమంద అంతా చెట్టుకొకటి పుట్టకొకటి పారిపోయాయని, పులి మళ్లీ ఎపుడు దాడి చేస్తుందో తెలియక మీ కోసం ఎదురుచూస్తున్నామని వారు తెలిపారు. దానితో గోపయ్య పులిని చంపడానికి నిశ్చయించుకొని పులి ఉన్న గుహ వైపుకి బయలుదేరాడు. గోపన్న పులిపైన వీరోచితంగా పోరాడాడు. కాని చివరకు గోపన్న పులివేటుకు బలి అయి వీరమణం పొందాడు.

## తిరుపతమ్మ యోగాగ్ని ప్రవేశ నిర్ణయము :

తిరుపతమ్మ తన దివ్య శక్తితో భర్త మరణాన్ని ముందే గ్రహించింది. పుణ్యస్త్రీగా మరణించాలని నిర్ణయం తీసుకుంది. పుణ్యస్త్రీగా మరణించుటకు యోగాగ్నిలో ప్రవేశించాలని నిర్ణయిం చుకొని ముందుగా పాపమ్మకు ఈ విషయాన్ని తెలిపింది. ఆమెను ఈ విషయాన్ని ఊరిపెద్దలకు తెలుపమని కోరుతుంది. పాపమ్మ ఈ విషయాన్ని ఊరి పెద్దలైన శ్రీశైలపతిగారికి, ముత్యాల నాయుడు గారికి తెలిపింది. కాని వారు తిరుపతమ్మ యోగాగ్నిలో ప్రవేశించాలనే విషయాన్ని ప్రజలందరి ముందు తెలపాలని చెప్పారు. అపుడు వెంటనే పాపమ్మ తిరుపతమ్మకు ఈ విషయాన్ని తెలిపింది. అప్పుడు తిరుపతమ్మ వెంటనే అత్తమామలు, బావ తోడికోడలు ఆశీర్వాదము తీసుకొని ఊరిపెద్దల వద్దకు బయలు దేరుతుంది. అప్పటి వరకు ఆమె శరీరం నుండి వెలువడిన దుర్గంధం పరిమళభరితమైన సువాసనగా మారిపోయింది. నడవ లేని స్థితిలో ఉన్న తిరుపతమ్మ ఊరి పెద్దల వద్దకు నడుచు కుంటూ రావడం ఊరి ప్రజలందరికి దైవలీలగా తోచింది. ఊరి పెద్దల ఎదుట నిలచి తన నిర్ణయాన్ని తిరుపతమ్మ తెలిపింది. ఊరి పెద్దలు మరొక్కసారి ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సెలవిస్తారు. కాని తిరుపతమ్మ తాను పుణ్యవతిగా మరణించుటకే నిర్ణయించుకొని యోగాగ్ని ప్రవేశానికి సిద్ధపడింది.

## తిరుపతమ్మ మహిమలు :

శ్రీశైలపతి గారు తిరుపతమ్మతో మాట్లాడి ఇంటికి వెళ్ళిన తర్వాత ఆయనకు మైకం కమ్మినట్లయినది. నిత్యం అంబపూజ చేసే శ్రీశైలపతి గారు పూజా మందిరంలో కూర్చొని అంబపూజ

చేస్తుండగా ఆయనకు ఆ స్థానంలో శ్రీ తిరుపతమ్మ కనిపించింది. అంతేకాకుండా ఆమె దివ్యకాంతులు వెదజల్లుతూ ఉండగా యోగాగ్ని ఆమెను దహించినట్లుగా ఆయనకు కనిపించింది. శ్రీశైలపతి గారు చేతులెత్తి ఆమెకు నమస్కరించగా ఆమె ఆయన ముందు ఒక్క రెప్పపాటు ప్రత్యక్షమై మాయమయ్యింది. అంతట ఆయన తన భార్యను వెంట బెట్టుకొని కాకాని కృష్ణయ్య గారి ఇంటికి పసుపు కుంకుమలతో పయనమయ్యాడు. అక్కడ జనులకు తిరుపతమ్మ మహిమను తెలియజేశాడు. తరువాత తిరుపతమ్మను తన ఇంటికి వచ్చి పావనం చేయవలసినదిగా కోరాడు. అట్టే తిరుపతమ్మ శ్రీశైలపతి ఇంటికి వెళ్ళి వారి ద్వారా పసుపు కుంకుమలు అందుకొని మరొక ఊరి పెద్ద శ్రీ కర్లా ముత్యాల నాయుడు గారి ఇంటికి వెళ్ళి వారి వద్ద కూడ పసుపు కుంకుమలు పొంది యోగాగ్ని ప్రవేశానికి అనుమతి తీసుకొని ప్రజలతో "పరమాత్మ స్వరూపుడైన పరమేశ్వరుడు నాకు కన్పించి ఆయన ఇచ్చిన సందేశమే నాయీ యోగాగ్ని ప్రవేశమని తెలిపింది".

## తిరుపతమ్మ యోగాగ్ని ప్రవేశం :

తిరుపతమ్మ యోగాగ్నికి సిద్ధపడిన విషయం ఊరు వాడ తెలిసిపోయింది. అట్లే పొరుగూరున ఉన్న ఆమె పుట్టింటి వారికి కూడ ఈ విషయం తెలిసింది. వారు తమ కుమార్తె చేసే ఈ సాహసానికి కొంత బాధ పడినా వరసిద్ధి వలన ఆమెకు ప్రాప్తించిన దైవత్వాన్ని గురించి విని సంతోషపడ్డ పుట్టింటి వారు సారె తీసుకొని తిరుపతమ్మ యోగాగ్ని ప్రవేశస్థలికి బయలుదేరారు. ఊరిపెద్దలు మరియు ప్రజలంత తిరుపతమ్మకు మునిమేరులో స్నానమాచరింప చేయుటకు మేళతాలములతో ఊరేగింపుగా బయలుదేరారు. ముత్తయిదువులందరు ఆమెకు మునిఏటి నీళ్ళతో స్నానమాచరింపజేశారు. మొదటిగా అత్తింటివారి పట్టు వస్త్రాలు కట్టబెట్టారు. అత్తింటి వారు తెచ్చిన కుంకుమను వారి అత్తగారు ముందుగా ఆమె నుదిటిన పెట్టారు. తరువాత పుట్టింటి వారు తెచ్చిన సారెను ఆమెకు సమర్పించారు. అప్పుడు సాయం సమయమైంది. అది మాఘమాసము, ఉత్తరాయణ పుణ్య కాలము, పౌర్ణమి రోజు శ్రీశైలపతి గారి సలహాచే యోగాగ్ని పీఠము నిర్మాణం జరిగింది. పీఠము చుట్టూ తిరుపతమ్మ ముమ్మారు ప్రదక్షిణం చేసింది. అంతట అడవులకు ఆలమందను తోలుకొని వెళ్ళిన వారందరు కూడ అక్కడికి చేరుకుంటారు. అందరు వారిలో గోపన్న ఉన్నాడేమో అని వెతుకుతుంటారు. కాని తిరుపతమ్మ ప్రశాంతమైన వదనంతో తన భర్త మరణం ముందుగానే తెలిసినట్లుగా ఉంటుంది. అందరికి తన భర్త తూర్పున ఉదయించే సూర్యబింబంలో కలసిపోయాడని చెప్తుంది. ఈ విషయం విని ప్రజలంతా తిరుపతమ్మ దైవశక్తికి ఆశ్చర్య చకితులై చూస్తుంటారు. గోపాలకులతో తన భర్త వాడిన వస్తువులన్ని ఇవ్వమని కోరుతుంది. వారు ఇవ్వగానే వాటిని కన్నులకు అద్దుకొని సంధ్యా సమయమున భాజాభజంత్రీలు మ్రోగుచుండగా ఆమె సూర్యభగవానునికి నమస్కరించి, ఇప్పుడు మాఘ పౌర్ణమి కనుక ఈ కార్యక్రమము అనంతరము చంద్రుణ్ణి చూడండి. అందులో నేను కన్పిస్తాను. సూర్యమండలము ఉన్నంతవరకు, ఈ భూమండలము ఉన్నంత వరకు మేమిరువురు భార్యభర్తలము మిమ్ములను కాపాడెదము అని చెప్పి, తరువాత పాపమ్మను పిలిచి పాపనాశిని పేరుతో ఏ విధంగా నీవు వెంకటేశ్వర్లునికి సేవలదించావో అదే విధంగా నాకు నీవు సేవలందించావు. కాబట్టి ఇప్పటి నుండి నిత్యం ధూప, దీప నైవేద్యాలను, అర్చన, హారతులను మీ వంశీకులు నాకు నెరవేర్చుతారు అని చెప్పి తిరుపతమ్మ పాపమ్మకు పసుపు కుంకుమలతో కూడిన పూజా పళ్ళెమును ఇస్తుంది. మునిఏటిలో స్నానమాచరించినచో తిరుమలలోని పాపనాశనిలో స్నానమాచరిచిన పుణ్యం లభిస్తుందని చెప్తుంది. జనులారా! యోగాగ్ని అనంతరం ఈ పుణ్యస్థలిలో నా మంగళసూత్రములు, కుంకుమ భరిణె, మా ప్రతిమలు ఈ పీఠమందు లభ్యమౌవునని చెప్పింది. తరువాత కొన్ని రోజులకు పెద్ద పులియే స్వయముగా వచ్చి నా చుట్టూ ప్రదక్షిణం చేసి ఇక్కడే దేహత్యాగం వనరించునని అచట పెద్దమ్మ పెద్దపులి విగ్రహములు కన్పించునని వాటిని పూజించమని, పెద్దమ్మ తల్లికి తన ఆలయమునకు పడమరన ఒక ఆలయం నిర్మింపమని తెలిపి, నిత్యం ఆదేవతలను పూజించమని చెప్పింది. అందరిని కళ్ళు మూసుకోమని చెప్పి తక్షణమే తన యోగశక్తి ద్వారా యోగాగ్నిని ప్రజ్వరిల్లజేసుకొని నిర్వికల్పస్థితి పొందింది. అందరు కళ్ళు తెరిచి చూడగానే మండపములో పూలరాశి స్థలములో కుంకుమరాశి కన్పించింది. ఉదయించు చున్న చంద్రుడ్ని చూడగానే తిరుపతమ్మ ఆచంద్రుడిలో కన్పించింది. ఆ తరువాత శ్రీశైలపతి గారు ఒక సుముహూర్తమున అక్కడ లభించిన విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. పూజా జలమును తీర్ధముగా, కుంకుమరాశిని దీవెన బండారుగా ప్రజలు గ్రహించారు.

## తిరుపతమ్మ తిరునాళ్ళు :

అప్పటి నుండి ప్రతి సంవత్సరము తిరుపతమ్మకు సంవత్సరానికి రెండుసార్లు తిరునాళ్ళు జరుగుతుంది. మొదటి తిరునాళ్ళు మాఘపౌర్ణమినాడు ఆరంభమౌవుతుంది. ఈ తిరునాళ్ళు అయిదురోజులు జరుగుతాయి. మొదటి రోజున "నిధి" మహోత్సవము జరుగుతుంది. ఈ రోజున తిరుపతమ్మ, గోపయ్యల వివాహం జరుగుతుంది. దీక్షాస్వాములు 41 రోజుల మండల దీక్ష వహిస్తారు. వీరు మాఘపౌర్ణమి నుండి పూర్ణాహుతి వరకు గల మధ్య సమయములో తిరుముళ్ళు సమర్పిస్తారు. రెండవరోజు జల బిందెల మహోత్సవం జరుగుతుంది. ఈ జలబిందెల మహోత్సవములో అనాది నుండి కొన్ని ఇంటి పేర్ల వారే పాల్గొనడం జరుగుతుంది. వారిలో కర్లవారు, సూరంపల్లి వారు, నల్లపునేని వారు, వడ్లమూడి వారు, పెద్ద యాదవలు. ఈ వంశీకులు

మాత్రమే మునియేటి నుండి పవిత్ర జలాన్ని మట్టికుండలో నింపుకొని తీసుకు వచ్చి తిరుపతమ్మ అమ్మ వారికి, అంకమ్మ అమ్మ వారికి సమర్పిస్తారు. మూడవ రోజు ఆదిపరాశక్తి అంకమ్మ వారికి అంకసేవ క్రతువు నిర్వహిస్తారు. నాల్గవ రోజున పొంగలి నివేదన క్రతువు నిర్వహిస్తారు. తరువాత అంకమ్మ కథాశ్రవణం జరుగుతుంది. అయిదవ రోజున అమ్మవారి దీవెనగా బండారును భక్తులకు అందజేస్తారు.

ఫాల్గుణ పౌర్ణమినుండి అయిదురోజుల పాటు చిన్న తిరు నాళ్ళ మహోత్సవము జరుగుతుంది. ఈ తిరునాళ్ళు కూడ అయిదు రోజుల పాటు జరుగుతాయి. మొదటి రోజు అఖండ స్థాపన, రెండవ నాడు రథమహోత్సవము, మూడవ నాడు ప్రభోత్స వము, నాల్గవ రోజున శుక్ర, మంగళ వారాలు కాకుండా చూచి పుట్టింటి పసుపు కుంకుమను అనిగండ్లపాడు గ్రామము నుండి తెచ్చే మహోత్సవము జరుగుతుంది. అయిదోరోజున భక్తుల భోణాల సమర్పణ జరుగుతుంది. ఈ ఉత్సవము మేళతాళము లతో మంగళ వాయిద్యాల మధ్య కొమ్ములు, డప్పులు, భజనలు, పంపుకోళ్ళు మధ్య అత్యంత కోలాహాలంగా జరుగుతాయి. భక్త జనం అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించి టెంకాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని స్తుతిస్తారు.

పుణ్యస్త్రీగా తనకు తాను అగ్నికి అహుతి అయిన ఎందరో పేరాంటాళ్ళు మన తెలుగుదేశంలో ఉన్నారు. వారి కోవకి చెంది నదే ఈ తిరుపతమ్మ. భక్తులను అను నిత్యం కాపాడి వారి కోర్కె లను తీర్చుతూ తను నెలకొని ఉన్న ప్రాంతాన్ని సుభిక్షంగా కాపాడే తల్లిగా తిరుపతమ్మ నేటికి భక్తుల పూజలు అందుకొంటుంది. తిరుపతమ్మను దర్శించుకునే భక్తులు కేవలం తిరునాళ్ళ రోజు ల్లోనే కాకుండా ఈ రోజు ఆ రోజు అనకుండా మూడు వందల అరవై రోజులు శ్రీ తిరుపతమ్మకు భక్తులు భోణాలు సమర్పించు కొని ప్రభలు కట్టి ఆ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు లక్షలలోనే ఉన్నారు. తెలుగు రాష్ట్రాలు రెండు ప్రాంతాల నలు మూలల నుడి అనేక మంది భక్తులు తిరుపతమ్మను దర్శించు కొని ఆమె దీవెనలు పొందుతున్నారు. ఆమె సన్నిధి నిత్యకళ్యాణం పచ్చతోరణం అనే రీతిలో ప్రతినిత్యం జన కోలాహలంతో నిండి ఉంటుంది.

శ్రీ తిరుపతమ్మ దేవస్థానం వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభు త్వానికి దేవాదాయశాఖ ద్వారా ఆర్ధిక రాబడి విరివిరిగానే ఉంది. అంతేకాకుండా ఈ ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుండి బస్సు సర్వీసులను కల్పించి ఆర్.టి.సి. కూడా ఆదాయాన్ని పొందుతున్నది. భక్తులు అనునిత్యం తిరుపతమ్మ దేవాలయానికి రావడం వలన పెనుగంచిప్రోలులోని చిన్న చిన్న వ్యాపారస్తులు ఈ దేవాలయంపై ఆధారపడి జీవిస్తున్నారు. తిరుపతమ్మ ఆల యాన్ని అభివృద్ధి చేయడం జరిగింది. కాని దర్శనానికి ఎంతో దూరం నుండి వచ్చే భక్తులకు సరిఅయిన వసతి ఏర్పాట్లు ఇక్కడ లభించడం లేదు. వీరంతా మునిఏరు ప్రక్కలనున్న తోటలు, ఖాళీ ప్రదేశాలలో పొంగళ్ళు జరుపుకోవడం, అక్కడే బస చేయడం జరుగుతుంది. దీని వలన సరి అయిన పారిశుధ్యం ఏర్పాట్లు లేక మునిఏరు కాలుష్యానికి గురి అవుతుంది. కావున పెనుగంచి ప్రోలులో తిరుపతమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు, ఉచిత భోజన, వసతి సౌకర్యాలు మరియు పారిశుద్ధ్య ఏర్పాట్లు చేసినట్ల యితే ఇంకా పర్యాటకులు ఎక్కువగా ఈ ప్రాంతాన్ని దర్శించునే వీలుంటుంది. కావున పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే తిరుపతమ్మ ఆలయం లాంటి చాలా ఆలయాలకు రాష్ట్ర ప్రభు త్వం సరి అయిన ఏర్పాట్లు చేసినట్లయితే పర్యాటక రంగం అభివృద్ధి చెంది ప్రపంచ పర్యాటక రంగంలో మన పర్యాటక రంగం ఉన్నతమైన స్థానాన్ని చేరుకుంటుంది అనుటలో ఎటు వంటి సందేహం లేదు.

❀❀❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# స్త్రీవాద కవిత్వ ధోరణులు - విశ్లేషణ

- **శెల్కలపెల్లి రాజు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.

తెలుగులో "స్త్రీవాద" సాహిత్యోద్యమం 1970 దశకం వరకు రూపుదిద్దుకోనప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా ఇది సామాజిక ఉద్యమంగా ప్రారంభమై రెండు వందల సంవత్సరాలు దాటింది. ఆంగ్లంలో "ఫెమినిజం" పదానికి తెలుగులో సమానార్థకంగా "స్త్రీవాదం" వాడబడుతోంది.

కందుకూరి సంఘ సంస్కరణోద్యమం ద్వారా స్త్రీ విముక్తికి మార్గం వేస్తే, చలం స్త్రీకి లైంగిక స్వేచ్ఛ, వివాహం స్వాతంత్ర్యం ఉండాలని రచనలలో నొక్కి వక్కాణించారు. రంగనాయకమ్మ రచనలలో "స్త్రీ స్వేచ్ఛ"ను గురించిన ఆలోచనలకు పునాది పడింది. భావ, అభ్యుదయ, విప్లవ కవిత్వాలలో స్త్రీకిసముచిత స్థానం ఇవ్వబడింది. రంగనాయకమ్మ, తెన్నేటి హేమలత, మల్లాది సుబ్బమ్మ, వాసిరెడ్డి సీతాదేవి మొదలైన వారి రచనలు కొత్త భావనలు రేకెత్తించాయి. సమాజంలో అన్ని రంగాలలోనూ స్త్రీలకు భాగస్వామ్యం ఉండాలనీ, వ్యక్తిత్వమూ, జీవితమూ కొందరి చెప్పు చేతలకిలోబడి తీర్చిదిద్దబడే పరిస్థితి మారాలనీ ముఖ్యంగా స్త్రీని తల్లిగా, భార్యగా మాత్రమే ముద్రవేయబడే ఒక లేబిల్ నుంచి మనిషిగా గుర్తింపబడేస్థితికి రావాలని - దాని కోసం సాంస్కృతికంగానూ, సామాజికంగానూ, సాహిత్యపరంగానూ మర్రి ఊడపై విస్తరించి ఉన్న పురుషస్వామ్యపు భావజాలం పోవాలనీ, ఈ భావాలతో సాగుతున్న ఉద్యమమే "ఫెమినిజం" అని చాలా మంది భావం. స్త్రీల ఆత్మ చైతన్యానికై, ఆత్మాభిమానానికై రూపొందించబడిన ఆలోచనాధోరణే స్త్రీ వాదం".

"స్త్రీవాదం" అనే పదం జయప్రభ మొట్టమొదటిసారిగా ప్రయోగించారు. 1972లోనే ఓల్గా "ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి" అన్న కవితతోనే తెలుగునాట స్త్రీవాద కవిత్వం ప్రారంభమైనదని చెప్పవచ్చు. 1980 నుండి స్త్రీవాద కవిత్వం విస్తృతంగా రావడం మొదలైంది. తొలితరం స్త్రీవాదిగా రేవతీదేవికి పేర్కొనవచ్చు. 1980లో 'శిలాలోలిత" అనే మొట్టమొదటి స్త్రీవాద కవితా సంకలనాన్ని ప్రచురించారు. "ఈ సమాజం ఒక స్త్రీని కవిగా ఎదగడానికి వీలు లేకుండా చేసిందని" వాపోయారు. తొలి తెలుగు స్త్రీ వాద కవితా సంకలనం - "గురిచూసి పాడేపాట" (1990)ను త్రిపురనేని శ్రీనివాస్ ప్రచురించి, అందులో "స్త్రీలు రాస్తేనే స్త్రీవాద కవిత్వం అవుతుందనీ, కవయిత్రులు మాత్రమే శక్తివంతంగా చెప్పగలరని" పేర్కొన్నాడు.

స్త్రీవాద కవిత్వంలో స్థూలంగా నాలుగు ప్రధాన ధోరణులను డా॥ కాత్యాయని విద్మహే పేర్కొన్నారు. అవి

1. స్త్రీల ఉనికికి సంబందించిన కవిత్వం.
2. కుటుంబ సంబంధాలలో తమస్థానాన్ని గురించి వివేచించిన కవిత్వం.
3. కుటుంబం నుంచి బయటకు వచ్చినపుడు తనకు సంబందించి సమాజంలో వచ్చే స్పందనను చిత్రించే కవిత్వం.
4. సామాజిక పరిణామాలు, సామాజిక సమూహాలను తను చూసే పద్ధతికి సంబందించిన కవిత్వం.

తొలి తరం స్త్రీవాద కవయిత్రి రేవతీదేవి - "శిలాలోలిత" (మూగబోయిన గొంతు) కవితలో ...

"ఇన్నాళ్ళూ గలగలా మాట్లాడితే
నే చెప్పాల్సిందేమీ లేనందున
నేనేం చెప్పినా విన్నారు
ఇప్పుడేమో నాకు చెప్పాల్సిందేదో వుండి మాట్లాడబోతే
ఎవరూ వినిపించుకోరు
అందుకో మరెందుకో ఈ గొంతు మూగబోయింది".
అంటూ వాపోయింది.

రచయితలు మేధావులుగా ప్రకాశిస్తారు. రచయిత్రులు తమ అందమైన శరీరంతో ప్రకాశించాలని మార్కెట్ నిర్దేశిస్తోంది. స్త్రీల సాహిత్య కృషి పురుషులు నిర్మించిన సాహిత్యోద్యమ రథచక్రాల కింద పడిపోయింది. ఓల్గా "మొదటి స్త్రీవాద కవిత"గా గుర్తించే "ప్రతి స్త్రీ నిర్మల కావాలి" అనే కవితలో ...

"అందమైన దోపిడీకి
పవిత్రమైన హింసకూ
న్యాయమైన దాస్యానికీ
బలైపోయిన నేను భారతస్త్రీని !
......................................
......................................
ప్రబంధ కన్యను కాను
పంచదార చిలకను కాను
ఫ్యాషన్ పరేడ్ బొమ్మను కాను
పసిపాపల చంపే పాపిని కాను
పంచాది నిర్మల వారసురాలిని !"

అంటూ స్త్రీవాద భావజాలాన్ని తీవ్రంగా వ్యక్తీకరించింది. ఈ సమాజంలో స్త్రీకి జరిగే అన్యాయాలన్నీ అందంగా, పవిత్రంగా, న్యాయమైనట్టుగా జరుగుతాయనటం "ముసుగు"ను తొలగించడమే. సాంఘిక ధర్మం, పవిత్రత, శీలం వంటి మాటలతో జరిగేవన్నీ అలాగే ఉంటాయని భావం. చివరలో సాంప్రదాయ

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


భావజాలంపై నిరసన ఉంది. పంచాది నిర్మల విప్లవ పోరాటంలో పాల్గొన్నారు. అందుకని తిరుగుబాటుకి ఆమెను ప్రతీకగా స్వీకరించారు.

"మెహందీ స్త్రీల విజ్ఞప్తి" కవితలో ఓల్గా - 'ఒక యువకుడి మరణం వల్ల మెహందీ స్త్రీలపై జరిగినపోలీసుల దాడికి స్పందిస్తూ'

"ఓ మగ మద మృగాల్లారా
మీరు మీ ఇళ్ళలో చావండి
మీ భార్యల ఒళ్ళో చావండి
మా ఇళ్ళలలో చావకండి
మాకు మిమ్మల్ని సుఖపెట్టడమే తెలుసు
చావడానికి మా దగ్గరకు రాకండి
బతకడానికి నానా చావు చస్తున్న వాళ్ళం" ...

అని విజ్ఞప్తి చేసినది. వేశ్యలను దూరం నుంచి సాను భూతితో చూడడం కాక, వేశ్య ఆత్మగీతాన్ని ఆవహింపచేసుకొని ఆర్తిగా ఆవిష్కరించడం స్త్రీవాద కవితకే చెల్లింది.

"పాఠం ఒప్ప చెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంతులు గారన్నప్పుడే భయమేసింది.
........................................
........................................
........................................
"పెళ్ళంటే "పెద్ద శిక్ష" అని
మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని"

"బంది పోట్లు" అనే కవితలో సావిత్రి గొప్ప టెక్నిక్‌తో సూటిగా శబ్దచమత్కారంతో పురుషాధిక్యతను బలంగా వ్యం గ్యంగా నిర్మాణ శిల్పంతో వ్యతిరేకించినది.

ఇంటి నుంచి బయటకు వచ్చిన స్త్రీ ఎదుర్కొనే సమ స్యను" చూపులు" కవితలో జయప్రభ ఇలా అంటుంది.

"రెండు కళ్ళనుంచి చూపులు
సూదుల్లా వచ్చి మాంసపు ముద్దలపై
విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి"

అని అనడంలో పురుషులు చేసే శారీరక హింస, సౌందర్య హింసను గురించి నిర్మొహమాటంగా గట్టిగా నొక్కి వక్కాణించింది రచయిత్రి.

ఇంటి చాకిరీ స్త్రీ జీవితాన్ని ఎలా పరిమితం సంకుచితం చేసిందో, ఆమె అస్తిత్వాన్ని ఎలా హరిస్తుందో విమల తన 'వంటిల్లు' కవితలో అద్భుతంగా వర్ణించింది. "వంటిల్లు ఆట"తో స్త్రీ బాల్యం ప్రారంభమౌతుందని చెబుతూ ....

"మా అమ్మ అమ్మమ్మ ఇంట్లో అమ్మలంతా ఇక్కడ స్త్రీల య్యారట / రక రకాల శవాలు నిండిన స్మశానంలా మా వంటిల్లు / భయం భయంగా నిశబ్ధంలా, నిరాశగా / మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ / అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా వుంటుంది / ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరే !" ...

అంటూ వంటిళ్ళను కూల్చేద్దామన్న నినాదంతో, మార్క్సిస్టు దృక్పథంతో ఈ కవిత ముగుస్తుంది. స్త్రీని వంటింటి కుందేలుగా, వంటలక్కగా బాధిస్తున్న వైనాన్ని తెలిపిన ఆమె ఉద్దేశ్యం హర్షించ దగినది.

"బాల్యంలో చిన్నపిల్లవి నీకేం తెల్సు కూర్చో అన్నారు.
యవ్వనంలో ఉడుకు రక్తం మంచీ - చెడూ తెలీదు కూర్చో అన్నారు
వృద్ధాప్యంలో ముసల్దానికి ఇంకేం చేస్తావు కూర్చో అన్నారు.
అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు
కూర్చొని కూర్చొని బద్ధకం వచ్చినందుకే బాధగా వుంది" ...

అని స్త్రీ పురుషుల మధ్య బాల్యం నుంచి చూపే వివక్ష, ఆడపిల్ల పుట్టినప్పటి నుండి, వృద్ధాప్యం వచ్చే వరకు ఎలాంటి నియంత్రణలో, నిర్లక్ష్యంలో, చులకనలో బతుకుతుందో, ఎలా వివక్షకు గురవుతుందో" అలాగే అన్నారు" కవితలో రజియాబేగం అక్షరీకరించారు.

స్త్రీగా పుట్టడమే శాపమని భావించేలా ఈ పితృస్వామ్యపు వ్యవస్థ చేస్తుంది. కనుక తమ ఉనికే నిషిద్ధమని చెబుతూ - "శ్రీమతి" ఇలా రాసినది.

"నేనమ్మలో ఉన్నపుడు
నేను కావాలని అమ్మ కోరుకున్నట్లు నాన్నకు తెలియగానే " ...
........................................
........................................
"నేనొక స్త్రీని
నేనొక నిషిద్ధ జీవిని
మొన్నటి దాకా నా నవ్వు నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే" ...

అని గుజరాత్‌లో ఆడపిల్లలు పుట్టకుండా (స్కానింగ్ ద్వారా తెలుసుకొని) సామూహికంగా 'అభార్షన్" చేయించుకున్న వార్తకి స్పందించి ఈ కవితలో నిరసన తెలిపారు.

భర్తను "దుష్టశత్రువుగా"గా సంభోదించి తన కలలను చెరిపేస్తాడని మొక్కపాటి సుమతి" మిత్రవైరుధ్యమా" కవితలో ఇలా అన్నారు.

"వర్గ శత్రువు నా శ్రమనే దోచుకుంటాడు
ఈ దుష్టశత్రువు నా బ్రతుకే దోచుకుంటాడు
........................................
........................................
వాడికి నేను మరను తిప్పే మనిషిన
వీడికి నేను మనిషి రూపంలోని మరని
ఎవడూ అన్నది? ఇది మిత్ర వైరుధ్యమని?
పెళ్ళినాడు పురోహితుడు చూపే
అరుంధతీ నక్షత్రంలా
ఆకాశంలో సగాన్ని చూపి
మోసం చేస్తున్నాడు వాడు" .....

ఇందులో 'వర్గ శత్రువు' కంటే 'లింగ' శత్రువే మిన్న. అనే అభిప్రాయం సూటిగా వ్యక్తం చేస్తూనే ఈ పురుషాధిక్య సమాజం అన్యాయంగా స్త్రీలకు స్వేచ్ఛ లేకుండా యంత్రం భావిస్తున్నారని వివరించింది.

స్త్రీవాద కవిత్వం వల్ల "అమ్మ"కి ప్రాధాన్యం పెరిగి ప్రత్యేకంగా "అమ్మ" అనే కవితా సంకలనం వెలువడింది. బి. పద్మావతి "గుక్కపట్టిన బాల్యం" కవితలో అమ్మ గురించి పలికిన పలుకులు మనల్ని స్పందింపచేస్తాయి.

"నవ్వే నక్షత్రంలా అమ్మ కావాలి / లాలించే జీవనది అమ్మ కావాలి / అమ్మ ఆకాశపు గుండెల మీద ఉయ్యాల లూగాలి / అమ్మ కావాలి / నాన్న చేత తన్నులు తినని అమ్మ కావాలి / సుడిగుండంలా అమ్మ ఏడుపు ముంచెత్తని సుఖనిద్ర రాత్రి కావాలి" ...

అంటూ అమ్మ పడే అవస్థ గురించి శక్తివంతంగా పురుషుల్లో మార్పు కలిగేలా చెప్పినది. పూర్వపు భర్తలు భార్యని చాలా హీనంగా చూసేవారు. ఇప్పుడూ లేకపోలేదు గానీ పూర్వం భార్యల్ని హింసించటం బాగా ఎక్కువగా ఉండేది. పైగా ఎవరూ పట్టించుకొనే వారు కూడా కాదు. అది వాళ్ళిద్దరి సమస్య. మరొకరు జోక్యం చేసుకోకూడదు. అనుకొనే రోజులవి. అందుకే స్త్రీవాదులు కుటుంబం "ప్రైవేట్ యూనిట్" కాదనీ - సమాజంలో భాగమనీ, కుటుంబ హింస సామాజిక సమస్య అని చాటి చెప్పారు.

"కవికీ చిత్రకారుడికీ
నా శరీరమేగదా వర్ణనీయ వస్తువు !
చలన చిత్రాలకు వ్యాపార ప్రకటనలకు
పెట్టుబడి నా శరీరమే కదా !" ...

అని సమాజంలో అన్ని వర్గాల పురుషులకూ స్త్రీ ఎలా పెట్టుబడి అవుతుందో మందరపు హైమావతి తెలుపుతూ, స్త్రీని వ్యాపార వస్తువుగా చూడటం మానుకుంటే బావుంటుందనే అభిప్రాయమును "సర్పపరిష్వంగం" కవితలో వ్యక్తపరిచినారు.

షాజహానా "ముసుగు తీసి చూడు" కవితలో "ఏ పరదాల మాటున ఎంత నైరాశ్యం గూడు కట్టుకుని ఉందో ఎన్ని బురఖాల చాటున ఎన్ని కన్నీళ్ళ సముద్రాలున్నాయో" ...

అంటూ బురఖా వెనక స్త్రీకి చైతన్యం సోకనివ్వని తన మతం పట్ల ద్వేషం, ముస్లిం స్త్రీల దుస్థితి పట్ల ఆవేదన వెలిబుచ్చినారు.

మధ్యతరగతికి చెందిన నగర వాసుల స్వీయానుభవాలతో ప్రారంభమైన స్త్రీవాద కవిత్వం విమల, పద్మ వంటి వారి కవిత్వంలో శ్రామిక వర్గ స్త్రీల ఆత్మఘోషను కూడా చేర్చుకుంది. ఆ తర్వాత స్త్రీలందరి సమస్యలూ ఒకేలా వుండవనీ, దళిత, మైనారిటీలకు చెందిన స్త్రీల వెతలు మరింత దారుణంగా ఉంటాయని ఒక కొత్త అవగాహన ఏర్పడింది. చల్లపల్లి స్వరూపారాణి, మద్దూరి విజయశ్రీ, జి. విజయలక్ష్మి, దరిశె నిర్మల మొదలైనవారు దళిత స్త్రీలు కుల వివక్షకు జెండర్ వివక్షతోడై ఎదుర్కొనే హింసను చిత్రించారు. దళిత స్త్రీలు అగ్రవర్ణాల స్త్రీల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించడం కూడా కొన్ని కవితల్లో కనిపిస్తుంది.

✿✿✿

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జానపద సాహిత్యంలో హాస్యం

- ఎమ్ .ఎన్. వి. సూర్యకుమారి, తెలుగు అధ్యాపకురాలు, డి. ఆర్. జి. మహిళా డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం.

జానపదుని జీవితమంతా కష్టజీవితమే రెక్కాడితేగానీ డొక్కాడని జీవితం జానపద జీవితం. తెల్లారింది మొదలు రాత్రి పరుండేదాక ఏదో పనిలో నిమగ్నమయ్యేవాడు. తాము చేసే కష్టమైన పని తేలికగా చేయగలుగుటకు అనువుగా పాటలు పాడుతూ తమ కష్టజీవితమును సంగీతమయం చేసుకొనేవాడు.

పగలంతా కష్టపడినా రాత్రిళ్ళు కులవర్గ విభేదము లేకుండా సమిష్టిగా కూడి, ఆడి, పాడి, కాలక్షేపం చేసేవారు. జానపదులు గొప్ప కళాకారులు, వివిధ పశు, పక్షుల ఆట పాటలను అనుకరించి ఆనందించేవారు. కోలాట, పండరిభజన, చెక్క భజనలతోను, బయలు నాటకం, తోలుబొమ్మలాటలతో రాత్రిళ్ళు వినోద కాలక్షేపంతోపాటు భక్తి భావముతో భగవంతుని ఆరాధించేవారు.

తరతరాలుగా ఆంధ్రులు కాపాడుకుంటూ వస్తున్న అనేక కళారూపాల్లో వీధి నాటకం ఒకటి. అనాదిగా ఆంధ్రుల్లో ఒకతరం నుంచీ మరోతరానికి అందించబడుతూ వస్తున్న అద్భుతమైన కళా స్వరూపం వీధి నాటకం. ఇదే ఆధునికాంధ్ర నాటకకళా రంగానికి మాతృక.

సుదీర్ఘంగా నాటకాన్ని తిలకించే ప్రేక్షకులు నిస్థిరపొద్దు కావడం వల్లను, విసుగువల్లను కాస్తంతసేపు కన్ను మూయాలని నిద్రకు ఉపక్రమిస్తూ ఉంటారు. అలా నిద్రపోయేవారిని ప్రదర్శన చూసేవిధంగా చేయడానికి మధ్య మధ్యన హాస్యపూరితమైన కథకు సంబంధంలేని అంశాలను ప్రదర్శిస్తూ ఉంటారు. వీటినే "ఉప్పాలు" అంటారు. ఇవి రెండు రకాలుగా ఉంటాయి.

1. ఒకే పాత్ర చేత ప్రదర్శించేవి
2. రెండు మూడు పాత్రలచేత ప్రదర్శించేవి

**గువ్వలడాన్సు (రాయలసీమ ప్రాంతం) :**

మొదట స్త్రీ పాత్రధారి ఒక చిన్నపెట్టెను చేతబట్టుకొని సూదులు, దబ్బనాలు అమ్మే గువ్వాలమ్మి వేషంలో రంగస్థలం పైకి వస్తాడు. మరో గువ్వలవాడి వేషంలో వచ్చిన మరోనటుడు గువ్వల్ని వెతుకుతున్నట్లు అభినయిస్తూ వస్తాడు.

ఆ గువ్వలవాడు ఎలాగైనా ఆ గువ్వలమ్మిని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. ఆ సమయంలో వారిద్దరి మధ్య సాగే సంభాషణ నవ్వు పుట్టిస్తుంది.

పురుషుడు : ఏ ఊరు ఏవాడా పిల్లా నీవు
ఏం పనుల మీదొచ్చినావు పిల్లా నీవు ॥ఏ ఊ॥
స్త్రీ : నాగూరు నాగపట్నమయ్యా నాదీ
సూదులమ్మ నొచ్చినానయ నేను ॥నాగూ॥
పు : ఏమేమి పన్లు చేస్తావా పిల్లానీవు
స్త్రీ : అన్ని పన్లు చేస్తానయ్యా నేను
పు : రాగులైన ఇసరగలవా పిల్లానీవు
స్త్రీ : రాగులంటే రోగమొస్తుందయ్యా నాకు
పు : సద్దలైనా దంచగలవా పిల్లా నీవు
స్త్రీ : వడ్లంటే వణుకొస్తుందయ్యా నాకు
పు : నీళ్ళయినా తోడగలవా పిల్లా నీవు
స్త్రీ : నీళ్ళంటే నిదరొస్తుందయ్యా నాకు
పు : చెత్తయినా ఊడ్చగలవా పిల్లా నీవు
స్త్రీ : చెత్తంటే చెమటొస్తుందయ్యా నాకు
పు : ఇంకేమి పన్లు చేస్తావ్ పిల్లా నీవు
స్త్రీ : అన్ని పన్లు చేస్తానయ్యా నేను
పు : ఓహో అన్ని పన్లూ చేస్తావా.... సరే ... వస్తావంటే
నా యెంట వస్తావటే పిల్లా వస్తావటే కొత్తి కోనేరు
పొదారి వస్తావటే ॥కొత్తి॥
స్త్రీ : వస్తాన్ గానీ మాయా వస్తావ్‌గానీ మామ
నన్ను కొట్టకుండా తిట్టకుండా ఉంటావ్ కదా
పు : నేను కొట్టకుండా తిట్టకుండా వుంటానా నీ పిల్లా
ఎవ్వన్నీ చూసి నవ్వు నవ్వావు కదా ॥ఎవ్వ॥
స్త్రీ : ఎవ్వన్నీ చూసి నవ్వను గానీ మామ
నా నవ్వేటి మొగమే అట్లుండునే ॥నానవ్వే॥
పు : నీ నవ్వేటి మొగమే అట్టుంటేను
నేను చెర్నాకోల తీసుకొని చెలరేగనా ॥చెర్నా॥
స్త్రీ : నువ్వు చెర్నాకోల తీసుకొని చెలరేగితే
నేను గంజినీళ్ళు పొయ్యకుండ బొగొట్టనా॥గంజి॥
పు : నువ్వు గంజినీళ్ళు పొయ్యకుండ బొగొట్టితే
నేను కూలికి పోకుండ ఎగొట్టనా ॥గంజి॥

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


స్త్రీ : కూలికి పోకుండా ఎగొట్టితే
నేను మాయమ్మగారింటికి వెళ్ళిపోనా ॥మాయమ్మ॥

పు : మీయమ్మ గారింటికి నువెళ్ళితే
నేను కొట్టుకుంటు తిట్టుకుంటు ఈడ్చుకురానా ॥కట్టి॥

స్త్రీ : నువ్వు కొట్టుకుంటు తిట్టుకుంటు ఈడ్చుకుస్తే
నేను బాయిలోనో చెల్లానోబడి చచ్చిపోనా ॥నాయి॥

ఈ విధంగా సాగుతుంది గువ్వలడాన్సు

**జానపదంలో గేయం :**

తల్లి తన తనయుడి మీద చూపించే ప్రేమ అద్వితీయం. బాగా అలకరించి కొడుకుని చల్లగాలికి తిరిగి రమ్మని పంపుతుంది. వాడు ఏటిగట్టున వెళుతూ ఉంటాడు. ఆ గట్టు మీద చెట్లు గాలికి అల్లాడుతుంటాయి. ఆ కదలికకు అబ్బాయి ధరించిన గొలుసులు అల్లాడుతాయి. బంగారు తలపాగా అంచులు అల్లాడుతాయి. అప్పుడు వాడు గాలికి చెదిరిన మేఘ శకలంలా ఉంటాడు. ఇక తల్లి వాడి అలంకార విషయాల్లో అందరినీ పురమాయిస్తుంది.

"తీరె మా అబ్బాయికి ముత్యాల చుట్టూ
ముత్యాల చుట్టుకీ మూడు రేకల్లూ
రత్నాల చుట్టుకీ రావిరేకల్లూ
దానికి
వజ్రాల తాపిరీ వాడి మామల్లూ
కెంపుల్లు తాపిరీ వాడి బాబుల్లూ" - దీనిని బట్టి అబ్బాయికి తండ్రితోనే కాక మేనమామలతో ఎక్కువ బంధం కట్టపెడుతుంది తల్లి. అందితే అన్నతో వియ్యమందాలి, అనేది స్త్రీ వాంఛించే వాంఛల్లో ఒకటి. అందుకని యీ పాటల్లో మేనమామ ప్రసంగం తరచూ వస్తుంది. వాటిని వర్ణిస్తూ

చెవి చెవికీ బారేడి పోగుల్లవారు
పట్టుపంచెలవారు పాగాలవారు
పెసరకాయల వంటి పెదమల్లవారూ
కందికాయలవంటి కనుబొమ్మల వారు
మిరపకాయల వంటి మీసాలవారూ.... అని చెప్పి

"వారు మా అబ్బాయి మేనమామల్లూ" అని ఠీవి వలక బోస్తుంది. అదే కూతురి మామగారిని, అనగా తన వియ్యంకుడిని గురించి పాడేటప్పుడు ఆవిడ ధోరణి వేరు. అక్కడ ఆమె ఎంత ఎగతాళైనా చేసి హాస్యాన్ని ఒలకరిస్తుంది.

అమ్మాయి మామల్లు ఎటువంటి వారూ
చేప గంపలవద్ద చేయి జాచువారూ
గుడ్డి గుఱ్ఱాన్నెక్కి గోజారువారూ
పందిపిల్లా నెక్కి పరుగెత్తువారు... ఇట్లా అనడానికి కారణం ఆ "మాయ" తన తోడబుట్టిన వాడు కాడు కనుక.

చిన్నపిల్లగా స్త్రీ పొందే సరదాలలో వదినలతోనూ, బావలతోనూ సరసాలాడటం ఒక సరదా. అని చాలాసార్లు హద్దులు మీరతాయి. అయినా ఎవ్వరికీ కోపం రాదు. ఒకపిల్ల తన మరిదిని ఈ విధంగా మర్యాద చేస్తుంది.

"మేనత్త కొడుకమ్మ నా మేనమరిది
నన్ను చూడావచ్చి పాతర్లొపడెను
పాతర్లొ పడ్డవాణ్ణి రోకళ్ళు కుమ్మి
మూల మంచం వేసి ముంతపొగ బెడుచు
కుండ కడిగిన నీళ్ళు కాళ్ళకందించి
తవ్వ కడిగిన నీళ్ళు దాహానికిస్తు
ఇంకొక చోట వదినెనూ, బావనూ కలిసి
ఒదినగారూ మీరు వాసి కలవారూ
వండబోయిన చోట కుండ నాకేరు
బావగారూ మీరు ప్రతిభ కలవారూ
నిండినా సభలోన పిండి బొక్కేరు
అని ఎగతాళి చేసి తృప్తి కలగక
చక్కిలాల బుట్ట చంక పెట్టుకుని
సభలోన మా బావ సంగీతపరుడు అని బెణుకు విసురు తుంది.

ఈ మధ్య కాలంలో పల్లెలకు, పట్నాలకు మధ్య అంతరం ఎక్కువ పెరిగిపోతుంది. పూర్వకాలంలో పల్లెల్లో జీవనం ప్రశాంతంగా ఉండేది. పట్నాలజీవితం అప్పుడూ... ఇప్పుడూ కూడా హడావుడి పరుగులె.... దానినే పల్లె జీవితానికి అనుసంధానం చేసి పల్లెలలోని ఆడపడుచులు ఈ క్రింది విధంగా గేయాన్ని సరదాగా ఆలపిస్తున్నారు.

పల్లెల అందం పవిత్రానందం
అనుభవించు ఆలపించు పల్లెపిల్లలం ॥ప॥
కోడి కూయంగ ఒడిగ లేచి చల్ల చిలుకుతాం
గోడ గడియారం గంటకై మేము వేచి చూడము ॥ప॥
పట్నాల వాసులు ఏడైన లేవక మగత కన్నులా
టూతుబ్రష్షు, బాత్ టబ్బు తడుముకుందురట
ఇడ్లీ, ఉప్మా మాడు పెసరట్లు మనసారా తిందురట.॥ప॥

ఈ విధంగా సాగే ఈ గేయంలో వారి గొప్పదనాన్ని తెలియ చేస్తూ పట్నం వారి అలవాట్లను ఎగతాళి చేస్తూ సరదాగా ఆట పట్టిస్తుంటారు.

**ముగింపు :**

జానపద వాఙ్మయంతా చాలావరకు గేయ వాఙ్మయం. పాటపాడే హక్కు స్వతహాగా స్త్రీలది. పురుషులు దాన్ని గుత్తగొని సాధనచేస్తే, ఆ మనోహరత రాదు. ఇవి లయాత్మకమైన సుందర మధురగీతాలు. ఈ వాఙ్మయం చదవటంవల్ల హృదయస్పందనం జరుగుతున్నది. అంటే రసస్ఫోరకత దానిలో అంతర్గతంగా ఉం డటం వల్ల అది మన హృదయాలను కరిగించగల్గుతున్నది.

**ఆధార గ్రంథాలు :**

1. పరిశోధన - నాయని కృష్ణకుమారి
2. కళాదీపిక - కళాసాహిత్య శతవ్యాస మాలిక.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలుగు భాష మనుగడ - తెలుగు ఉపాధ్యాయుల కర్తవ్యం

- 'భాగవతరత్న' డా॥ పీపూరి వేంకటేశ్వర్లు, కర్నూలు.

ఏ భాషను శిశువు అసంకల్పితంగానే నేర్చుకుంటాడో, ఏ భాష ఇతర భాషల అభ్యసనంపై ప్రభావం చూపుతుందో ఆ భాషను మాతృభాష అంటారు. ఈ భాష వంశపార్యంగా గాక పరిసరాల ప్రభావం వల్ల అలవడుతుంది. అసంఖ్యాకమైన వ్యక్తుల విషయంలో ప్రాంతీయ భాషే వారి మాతృభాషగా వ్యవ హారంలో ఉంటుంది.

వ్యక్తి నిత్యవ్యవహారానికి అవసరమైన భావగ్రహణ, భావ వ్యక్తీకరణాలకు మాతృభాషపై ఆధారపడతాడు. ఏదైనా ఒక విషయంలో ఆలోచించడం గాని, ఇతరులతో చర్చించడం గాని మాతృభాషలోనే తరచుగా చేస్తాడు. ఇతర భాషలు తెలిసి యున్నప్పటికీ, అవి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఉప యోగిస్తాడు. అందువల్ల మాతృభాష వ్యక్తుల నిత్యవ్యవహారంలో ప్రధాన భాగాన్ని - స్థానాన్ని ఆక్రమిస్తుంది. భాషపై అధికారాన్ని సంపాదించి, భావవ్యక్తీకరణను ఎంత స్పష్టంగా చేయగల్గితే, ఆ భాష ఆ వ్యక్తికి అంతగా కరతలామలకమవుతుంది.

పరభాషల్లో వ్యవహరిస్తున్నప్పుడు కూడా వ్యక్తి తనలోని భావాలను మనోకుహరాల్లో స్వభాషల్లోకి అనువదించుకొని, వాటికి అనుగుణంగా భావవ్యక్తీకరణను మాతృభాషలోనే ఆకృతి కల్పించుకొని, పరభాషల్లో వ్యక్తీకరించడానికి ప్రయత్నిస్తాడని భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. దీనిని బట్టి భావగ్రహణం, భావ వ్యక్తీ కరణం మాతృభాషలోనే సులువుగా జరుగుతాయని చెప్పవచ్చు.

మనిషికి సంఘంలో సుఖవంతమైన జీవనానికి ధనంతో పాటు భాషాధనం కూడా అవసరం! ఎందుకంటే భాష సమాజాన్ని పోషిస్తుంది. ఇక తెలుగు మన మాతృభాష. 'అది మన భాష కాబట్టి మనకు బాగా తెలిసే ఉంటుంది. బాగా తెలుసు కాబట్టి మనమింకా తెలుసుకునేదేముంటుంది?' అనే భావన వల్లనే భాషా ప్రయోగంలో మనం తగినంత శ్రద్ధ చూపటం లేదు. ఒక ఆంగ్లపు మాటను వ్రాసేటప్పుడు, ఆ మాట వర్ణక్రమం (స్పెల్లింగ్) విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటాం! కాని మాతృభాషా విషయంలో మనకు ఆ స్పృహ లేదన్నది నిత్యమూ అనుభవమైన విషయమే, దీనికి కారణం నిర్లక్ష్యమే!.

దుకాణాల పేర్ల బోర్డులు కాని, గోడల మీద వ్రాసిన నినాదాలు కాని, అడ్వర్టయిజుమెంట్లు కాని, పోస్టర్లు కాని, కర పత్రాలు కాని చూస్తే ..... ఈ విషయం అర్థమవుతుంది.

అంతేకాదు స-శ-షల మధ్య ఉచ్చారణాభేదాన్ని పాటించని తరాన్ని చూస్తున్నాం! శర్మను 'షర్మ'గా మాట్లాడుతూ, వాక్యాల్ని కైమా కొట్టినట్లు వంకర్లు పోయే యాంకర్లను చూస్తున్నాం!! అక్కడి దాకా ఎందుకు? ఆధునిక కవులమని చెలామణి అవుతున్న ఈనాటి-ఈతరం కవులలో సైతం సలక్షణంగా భాషను ప్రయోగించ గల వాళ్ళ సంఖ్య పరిమితంగానే ఉండడం గమనార్హం! వైరి సమాసాల్ని ఎట్లాబడితే అట్లా వాడుతున్న గందరగోళ పరిస్థితి తెలుగులో ఉన్నది. మరోప్రక్క కవిలోకంలోని రకరకాల వాదాలు-ఇజాలు, వాటి ఓరియెంటేషన్లూ మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. కనుక ప్రతి తెలుగువాడు చక్కగా వ్రాయగల - మాట్లాడగల సామర్థ్యాన్ని సాధించాలి. అన్ని సామర్థ్యాల మూలం భాషా సామర్థ్యమే! ఏ విషయంలో (సబ్జెక్టులో) ఉన్నత శిఖరాలను అధిరోహించినా, భావవ్యక్తీకరణకు భాష కావాలి కదా! అందుకే పాఠశాలల్లో భాషాబోధనకు ఎక్కువ సమయం వినియోగించాలి. భాషాబోధనలో మాతృభాషోపాధ్యాయులకు చక్కని శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లోనే ఎక్కువ సామర్థ్యం ఉన్న, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల అవసరం ఉంది. అలా ఉపాధ్యాయులకు ప్రోత్సహించవలసిన అవసరమూ ఉంది. ప్రభుత్వాలు ఈ విషయంలో అపారమైన ధనాన్ని వ్యయం చేస్తోంది. కాని సానుకూలమైన ఫలితాన్ని రాబట్టలేకపోతుంది. ఇందుకు వ్యవస్థీకృతమైన లోపాలు కొన్ని, అవగాహనలేని అధికారుల అశ్రద్ధ, అర్థం-పర్థం లేని మొక్కుబడి కార్యక్రమాల నిర్వహణ మరికొంత కారణం.

భాష నేర్చుకునే పద్ధతుల మీద ఇతర దేశాలలో చాలా పరిశోధన జరిగింది, జరుగుతున్నది. వాళ్ళంతా ముక్తకంఠంతో చెప్పేదేమంటే, ఏ భాషైనా నేర్చుకోవటానికి కావలసిన మొట్ట మొదటి దినుసు 'మోటివేషన్'. ఆ మోటివేషన్‌ను కలిగించే దిశకు తెలుగు ఉపాధ్యాయుని సన్నద్ధం చేయాలి. ఎందుకంటే పాఠ శాలల్లో 'తెలుగు ఉపాధ్యాయుడను' ఒక సాంస్కృతిక కేంద్రం. అయితే దురదృష్టవశాత్తు ఈనాటి వాతావరణంలో 'నేను తెలుగు ఉపాధ్యాయుడను' అని చెప్పుకోవడానికే సిగ్గుపడుతున్న తరం కనిపిస్తోంది. ఇది శోచనీయమైన విషయం! కాని దీనికి ఉపా ధ్యాయుల పట్టనితనం కూడా కొంత కారణం!

డిగ్రీ చదివినా తేటతెనుగు పద్యాలను చక్కగా చదవలేక పోవటానికి, ఉచ్చారణ దోషాలు దొర్లటానికి కారణం ప్రాథమిక - ఉన్నత స్థాయి వరకు నేర్చుకుంటున్న మాతృభాషా విషయంలో, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపకపోవటమే! ఇలాంటి శ్రద్ధ విద్యార్థికి కల్పించినట్లయితే ఆ శ్రద్ధ ఆజన్మాంతం వదలదు.

తల్లిదండ్రుల నుండి, పరిసరాల నుండి మాట్లాడే భాషను విద్యార్థి సహజంగా నేర్చుకుంటాడు. కాని వ్రాయడం మాత్రం

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


ఇలా అప్రయత్నంగా వచ్చేది కాదు. ప్రయత్నించి నేర్చుకోవాలి. ప్రయత్నించి నేర్చుకునే ఏ విషయమైనా, ఎంత నేర్చుకుంటా మన్నది, నేర్చుకునే వ్యక్తి అవసరాన్ని బట్టి ఉంటుంది. ఈ సామర్థ్యాన్ని విద్యార్థిలోకంలో పెంచే బాధ్యత ఉపాధ్యాయలోకం మీదే ఉంది. అంతేకాదు విద్యార్థి తన భావాలను, తెలిసిన విష యాలు తెలియచేయడానికి కావలసిన శిక్షణను పాఠ్యగ్రంథాల ద్వారా అందించేది కూడా ఉపాధ్యాయుడే! ఎందుకంటే ఎంత మంచి పాఠ్యపుస్తకమైనా ఉపాధ్యాయునికి దీటురాదు.

నేర్చుకున్న విద్య ఉద్యోగాన్నివ్వలేదని, సమాజం తనను గుర్తించలేదని, తనవారి సమస్యల్ని పరిష్కరించలేదని, నిరాశ స్పృహలతో సమాజం పట్ల, ప్రభుత్వం పట్ల అసహన భావం పెంచుకొనని శిక్షణ కూడా ఉపాధ్యాయుడే, ముఖ్యంగా తెలుగు ఉపాధ్యాయుడే అందించాలి. ఇతరులను అర్థం చేసుకోవటానికి, సామాజిక, నైతిక సమస్యా పరిష్కారంలో తెలుగు ఉపాధ్యా యుడు విద్యార్థికి ఎప్పుడూ కరదీపికే!

అయితే ఇప్పటి సంక్లిష్ట-సంశ్లిష్ట రాజకీయ వాతావరణ ప్రభావం విద్యాలోకంలో కూడా వ్యాపించింది. కొందరు పాఠ్య పుస్తకాలకు సంపాదకులైనప్పుడు 'విద్యార్థి - ఉపాధ్యాయుడు - బోధనా వాచకం' అనే ఈ మూడింటికి మధ్య అవసరమైన ఏకసూత్రత దెబ్బతింటోంది. వాళ్ళ భావజాలాన్ని (అయిడియా లజీనే) పుస్తకాలలో నింపుతున్నారు. ఇది గర్హనీయమైన అంశం!

ప్రాచీన సాహిత్యం నుండి ఏదైనా ఒక ఖండికను పెడితే, తిట్టే తెలుగు పండితులు, 'ఏమిటీ ఆధునిక కవిత్వం?' అంటూ నిరసించే ఛాందసులూ మనకు దర్శనమిస్తారు. పాతకొత్తల మేలు కలయిక సాధించలేకపోతున్నారు.

భాష యొక్క నిర్మాణ రీతిని, లక్షణాన్ని చెప్పేది వ్యాక రణం. వ్యాకరణం కూడా ఒక సైన్సు. సైన్సులలోలాగా ఇందులోనూ 'సాంకేతిక పదాలు' ఉంటాయి. ఆ సూత్రాలు, ఆ పరిభాష శాస్త్ర సాంకేతిక పద్ధతికి దీటుగా ఉంటుంది. అయితే ఈ మధ్య 'వ్యాకరణాన్ని సిలబస్‌లో నుండి తీసివేయండి' అనే గోల మొద లైంది. దీనికి కారణం ఉపాధ్యాయుల అలసత్వమేనంటే బాధ పడవలసిన పనిలేదు. పైగా 'విద్యార్థులకు వ్యాకరణం ఎలా బోధించాలి?' అనే విషయం మీద సిలబస్ ఫ్రేమ్ చేసేవాళ్ళకు గాని, బోధకులకు గాని తగినంత అవగాహనలేదు. అంతేకాదు బోధకులు తమ భయాన్ని పిల్లలకెక్కించి, వారిని భయ పెడుతున్నారు. దువ్వూరి వెంకటరమణ శాస్త్రిగారు, బొడ్డుపల్లి పురుషోత్తం గారు వంటి వాళ్ళ వ్యాకరణం పాఠాల పుస్తకాలు చదివితే ఉపాధ్యాయులకు ఆ భీతి ఉండదు.

ఇక తల్లిదండ్రులు భారీ ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠ శాలలోనో, సాధారణ పాఠశాలలోనో చేర్పించటంతో తమ బాధ్యత తీరిందని; పాఠాలు చెప్పటంతోటే ఉపాధ్యాయులు తమ బాధ్యత తీరిందని భావిస్తున్నారు. అయితే పిల్లలకు. విద్యార్థులకు విలువలు, ఎథిక్స్ వంటివి ఎవరు చెప్పాలి? సత్యం - ధర్మం - శాంతి - ప్రేమ - అహింస - సేవాభావం - పెద్దలపట్ల గౌరవం - దేశభక్తి - నీతి - నిజాయితీ వంటివి ఎవరు నేర్పాలి? దీనిని ఒక ఉమ్మడి బాధ్యతగా అందరూ గుర్తించాలి. కుటుంబంలోని తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు కలిసి నిర్వహించవలసిన సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ఎందుకంటే ప్రభుత్వం, సమాజం, తల్లి దండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్యారంగంలో ప్రధానపాత్ర వహించేవాళ్ళు కదా!

విద్యావ్యవస్థలో ప్రాథమిక విద్య పునాది. దీనిమీదే భవి ష్యత్ విద్య అంతా ఆధారపడి ఉంటుంది. మన విశ్వజనీన విద్యకు కనీస స్థాయి ఇదే కాబట్టి దీనికెంతో ప్రాముఖ్యం ఉంది. ప్రాథమిక విద్యలో భాషా బోధన చాలా ముఖ్యం. ఇదే ప్రతి వ్యక్తికి సమాజంలో తన వ్యవహారాలన్నీ సమర్థంగా నిర్వ హించుకోవడానికి అవసరమయిన భాషాజ్ఞానాన్ని అందిస్తుంది. ఇది కనీసావసరం!

**1) వర్ణమాల :** ఆంధ్రదేశంలో ఐదేళ్ళ నుండి ఒకటో తర గతిలో చేరిన పిల్లవాడికి ఓనమాలు నేర్పుతారు. వర్ణమాలు - గుణింతాలతో విద్యాభ్యాసాన్ని మొదలుపెడతారు. దిద్దించే పద్ధ తిలో వర్ణమాల నేర్పుతారు. పిల్లలు పాటలు త్వరగా నేర్చు కుంటారు. కనుక ఒక్కొక్క పాటలో ఒక్కొక్క వర్ణాన్ని పరిచయం చేస్తారు.

చదవడాన్ని నేర్పడంలో అనేక పద్ధతులున్నాయి. స్వరోచ్చా రణ పద్ధతి, అక్షర పద్ధతి, నవీనాక్షర పద్ధతి, పద పద్ధతి, వాక్య పద్ధతి, కథా పద్ధతి, గేయ పద్ధతి వంటి ఎన్నో పద్ధతులను నేడు వాడుతున్నారు. అయితే సాధారణంగా వాడుతున్న పద్ధతి పద పద్ధతి. అలాగే రాయడాన్ని నేర్పడంలోనూ సంప్రదాయ పద్ధతితో పాటు రూపసామాన్య పద్ధతి లేదా ఆకృతి పద్ధతిని కొందరు ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ పద్ధతులన్నీ స్వయం సమగ్రమ యినవని కాని, నిర్దుష్టాలని కాని చెప్పడానికి వీల్లేదు. ఉపాధ్యా యుడు తానున్న చోటు, తన విద్యార్థుల స్థితి, తనకున్న వనరులు ... వీటి ఆధారంగా బోధన పద్ధతిని తానే నిర్ణయించుకోవాలి.

**2) పద్యం :** పద్యం తెలుగువాడి సొంతం. పద్యమన్న పదం తెలుగు భాషలోనే వాడతారు. పదం నుంచి పద్యం పుట్టింది. 'పదం' అంటే పూర్వం పాడడానికి వీలైన కవిత్వరూపం. వెన్నెల పదాలు, తుమ్మెద పదాలు ఇలాంటివే! ఆ 'పదాలే' పరిణతి చెంది పద్యాలుగా మారినాయి. పద్యం యొక్క పూర్వ రూపం గానయోగ్యంగా ఉండేది. మరి పద్య రూపంలో గానం ఏమైంది? అంటే అదే అంతర్లీనంగా మ్రోగుతుంది. గణబద్ధంగా సాగుతుంది.

పద్యాన్ని కావ్య పద్ధతిలో చదవాలి. పౌరాణిక పద్ధతిలో రాగస్ఫూర్తితో చదవాలి. నాటక పద్ధతిలో రసాన్ని అంతర్లీనంగా

(రసం - రాగం పద్యంలో అంతర్లీనంగా ఉంది) భావిస్తూ, అభినయ పద్ధతిలో చదవాలి. అర్థ పద్ధతిలో పద్యం యొక్క అర్థం వ్యక్తమై, రసరాగ అభినయ అనుభవాలు శ్రోతకు కలిగేలా చదవాలి.

ఏ పద్యాన్ని ఏ పద్ధతిలో చదివితే బాగుటుంది? అన్న ప్రశ్న ఆ పద్యాన్ని చదివే పండితుని శక్తి సామర్థ్యాలపైన, ప్రేక్షక శ్రోతల అభిరుచిపైన ఆధారపడి ఉంటుంది.

తెలుగు పద్య బోధన ఒక యోగం. ఆ యోగంలో ఉండేది తరగతి గదిలోని ఉపాధ్యాయుడు, విద్యార్థులు. వాళ్ళ మధ్య వేదమంత్రంలా ప్రవహించేది ఛందోబద్ధమైన పద్యం. అక్కడ బాహ్యస్పృహ పనికిరాదు. పద్యం చదివినప్పుడు ఆ పద్యాన్ని రచించిన కవి అంతరాత్మ ఆ తరగతి గదిలో ప్రత్యక్షం కావాలి. అలా కుదరాలంటే తెలుగు ఉపాధ్యాయుడు 'పద్యాల ట్యూన్' పట్టుకోవాలి. ఒక్కొక్క పద్యానికి ఒక్కొక్క ట్యూన్ ఉంటుంది. ఛందోబద్ధమైన ఆ 'ట్యూన్'కు తెలుగు ఉపాధ్యాయుడు అలవాటు కావాలి.

కేవలం పద్యాన్ని చదివో - గానం చేసో విద్యార్థులను ఆకర్షిస్తే, అది ఉత్తమ పద్యబోధన అనిపించుకోదు. విద్యార్థి స్వయంగా పద్యంలోని సౌందర్యాన్ని ఆనందించి, అభినందించాలి. అలాంటి మానసిక శక్తిని తెలుగు ఉపాధ్యాయుడు విద్యార్థికి అందించాలి. పద్య సౌందర్యం పద్యం యొక్క రూపాన్ని బట్టి, భావాన్ని బట్టి ఉంటుంది. 'రూపం' అంటే పద్యంలో వాడిన శబ్దాలు - అక్షరాలు. 'భావం' అంటే పద్యంలోని చమత్కారం - అలంకారం.

విద్యార్థుల్లో పద్య రచన పట్ల ఆసక్తి ఉన్న వాళ్ళని తెలుగు ఉపాధ్యాయుడు గుర్తించగలగాలి. వారికి యతుల గురించి భయపెట్టకుండా, గణాల ద్వారా కాకుండా, లయద్వారా - పద్య పునడక ద్వారా పద్య రచనను అలవాటు చేయాలి. రకరకాల పద్యాలను సేకరించి, చార్టులు వ్రాయించి తరగతి గది గోడలపైన పెట్టాలి. వీలుంటే ఒక 'పద్య ప్రదర్శన శాలను' ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా తెలుగు ఉపాధ్యాయుడు పద్యంలో కవి సంక్షిప్తంగా చెప్పిన సమగ్ర గాథను, అభినయ పూర్వకంగా - కథాకథన చమత్కారంతో చెప్పగలగాలి. అప్పుడే అతని వృత్తికి సార్థకత చేకూరుతుంది.

**3) గద్యం :** గద్యం వ్రాసి మెప్పించటం కవికెంత కష్టమో, గద్యాన్ని బోధించి మెప్పించటం ఉపాధ్యాయునికీ అంతే కష్టం. అందుకే కవికే కాదు, ఉపాధ్యాయునికీ గద్యం నికషమే!

గద్యం మనకు ప్రాచీన కావ్యాల నుండి వారసత్వంగా అందిన సాహిత్య ప్రక్రియ. అయినప్పటికీ ఆధునిక గద్య ప్రక్రియలు (వచన ప్రక్రియలు) ఆంగ్ల భాషా ప్రభావంతో రూపు సంతరించుకొన్నవనటం అతిశయోక్తి కాదు. నవల, కథ, కథానిక, గల్పిక, వ్యాసం, వైజ్ఞానిక వ్యాసం, జీవిత చరిత్ర, ఆత్మకథ, పీఠిక, వార్తావ్యాఖ్య, స్కెచ్ ఇటువంటివన్నీ ఆంగ్ల భాషను చూసి మన తెలుగులో కూడా ప్రారంభించుకున్నాం! అయితే మన తెలుగు సమాజపు వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ఈ గద్య ప్రక్రియలన్నీ, ఇతర భాషా ప్రభావంతో ఆరంభమయ్యాయంటే నమ్మలేనంతగా ఇవి విస్తరించాయి.

తరగతి గదిలో తెలుగు ఉపాధ్యాయుడు గద్యం చదివేటప్పుడు, అందులోని జిగిబిగిని ప్రదర్శించాలి. సందర్భాన్ని బట్టి కథలోని ఆ భావోద్వేగాన్ని పలికించాలి. ఆ వాక్య సౌందర్యాన్ని చెడగొట్టకుండా అందించాలి. చిన్నయసూరి రచనలో ప్రతి వాక్యమూ రసాభరణమే!

తెలుగు బోధకుడు ప్రతిరోజు చిన్నయసూరి వచనాన్ని నాలుగు లైన్లు చూచి వ్రాస్తే, గద్యం మీద పట్టుబడుతుంది. కాని నేటి తెలుగు బోధకులకు ఈ నీతిచంద్రిక ఒక అరణ్య రోదనంగా అనిపిస్తోంది. కథ ఆకర్షణీయమే గాని భాష ఇబ్బందిగా ఉందని బాధపడుతుంటారు.

సామెతలు, లోకోక్తులు, జాతీయాలు, నుడికారాలు, నానుడి, పలుకుబడి వీటికి సంబంధించిన వివరాలను ఉపాధ్యాయుడు తెలుసుకోవాలి. పాఠాలలో ఇవి వచ్చిన సందర్భాలలో వాటిని విద్యార్థులతో ప్రయోగింపచేయాలి. అంతేకాదు వివిధ సందర్భాలలోని గ్రాంథిక, వ్యావహారిక శైలీ భేదాలను గుర్తించేటట్లు చేయాలి. మళ్ళీ మాండలిక భాషా భేదంతో వచ్చే వ్యావహార శైలిని విడమరచి చెప్పాలి. ఇలా అన్ని శైలుల్ని - అన్ని పదాల్ని వివరించి చెప్పినప్పుడే ఉపాధ్యాయుడు గురువవుతాడు. లేకపోతే అతడు లఘువే అవుతాడు.

**4) వచన కవిత్వం :** వచన కవిత్వమంటే తక్కువ స్థాయికి చెందిన కవిత్వమని లేదా అసలు కవిత్వం కాదని అపోహపడే తెలుగు ఉపాధ్యాయులు కొందరున్నారు. నిజం చెప్పాలంటే వచన కవిత్లో వెలువడుతున్న భావనలు-భావాలు జాతిని ముందుకు నడిపించే దారి దీపాలు.

వచన కవిత్వం అనేక సామాజిక ఉద్యమాల సమాహారం. అనేక ధోరణుల కలయిక. ఛందస్సు లేకుండా స్వేచ్ఛగా వ్యక్తీకరించటానికి కవులు వినియోగించుకొంటున్న ప్రక్రియ. ఇందులో ప్రతీకలు ఉంటాయి. ఇవి ఏకబోధకతతో ఆగేవి కావు. కాబట్టి తెలుగు ఉపాధ్యాయుడు వీటన్నింటి పట్ల సమగ్రమైన అవగాహన కల్గియుండి, భావాన్ని బట్టి-వాక్య నిర్మాణాన్ని బట్టి, ఒక ఊపు - ఒక తూగు స్ఫురించేలా వచన కవితను చదవాలి. వర్తమాన సామాజిక స్థితిగతులకు అన్వయించి బోధించాలి. గట్టిగా చెప్పాలంటే పద్యం కన్నా, వచన కవిత్వాన్ని విశ్లేషించటానికే ఎక్కువ నైపుణ్యం - శ్రద్ధ అవసరం! అంతేకాదు పద్య బోధనతో సాధించలేని సృజనాత్మక నైపుణ్యాన్ని ఆధునిక కవిత్వ బోధనతో విద్యార్థిలో పెంపొందింప చేయవచ్చు.

**5) వ్యాకరణం :** విద్యార్థి దశల స్థాయిని బట్టి వ్యాకరణ బోధన జరగాలి. కొన్ని అక్షరాలను తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు చెప్పే పద్ధతి వింటే ఆశ్చర్యం కలుగుతుంది. "స-కుంటిస; ష-కాలుపట్టి గుంజేష; శ-శనివారంలో శ" అని ఇలా చెప్పటం చూస్తే తెలుగు ఉపాధ్యాయుల ఉచ్చారణాలోపమే దీనికి కారణమనిపిస్తుంది. ఆ ఉచ్చారణా సంస్కారాన్ని విద్యార్థులకు అలవరచేముందు ఉపాధ్యాయుడే అలవరచుకోవాలి.

ఈనాటి వాచకాలలో వ్యావహారిక భాషకు ప్రాధాన్యం ఇస్తూ, రూపకల్పన చేశారు. అయితే ఇందులోను సంధులు, సమాసాలు, వాక్య నిర్మాణ పద్ధతులు ఉన్నాయి. 'వ్యావహారిక భాషావాదం' అంటే అచ్చంగా మాట్లాడినట్లే వ్రాయడమని కాదు. అట్లా వ్రాయాలంటే లిపి చాలదు. మాట్లాడే భాషలోలాగ సంధి చేసి వ్రాస్తే సందిగ్ధత ఏర్పడే ప్రమాదమూ ఉంది. మాట్లాడేటప్పుడు పునరుక్తులుంటాయి. బోలెడంత విస్తరణ ఉంటుంది. అది వ్రాతలో ఉండదు. ఆలోచిస్తే ఏ నాగరిక సమాజంలోనయినా మాట్లాడే భాష, రచనా భాష ఒకేలా ఉండదు. కాని రచనా భాష వ్యావహారిక భాష నుండి స్ఫూర్తిన్ని పొందుతుంది. అంతమాత్రం చేత రచనా భాష, వ్యావహారికానికి దూరం కాదు. కాని ఉన్న దూరం మాత్రం పరిమితమైనది. ఈ విషయాన్ని విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయుడు విడమరచి చెప్పాలి.

క్రియలు-క్రియా విశేషణాలు ఏర్పడుతున్న తీరును, శబ్దపల్లవాలేర్పడే తీరును విద్యార్థుల చేత ఆటలాడించినట్లు- మాటలాడిస్తుంటే అదొక వినోదంగా సాగి, ఉపాధ్యాయునికి - విద్యార్థులకు భాషాసామర్థ్యం పెరుగుతుంది.

**6) సంస్కృత భాషాజ్ఞానం :** సంస్కృత భాషా జ్ఞానం లేని తెలుగు ఉపాధ్యాయుడు పునాది లేని భవనం లాంటివాడు. విద్యార్థులకు పద్య సాహిత్యాన్ని బోధిస్తున్నప్పుడు పర్యాయ పదాలు, వ్యుత్పత్త్యర్థాలు, సమాసాలు మొదలగునవి పరిచయం చేయాలంటే సంస్కృతం తప్పనిసరి! అంతేకాదు శబ్దజాల, వ్యాకరణ, ఛందోలంకారాది సమస్త విషయాలలో సంస్కృతాన్ని అధ్యయనం చేయకుండా తెలుగు పండితుడు సమగ్రమైన పాండిత్యాన్ని సాధించలేడు. తద్వారా తన తెలుగు భాషాబోధనకు సర్వశక్తుల్ని వినియోగించలేడు.

**7) ఉపవాచకం :** ఉపవాచకాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే కథారూపంగా, ఆహ్లాదకరంగా ఉంటాయి. ఆ వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించే సందర్భాలను, మానవీయ మూల్యాలు సంగ్రహించే నేర్పును పెంచే సందర్భాలను బోధకుడు హైలైట్ చేసి చెప్పాలి. అట్లా చేయనప్పుడు ఆ ఉపవాచక బోధన వ్యర్థం!

పై ఏడు అంశాలు తెలుగు ఉపాధ్యాయునికి సప్త సోపానాలు. ఈ సోపానాలను మొదట తాను దాటగలిగే నేర్పును సాధించి, ఆ తర్వాత విద్యార్థులను దాటించగలిగే ప్రయత్నాన్ని తెలుగు ఉపాధ్యాయుడు చేయాలి. అప్పుడే తెలుగు నిలబడుతుంది, వినబడుతుంది, కనబడుతుంది.

## ఆధార గ్రంథం :

వేంకటేశ్వర్లు, బూదాటి (సంపా) : తెలుగు బోధన సమస్యలు - పరిష్కారాలు, హిమకర్ పబ్లికేషన్స్, హైదరాబాద్ (2016).

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు భాషావైభవం

- డా॥ వై. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

## 1. తాళ్ళపాక అన్నమాచార్యులు-సాహితీవ్యక్తిత్వం:

అన్నమయ్య తొలి తెలుగు సంకీర్తనా కర్త. పదకవితా పితామహుడిగా పేరు గాంచాడు. ముప్పై రెండు వేల సంకీర్తనల సృష్టికర్త. భగవంతుడిపై ఇష్టాన్ని, ఇహలోక బంధాలపై అయిష్టాన్ని మనిషిలో పాదుకొల్పడం అన్నమయ్య సంకీర్తనల పరమ ప్రయోజనం. భాషా సాహిత్య సంగీత నిధులు ఆయన కీర్తనలు. పండితులకోసం కాకుండా సామాన్య ప్రజలకోసమే చక్కని భావంతో కీర్తనలను రచించారు. సున్నితంగా పదాల ద్వారా తన భావాన్ని వెల్లడించిన తీరు చాలా గొప్పది. ఊరూరు తిరుగుతూ సంకీర్తనలను పాడటం వల్ల అన్ని ప్రాంతాల భాష, ఆ ప్రాంతాలతో ఆయనకున్న అనుబంధం వ్యక్తమవుతుంది. అన్నమయ్య సంకీర్తనల ఆధారంగా పదిహేనో శతాబ్ది భాషా స్వరూపాన్ని అవగాహన చేసుకోవచ్చు. కనుక సంకీర్తనలలో అన్నమయ్య ప్రయోగించిన తెలుగు భాషావైభవాన్ని విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశం.

## 2. భాష-మాండలికం :

అర్థవంతమైన కొన్ని ధ్వనుల సముదాయం భాష. అది నిత్య ప్రవాహి. ఎన్నో మార్పులకు, చేర్పులకు లోనవుతూ ఉంటుంది. ఇలా మార్పు చెందే భాషలోని అంతర్భాగమే మాండలికం. మాండలికమంటే భాషావైవిధ్యం. విస్తృతంగా ఉండే ప్రదేశంలో కొన్నికొన్ని భాషా వ్యవహార సమూహాలలో కనిపించే వైవిధ్యం. ఈ వైవిధ్యానికి కారణాలు నైసర్గిక పరిస్థితులు, పరభాషా ప్రభావం, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు. వీటివల్ల ఏర్పడే భాషావైవిధ్యం, ధ్వని నిర్మాణం, పదజాలం, వ్యాకరణం, అర్థాలకు సంబంధించి ఉంటుంది.

భాషాసమాజంలో మాండలికాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. సాంస్కృతిక, భాషాచరిత్ర మూలాలను మాండలికాల ద్వారా తెలుసుకోవచ్చు.ఉదా :

1. 'కసవు' అనే పదానికి గడ్డి, చెత్త అని అర్థాలు. ఈ 'కసవు' అనే పదాన్ని గడ్డి అనే అర్థంలో అన్నమయ్య "కసవు కట్టలు వేసికదా గోవులచేత"(2-290) అని పేర్కొనడం ఉంది.
2. 'కొండెగాడు' అంటే చాడీలు చెప్పేవాడని భావం. అందుకని కృష్ణుడిపై యశోదకు చాడీలు చెప్తున్న తీరుని "కొండించేరు యశోదకు గోవిందా"(16-325) అని కీర్తిస్తారు.
3. 'ఓగు' అనే మాండలికం రాయలసీమలో వాడటం బాగా కనబడుతుంది. దుష్టుడు, కీడు, చెడిపోయినవాడు అనే అర్థాలలో ఈ పదాన్ని ఎక్కువగా ప్రయోగిస్తారు. "ఓగుల లంపటమున కోపికెంతైనా గద్దు"(1-467) అన్న కీర్తనలో ప్రయోగించిన తీరు ఆ ప్రాంతాలపై అన్నమయ్యకున్న పట్టును, ప్రజల భాషలో రాయాలన్న తపనను వ్యక్తం చేస్తున్నాయి.

వీటితోపాటు లంజకాడ, ముండమోపి, దుడ్డు, తిక్క, ఓలి, ఎనుము, దండి లాంటి ప్రజల వాడుకలో ఉన్న మాండలిక పదాలెన్నో ప్రయోగించాడు. తెలుగు భాషా సౌందర్యాన్ని మరింత ఇనుమడింపచేశారు. అదే అన్నమయ్యలోని విశేషాంశం.

## 3. వర్ణవిజ్ఞానం :

శబ్దాల ఆకృతిలో మార్పు అనేక కారణాల వల్ల ఏర్పడుతుంది. ఈ మార్పులు చాలా వరకు మనస్తత్వ శాస్త్రానికి సంబంధించినవి. కొన్ని మార్పులు ఎందుకు జరిగాయో ఊహించడం కూడా కష్టం. భాషలో ధ్వని మార్పులు హఠాత్సంభవాలు. కారణం మాట్లాడే వ్యక్తికి గల సౌలభ్యాపేక్ష. అన్నమయ్య ప్రయోగించిన భాష విలక్షణమైంది. ఇది పూర్తిగా గ్రాంథికమూ కాదు, వ్యావహారికమూ కాదు. వ్యావహారిక లక్షణాలతో కూడిన గ్రాంథిక భాష అనో, గ్రాంథిక లక్షణాలతో కూడిన వ్యావహారిక భాష అనో చెప్పవచ్చు. వర్ణాగమాలు, లోపాలు, మహాప్రాణాలు అల్పప్రాణాలు కావడం, వర్ణవ్యత్యయాలు వంటి ధ్వని మార్పులు ఎన్నో అన్నమయ్య భాషలో కనిపిస్తాయి.

### 3.1. వర్ణాగమం :

**3.1.1 'ఉ'కారాగమం :** కల్హారము > కలుహారము (6-50)
చిన్మయ > చినుమయ (15-290)
పర్వతము > పరువతము (1-19)

పై ఉదాహరణలలో ఉకారం పదమధ్యంలో రావడం విశేషం.

**3.1.2 'ఇ'కారాగమం :** దర్శనము > దరిశనము (3-395)
సూర్యుడు > సూరియుడు (4-239)
అంతర్యామి > అంతరియామి (4-448)

ఈ శబ్దాల్లో దర్శనము అనే పదానికి ఉకారాగమం, ఇకారాగమం రెండూ రావడం గమనించవచ్చు.

### 3.2.వర్ణలోపం:

**3.2.1. 'ర'లోపం :** ప్రాయము > పాయము (21-66)
కూర్చుండు > కూచుండు (29-127)

పదాదిలో 'ర'కార లోపం 'ప్రాయము'లో, పదమధ్యంలో 'కూచుండు'లో కనిపిస్తుంది. చాలా చోట్ల 'కూచుండు' అనే పదమే ఎక్కువగా ప్రయోగించడం గమనార్హం.

**3.2.2. 'వ'లోపం :** స్వర్గము > సర్గము (9-217)
దీపావళి > దీపాళి (11-184)

**3.3. వర్ణవ్యత్యయం :**

అ > ఎ - అడిక > అడికె (1-250)
దూతిక > దూతికె (8-92)
గరిమ > గరిమె (1-364)

అ > ఒ - మగఁడు > మొఁగడు (23-511)
వలపక్షం > వొలపక్షం (26-418)

ఉ > ఒ - పుస్తకం > పొస్తకం (26-355)
తులసమ్మ > తొళసమ్మ (21-130)

ఎ > అ - నెమలి > నమలి (5-254)
రెండు > రండు (8-26)

ఎ > య - ఎవ్వతె > యవ్వతె (29-22)

ఔ > అ - కౌఁగిలి > కాఁగిలి (5-40)

క > గ - దేవకన్య > దేవగన్య (9-56)

చ > స - చక్కెర > సక్కెర (18-207)

ట > డ - అటుకులు > అడుకులు (14-455)

ద > జ - జూదమాడు > జూజమాడు (26-255)

న > ణ - పద్మిని > పద్మిణి (5-123)
హస్తిని > హస్తిణి (5-123)
మోహిని > మోహిణి (5-123)

ర > ల - అంగనలార > అంగనలాల (1-454)
జ్ఞానులార > జ్ఞానులాల (2-26)

శ > స - శిశువు > సిసువు (4-179)
శోభనము > సోబనము

**3.4. సంయుక్తాక్షరాలు ద్విత్వాక్షరాలుగా మారడం:**

ఉదా : భక్తి - బత్తి

**3.5. అరసున్న ప్రయోగం :** ఇది చాలా ఎక్కువగా ఉంది. అవసరం లేని చోట కూడా విరివిగా వాడటం ఒక్క అన్నమయ్యకే సాధ్యం.

ఉదా : కాఁగిట మాఁట కట్టఁగడ ఏఁటిజాణతనం

**3.6.దీర్ఘం మీద పూర్ణానుస్వారం :** బాలవ్యాకర్త 'దీర్ఘం మీద సాధ్యపూర్ణం లేదు.' అని సూత్రీకరిస్తే అన్నమయ్య దీనికి భిన్నంగా పూర్ణానుస్వారాన్ని ప్రయోగించారు.

ఉదా : ఏంటి మాటలు (3-223)

గాంటపు వంటి రూపాలు కనిపిస్తున్నాయి.

**4. క్రియలు :** భాషాభాగాలన్నింటిలో క్రియలు ప్రధానమైనవి. క్రియను సరిగా ఉపయోగించినప్పుడే భాషలోని ప్రజ్ఞా పాటవం వెల్లడవుతుంది. సామాన్య జన వ్యవహారంలో కాల, పురుష, వచన, లింగ బోధకతను సూచిస్తూ పనిని తెలిపే పదమే క్రియ.

1. 'పొడవెక్కు' (1-254) - ఈ క్రియలో 'పొడవు' అనే నామ విశేషణ ప్రాతిపదికకు 'ఎక్కు' అనే ప్రత్యయం చేరి 'పొడవెక్కు' అనే రూపం ఏర్పడుతుంది.
2. 'ఏఁతెంచు' (1-444) - ఇందులో 'ఏగు' అనే ధాతువుకు 'తెంచు' అనే ప్రత్యయం చేరగా 'ఏఁతెంచు' అనే క్రియగా రూపాంతరం చెందింది.

రెండు వేర్వేరు అర్థాలు కల్గిన పదాలు కలిసి విలక్షణార్థాన్నిచ్చే ఇలాంటి క్రియాపదాలెన్నో అన్నమయ్య సంకీర్తనల్లో తారసపడతాయి.

**5.సంధి :** "పూర్వపరస్వరంబులకు పరస్వరంబేకాదేశమగుట సంధి." సంధికార్యాలు సలక్షణంగా కీర్తనలలో ఉన్నా అక్కడక్కడ విలక్షణమైన సంధి కార్యాలు కూడా గోచరిస్తాయి.

1. ఆపెలిగితే < ఆపె + అలిగితే (22-274)

ఇదొక విచిత్రమైన సంధి. ఎందుకంటే పూర్వపరస్వరంబులకు పరస్వరం ఏకాదేశమైనపుడు "ఆపలిగితే" అని కావాలి కాని భిన్నంగా సంధి జరగడం ఇక్కడ ఉంది.

2. 'ను' గాగమానికి బదులు 'య'డాగమం రావడం.

ఉదా : సుద్దులు యడగవలెనా (22-494)
చలము యెందాకా (25-19)

3. 'య'డాగమానికి బదులు 'వ' ఆగమం రావడం.

ఉదా : మరచి వూరకుండితే (24-189)

ఇలా వింత సంధికార్యాలు వివిధ రకాలుగా అన్నమాచార్య సంకీర్తనల్లో కనిపిస్తాయి. దీనికి కారణం తనది ప్రజల భాష కావడమే.

**6. సమాసాలు :** 'సమర్థంబులగు పదంబులేకపదంబగుట సమాసంబు." అని నిర్వచనం. పూర్వోత్తర పదాలు పరస్పరం అన్వయించే సామర్థ్యం. ఈ సామర్థ్యం రెండు విధాలుగా ఉంటుంది. అందులో ఒకటి- వ్యపేక్షాసామర్థ్యం, రెండు- ఏకార్థీభావ సామర్థ్యం. ఏకార్థీభావ సామర్థ్యం ఉన్న పదాలే పరస్పరం సమసిస్తాయి. అన్నమయ్య సమాసాల్లో ఎంతో విలక్షణత చోటుచేసుకుంది. ఆయన ప్రయోగించిన కొన్ని సమాసాలు సాహిత్యంలో ఎక్కడా కనిపించకపోవడం విశేషం. సామర్థ్యంలేని పదాలు కూడా పూర్వోత్తర పదాల మధ్యలోకి చేరడం అన్నమయ్య సమాసాల్లో కనిపించే ఒక ప్రధాన లక్షణం.ఉదా:

**1. సామర్థ్యంలేని పదాలు పూర్వోత్తర పదాల మధ్య చేరడం:**

'ఎవ్వతో మేని సొమ్ములు' (26-377). ఇది మూడు పదాల సముదాయం. ఇందులో 'ఎవ్వతె మేని సొమ్ములు' అనేది ఎవ్వతె యొక్క మేని సొమ్ములు అనే విగ్రహవాక్యం ప్రకారం షష్ఠీ తత్పురుష సమాసం. ఓ అనేది సందేహార్థంలో చివర

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



చేరాల్సిన పదం. అప్పుడు ఎవ్వతె మేని సొమ్ములో అని ప్రయోగించాల్సి ఉంటుంది. సమాసం చివర చేరాల్సిన సందేహార్థక పదాన్ని పూర్వోత్తర పదాల మధ్యలో చేర్చడం ఇందులోని వింత. ఇలాంటి విలక్షణ సమాసాలెన్నో అన్నమయ్య సంకీర్తనల్లో గోచరిస్తాయి.

## 2.'నీ', 'నా' అనే శబ్దాలు సమాసం మధ్యలో చేరడం :

పైన చెప్పుకున్నట్లుగా సమాసం మధ్యలో చేరినట్లుగానే సమాసం మొదట్లో ఉండాల్సిన 'నీ', 'నా' అనే శబ్దాలు సమాసం మధ్యలో చేరడం కూడా కనిపిస్తుంది. ఇలాంటి సమాసాలు అన్నమయ్య కీర్తనల్లో కొల్లలుగా ఉన్నాయి.

ఉదా : నునుపు నీ మాటలు (27-360)
దోమటి నా చూపులు (24-14)

ఈ రెండు ఉదాహరణల్లో రెండు సమాసాలున్నాయి. ఒకటి అప్రధానం. రెండోది ప్రధానం. 'నీ నునుపు మాటలు', 'నా దోమటి చూపులు' అనే రెండు సమాసాలలోని 'నునుపు మాట', 'దోమటి చూపులు' అనే కర్మధారయాలు అప్రధాన సమాసాలు. నీ నునుపు మాట - నీ యొక్క నునుపు మాటలు, నీ దోమటి చూపులు - నీ యొక్క దోమటి చూపులు అనేవి షష్ఠీ తత్పురుష ప్రధాన సమాసాలు.

ఇలా వ్యాకరణానికి లొంగని విలక్షణమైన సమాసాలను వాడటం ఒక్క అన్నమయ్యకే సాధ్యం.

**7. విభక్తులు** : ఒక విభక్తికి మరొక విభక్తి వచ్చిన రూపాలెన్నో అన్నమయ్య పదాలలో కనిపిస్తున్నాయి.

**1. ప్రథమకు బదులుగా షష్ఠి**

ఉదా : 'కూరిమితో మీకు మీకె కొలిచేవారా' (2-16)

కూరిమితో మీకు మీరే కొలిచేవారా అని రావాల్సిన ప్రథమ విభక్తికి బదులుగా షష్ఠి రావడం గమనించవచ్చు.

**2. ద్వితీయకు బదులు తృతీయ**

ఉదా: చేసుకోవయ్య పెండ్లి చెలితోను

చేసుకోవయ్య పెండ్లి చెలిని అని ద్వితీయ ప్రయోగిస్తే సరిపోతుంది. కాని ద్వితీయకు బదులుగా తృతీయను ప్రయోగించారు.

**8.పలుకుబళ్ళు** : భాష సజీవమైంది. నిరంతరం ప్రతి భాషలోనూ పదజాలం చేరుతూనే ఉంటుంది. భాషా సౌందర్యం పలుకుబళ్ళతో ఇనుమడిస్తుంది. భాషకు పరిపుష్టిని, అందచందాలను అందిస్తాయి పలుకుబళ్ళు. ఇవి శైలిలో ఒక భాగం. ప్రజల భాష అన్నమయ్య భాష అందువల్లనే అన్నమయ్య భాషలో దేశీయ పలుకుబళ్ళు కొల్లలుగా ఉన్నాయి. ఎందరో కవులు తమ రచనల్లో ఆయా ప్రాంతాల్లో ప్రస్ఫుటంగా వినిపించే వాటినే ప్రయోగిస్తున్నారు. అన్నమయ్య సాహిత్యంలోనూ అందమైన పలుకుబళ్ళు ఎన్నో నిక్షిప్తమై ప్రజా సముదాయంతో ఆయనకు గల సన్నిహిత సంబంధాన్ని వ్యక్తీకరించడమే కాదు అన్నమయ్య తెలుగుదనాన్ని స్పష్టీకరిస్తున్నాయి. అందులో-

1. 'కాసుకు కొరగాని'- 'కాసు' అంటే రాగి నాణెము. దేనికీ పనికి రాని వాటిని గురించి చెప్పేటప్పుడు ఈ జాతీయాన్ని వాడుతారు.
2. 'మగడు లేని సింగారములు'- భార్యాభర్తలిద్దరిలో ఏ ఒక్కరు లేకపోయినా బాధాకరమే. ఆ ఉద్దేశంతో భర్త లేనప్పుడు భార్య అలంకరణ వృధా అనే భావనను వ్యక్తం చేస్తుంది.
3. 'సంతమాటలు'- క్రమం లేకుండా ఇష్టానుసారం మాట్లాడే అడ్డదిడ్డమైన మాటలను 'సంతమాటలు' అనే జాతీయంలో ప్రయోగిస్తారు. ఇలాంటి పలుకుబళ్ళెన్నో పదసాహిత్యంలో కొత్త అందాలను సంతరించుకున్నాయి.

**9. సామెతలు** : సామెత జాతి యొక్క సూక్తి. దేశ చరిత్రకూ, జాతి సంస్కృతికీ మానవ నిజస్వరూపానికీ అద్దం పడుతుంది సామెత. పలుకుబళ్లలాగే సామెతలు సైతం అన్నమయ్యకున్న లోకానుభవాన్ని ప్రజలతో తన సన్నిహిత సంబంధాన్ని స్పష్టం చేస్తాయి.

1.'గోరుచుట్టుపై రోకటిపోటు' (12-238)

కష్టాలు ఒకదానివెంట ఒకటి వచ్చినప్పుడు ఈ సామెతను ప్రయోగిస్తారు.

2.'చింతలేని అంబలి ఒక్క చారెడు చాలు'(1-114)

ఎంత సంపద ఉన్నా మనసును పీడించే అశాంతి కూడా ఉంటుంది. మానసిక ప్రశాంతత లేక అల్లాడే ప్రజలను ఉద్దేశించి అన్నమయ్య ఎలాంటి చింత లేకుండా గంజి తాగినా మంచిదేనంటున్నాడు.

3.'ఆపరాని కోరికలు అంగడి పెట్టగరాదు' (28-108)

'అంగడి' అనే పదం పలుకుబడిగా ఉపయోగించాడు. కోరికలను బహిరంగంగా ప్రదర్శించనవసరం లేదన్నది అన్నమయ్య భావన ఆ ఉద్దేశ్యంతోనే అంగడిని ప్రయోగించాడు. ఇలా మానవ జీవితాన్ని ప్రతిబింబించే సామెతలెన్నింటినో అన్నమయ్య ప్రయోగించి సహజకవిగా వాసికెక్కాడు.

**10.ధ్వన్యనుకరణ శబ్దాలు** : ధ్వన్యనుకరణ శబ్దాలను సాహిత్యంలో ప్రయోగించి సంగీత ప్రధానమైన సంకీర్తనకే ఎంతో సొబగును చేకూర్చాడు అన్నమయ్య. ఈ ధ్వన్యనుకరణ శబ్దాలను సమర్థవంతంగా ఉపయోగించడం తెలుగుభాష, నుడికారాలపై ఉన్న పట్టుకు నిదర్శనం.

ఉదా : 1. 'ముసి ముసి' (చిన్ని నవ్వులు)
ముసి ముసి నగవుల మోవి మీది కెంపులలో
కసిగాటు సేతలనే కప్పెనతడు (12-170)

2. 'బిరబిర' (తొందరను సూచించేది)
వీదుల వీదుల వెసదురగముపై
భేదిల బల్లెము బిరబిర దిప్పుచు (2-93)

3. జలజల (అలవోకగా)
కులుకక నడవవో కొమ్మలాలా
జలజలి రాలీని జాజులు మాయమ్మకు (12-73)

4. చురచుర (తీక్షణంగా)
కరతల యోగిని కర్మముతివంటునా
చురచుర జడునైతే జట్టుకొనుగాక (12-85)

ఇలాంటి ధ్వన్యనుకరణ శబ్దాలెన్నో అలవోకగా అన్నమయ్య ప్రయోగించాడు. ఇవి భాష సజీవత్వానికి నిదర్శనంగా నిలుస్తాయి.

**11. ముగింపు** : ప్రక్రియలో, భాషలో, భావంలో వినూత్నత్వాన్ని ప్రవేశపెట్టినాడు అన్నమయ్య. తెలుగు పదాలతో వేలకొద్ది కీర్తనలు రచించి భాష పరంగా తెలుగు భాషకు పట్టంకట్టిన మహానుభావుడు. గ్రామీణ ప్రజలు వాడుకొనే అందమైన పదాలెన్నింటినో మనకందించిన భాషావేత్త. వెలికితీస్తే భాషలోని ప్రతి ప్రక్రియా ఒక పరిశోధనే. అదొక మహోన్నతమైన గ్రంథంగా వెలుగొందుతుంది. ప్రతి కీర్తనలోనూ ఆ భాషావైభవం తొణికిసలాడుతూ ఉంది. ఈయన సంకీర్తనా రాశినంతటినీ పరిశీలించినప్పుడు ఎన్నెన్నో భాషా లక్షణాలు మనకు కనిపిస్తాయి. స్థాలీపులాక న్యాయంగా కొన్నిటిని మాత్రం ఈ వ్యాసంలో పరిశీలించడం జరిగింది. చివరిగా ఆనందమూర్తిగారి గ్రంథపీఠికలో శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణగారి పలుకులతో ముగిస్తాను.

"ఆ సంకీర్తనల సాహిత్యం, ప్రతిఫలించిన పురాణము, వేదాంతము, సంప్రదాయము, చరిత్ర, భాష, వ్యాకరణము, నుడికారము, ఛందస్సు, గేయలక్షణాలు, కావ్యకళ ఒక్కొక్కటి ఒక్కొక్క సముద్రం వంటి విశేషాలు. వాటి గొడవ ఒక వ్యక్తి శక్తికి మించిన బరువు". అది అందరికీ తెలిసిన సత్యం.

❀❀❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆధునిక కవిత్వ సొబగులు

– **డా॥ డి. యువశ్రీ,** సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

సాహిత్య చరిత్రకారులు రచనా సౌలభ్యం కోసం, పఠనా సౌలభ్యం కోసం ఆంధ్రసాహిత్య చరిత్రను యుగాలుగా విభజించారు. ఈయుగ విభజన అనేక విధాలుగా సాగింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రసాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యమని, ఆధునిక సాహిత్యమని విమర్శకులు విభజించారు. క్షీణయుగం దాకా అంటే క్రీ.శ.1850 దాకా వచ్చిన సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యమన్నారు. ఆ తర్వాత వచ్చిన సాహిత్యమంతటినీ ఆధునిక సాహిత్యమని వ్యవహరించారు. ఆధునిక కాలంలో వెలసినందువల్ల ఆ సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యమని వ్యవహరించి వుండవచ్చు. వస్తువు ఆధునిక కాలానికి చెందివుండడము, దాని రూపం కూడా ఆధునిక కాలానికి చెంది వుండడం దీని ప్రత్యేకత. ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియలున్నాయి. వాటిలో పేర్కోదగ్గవి పద్యము, వచన కవిత, గేయకవిత, గేయము, కథ, నవల, వ్యాసము, విమర్శ, నాటకము, నాటిక మొదలైనవి.

ఆధునిక సాహిత్యంలో చోటు చేసుకున్న కవిత్వం సమకాలీన సమాజాన్ని కళ్ళకు కట్టేట్టు చిత్రిస్తుంది. సమస్యలను ప్రస్తావిస్తుంది. పరిష్కారాలను సూచిస్తుంది. ఆధునిక కవులు కొందరు వెలయించిన కవితలను గమనిస్తే ఆధునిక కవిత్వపు తీరు కొంతైనా అర్థం కాగలదు.

ఆంగ్లేయులు శీతల ప్రాంతవాసులు. భారతదేశం ఉష్ణప్రదేశం. కాబట్టి వారు వేసవికాలంలో నీలగిరి మొదలైన చలువ ప్రదేశాలకు వెళ్ళి వేసవి అయిపోయాక తిరిగి వచ్చేవారు. భారతీయులు కూడా కొందరు శ్వేతజాతీయులను అనుసరించేవారు. ఆ విధంగానే విజయనగర సంస్థానోద్యోగి శ్రీచక్రవర్తుల తాతాచార్యులు, మహాకవి గురజాడ అప్పారావు ఒక వేసవిలో నీలగిరిలో వుండడం తటస్థించింది. ఆచార్యుల వారు తనమీద ఒక గేయకవిత చెప్పమని రావుగారిని కోరారట. దానికి సమాధానంగా చెప్పబడిన కవితే "భొట్టు". ఆనాటి బ్రాహ్మణులు ముఖ్యంగా ఉద్యోగులు తెల్లవారిని అనుకరించేందుకు చేసే ప్రయత్నం ఈ కవితలో కనిపిస్తుంది. వారికోటు, కనిపించీ కనిపించకుండా పెట్టుకొనే బొట్టు, దర్పంకోసం ధరించే చేతికర్ర మొదలైనవి మనోదృగ్గోచరం అయ్యేలా రాయబడిన కవిత ఇది. దీనిలో అడుగడుగునా అంత్యప్రాస కనిపిస్తుంది.

"నూగు మీసపు కట్టు
కానరాని బొట్టు
నోటాన సిగ రెట్టు
కోటు వింత కుట్టు
చేకఱ్ఱ జిలుగు వెండికట్టు
నీలగిరి కొలనుగట్టు
పై విహరించు వైష్ణవభొట్టు"

(గురజాడ అప్పారావు - "ముత్యాలసరాలు"లోని "భొట్టు" కవిత - పేజి: 50)

దేవులపల్లి కృష్ణశాస్త్రి భావకవి. ప్రకృతి ప్రేమికుడు. ఓసారి బెజవాడ నుండి బళ్లారి వెళ్తుండగా రైలు నడకలోని సమాన లయకు స్పందిస్తూ... చుట్టూ ఉన్న నల్లమల అడవుల సోయగాలు చూడగానే ఆయన ఊహలో ఒక గేయ కవిత మొగ్గ తొడిగింది. "ఆకులో ఆకునై" అంటూ పలవరించారు. ఇదే ఆ గేయ కవిత

"ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈయడవి దాగిపోనా
ఎట్లైన
నిచటనే యాగిపోనా?
గల గలని వీచు చిరుగాలిలో కెరటమై
జల జలని పారు సెలపాటలో తేటనై
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన
నిచటనే యాగిపోనా?
పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన
నిచటనే యాగిపోనా?
తరు లెక్కి యల నీలగిరి నెక్కి మెల మెల్ల
చద లెక్కి జలదంపు నీలంపు నిగ్గునై
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన
నిచటనే యాగిపోనా?
ఆకలా దాహమా చింతలా వంతలా
ఈ కరణి వెర్రినై యేకతమ తిరుగాడ
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన
నిచటనే యాగిపోనా"?

(దేవులపల్లి కృష్ణశాస్త్రి - "కృష్ణపక్షము"లోని "ఆకులో ఆకునై" గేయకవిత-పేజి:1)

ప్రాచీన కవులకు వస్తువు పరిమితంగానే లభించేది. అయితే ఆధునిక కవులకు విశాల దృక్పథం కాబట్టి వారి వస్తువు కూడా విశాలంగానే వుండేది. చూపునుబట్టి రూపు అన్నట్టు ప్రపంచంలోని ఏదైనా కవిత్వానికి పనికొస్తుంది. అయితే దాన్ని కవిత్వంగా మలచుకొనే నేర్పేకావలసింది అంటాడు శ్రీశ్రీ. ఇది ఆయన విశాల దృక్పథాన్ని ఆవిష్కరిస్తుంది. సమత్వ ప్రతిపాదనను స్పష్టీకరిస్తుంది. ఈ కవితలో అడుగడుగునా అంత్యప్రాస చోటుచేసుకోవడం విశేషం.

"కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా-
హీనంగా చూడకు దేన్నీ!
కవితామయమేనోయ్ అన్నీ!
రొట్టెముక్కా, అరటితొక్కా, బల్లచెక్కా-
నీ వేపే చూస్తూ ఉంటాయ్!
తమలోతు కనుక్కోమంటాయ్!
తలుపుగొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపుకళ్ళెం-
కాదేదీ కవిత కనర్హం!
ఔనౌను శిల్ప మనర్ఘం!
ఉండాలోయ్ కవితావేశం!
కానీవోయ్ రస నిర్దేశం!
దొరకదటోయ్ శోభాలేశం!
కళ్ళంటూ ఉంటే చూసి,
వాక్కుంటే వ్రాసీ!
ప్రపంచమొక పద్మవ్యూహం!
కవిత్వమొక తీరని దాహం!"

(శ్రీశ్రీ - "మహాప్రస్థానం"లోని "ఋక్కులు" కవిత - పేజి:29)

భారతదేశం గొప్పదే. దాని చరిత్ర విశిష్టమైందే. దాని గొప్పతనాన్నే తలచుకొంటూ కాలం గడపడం వ్యర్థం. సమకాలీన వాస్తవాన్ని కూడా స్మరించాలి. ఆ దుస్థితి మారేందుకు ప్రతివారూ కృషి చేయాలి. ఈ నేపథ్యంలో రూపుదిద్దుకున్న తిలక్ కవితే "ఆర్తగీతం". దీనిలో బాలగంగాధర తిలక్ తాను దర్శించిన దయనీయ దృశ్యాలను మనముందుంచాడు. ఇది ఏ సంస్కృతికి ప్రతిఫలమని నిలదీశాడు. ఈ కవిత అంతటా బాలగంగాధర తిలక్ ఆవేదన గోచరించడం గమనించవచ్చు.

"ఈ రోజు నేను చూసినదేమి? విధి యిన్ని కత్తులను దూసినదేమి
జాగృతి హేతి వాదరల రుధిరమేమి?
నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు
కింద మరణించిన ముసలివాణ్ణి;
నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెనకింద
నిండు చూలాలు
ప్రసవించి మూర్ఛిలిన దృశ్యాన్ని!
నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక
ఏడుస్తూ ఏడుస్తూ
ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికికాల్వ
పక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి;
నేను చూశాను నిజంగా పిల్లలకు గంజికాసిపోసి
తాను నిరాహారుడై
రుద్ధబాష్పాకులిత నయనుడై ఆఫీసుకు వచ్చిన వృద్ధుని ప్యూన్ వీరన్నని;
నేను చూశాను నిజంగా క్షయగ్రస్త భార్య యిక బతకదని
డాక్టరు చెప్పినపుడు
ప్రచండ వాతూల హత నీపశాఖవలె గజగజ
వణికిపోయిన ఆరిక్త అశక్త గుమాస్తాని
అయిదారుగురు పిల్లలు గలవాణ్ణి;
నేను చూశాను నిజంగా మూర్తీభవత్ దైన్యాన్ని, హైన్యాన్ని,
క్షుభితాశ్రు కల్లోలనీరధుల్ని, గచ్ఛత్ శవాకారవికారుల్ని
ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి ? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి?
ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి?"

(దేవరకొండ బాలగంగాధర తిలక్ - "అమృతం కురిసినరాత్రి"లోని "ఆర్తగీతం" కవిత- పేజి: 43-44)

పండుగల పరమార్థం గంగలో కలిసిపోయింది. ఎందుకు ఏపండుగను చేసుకొంటున్నామో తెలియని స్థితి. పైగా పండుగల్లో చోటుచేసుకొనే అవాంఛనీయ సంఘటనలు గుండెను కుదిపేస్తాయి. ఈ స్థితి పోవాలి. అజ్ఞానం అంతరించాలి. విజ్ఞానం వికశించాలి. ప్రతివారూ సంతోషంగా, సంబరంగా పండుగ జరుపుకొనే స్థితి రావాలి. అప్పుడే అది నిజమైన పండుగవుతుంది. ఈ ఆలోచనతో వెలువడినదే జక్కంపూడి మునిరత్నం గారు రచించిన 'దీపావళి' కవిత. దీపావళికి చెందిన అంశాలను తీసుకొని ప్రస్తుత హృదయ విదారక దృశ్యాలకు జతచేసి రాశారు.

"దీపావళి వచ్చిందని
తిమిరమెల్ల విచ్చిందని
భ్రమపడతావానేస్తం
భలేవెర్రివాడవయా!
ఈ చీకటి పోతుందా?
ఇలకు వెలుగు వస్తుందా?
ఎప్పుడొస్తుందా రోజు?
ఏమోలే ఎదురుచూడు.
అజ్ఞానం
నిరక్షరాస్యత
అమావాస్య అంధకారం
ధరల తారాజువ్వలు
దరిద్రాంగన తైతక్కలు
ఉర్విలోని పేదవాళ్ళ

ఉత్సాహపు మతాబులు

(ఆచార్య జక్కంపూడి మునిరత్నం- "తలపుల పందిరి" లోని "దీపావళి" కవిత-పేజి:3-4)

ఇటీవల సూక్ష్మంలో మోక్షం అన్నట్టు సూక్ష్మ కవితలు వస్తున్నాయి. ఇవికూడా మినీ కవితల్లాంటివే మరి. కవితలు రాయ డంలో సిద్ధహస్తులైన ఆచార్య ఎస్.జి.డి. చంద్రశేఖర్ గారు వేరు వేరు అంశాలను దృష్టిలో పెట్టుకొని కవితలు రాశారు. వాటిలో ప్రకృతి సౌందర్యమూ వుంది, హృదయ రంజికతా కనిపిస్తుంది. కలంలో సిరా సిరాలో అంతర్లీనమైన అక్షరాలు వున్నట్టే తన కవిత్వా క్షరాల్లో తనను కూడా చూడవచ్చని దానికి కావలసింది తగిన చూపే అని ఎస్.జి.డి. గారు తెలియజేశారు.

"కలంలో సిరా
సిరాలో అక్షరాలు
అక్షరాల్లో నేను"

(ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్-సూక్ష్మ కవితలు - పేజి: 2)

సూర్యుడు అస్తమించేటప్పుడు ఆకాశం రాగ రంజితమవు తుంది. ఆ దృశ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సూర్యాస్తమయాన్ని ఆత్మహత్యగా అభివర్ణించడం అభినందనీయం. ఇదే ఎస్.జి.డి. గారి కవిత

"సూర్యుడు పడమటి కొండెక్కి
ఆత్మహత్య చేసుకొంటూ ఉన్నాడు
ఆకాశమంతా నెత్తురు"

(ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్ - సూక్ష్మ కవితలు-పేజి: 3)

నీటిలో కనిపించే చంద్రబింబాన్ని కొలనులో జలకమాడే కోమలిగా దర్శించడం కొత్త ఊహ

"చందమామ కొలనులో
స్నానం చేస్తూ ఉంది
నీళ్ళంటే ఎవరికి ఇష్టం ఉండదు మరి"

(ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్-సూక్ష్మ కవితలు-పేజి: 13)

హృదయాన్ని లేపనంగా చేసి పాదాలకు పుయ్యడం ప్రేమగాఢతకు సరైన కొలబద్దే.

"నా హృదయాలేపనాన్ని
నీ పాదాలకు పూశా
నీవు పారాణి లేదనప్పుడు"

(ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్-సూక్ష్మ కవితలు-పేజి: 13)

ఇలా ఎందరో ఆధునిక కవులు తమ కవిత్వం ద్వారా కొత్త భావాలను ఆవిష్కరించారు. కొత్తగా ఆలోచింపజేశారు. ఈ కవితల సొబగులు ఆలోచింపజేసేవిగా మాత్రమేగాక ఆనం దింపజేసేవిగా కూడా వున్నాయి. ఈ కవితల్ని చదివి ఆనందా నుభూతిని అందుకోవడం మనందరి కర్తవ్యం.

❀❀❀

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# జాషువా కవితా శిల్పం - భావుకత

- డా॥ బూసి వెంకటస్వామి, ఆంధ్రోపన్యాసకులు, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు జిల్లా.

ప్రతిభగల కవి రసభావపూరితుడై ఉన్నతాశయములపై దృష్టి సారించి బహుముఖమైన స్వానుభూతులను సర్వజనానుభవములుగా మలచాలి. తన 'భావుకతా రసము'ను కవితా శిల్పముతో మనోహరముగ అనుసంధించిన జాషువా వంటి కవి, ఆధునికాంధ్ర సాహితీ చరిత్రలో మరియొకరు లేరు అంటే అతిశయోక్తి కాదు. తన స్వభాకోక్తిని ఎప్పటికప్పుడు సరికొత్తగా, కవితాశిల్పంలోని భావుకతను ఘురకత్తిలా, అనుకున్న అభిప్రాయాన్ని పదునుగా ఝుళిపించేంత స్వచ్ఛంద సాహిత్యం 'జాషువా' గారి సొంతం.

జాషువా గొప్ప భావకుడేకాదు. అసమాన కల్పనాశక్తి అనన్యసామాన్య సృజనాశక్తి కలవాడు. అసామాన్య ప్రతిభావ్యుత్పత్తులు కలిగినవాడు. వర్ణిత వస్తువు లేక ఇతివృత్తం వాస్తవ జగత్తునకు సంబంధించిదైనా, కాల్పనికమైనదైనా, చదవగానే పాఠకుల మనోనేత్రాలపై రేఖా చిత్రం కనిపించేటట్లు చెప్పగల సమర్థుడు. అలా చెప్పగటగడం వల్లనే పాఠకుల హృదయాలలోని భావాలు స్పందిస్తాయి. దానినే 'సరస్ఫోరకం' అంటారని లాక్షణికులు తెల్పారు. అదే అతని "కవితాశిల్పం!" జాషువా కవి స్వయంగా మన ఎదురుగా కూర్చొని, మనతో చెబుతున్న రీతిగా, చదివిన ప్రతి పాఠకుడికి ఈ 'భావుకత' ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. అనంత మైన ఆయన సాహిత్యాంబుధిలో అనర్ఘరత్నాలెన్నో..! ఎన్నెన్నో...!! అందులో మచ్చుకు కొన్ని భావకతా పద్యరత్నాలు...

'ఫిరదౌసి' రచనలోని ఘజనీ మొహమ్మదు భారతదేశంపై సుమారు పద్దెనిమిది సార్లు దండెత్తి మన దేవాలయాలను, దేశంలో ఇతర సంపదలను దోచుకుపోయినప్పుడు దేశంలో పలు దేవాలయాలకు పట్టిన దుర్గతిని, ఆనాటి హిందూ మతతత్త్వంపై కాలుదువ్వి కాలరాయాలనే అతని దురంతాలను తన కరుణ రస గంభీర భావుకతతో ఈ క్రింది పద్యంలో ఉటంకించిన వైనం ఎంతో హృదయ విదారకం అని చెప్పక తప్పదు.

"భారత క్షోణిగల్గు దేవస్థలములు
చెదరి గజనీ పురాన మసీదులయ్యె
నిన్నటి మసీదులే రూపమెత్తగలవో
కాలమెఱుగును ధోరణీ గర్భమెఱుగు"

పై పద్యంలోని సందర్భోచితమైన భావమెంతో గంభీరమైనది. ఇందులో మతం పేరుతో భారతేదేశంలో అనాది నుండి ఈనాటి వరకు జరిగే హింసాత్మక చర్యలు ప్రతి పాఠకుడి కళ్ళ ముందు ఆవిష్కృతమౌతాయి. అది రసోదంచితమైన వచన సదృశ్యమై, సరసన సుబోధకంగా ఉండి, చదివిన ప్రతి ఒక్కరి మనసులు బరువవక మానవు.

ఆయన వ్రాసిన క్రీస్తు చరిత్రలో 'ఏసుక్రీస్తు' ప్రభువును యూదు సైనికులు నానాహింసలు పెట్టి, సిలువ వేసే ఘట్టాన్ని జాషువా కవి వర్ణించిన రీతిని గమనిస్తే కులమత బేధభావాలు లేని ప్రతి పాఠకుడు హృదయావేదనకు గురవక మానడు. మానవాభ్యుదయానికి పరిశ్రమించే మహాపురుషుల బలిదానాన్ని కోరే ఈ నిరంకుశ లోకంలో 'పారమార్ధ వంచకులు, లోభ స్వాంతులు, కొంగభక్తులు, కళా ద్రోహులు' మొదలైనవారు విచ్చల విడిగా చెలరేగడం ఇందులో వర్ణించబడ్డాయి. బహుశా జాషువా బాల్యంలో తను పడిన వేదనంతా 'క్రీస్తు చరిత్ర' రచనతో 'భావభారాన్ని' దించుకున్నారేమో! అన్పించేలా రచించారు. ఈ క్రింద ఉన్న పద్యం జాషువానే క్రీస్తు పాత్రగా పరకాయ ప్రవేశం చేశారా అన్పించక మానదు.

"కరకు మేకుల కుచ్చుగల కశలగొని మేన
క్రొన్నెత్తు రెగజిమ్మ కొట్టి కొట్టి
కనుల గంతలు గట్టి గదిమి వీపున గ్రుద్ది
చెప్పు మీ పేరంచు చీరి చీరి
ఉమ్మి మోమున వైచి దుమ్మునెత్తిన జల్లి
పలుకవేమని చెవుల్ నులిమి నులిమి

తిట్టగల తిట్లన్ని తిట్టి తిట్టి
పెట్టగల హింసలన్నియు బెట్టి పెట్టి
క్రక్కగల అక్కసంతయు గ్రక్కిగ్రక్కి
విశ్రమించిరి యూదులోపికలు జారి!!

పై పద్యంలో యూదులు క్రీస్తు ప్రభువును పెట్టిన బాధ కళ్ళకు కట్టినట్లుగా చెప్పాడు. ప్రపంచంలో ఏ సమాజంలోనైనా సమాజానికి హితవు చెప్పేవారికీ దుర్గతి పట్టడం సర్వసాధారణమే! కానీ, ఇతర మతాలలోని లేదా ఇతర సమాజాలలోను ప్రభోధకులకెవరికీ లభించని దారుణ మారణ హింసాత్మకతను అనుభవించినది ఒక్క ఏసుక్రీస్తు మాత్రమేననే నిజం అందరూ అంగీకరించవలసిన విషయం. ఈ పద్యంలోని 'కరుణరస భావుకత'కు ప్రతి ఒక్కరు కంటతడిపెట్టక మానరు. క్రీస్తు చరిత్ర చదివిన వారి కంటిలో నుండి జాలువారేవి కన్నీళ్లు కావు. భాష్పరుధిరాలు. అదే జాషువా కవితా శిల్పంలోని 'భావుకతా పారావాలు'.

చిన్నప్పుడు జాషువా కవి వినుకొండ దగ్గర తన స్వగ్రామమైన 'చాట్రగడ్డపాడు' అనే పల్లెటూళ్ళో పెరిగాడు. బాల్య చాపల్యంతో మిత్రులతో కలిసి - పిట్టల్నీ, తూనీగల్ని, తొండల్ని పట్టుకొని చెట్ల కొమ్మలపై ఆటలాడటం మొదలగు బాల్య చేష్టలు చేస్తుండేవాడట. ఆ సమయంలోనే గిజిగాడు అనే పక్షి వింతైన

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


విధంగా చెత్తా చెదారాన్ని తెచ్చి గూళ్ళను చెట్ల కొమ్మలకు వ్రేలాడే విధంగా నిర్మించడం గమనించడం జరిగిందట. పెను తుఫానులు వచ్చినా, చెట్లు కూలేవి గానీ, అవి కట్టిన గూడు చెక్కు చెదిరేది కాదట. శత్రుభయంలేక అవి తమ పిల్లలతో నిర్భయంగా, హాయిగా నివసించడం గమనించిన బాల జాషువా పెరిగి పెద్దయ్యాక బాల్య స్మృతుల భావాలను కలబోసి గిజిగాడు అనే శీర్షికతో వ్రాసిన పద్యాలు చదివిన వారికి, వారి వారి బాల్య స్మృతుల పరంపరతో మనసులు పులకాంకితమవుతాయి. ఇవి జాషువా భావోన్నతికి తార్కాణం. ఎందుకంటే ఇందులో కష్టపడే జీవుల 'శ్రమవాదం' ఉంది. 'శ్రమైక జీవన సౌందర్యం' ఉంది. శ్రమ జీవులు తమకున్న దానితో తృప్తి పొందే 'భావుకత' కన్పిస్తుంది. 'కష్టే ఫలి' అన్న సూక్తితో వ్యర్థాలతోనైనా, కట్టుకున్న సొంతగూటిలో నివసించే ప్రతి ఒక్కరు ఆ యింటి మహారాజే అన్న సందేశం ఇస్తున్నట్లుగా తోస్తుంది. కష్టపడే మనస్తత్వం వుంటే ఎక్కడైన మహారాజులా బ్రతికేయవచ్చు అనే భావుకతను నిదర్శనంగా ఈ క్రింద పద్యం సర్వులకూ ఆదర్శం.

"తేలిక గడ్డిపోచలను దెచ్చి రచించెద వీవు తూగుటు
య్యేల గృహంబు, మానవుల కేరకి సాధ్యము గాదు దానిలో
జాలరు లందులో జిలుగు శయ్యలు నంతిపురంబులొప్పగా
మేలు భళీ! పులుంగు టెకిమీడవురా గిజిగాడ! నీడజా!"

తన ఖండకావ్య రచనలో 'సాలీడు' గురించి జాషువా మంచి భావన చేశాడు. ఇందులో కూడా ప్రాక్తన మానవుడి నుండి ఈనాటి మానవుడు వరకు ప్రకృతిపైన, జీవులపైన ఆధారపడడం భావుకతా దర్పణంగా నిలుస్తుంది. మానవుడు తన అభివృద్ధి అంతా ప్రకృతి నుండి లభించే వనరులపైనా, జీవజాల అనుకరణలపైనా ఆధారపడతాడనే నేపథ్యం మనందరకు తెలిసిందే! ఇందులో కష్టపడి బ్రతికే 'నేతపని' వారి అగచాట్లను 'కాదేదీ కవిత కనర్హం' రీతిలో సాలీడును కవితా వస్తువుగా మలచడం జాషువా భావుకతకు నిదర్శనం. అన్యాపదేశంగా ఇతరులకు ఉపదేశాత్మకంగా ఈ పద్యం మలచిన తీరు ఆయన 'ఆదర్శనీయమైన భావుకత'కు నిదర్శనం.

"నీలో నూలు తయారు చేయమరగానీ ప్రత్తిరాట్నంబుగా
నీ లేదీశ్వరశక్తి నీ కడుపులోనే లీనమై యుండునో
యే లీలన్ రచియింతువీ జిలుగు నూలీ పట్టు పుట్టంబులో
సాలీడా! నిను మోసగాడువని విశ్వంబేల ఘోషించెడిన్"

అత్యద్భుతమైన తన భావుకతా అల్లికలలో విషపు పురుగులను సైతం లోకోత్తర రీత్యా త్యాగశీలులుగా ప్రతిఫలింపజేసే చక్కటి తన భావాల నేతలకు రంగులద్దిన పై పద్యంలోని తీరును గమనిస్తే సాలీడు కడుపులో 'రాట్నంలేదట!, యంత్రం లేదట!, శివశక్తి లేదట! అయినా, చాలా సన్నని దారాలు తన గర్భం నుండి తీసి గూడు నిర్మించుకొంటుంది. ఈ అద్భుత చర్యను, ఇంతటి సులభ శైలిలో మనోహరంగా వర్ణించడం? ఇంకెవరికి సాధ్యం? 'నేత శిల్పి'ని గూర్చి చేసిన ఈ రచనా శిల్పం జాషువా భావుకతా ప్రతిభకు కట్టిన పట్టం.

శ్రీనాథుని తర్వాత మరలా సీస పద్యాన్ని వ్రాయగల్గిన వాడు జాషువాయే! 'మధుర శ్రీనాథ' బిరుదు కూడా జాషువా కవి సొంతం! అది "సార్థక బిరుదమే! అందుకు నిదర్శనం జాషువా వ్రాసిన 'సీసా'లు. అది భావుకతా హృదయంతో చదివిన వారికి మాత్రమే బోధపడతాయి.

మన భరతమాతను 'రత్నగర్భ' బిరుదాంకితురాలుగా సగర్వంగా చెప్పుకుంటూ ఆమె కీర్తి బావుటాను దశదిశల చివరి అంచుల వరకు ఎగరేయడమే మనకు తెలుసు. కానీ, ఆమె గర్భంలోని సంపదను మానలో చూచే అవకాశం ఎవరికీ లేదు! కానీ, దుష్టుడైన ఘజనీ తన దాడులతో దారుణ మారణ హోమంతో త్రవ్వి తీసిన ఎన్నో వైవిధ్య భరితమైన రత్నాలను వాటి పేర్లను సామాన్యుడి ఊహలకు, మేధస్సుకు, కనులకు చూడలేనివన్నీ జాషువా తన 'సీస' పద్యం ద్వారా భావి తరాల వారికి ఇవి ఇలా ఉంటాయి అనేవిధంగా 'స' సాక్ష్యంగా సాక్షాత్కరింప చేశాడు. 'రవిగాంచనిచో కవిగాంచున్' అన్న నానుడిని నిరూపించాడు.

"బంగారు నాణెముల్ బస్తాల కెత్తించి
మదపుటేనుగుల మీద బదిల పఱచి
లేతపచ్చలు నేత గోతాల గుట్టించి
లొట్టిపిట్టల మీద దిట్టపఱచి
కురువింద మణులను కుంచాల గొలిపించి
పరువుటెద్దుల బండ్లపై నమర్చి
మొలక వజ్రముల జాలెల బోసి కూర్పించి
గుఱ్ఱాల మూపుల గుస్తరించి
పదియునెనిమిది విజయరంభల వరించ
గాంగ జలమున నెత్తుటి కత్తి కడిగి
సర్వము హరించి హిందు దేశంబు విడిచి
గజని మామూదు గజనీకి గదలిపోయె."

ఏమా పద్య వర్ణనాత్మకం! ఎంతో భావుకత ఉన్న చారిత్రక సంఘటన, హృదయ విదారకమైన 'గంభీర భావుకతా' రూపంగా జాలు వారింది. ఇందులో జాషువా కవితా శిల్పం కొత్త పరవళ్ళు తొక్కింది. ఘజనీ దోచుకుపోయిన ధన, కనక, రత్నరాసుల్ని, అవి రవాణా చేసేందుకు ఉపయోగించిన జీవజాలాన్ని, భద్రపరిచే విధానాన్ని మాహద్భుతంగా ఆనాటి రవాణా విధి విధానాల్ని కళ్ళ ముందు సాక్షాత్కరింపచేశాడు.

ఏ ఏ రత్నాలను పొదిగితే హారం అందంగా ఉంటుందో ఊహించి విశ్వకర్మ తయారు చేసినట్లుగా జాషువా అనే కవి

BHAVAVEENA
Vol. 15, Issue. 12(2), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



ఆయా సన్నివేశ, వస్తువర్ణనలో సరియగు పదాలు వాడి, ఆయా ఘటనలు కళ్ళముందు కనిపించే దృశ్య మాలికగా రూపొందించిన జాషువా కవి విశ్వకర్మ. ఈ విధంగా బంగారు నాణెములు బస్తాలకెత్తించి, మదపు టేనుగుల మీద పదిలపఱచి నాడనడం, 'లేత పచ్చల నేత గోతాల గుట్టించి లొట్టిపిట్టలపై దిట్టపఱచి నాడనడం ఎంత సహజంగా, ఎంత చక్కగా, ఎంత లలితంగా, కమనీయంగా ఉన్నదో కదా! ఇలాంటి కవితా శైలిలోని భావుకతను చదివి ఆనందించాల్సిందే, కానీ మాటలతో చెప్పడం అసాధ్యం!

అన్నీ దోచుకుని అడ్డం వచ్చిన వారిని వధించి తన కత్తి కంటిన రుధిరాన్ని. మన గంగా జలాల్లోనే కడిగిగాని ఘజనీ హిందూ దేశము విడిచి పోలేదట! ఇంతగా భీతిల్లే వర్ణన ఇతర ఏ కవుల్లోను కానరాదు. అమాయకపు ప్రజలను సంహరించి, సంపదను హరించి ఆ పాపపంకిలాన్ని పుణ్య గంగా జలాల్లో శుద్ధి చేసుకొని వెళ్ళడమనే హృదయ విదారకతా భావాలను సాదృశ్యగా తన 'సీసా'ల్లో ఇమడ్చడం జాషువా 'కవితా శిల్ప భావకత'కు తగిన ప్రామాణికంగా తోస్తుంది. పద్యం చివరి వరకూ చదివి, ఆ భావుకతకు నివ్వెరపోకమానడు ప్రతి పాఠకుడు. దానిలోని హింసాత్మక, ఆధ్యాత్మికతా భావనలు అతడు జరిపిన భీభత్సానికి తరువాత ఏర్పడిన భయంకరమైన ప్రశాంతతకు నిదర్శనంలా తోస్తుంది. 'నిశ్శబ్దం'గా ధ్వనిస్తుంది.

ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో! ఎన్నెన్నో!! పద్య రత్నాలు జాషువా 'భావుకత' అనే సాహిత్య స్వర్ణ కిరీటాన్ని తన కవితా వధూటి శిరస్సుపై ఉంచాడు. 'పద్మభూషణ' బిరుదాంకితుడైన జాషువా రచనల్లో ప్రధానంగా వేదనాభరితమైన ఒక 'ఆశాభావం - మానవతా దృష్టి'తో కూడిన 'భావుకతా వేదం' సర్వమానవాళి శ్రేయోదాక సమవర్తిలా రచించాడనడం అతిశయోక్తి కాదు. అది అతని రచనలో ప్రతి అక్షరంలోను లక్షలకొలది భావ సంపద ప్రత్యక్షంగా కనబడుతుంది. ఈ భావాలన్నింటినీ తరచి తరచి పరిశీలించి, జాషువా మనకిచ్చిన తన హృదయాంతర్గత 'విశ్వ కల్యాణ భావుకతా' శిల్ప విశేష రత్నాలను సాహితీ అభిమానుల హృదయాలలో తాపడం చేశాడు.

ఈ అభినవ మధుర శ్రీనాధుడు, విశ్వశ్రేయస్సులో వ్రాసి మనకందించిన సాహిత్యం - తెలుగు భావుకతా కవితా రీతులపై ముత్యాల పందిరి వేసింది. విశ్వనరుడు తన వెలకట్టలేని ఎనలేని ఆత్మీయతతో, భావుకతా మల్లెలను పూయించాడు. సాహితీ జగత్తును ఆ భావుకత పరిమళాలలో తలమునకలు వేయించాడు.

భావ వీణ BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

International Journal of Telugu Literary, Culture & Language Study

December 2018

అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 9703301698.